

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



శనివారం | 29-3-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 360 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: అమావాస్య సా.4.29 తదుపరి పాడ్యమి; నక్షత్రం: ఉత్తరాభాద్ర రా.7.26 తదుపరి రేవతి; వర్జ్యం: ఉ.6.39-8.04, తె.6.00 మొ.; అమృతఘడియలు: మ.3.10-4.35; దుర్ముహూర్తం: ఉ.6.15-7.52; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.15; సూర్యాస్తమయం: 6.24 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



గోల్డ్ మరో ఆల్‌టైం రికార్డు

- రూ.92,000 దాటిన 10 గ్రాముల ధర
- ఒక్కరోజే రూ.1,100 పెరుగుదల

న్యూఢిల్లీ: పసిడి ధరలు సరికొత్త జీవితకాల రికార్డు గరిష్ఠానికి ఎగబాకాయి. ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత బంగారం 10 గ్రాముల ధర శుక్రవారం రూ.1,100 పెరిగి రూ.92,150కి చేరింది. 99.5 శాతం స్వచ్ఛత లోహం కూడా అదే స్థాయిలో పెరిగి రూ.91,700కి చేరుకుంది. గోల్డ్ రేట్లు పెరగడం వరుసగా ఇది మూడో రోజు. కిలో వెండి సైతం రూ.1,300 పెరుగుదలతో రూ.1,03,000 ధర పలికింది. అంతర్జాతీయంగా వీటి ధరలు పెరగడం ఇందుకు ప్రధాన కారణం. ఇంటర్నేషనల్ స్పాట్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ 3,086.08 డాలర్లకు చేరగా.. కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ కాంట్రాక్టు రేటు సరికొత్త రికార్డు గరిష్ఠం 3,124.40 డాలర్లకు ఎగబాకింది. స్పాట్ సిల్వర్ 34.42 డాలర్లకు పెరగగా.. కామెక్స్ సిల్వర్ ఫ్యూచర్స్ కాంట్రాక్టు రేటు 35.33 డాలర్లకు చేరింది.

2024-25లో గోల్డ్ 35 శాతం అప్: ఈ ఆర్థిక సంవత్సరం తొలి రోజున (2024 ఏప్రిల్ 1) రూ.68,420 పలికిన 10 గ్రాముల బంగారం.. గడిచిన ఏడాది కాలంలో రూ.23,730 (35 శాతం) పెరిగింది. ఫెడ్ రేట్ల తగ్గింపు, అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలతోపాటు తాజాగా ట్రంప్ సుంకాలు గోల్డ్ ర్యాలీకి కారణమయ్యాయి. ట్రంప్ సుంకాలతో మున్ముందు ఆర్థిక అనిశ్చితులు మరింత తీవ్రతరమయ్యే అవకాశాలున్నాయి. ఇందుకుతోడు, అమెరికా మళ్లీ ఆర్థిక మాంద్యంలోకి జారుకోవచ్చన్న అంచనాలూ ఉన్నాయి. ఇదే గనక జరిగితే, బంగారం, వెండి ధరలు మరింత ఎగబాకడం ఖాయమని బులియన్ విశ్లేషకులు అంటున్నారు. ఈ ఏడాది చివరి నాటికి ఔన్స్ గోల్డ్ 3,300 డాలర్లకు చేరుకోవచ్చన్న అంచనాలున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ 3,300 డాలర్లకు చేరితే, దేశీయంగా తులం మేలిమి బంగారం రూ.లక్ష దాటే అవకాశాలున్నాయి.

రూ.26 లక్షల కోట్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పెరిగిన మార్కెట్ సంపద ఇది.. ● సెన్సెక్స్ 5 శాతం వృద్ధితో సరి

ముంబై: ఈ మార్చి 31తో ముగియనున్న ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఈక్విటీ మదుపరుల సంపద రూ.25.90 లక్షల కోట్లు పెరిగింది. బీఎస్ఈ ప్రామాణిక సూచీ సెన్సెక్స్ 3,763.57 పాయింట్లు (5.10 శాతం), నిఫ్టీ 1,192.45 పాయింట్లు (5.34 శాతం) వృద్ధిని నమోదు చేశాయి. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో భారీ రిటర్నులు పంచిన స్టాక్ మార్కెట్.. 2024-25లో మాత్రం తీవ్ర ఒడుదుడుకులను చవిచూసింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో సెన్సెక్స్ 14,659.83 పాయింట్లు (24.85 శాతం) పుంజుకోగా.. ఈక్విటీ మదుపరుల సంపద రికార్డు స్థాయిలో రూ.128.77 లక్షల కోట్ల మేర పెరిగింది.



2024-25కు నష్టాలతో వీడ్కోలు

ఈ ఆర్థిక సంవత్సరానికి మార్కెట్ సూచీలు నష్టాలతో వీడ్కోలు పలికాయి. వాహన రంగంపై ట్రంప్ సుంకాల ప్రకటనతో అంతర్జాతీయ మార్కెట్లో ట్రేడింగ్ సెంటిమెంట్ బలహీనపడింది. దాంతో మన దలాల్ స్ట్రీట్ ఇన్వెస్టర్లూ అమ్మకాలకే మొగ్గుచూపారు. శుక్రవారం ట్రేడింగ్ ముగిసేసరికి సెన్సెక్స్ 191.51 పాయింట్ల నష్టంతో 77,414.92 వద్ద ముగియగా.. నిఫ్టీ 72.60 పాయింట్లు కోల్పోయి 23,519.35 వద్ద స్థిరపడింది. మార్కెట్ సంపద రూ.412.87 లక్షల కోట్ల (4.82 లక్షల కోట్ల డాలర్లు) వద్ద ముగిసింది.

ప్రథమార్థంలో జోరు.. ద్వితీయార్థంలో బేజారు

ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్థం (ఏప్రిల్-సెప్టెంబరు)లోనూ మార్కెట్ల జోరు కొనసాగింది. తొలి ఆరు నెలల్లో సూచీలు 17 శాతం పెరిగాయి. గత ఏడాది సెప్టెంబరు 27న సెన్సెక్స్ 85,978.25 పాయింట్ల వద్ద ఆల్‌టైం రికార్డు గరిష్ఠాన్ని తాకింది. కానీ, దీర్ఘకాలిక బుల్‌రన్ కారణంగా చాలా కంపెనీల షేర్లు అధిక ధరల వద్ద ట్రేడవుతుండటం, అంతర్జాతీయ అనిశ్చితులు, కార్పొరేట్ కంపెనీల నిరాశాజనక త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో విదేశీ ఇన్వెస్టర్లు అక్టోబరు నుంచి మన మార్కెట్లోని పెట్టుబడులను ఉపసంహరించుకోవడం మొదలుపెట్టారు. దాంతో ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో మార్కెట్ తీవ్ర ఒత్తిడికి లోనైంది. గత 29 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా వరుసగా ఐదు నెలలు (అక్టోబరు-ఫిబ్రవరి) ప్రామాణిక సూచీలు భారీగా దిద్దుబాటుకు లోనయ్యాయి. కేవలం అక్టోబరులోనే సెన్సెక్స్ 4,910.72 పాయింట్లు (5.82 శాతం) క్షీణించింది. ఈ ఏడాదిలో ట్రంప్ సుంకాల మోత మార్కెట్‌ను మరింత కుంగదీసింది. అయినప్పటికీ, రిటైల్ మదుపరులు, దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్ల దన్నుతో సూచీలు ఈ ఆర్థిక సంవత్సరంలో ఒక అంకె వృద్ధిని మాత్రమే నమోదు చేయగలిగాయి.

2025-26లోనూ కొనసాగనున్న అంతర్జాతీయ అనిశ్చితులు

దేశీయంగా పటిష్ఠ ఆర్థిక మూలాలు, ఆర్‌బీఐ వడ్డీ రేట్లను మరింత తగ్గించే అవకాశాలతో పాటు కార్పొరేట్ కంపెనీల పనితీరు మళ్లీ పుంజుకోనుందన్న అంచనాలు ఈ ఏప్రిల్ 1తో ప్రారంభం కానున్న కొత్త ఆర్థిక సంవత్సరం (2025-26)లో మార్కెట్లకు సానుకూలంగా పరిణమించనున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, ట్రంప్ సుంకాలతో అంతర్జాతీయంగా వాణిజ్య యుద్ధాలు తీవ్రతరమయ్యే ప్రమాదంతో పాటు భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పశ్చిమాసియా నుంచి యూరప్‌నకు మళ్లే అవకాశాలు మార్కెట్లకు ప్రతికూలంగా పరిణమించవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

2024-25లో 2 శాతం క్షీణించిన రూపాయి

ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ శుక్రవారం 24 పైసలు పెరిగి రూ.85.50 వద్ద ముగిసింది. మన ఈక్విటీ మార్కెట్లో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు మళ్లీ పెట్టుబడులు పెంచడం ఇందుకు దోహదపడింది. ఈ నెలలో రూపాయి మారకం విలువ 2.17 శాతం పెరిగింది. గడిచిన ఆరేళ్లకు పైగా కాలంలో మన కరెన్సీకిదే అత్యుత్తమ వృద్ధి. 2018 నవంబరులో రూపాయి 5 శాతానికి పైగా బలపడింది. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో రూపీ మారకం విలువ 2 శాతానికి పైగా క్షీణించింది. ఆర్థిక సంవత్సరం తొలి ట్రేడింగ్ సెషన్ అయిన ఏప్రిల్ 2న డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు రూ.83.42గా నమోదైంది.

అరబిందో ఇన్‌ఫ్రాకు అవార్డు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మౌలిక వసతుల రంగంలోని అరబిందో ఇన్‌ఫ్రా.. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నుంచి "ఎర్లీ ఆపరేషనలైజేషన్" విభాగంలో ప్రతిష్ఠాత్మకమైన అవార్డు అందుకుంది. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో అరబిందో ఇన్‌ఫ్రా మైనింగ్ విభాగం హెడ్ సంజయ్ వినోద్ మిశ్రా ఈ అవార్డును కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. అరబిందో ఇన్‌ఫ్రాకు ప్రస్తుతం మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, జార్ఖండ్, తెలంగాణల్లో నాలుగు బొగ్గు బ్లాక్‌లతో పాటు మధ్యప్రదేశ్‌లో మూడు రాక్ ఫాస్ఫేట్ బ్లాక్‌లున్నాయి. ఇందులో మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లాలో ఉన్న టక్లి జెనా బొలేరా-ఉత్తర, దక్షిణ బొగ్గు బ్లాక్ పూర్తి స్థాయిలో కార్యకలాపాలు నిర్వహిస్తుండగా మిగతా బ్లాక్‌ల అనుమతులు వివిధ దశల్లో ఉన్నాయి. టక్లి జెనా బొలేరా బ్లాక్‌ను కేవలం రెండు సంవత్సరాల రికార్డు వ్యవధిలోనే పూర్తి చేసి కార్యకలాపాలు ప్రారంభించినందుకు గాను ఈ అవార్డు లభించింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

29వ తేదీ			
హైదరాబాద్	440	విజయవాడ	460
వరంగల్	442	గోదావరి	445
చిత్తూరు	510	విశాఖపట్నం	445
		డజను గుడ్లు రూ.	60

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	116	విజయవాడ	122
వరంగల్	116	గుంటూరు	122
కరీంనగర్	116	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	116	చిత్తూరు	98
కర్నూలు	116	నెల్లూరు	103
విశాఖపట్నం	104	అనంతపురం	103
గోదావరి	122		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	90,980 ▲	83,400 ▲	1,14,000 ▲
విజయవాడ	92,200 ▲	86,500 ▲	1,04,000 ▲
విశాఖపట్నం	89,300 ▲	81,860 ▲	1,01,920 ▲
రాజమండ్రి	90,980 ▲	83,400 ▲	1,03,800 ▲
ప్రొద్దుటూరు	91,000 ▲	84,270 ▲	1,02,000 ▲
ముంబై	89,164 ▲	81,674 ▲	1,00,892 ▲

చిన్న మొత్తాల పొదుపు వడ్డీ రేట్లు యథాతథం

న్యూఢిల్లీ: పబ్లిక్ ప్రావిడెండ్ ఫండ్ (పీపీఎఫ్), నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్లు (ఎన్ఎస్‌సీ) సహా చిన్న తరహా పొదుపు పథకాలన్నింటిపై వడ్డీ రేట్లను ప్రభుత్వం యథాతథంగా కొనసాగించింది. దీంతో చిన్న పొదుపు పథకాల్లో ఇన్వెస్ట్ చేసిన వారికి ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యే 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో కూడా ప్రస్తుత రేటులోనే వడ్డీ లభిస్తుంది. ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ పథకాల వడ్డీ రేట్లలో యథాతథ స్థితిని కొనసాగించడం వరుసగా ఇది ఐదోసారి.

ఎలక్ట్రానిక్ కాంపోనెంట్స్ తయారీకి ఊతం

రూ.22,919 కోట్లతో పీఎల్ఐ పథకం

న్యూఢిల్లీ: ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల (పీఎల్ఐ) పథకానికి కేంద్ర ప్రభుత్వం మరింత పదును పెడుతోంది. ఇందులో భాగంగా ఈ పథకం కింద ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ దేశీయంగా తయారు చేసేందుకు ముందుకు వచ్చే కంపెనీలను ప్రోత్సహించేందుకు రూ.22,919 కోట్లు కేటాయించింది. దేశీయంగా సెమికండక్టర్ యేతర ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎల్ఐ పథకాన్ని ప్రకటించడం ఇదే మొదటిసారి.

ఏటీఎం లావాదేవీలు మరింత భారం

మే 1 నుంచి చార్జీలు పెంపు

ముంబై: ఏటీఎం నుంచి ఎలాంటి చార్జీలు లేకుండా ఉచితంగా నగదు విత్‌డ్రా చేసుకునేందుకు ఇచ్చిన గరిష్ఠ పరిమితి దాటిన అనంతరం చేసే ప్రతి లావాదేవీ పైన యూసేజ్ చార్జీ రూ.2 వంతున పెంచేందుకు బ్యాంకులకు ఆర్‌బీఐ అనుమతించింది. దీంతో ఇక నుంచి అలాంటి ప్రతి లావాదేవీ పైన రూ.23 యూసేజ్ చార్జి పడుతుంది. మే 1 నుంచి యూసేజ్ చార్జి రూ.2 వంతున పెంచేందుకు అనుమతించినట్టు ఆర్‌బీఐ తెలిపింది. ప్రస్తుతం బ్యాంకులు ఉచిత పరిమితి దాటి చేసే ఒక్కో లావాదేవీపై రూ.21 చార్జి చేస్తున్నాయి. బ్యాంక్ కస్టమర్లు ప్రతి నెలా తమ సొంత బ్యాంక్ ఏటీఎంల నుంచి ఐదు ఉచిత లావాదేవీలు (ఆర్థిక, ఆర్థికేతర) నిర్వహించుకునేందుకు అనుమతిస్తున్నారు. ఇతర బ్యాంకుల ఏటీఎం నుంచైతే ఉచిత లావాదేవీల సంఖ్య (ఆర్థిక, ఆర్థికేతర) మెట్రో నగరాల్లో 3కే పరిమితం చేశారు. మిగతా ప్రాంతాల్లో ఐదు లావాదేవీలను అనుమతిస్తారు. నగదు రీసైక్లర్ మెషీన్‌లో చేసే లావాదేవీలకు కూడా ఈ నిబంధన వర్తిస్తుందని తెలిపింది.

విస్తరణ బాటలో పాపయిస్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జుబిలెంట్ ఫుడ్‌వర్క్స్ లిమిటెడ్ నిర్వహణలోని అంతర్జాతీయ ఫ్రైడ్ చికెన్ బ్రాండ్ పాపయిస్.. హైదరాబాద్ సహా దేశీయంగా తన కార్యకలాపాలు విస్తరిస్తున్నట్లు ప్రకటించింది. శుక్రవారం నాడిక్కడ కొత్త స్టోర్‌ను ప్రారంభించిన సందర్భంగా పాపయిస్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ గౌరవ్ పాండే మాట్లాడుతూ.. ప్రస్తుతం సంస్థ దేశవ్యాప్తంగా 20కి పైగా నగరాల్లో స్టోర్లను నిర్వహిస్తోందని చెప్పారు. కార్యకలాపాల విస్తరణలో భాగంగా తాజాగా హైదరాబాద్‌లో కొత్త స్టోర్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. పాపయిస్ ఇప్పటికే ఇక్కడ రెండు స్టోర్లను నిర్వహిస్తోంది. కాగా వచ్చే ఏడాదిన్నర కాలంలో ఈ స్టోర్ల సంఖ్యను 10కి చేర్చాలని చూస్తున్నట్లు పాండే వెల్లడించారు. మరోవైపు దేశవ్యాప్తంగా పాపయిస్ 61 స్టోర్లను నిర్వహిస్తుండగా వచ్చే ఏడాది కాలంలో వీటి సంఖ్యను 100కి చేర్చాలని చూస్తున్నట్లు చెప్పారు. రవాణా సదుపాయాలు మెరుగుపడిన తర్వాత విజయవాడ, విశాఖపట్నం నగరాలకు విస్తరించాలని చూస్తున్నట్లు పాండే చెప్పారు.

పబ్లిక్ ఇష్యూకి ఆర్డీ ఇంజనీరింగ్

రూ.580 కోట్ల సమీకరణ లక్ష్యం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన ఆర్డీ ఇంజనీరింగ్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కు వస్తోంది. ఐపీఓ ద్వారా రూ.580 కోట్ల సమీకరణకు అనుమతి కోరుతూ క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. పబ్లిక్ ఇష్యూలో భాగంగా కంపెనీ రూ.500 కోట్ల తాజా ఈక్విటీ జారీ చేయనుండటంతో పాటు ప్రమోటర్ చంద్రశేఖర్ మోటూరుకు చెందిన రూ.80 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించాలని భావిస్తోంది. అంతేకాదు, ప్రీ-ఐపీఓ ప్లేస్‌మెంట్ ద్వారా రూ.100 కోట్ల వరకు సమీకరించే ఆలోచన కూడా ఉంది. ఒకవేళ ప్రీ-ఐపీఓ ప్లేస్‌మెంట్ ద్వారా నిధులు సమీకరిస్తే, ఐపీఓలో తాజా ఈక్విటీ జారీ సైజును తగ్గించుకోనుంది. తాజా ఈక్విటీ జారీ ద్వారా సమీకరించిన నిధుల్లో రూ.279.6 కోట్లను తెలంగాణలోని సీతారాంపూర్‌లో 2 కొత్త తయారీ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు వినియోగించుకోనున్నట్లు కంపెనీ వెల్లడించింది. మరో రూ.44.8 కోట్లతో ఏపీలోని పరవాడలో కొత్త ఇంటిగ్రేటెడ్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌నూ ఏర్పాటు చేయాలనుకుంటోంది. మరో రూ.65 కోట్లను రుణాలను తిరిగి చెల్లించేందుకు, మిగతా సొమ్మును వ్యాపార అవసరాల కోసం వినియోగించుకోవాలనుకుంటోంది.

మనీషా పసిడి పట్టు

పంగల్‌కు కాంస్యం ● ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్


మనీషా


అంతిమ్

అమ్మాన్ (జోర్డాన్): ఆసియా చాంపియన్‌షిప్‌లో భారత మహిళా రెజ్లర్లు రెండోరోజూ అమోఘ ప్రదర్శన కనబరచి రెండు పతకాలు కైవసం చేసుకున్నారు. మనీషా భన్వాలా (62కి.) పసిడి పతకం కొల్లగొట్టగా, అంతిమ్ పంగల్ (53కి.) కాంస్య పతకం సాధించింది. శుక్రవారం హోరాహోరీగా జరిగిన 62 కి. విభాగం ఫైనల్లో మనీషా 8-7తో కిమ్ ఓక్ జే (కొరియా)ని ఓడించి స్వర్ణ పతకం పట్టేసింది. ఈ చాంపియన్‌షిప్‌లో భారత్‌కిదే తొలి పసిడి పతకం కావడం విశేషం. తొలి బౌట్‌లో 11-0తో దుబేక్ (కజకిస్థాన్)పై గెలుపొందిన మనీషా..క్వార్టర్‌ఫైనల్లో 3-0తో లీ (కొరియా)పై, సెమీఫైనల్లో 5-1తో కల్మిరా (కిర్గిస్థాన్)పై విజయం సాధించింది. 53 కి.విభాగం కాంస్య పతక పోరులో 20 ఏళ్ల పంఘల్ 10-0తో మెంగ్ హువాన్‌ను చిత్తు చేసి విజేతగా నిలిచింది. క్వార్టర్‌ఫైనల్లో చైనాకు చెందిన జిన్ జాంగ్‌ను 10-6తో ఓడించిన అంతిమ్ సెమీఫైనల్లో మో కియోకా (జపాన్) చేతిలో 0-10తో ఓడిపోయింది. నేహా శర్మ (57కి.), మోనిక (65కి.), జ్యోతి బెరివాల్ (72కి.) పతక రౌండ్‌కు క్వాలిఫై కాలేక పోయారు. గురువారంనాడు మహిళలు మూడు పతకాలు కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. ఇక..ఈ చాంపియన్‌షిప్‌లో ఇప్పటి వరకు భారత్ మొత్తం ఏడు పతకాలు ఖాతాలో వేసుకుంది. మహిళలు ఐదు పతకాలు నెగ్గగా, పురుషులు గ్రీకో రోమన్‌లో రెండు పతకాలు అందుకున్నారు.

నిత్య 'డబుల్'

జ్యోతికి హర్డిల్స్ టైటిల్
ఇండియన్ గ్రాండ్‌ప్రీ-1


నిత్య



జ్యోతి

బెంగళూరు: తెలంగాణకు చెందిన నిత్య గంధె ఇండియన్ గ్రాండ్‌ప్రీ-1 పోటీల్లో డబుల్ సాధించింది. శుక్రవారం ఇక్కడ జరిగిన మహిళల 100, 200 మీటర్ల ఈవెంట్లలో నిత్య అగ్రస్థానంలో నిలిచింది. కాగా 100మీ. హర్డిల్స్‌లో ఆంధ్రకు చెందిన జ్యోతి యర్రాజి సత్తాచాటింది. 100 మీటర్ల పరుగులో నిత్య 11.41 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకుంది. ఇక 200 మీటర్ల పరుగును నిత్య 23.36 సెకన్లలో పూర్తిచేసి టాప్‌లో నిలవగా, జ్యోతి (23.55 సె) రెండో స్థానంతో సరిపెట్టుకుంది. 100 మీటర్ల హర్డిల్స్‌లో జ్యోతి టైటిల్‌ను దక్కించుకుంది. జ్యోతి 13.07 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకుని ప్రథమస్థానంలో నిలిచింది. కాగా ఇక్కడి ప్రదర్శనతో నిత్య, జ్యోతి ఆసియా అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌నకు అర్హత సాధించారు.

గురిందర్‌వీర్ రికార్డు పరుగు: స్ప్రింటర్ గురిందర్‌వీర్ సింగ్ అత్యంత వేగంగా 100మీ. రేసును పూర్తి చేసిన భారత అథ్లెట్‌గా నిలిచాడు. రిలయన్స్ తరఫున బరిలోకి దిగిన ఈ పంజాబీ 10.20 సెకన్లలోనే రేసును పూర్తి చేశాడు. ఈ క్రమంలో రెండేళ్ల క్రితం మణికంఠ హోబ్లిధర్ నెలకొల్పిన రికార్డు (10.23సె)ను అధిగమించాడు. మణికంఠ (10.22) ద్వితీయ స్థానంలో, అమలన్ బోర్గోహైన్ (10.43) తృతీయ స్థానాల్లో నిలిచారు.

తమీమ్ డిశ్చార్జి



ఢాకా: బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ తమీమ్ ఇక్బాల్ శుక్రవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యాడు. గత సోమవారం దేశవాళీ క్రికెట్ మ్యాచ్ ఆడుతుండగా తీవ్ర గుండెనొప్పి రావడంతో ఢాకాలోని ఓ ఆస్పత్రికి తరలించి స్టెంట్ వేశారు. అనంతరం మరో హాస్పిటల్‌లో చేర్చి చికిత్స కొనసాగించారు.

ఎన్నేళ్లో వేచిన విజయం..

- 17 ఏళ్ల తర్వాత చెపాక్‌లో మురిసిన బెంగళూరు
- 50 రన్స్ తేడాతో చెన్నై చిత్తు
- రజత్ పటీదార్ హాఫ్ సెంచరీ

1 — సీఎస్‌కే తరఫున ఎక్కువ పరుగులు (4699) సాధించిన బ్యాటర్‌గా ఎంఎస్ ధోనీ. రైనా (4687)ను అధిగమించాడు. | ఐపీఎల్‌లో 3వేల పరుగులు+100 వికెట్లు తీసిన ఏకైక ప్లేయర్‌గా జడేజా



పటీదార్ (51)

చెన్నై: ఒకటా.. రెండా ఏకంగా 17 ఏళ్ల తర్వాత రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇక్కడి చెపాక్ మైదానంలో విజయం రుచి చూసింది. బ్యాటింగ్‌లో మెరుపులతో పాటు బౌలింగ్‌లోనూ అదరగొట్టిన ఆర్‌సీబీ శుక్రవారం చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 50 రన్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. ఐపీఎల్ ఆరంభ సీజన్ 2008లో బెంగళూరు ఇక్కడ తొలిసారి గెలిచింది. అప్పటికి విరాట్ కోహ్లీ అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేయక పోవడం గమనార్హం. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 7 వికెట్లకు 196 పరుగులు చేసింది. రజత్ పటీదార్ (32 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 51), సాల్ట్ (16 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 32), విరాట్ (30 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్‌తో 31) రాణించారు. నూర్ అహ్మద్‌కు మూడు, పథిరనకు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో చెన్నై 20 ఓవర్లలో 8 వికెట్లకు 146 పరుగులు చేసి ఓడింది. రచిన్ (41), ధోనీ (30 నాటౌట్), జడేజా (25) ఫర్వాలేదనిపించారు. హాజెల్‌వుడ్‌కు మూడు.. యష్, లివింగ్‌స్టోన్‌లకు రెండేసి వికెట్లు లభించాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా రజత్ పటీదార్ నిలిచాడు.

ఆది నుంచే తడబ్యాటు..: ఆర్‌సీబీ ధనాధన్ బ్యాటింగ్‌తో చెలరేగిన చోట సీఎస్‌కే బ్యాటర్లు తెగ కష్టపడ్డారు. అటు పేసర్లు, స్పిన్నర్లు సమష్టిగా రాణించి ఈ విజయంలో కీలకమయ్యారు. టాపార్డర్‌తో పాటు మిడిలార్డర్ ఎలాంటి ప్రభావమూ చూపలేక పోయింది. ఓపెనర్ రచిన్ మాత్రం కాస్త నిలదొక్కుకోగా.. చివర్లో ధోనీ మెరుపులతో ఊరటనిచ్చాడు. పేసర్ హాజెల్‌వుడ్ రెండో ఓవర్‌లోనే ఓపెనర్ త్రిపాఠి (5), కెప్టెన్ రుతురాజ్ (0)లను వెనక్కి పంపి షాకిచ్చాడు. దీపక్ హుడా (4)ను భువనేశ్వర్ అవుట్ చేయడంతో జట్టు పవర్‌ప్లేలో 30/3 స్కోరుతో దయనీయంగా కనిపించింది. హిట్టింగ్ కోసం వచ్చిన సామ్ కర్రాన్ (8) చేసేదేమీ లేకపోయింది. ఈ దశలో రచిన్-దూబే జోడీ అడపాదడపా బౌండరీలతో ఆశలు రేపింది. అయితే 13వ ఓవర్‌లో పేసర్ యష్ ఈ ఇద్దరినీ బౌల్డ్ చేసి సీఎస్‌కేకు ఓటమిని కళ్ల ముందుంచాడు. అప్పటికి స్కోరు 80/6. అశ్విన్ (11)ను స్పిన్నర్ లివింగ్‌స్టోన్ అవుట్ చేశాక 16వ ఓవర్‌లో ధోనీ క్రీజులోకి వచ్చాడు. అప్పటికి సమీకరణం 29 బంతుల్లో 98 రన్స్‌గా ఉండడంతో చెపాక్‌లో ఆర్‌సీబీ విజయం ఖాయమైంది. జడేజా -ధోనీ మధ్య 8వ వికెట్‌కు అత్యధికంగా 31 పరుగులు జత చేసినా ఫలితం లేకపోయింది. చివరి ఓవర్‌లో 67 రన్స్ అవసరమవగా.. ధోనీ 6,6,4తో ఫ్యాన్స్‌లో కాస్త జోష్ నింపాడు.

రజత్, సాల్ట్ జోరు: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్‌సీబీకి ఓపెనర్ సాల్ట్ మెరుపు ఆరంభాన్ని అందించాడు. అలాగే బరిలోకి దిగిన ప్రతీ బ్యాటరూ బాదడమే లక్ష్యంగా ఆడే ప్రయత్నం చేశారు. కానీ ఓపెనర్ విరాట్ మాత్రం షాట్లు ఆడేందుకు ఇబ్బందిపడ్డాడు. అటు కెప్టెన్ రజత్ పటీదార్ మూడు క్యాచ్‌లను చెన్నై ఫీల్డర్లు వదిలేయడం ఆర్‌సీబీ భారీ స్కోరుకు కారణమైంది. స్పిన్నర్ నూర్ అహ్మద్ మరోసారి ప్రభావం చూపాడు. తొలి ఓవర్‌లోనే సాల్ట్ రెండు ఫోర్లు, తర్వాతి ఓవర్‌లో 6,4,4తో ఎదురుదాడికి దిగాడు. ఐదో ఓవర్‌లో అతడిని స్పిన్నర్ నూర్ అహ్మద్ అవుట్ చేయగా తొలి వికెట్‌కు 45 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత దేవ్‌దత్ సిక్సర్‌తో పవర్‌ప్లేలో జట్టు 56/1తో నిలిచింది. ఏడో ఓవర్‌లో పడిక్కళ్ 4,4,6తో 15 పరుగులు రాబట్టాడు. అశ్విన్ ఓవర్‌లో తను నిష్క్రమించాక బరిలోకి దిగిన పటీదార్ మరింత చెలరేగాడు. అయితే అతను 17 పరుగుల వద్ద ఉన్నప్పుడు ఇచ్చిన సులువైన క్యాచ్‌ను లాంగాఫ్‌లో దీపక్ హుడా వదిలేయడం ఆర్‌సీబీకి కలిసివచ్చింది. అటు నెమ్మదిగా ఆడి ఒత్తిడికి లోనైన విరాట్‌ను నూర్ అహ్మద్ అవుట్ చేశాడు. 14వ ఓవర్‌లో రజత్ 6,4,4తో 15 రన్స్‌తో స్కోరు మళ్లీ వేగం పుంజుకుంది. లివింగ్‌స్టోన్ (10), జితేశ్ (12) స్వల్ప స్కోర్లకు వెనుదిరగ్గా, 30 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసిన పటీదార్ 19వ ఓవర్‌లో భారీ షాట్‌కు వెళ్లి పథిరనకు చిక్కాడు. ఈ ఓవర్‌లో వైడ్ రూపంలో ఒకే పరుగు రాగా క్రునాల్ కూడా డకౌటయ్యాడు. అయితే ఆఖరి ఓవర్‌లో టిమ్ డేవిడ్ (22 నాటౌట్) హ్యాట్రిక్ సిక్సర్లతో 19 రన్స్ అందించడంతో ఆర్‌సీబీ 190 రన్స్ దాటగలిగింది.

ధోనీ.. మరోసారి: ధోనీ మెరుపు స్టంపింగ్ మరోసారి ఫ్యాన్స్‌ను అబ్బురపరిచింది. ముంబైతో మ్యాచ్‌లో సూర్యకుమార్‌ను అవుట్ చేసిన మాదిరే.. ఈసారి ఆర్‌సీబీపై ఓపెనర్ సాల్ట్ పనిబట్టాడు. వేగంగా ఆడుతున్న అతడిని స్పిన్నర్ నూర్ అహ్మద్ ఓవర్‌లో 0.16 సెకన్లలోనే స్టంప్ చేశాడు. వాస్తవానికి సాల్ట్ క్రీజులో నుంచి కాళ్లు తీసినట్టుగా కూడా కనిపించ లేదు. కానీ రీప్లేలో మాత్రమే అతడి కాలు గాల్లోకి లేచినట్టు కనిపించడం గమనార్హం.

స్కోరుబోర్డు

బెంగళూరు: సాల్ట్ (స్టంప్డ్) ధోనీ (బి) నూర్ అహ్మద్ 32; విరాట్ (సి) రచిన్ (బి) నూర్ అహ్మద్ 31; పడిక్కళ్ (సి) రుతురాజ్ (బి) అశ్విన్ 27; పటీదార్ (సి) కర్రాన్ (బి) పథిరన 51; లివింగ్‌స్టోన్ (బి) నూర్ అహ్మద్ 10; జితేశ్ (సి) జడేజా (బి) ఖలీల్ 12; డేవిడ్ (నాటౌట్) 22; క్రునాల్ (సి) హుడా (బి) పథిరన 0; భువనేశ్వర్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 20 ఓవర్లలో 196/7. వికెట్ల పతనం:** 1-45, 2-76, 3-117, 4-145, 5-172, 6-176, 7-177. **బౌలింగ్:** ఖలీల్ 4-0-28-1; అశ్విన్ 2-0-22-1; కర్రాన్ 3-0-34-1; నూర్ అహ్మద్ 4-0-36-3; జడేజా 3-0-37-0; పథిరన 4-0-36-2.

చెన్నై: రచిన్ (బి) యశ్ దయాల్ 41, రాహుల్ త్రిపాఠి (సి) సాల్ట్ (బి) హాజెల్‌వుడ్ 5, రుతురాజ్ (సి) సబ్ బందగే (బి) హాజెల్‌వుడ్ 0, దీపక్ హుడా (సి) జితేశ్ (బి) భువనేశ్వర్ 4, కర్రాన్ (సి) క్రునాల్ (బి) లివింగ్‌స్టోన్ 8, శివమ్ దూబే (బి) యశ్ దయాల్ 19, జడేజా (సి) సాల్ట్ (బి) హాజెల్‌వుడ్ 25, అశ్విన్ (సి) సాల్ట్ (బి) లివింగ్‌స్టోన్ 11, ధోనీ (నాటౌట్) 30, నూర్ అహ్మద్ (నాటౌట్) 0 ; **ఎక్స్‌ట్రాలు : 3 ; మొత్తం 20 ఓవర్లలో 146/8 ; వికెట్లపతనం :** 1-8, 2-8, 3-26, 4-52, 5-75, 6-80, 7-99, 8-130 ; **బౌలింగ్ :** భువనేశ్వర్ 3-0-20-1, హాజెల్‌వుడ్ 4-0-21-3, యశ్ దయాల్ 3-0-18-2, లివింగ్‌స్టోన్ 4-0-28-2, సుయాష్ శర్మ 4-0-32-0, క్రునాల్ 2-0-26-0.

స్పోర్ట్స్

ఐపీఎల్‌లో నేడు — వేదిక అహ్మదాబాద్
గుజరాత్ x ముంబై — రా.7.30

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
బెంగళూరు	2	2	0	0	4	2.266
లక్నవూ	2	1	1	0	2	0.963
పంజాబ్	1	1	0	0	2	0.550
ఢిల్లీ	1	1	0	0	2	0.371
హైదరాబాద్	2	1	1	0	2	-0.128
కోల్‌కతా	2	1	1	0	2	-0.308
చెన్నై	2	1	1	0	2	-1.013
ముంబై	1	0	1	0	0	-0.493
గుజరాత్	1	0	1	0	0	-0.550
రాజస్థాన్	2	0	2	0	0	-1.882

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్పిన్ బౌలింగ్ కోచ్ కావలెను!



బెంగళూరు: సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీఓఈ)లో పని చేసే స్పిన్ బౌలింగ్ కోచ్ కోసం బీసీసీఐ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఇప్పటివరకు ఆ బాధ్యతల్ని నిర్వర్తించిన సాయిరాజ్ బహుతులే రాజీనామా చేసి రాజస్థాన్ రాయల్స్ జట్టులో చేరాడు. మరోవైపు అన్ని వయస్సు విభాగాల స్పిన్ బౌలర్లను మరింత మెరుగ్గా తీర్చిదిద్దే బాధ్యత కొత్త కోచ్‌పై ఉంటుందని బోర్డు పేర్కొంది. కనీసం 75 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు, మూడేళ్ల కోచింగ్ అనుభవం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులకు వచ్చే నెల 10 వరకు గడువుంది.

ఫెడరర్ రికార్డును.. దాటేసిన జొకోవిచ్



మియామీ గార్డెన్స్ (ఫ్లోరిడా) : నొవాక్ జొకోవిచ్ ఏడోసారి మియామీ ఓపెన్ టైటిల్ అందుకొనే దిశగా సాగుతున్నాడు. ఈక్రమంలో సెమీఫైనల్‌కు చేరుకున్న జొకో..స్విట్జర్లాండ్ దిగ్గజం రోజర్ ఫెడరర్ రికార్డును అధిగమించాడు. క్వార్టర్‌ఫైనల్లో సెబాస్టియన్ కోర్డాను 6-3, 7-6 (4) నొవాక్ ఓడించాడు. దాంతో 37 ఏళ్ల 10 నెలల జొకో..ఏటీపీ మాస్టర్స్ 1000 టోర్నీలో అత్యధిక వయస్సులో సెమీస్‌కు చేరిన ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. ఫలితంగా..2019లో 37 ఏళ్ల ఏడు నెలల వయస్సులో ఫెడరర్ నెలకొల్పిన గత రికార్డు తుడిచి పెట్టుకుపోయింది.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



అత్యంత శక్తిమంతమైన భారతీయుల జాబితాలో

రేవంత్‌రెడ్డి @ 28

ఇండియన్ ఎక్స్‌ప్రెస్ జాబితా-2025లో

నిరుటితో పోలిస్తే 11 స్థానాలు పైకి చేరుకున్న ముఖ్యమంత్రి

విధానపరమైన కీలక నిర్ణయాలతోనే గుర్తింపు!

అగ్రస్థానంలో ప్రధాని నరేంద్ర మోదీ.. 9వ స్థానంలో రాహుల్

ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబుకు 14వ స్థానం

13

శనివారం | 29-3-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 360
శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం, తిథి: అమావాస్య సా.4.29 తదుపరి పాడ్యమి; నక్షత్రం: ఉత్తరాభాద్ర రా.7.26 తదుపరి రేవతి; వర్జ్యం: ఉ.6.39-8.04, తె.6.00 మొ.; అమృతఘడియలు: మ.3.10-4.35; దుర్ముహూర్తం: ఉ.6.15-7.52; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.15; సూర్యాస్తమయం: 6.24
వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కులోన్మాద హత్య

తన కూతుర్ని ప్రేమిస్తున్నాడని యువకుడిని గొడ్డలితో నరికి చంపిన తండ్రి.. పెద్దపల్లిలో దారుణం

యువకుడికి కూతురు బర్త్ డే విషెస్ చెప్పడం, అతడితో కేక్ కట్ చేయించడంతో ఆగ్రహం

మధ్యాహ్నం నుంచి యువకుడి కదలికలపై దృష్టి

రాత్రి మిత్రులతో కలిసి మద్యం తాగుతుండగా దాడి

చంపేస్తారేమోనని గతంలోనే హెచ్చరించిన యువతి

గతంలోనూ రెండుసార్లు యువకుడిపై దాడికి యత్నం!

పెద్దపల్లి/ఎలిగేడు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తన కూతురును మరిచిపోవాలంటూ ఆ యువకుడిని హెచ్చరించినా పట్టించుకోకపోవడంతో అతడిపై యువతి తండ్రి కక్ష కట్టాడు. వేరే కులం యువకుడితో ప్రేమాగీమా వద్దంటూ మందలించినా కూతురు పట్టించుకోకపోగా ఆ అబ్బాయికి పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పడంతో ఉన్మాదిగా మారాడు. ఆ యువకుడిని చంపేస్తే తప్ప కూతురు ప్రేమ వ్యవహారానికి ఫుల్‌స్టాప్ పడదని భావించి.. పథకం ప్రకారం అతడి ప్రాణాలను బలిగొన్నాడు. గొడ్డలితో దాడి చేస్తే

మిగతా 3వ పేజీలో...



అత్యాధునిక ఎఫ్‌పీవీ డ్రోన్ పరీక్ష

విజయవంతం

పంజాబ్‌లోని పఠాన్‌కోట్‌లో పరీక్షించిన ఆర్మీ

లక్ష్యాన్ని సమర్థంగా ఛేదించిన డ్రోన్

న్యూఢిల్లీ, మార్చి 28: డ్రోన్ల తయారీపై దృష్టి సారించిన భారత ఆర్మీ తాజాగా అత్యాధునిక ఫస్ట్ పర్సన్ వ్యూ (ఎఫ్‌పీవీ) కమికాజె (ఆత్మాహుతి) డ్రోన్‌ను విజయవంతంగా పరీక్షించింది. శుక్రవారం పంజాబ్‌లోని పఠాన్‌కోట్‌లో నిర్వహించిన ఈ పరీక్షలో నిర్దేశిత లక్ష్యం వద్దకు మందుగుండు సామగ్రితో వెళ్లిన డ్రోన్ దాన్ని సమర్థంగా పేల్చివేసింది. ఇందుకు సంబంధించిన వీడియోను భారత సైన్యం

మిగతా 3వ పేజీలో...

పాపం.. పిల్లలు..

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో ముగ్గురి మృతి

రాత్రి తల్లిదండ్రులతో కలిసి భోజనం చేసిన పిల్లలు

తెల్లవారుజామున తల్లికి తీవ్ర అస్వస్థత

ఆస్పత్రిలో చికిత్స.. అప్పటికే పిల్లల మృతి

దారుణానికి విషాహారమే కారణం?

భర్తతో గొడవల నేపథ్యంలో పిల్లలతో కలిసి చనిపోవాలనుకుందని ఊహాగానాలు

భర్తపనేనని బాధితురాలి తరపు బంధువుల ఆరోపణ

3



మృతి చెందిన సాయికృష్ణ, మధుప్రియ, గౌతమ్ (ఫైల్)

భూ విలయం

మయన్మార్, థాయ్‌లో భారీ భూకంపం!

191 మంది మృతి

800 మందికి గాయాలు



మయన్మార్‌లోని నేపిడోలో భూకంపం ధాటికి ధ్వంసమైన ఓ భవనం

శుక్రవారం మధ్యాహ్నం 12.50కి ఘటన

రిక్టర్ స్కేలుపై 7.7 తీవ్రత నమోదు

12 నిమిషాల్లో 6.4 తీవ్రతతో మరో భూకంపం

తర్వాత మరో 4 సార్లు ప్రకంపనలు

శిథిలాల్లో వందల మంది ఆచూకీ గల్లంతు

థాయ్‌లాండ్, నైరుతి చైనాల్లో భారీగా ఆస్తి నష్టం

భారత్, బంగ్లాదేశ్‌ల్లోనూ ప్రకంపనలు

థాయ్‌లాండ్, మయన్మార్‌లలో అత్యవసర పరిస్థితి

అన్నివిధాలా ఆదుకుంటాం: ప్రధాని నరేంద్ర మోదీ

తప్పించుకున్న ఎమ్మెల్యే కుటుంబం

ఇద్దరు కుమారులు, కోడలితో బ్యాంకాక్ పర్యటనకు వెళ్లిన రాజ్‌ఠాకూర్ సతీమణి


వారు బస చేసిన హోటల్‌పై భూకంప ప్రభావం

అప్రమత్తమై హుటాహుటిన ఎయిర్‌పోర్టుకు..

2

బ్యాంకాక్, మార్చి 28: అతి భారీ భూకంపం మయన్మార్‌ను కుదిపేసింది. రాజధాని నేపిడో, రెండో అతిపెద్ద నగరం మాండలేలలో భారీ ప్రాణ నష్టం, తీవ్ర ఆస్తినష్టం సంభవించింది. ప్రఖ్యాత కట్టడాలు, పురాతన ఆలయాలు, ఆస్పత్రులు కూలిపోయాయి. 181 మంది మరణించి ఉంటారని అంచనా. మరో 730 మంది గాయపడ్డారని చెబుతున్నారు. వందల మంది జాడ తెలియడం లేదు. దాంతో మృతుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉంది. శుక్రవారం మధ్యాహ్నం 12.50 గంటలకు(భారత కాలమానం ప్రకారం 11.50) రిక్టర్ స్కేల్‌పై 7.7 తీవ్రతతో తొలుత ఒక భూకంపం వచ్చింది. తిరిగి పన్నెండు నిమిషాల వ్యవధిలో 6.4 తీవ్రతతో మరో భూకంపం వచ్చింది. తర్వాత మరోనాలుగుసార్లు ప్రకంపనలు వచ్చాయి. రెండోసారి వచ్చిన భూకంపం మయన్మార్‌నే కాకుండా పొరుగున ఉన్న థాయ్‌లాండ్, చైనాలోనూ విధ్వంసం సృష్టించింది. థాయ్‌లాండ్ మంది మంది మరణించారని, డజన్ల సంఖ్యలో గాయపడ్డారని అధికార వర్గాలు తెలిపాయి. చైనా వివరాలు అసలు బయటకే రాలేదు. అయితే, మూడు దేశాల్లో కలిపి ప్రాణనష్టం శనివారం నాటికి భారీగా పెరగొచ్చని అనుమానిస్తున్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు శిథిలాల్లో చిక్కుకొని ఉంటారని భావిస్తున్నారు. ముఖ్యంగా బహుళ

మిగతా 2వ పేజీలో...



బ్యాంకాక్‌లో భూకంపం కారణంగా ఓ భవనం కూలుతుండటంతో పరుగులు తీస్తున్న ప్రజలు



బీవైడీకి ఓకే!

తెలంగాణలో ఈవీ ప్లాంట్ ఏర్పాటుకు కేంద్రం ఆమోదం?

'మేఘా'తో కలిసి జాయింట్ వెంచర్

రూ.85,000 కోట్ల మేర పెట్టుబడులు

షాబాద్ వద్ద 500 ఎకరాల్లో ఏర్పాటు!

దాంతోపాటు హైదరాబాద్ సమీపంలో మరో 3 ప్రాంతాల్లోనూ పరిశీలన



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): చైనాకు చెందిన దిగ్గజ విద్యుత్ కార్ల (ఈవీ) తయారీసంస్థ బీవైడీ (బిల్డ్ యువర్ డ్రీమ్స్) ఎట్టకేలకు భారత్‌లో.. తన ఉత్పత్తి యూనిట్‌ను ఏర్పాటు చేయబోతోంది. హైదరాబాద్ కేంద్రంగా పని చేసే మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్)తో కలిసి సంయుక్తంగా ఈ ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపినట్టు సమాచారం. ఈ జేవీ ఈక్విటీలో చైనా కంపెనీకి 49%, ఎంఈఐఎల్‌కు 51% వాటా ఉండనున్నట్టు తెలుస్తోంది. అయితే ఈ వార్తలపై బీవైడీగానీ, ఎంఈఐఎల్‌గానీ అధికారికంగా ఎలాంటి ప్రకటనా చేయలేదు. దశలవారీగా 2032 నాటికి ఏటా

మిగతా 14వ పేజీలో...

రాష్ట్రంలో హెన్‌కిన్ గ్లోబల్

కేపబిలిటీ సెంటర్

రూ.2,500 కోట్ల పెట్టుబడులకు సిద్ధం

తక్షణం వెయ్యి ఉద్యోగాలు

వచ్చే మూడేళ్లలో మూడు వేల మందికి ఉపాధి

ముఖ్యమంత్రి రేవంత్‌తో సంస్థ ప్రతినిధులు భేటీ

14



కేంద్ర ఉద్యోగులకు శుభవార్త..

డీఏ 2% పెంపు

పెన్షనర్లకు డీఆర్ కూడా..

కేంద్ర క్యాబినెట్ నిర్ణయం

2

ఖరీఫ్‌లో ఫాస్ఫేట్, పొటాష్ ఎరువులపై రూ.37,216 కోట్ల సబ్సిడీ

నాన్-సెమీకండక్టర్ పరికరాల కోసం 22,919 కోట్లతో పీఎల్‌ఐ స్కీం

జస్టిస్ వర్మ బదిలీకి కేంద్రం ఓకే

3

వర్మపై ఎఫ్‌ఐఆర్ దాఖలుకు వేసిన పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీంకోర్టు

అందుకు ఇది సమయం కాదన్న బెంచ్

2 లక్షల మంది మహిళా కెప్టెన్లతో..

పింక్ ర్యాపిడో

2

వచ్చే మూడేళ్లలో దేశవ్యాప్తంగా సేవలు విస్తరణకు ర్యాపిడో సిద్ధం

స్త్రీలకు ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యం

ప్రస్తుతం చెన్నై, హైదరాబాద్, ఢిల్లీలో 700 మందికిపైగా మహిళలకు ఉపాధి

ఐఐటియన్లకూ ఉద్యోగాలు

దొరకట్లే!



22 ఐఐటీల ప్లేస్‌మెంట్లలో క్షీణత నమోదు

ఐఐటీ ధార్వాడ్‌లో 25%, ఖరగ్‌పూర్‌లో 2.8%

15 ఐఐటీల్లో 10 శాతానికి పైగా తగ్గుదల

ఉన్నత విద్య, స్టార్టప్‌ల వైపు విద్యార్థుల ఆసక్తి

పార్లమెంటరీ కమిటీకి కేంద్ర విద్యాశాఖ నివేదిక

న్యూఢిల్లీ, మార్చి 28: దేశవ్యాప్తంగా ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)ల్లో క్యాంపస్ ప్లేస్‌మెంట్లు భారీగా తగ్గుముఖం పట్టాయి. 2021-22తో పోలిస్తే 2023-24లో ఐఐటీ(బీహెచ్‌యూ) మినహా 23 ఐఐటీల్లో 22 చోట్ల బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీ గ్రాడ్యుయేట్ల ప్లేస్‌మెంట్లతో క్షీణత నమోదైంది. ఈ జాబితాలో 25శాతం తగ్గుదలతో ఐఐటీ ధార్వాడ్ టాప్‌లో ఉండగా, 2.88శాతం తగ్గుదలతో ఐఐటీ ఖరగ్‌పూర్ చివరి స్థానంలో నిలిచింది. 15 ఐఐటీల్లో ప్లేస్‌మెంట్ రేటు 10 శాతానికి పైగా తగ్గింది. ఈ మేరకు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి సమర్పించిన నివేదికలో కేంద్ర విద్యాశాఖ వెల్లడించింది. 2021-22, 2023-24 మధ్య ఐఐటీలు, ఐఐటీల్లో ప్లేస్‌మెంట్లు అసాధారణంగా తగ్గాయని బుధవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన నివేదికలో కమిటీ పేర్కొంది. మార్కెట్ ధోరణులకు అనుగుణంగా నియామకాల్లో హెచ్చుతగ్గులు ఉంటాయని, విద్యార్థులు ఉన్నత విద్యకు మొగ్గు చూపడం, స్టార్టప్‌ల వైపు మళ్లడం కూడా ప్లేస్‌మెంట్ల రేటు తగ్గడానికి కారణమని అభిప్రాయపడింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్

మిగతా 3వ పేజీలో...

కీలక శాఖల్లో మార్పులు!

క్యాబినెట్ విస్తరణతోపాటు పలువురు మంత్రుల శాఖల మార్పిడి

అధిష్ఠానం పట్ల విశ్వాసం, శాఖ నిర్వహణలో జాగ్రత్తలు తీసుకునే వారికి ప్రధాన శాఖలు

కాంగ్రెస్ హైకమాండ్‌దే తుది నిర్ణయం

ఇప్పటికే నివేదికలు తెప్పించుకున్న పెద్దలు

సీఎం వద్దే ఉండనున్న విద్యాశాఖ, హోంశాఖ!

ఉగాది లేదా ఏప్రిల్ 2 నుంచి 4 తేదీల్లో కొత్త మంత్రుల ప్రమాణం

హైదరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ శ్రేణులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్న రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు సమయం దగ్గరపడుతోంది. అయితే విశ్వావసు నామ సంవత్సరంలో చేపట్టనున్నట్లు భావిస్తున్న ఈ విస్తరణ.. కొత్త మంత్రుల చేర్పునకే పరిమితం కాబోవడంలేదు. క్యాబినెట్ విస్తరణతో పాటు.. ప్రస్తుతం ఉన్న మంత్రుల శాఖలు కూడా మారనున్నట్లు తెలుస్తోంది. ప్రత్యేకించి ప్రభుత్వంలోని అత్యంత కీలకమైన శాఖల్లో ఈ మార్పులు చోటుచేసుకోనున్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణపై

మిగతా 13వ పేజీలో...



నేడు కొడంగల్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

3.15 కోట్ల మందికి సన్నబియ్యం

రేపు హుజూర్‌నగర్‌లో ప్రారంభం

కొత్తగా 30 లక్షల మంది లబ్ధిదారులు

సన్నబియ్యంతో పాటు కొత్త కార్డులిస్తాం

కార్డులపై ప్రధాని బొమ్మ వేయాలన్న ప్రతిపాదన రాలేదు.. వస్తే పరిశీలిస్తాం

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్

హైదరాబాద్/హుజూర్‌నగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగ నుంచి రాష్ట్రంలో ఉన్న 3 కోట్ల 15 లక్షల మంది ప్రజలకు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర జనాభాలో 80-84 శాతం

మిగతా 13వ పేజీలో...

నిర్మల్ డీఎస్‌వో సస్పెన్షన్

డీఎం, డీటీలపైనా కొరడా.. ధాన్యం మిల్లింగ్‌లో అక్రమాల నేపథ్యంలో ప్రభుత్వం చర్యలు

ఏసీబీకి చిక్కిన డీఈఎంవో

రూ.30 వేల లంచం తీసుకుంటుండగా పట్టుబడిన ఆదిలాబాద్ వైద్యాధికారి

14



డీఈఎంవో రవి శంకర్

9885 మంది 'యాంటీ డ్రగ్ సోల్జర్'లు

మత్తుమందులపై పోరులో విద్యార్థుల సేవలు

డ్రగ్స్ కట్టడికి పోలీసుల సరికొత్త వ్యూహం

14

డ్రగ్స్‌పై సమాచారం అందజేయాలంటూ అవగాహన

రాష్ట్రవ్యాప్తంగా పేర్లు నమోదు చేసుకున్న విద్యార్థులు

డ్రగ్స్ ముఠాలు పట్టుబడితే సోల్జర్లకు పారితోషికం!

'ఎల్‌ఆర్‌ఎస్' రాయితీ

గడువు పెంపు!?

13

ఎల్లుండితో ముగియనున్న గడువు

దరఖాస్తుదారుల విజ్ఞప్తుల నేపథ్యంలో ఏప్రిల్ నెలాఖరు దాకా పెంచాలని సర్కారు యోచన!

గత 15 రోజుల్లో రూ.950 కోట్ల ఆదాయం

31లోపు మరో 500 కోట్లు వస్తుందని అంచనా

అంబేడ్కర్ జయంతి జాతీయ సెలవు దినం

న్యూఢిల్లీ, మార్చి 28: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ఏప్రిల్ 14ను జాతీయ సెలవు దినంగా ప్రకటిస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ విషయాన్ని కేంద్ర సాంస్కృతిక వ్యవహారాల శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ శుక్రవారం ఎక్స్ ద్వారా తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 14 శుక్రవారం రానుంది. ఆ రోజున పబ్లిక్ హాలిడేగా ప్రభుత్వం గుర్తించింది. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రూపొందించడంతో పాటు, సమాజంలో సమానత్వ యుగాన్ని స్థాపించారని, ఆయన సేవలకు గుర్తుగా సెలవు దినంగా ప్రకటిస్తున్నట్టు మంత్రి తెలిపారు. బాబాసాహెబ్‌ను భక్తిపూర్వకంగా అనుసరించే ప్రధాని నరేంద్ర మోదీ ప్రజల మనోభావాలను గౌరవించి ఈ నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు.

బీఏసీ సమావేశం నుంచి ధన్‌ఖడ్ వాకౌట్

న్యూఢిల్లీ, మార్చి 28: బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశం నుంచి రాజ్యసభ ఛైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ వాకౌట్ చేశారు. ఈ సమావేశంలో 'సముచిత గౌరవం' లోపించడమే కారణమని రాజ్యసభ వర్గాలు తెలిపాయి. అయితే వివిధ అంశాలపై ఎన్డీయే ఎంపీలకు, తమకు తీవ్ర విభేదాలు రావడంతో ఆయన మధ్యలో వెళ్లిపోయారని విపక్ష సభ్యులు చెబుతున్నారు. వచ్చే వారం రాజ్యసభ కార్యకలాపాలను నిర్ణయించడానికి శుక్రవారం బీఏసీ సమావేశం నిర్వహించారు. నకిలీ ఓటరు ఐడీ నంబర్లు, మణిపూర్ ఘటన, పార్లమెంటరీ కమిటీల బిల్లులను పరిశీలనకు పంపాలన్న అంశాలపై చర్చించేందుకు సమయం కేటాయించాలన్న డిమాండ్‌పై అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య భిన్నాభిప్రాయాలు రావడంతో ధన్‌ఖడ్ వాకౌట్ చేశారని ఓ విపక్ష నాయకుడు తెలిపారు. కాగా నకిలీ ఓటరు కార్డుల అంశం ఈ సమావేశంలో చర్చించలేదని రాజ్యసభ వర్గాలు పేర్కొన్నాయి.

తూర్పు లద్దాఖ్ వద్ద శాశ్వత సైనిక స్థావరం

- ఎల్‌ఏసీ రక్షణకు '72 ఇన్‌ఫాంట్రీ డివిజన్'..ఆర్మీ నిర్ణయం

న్యూఢిల్లీ, మార్చి 28: తూర్పు లద్దాఖ్‌లోని వాస్తవాధీన రేఖ (ఎల్‌ఏసీ) వద్ద రక్షణకు శాశ్వత సైనిక స్థావరం ఏర్పాటు చేయాలని భారత ఆర్మీ నిర్ణయించింది. ఆ ప్రాంతంలో శాశ్వతంగా మోహరించేందుకు కొత్తగా డివిజన్ స్థాయి దళాన్ని సిద్ధం చేస్తోంది. దానికి 72 ఇన్‌ఫాంట్రీ డివిజన్ అని నామకరణం చేసింది. చైనా సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే లద్దాఖ్‌లోని ఎల్‌ఏసీ మొత్తాన్ని గస్తీకాస్తున్న 3వ డివిజన్‌కు అదనంగా కొత్త పదాతిదళ విభాగం పనిచేస్తుంది. ఈ కొత్త విభాగం ఫైర్ అండ్ ఫ్యూరీ కార్ప్స్ ఆధీనంలో ఉంటుంది. ఓ దళంలో 10 నుంచి 15 వేల వరకు సైనిక శక్తి ఉంటుంది. వారికి అదనంగా మరో 8 వేల మంది సహాయంగా ఉంటారు. దీనికి మేజర్ జనరల్ ర్యాంక్ అధికారి నేతృత్వం వహిస్తారు.

యూకేను వీడనున్న లక్ష్మీ మిత్తల్!



న్యూఢిల్లీ, మార్చి 28: ప్రముఖ పారిశ్రామికవేత్త, ఆర్సెలార్ మిత్తల్ మాజీ సీఈవో లక్ష్మీ మిత్తల్ బ్రిటన్‌ను వీడనున్నారు. దాదాపు మూడు దశాబ్దాలుగా అక్కడే నివసిస్తున్న ఆయన.. యూకే ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఆ దేశాన్ని వీడాలని అనుకున్నట్లు సమాచారం. నాన్ డోమ్ పన్ను విధానాన్ని రద్దుచేయాలని బ్రిటన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ పన్ను విధానం కింద యూకేలో నివసించే వారు విదేశాల్లో సంపాదించిన ఆదాయంపై బ్రిటన్ ప్రభుత్వానికి ఎలాంటి పన్ను చెల్లించనక్కర్లేదు. అయితే ఇప్పుడు ఈ విధానాన్ని రద్దు చేయాలని అక్కడి ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఆయన ఏప్రిల్‌లో కొత్త నిబంధనలు అమలులోకి రాకముందే యూకే నుంచి వెళ్లిపోయే అవకాశం ఉంది. ఆయన యూకేను వీడి సంపన్నులకు ఆకర్షణీయమైన పన్ను ప్రోత్సాహకాలను అందించే దుబాయ్, స్విట్జర్లాండ్, ఇటలీ వంటి దేశాలకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారని వార్తలు వస్తున్నాయి. మిట్టల్ 1995లో యూకేకు వెళ్లారు. ఫోర్బ్స్ అంచనా ప్రకారం, మిత్తల్ సంపద 14.9 బిలియన్ పౌండ్లుగా ఉంది.

భావ స్వేచ్ఛ నాగరిక సమాజ సహజ లక్షణం

- కాంగ్రెస్ ఎంపీ రాసిన కవితపై కేసు కొట్టేసిన సుప్రీం

న్యూఢిల్లీ, మార్చి 28: భావ స్వేచ్ఛ ఆరోగ్యకర, నాగరిక సమాజ సహజ లక్షణమని సుప్రీంకోర్టు శుక్రవారం అభిప్రాయపడింది. దీన్ని కాపాడడం న్యాయస్థానాల కర్తవ్యమని స్పష్టం చేసింది. కవిత రాసినందుకు కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు ఇమ్రాన్ ప్రతాప్‌గఢీపై గుజరాత్ పోలీసులు పెట్టిన కేసును కొట్టివేస్తూ ఈ వ్యాఖ్య చేసింది. ఆయన ఎలాంటి తప్పు చేయలేదని ధర్మాసనం అభిప్రాయపడింది. సామాజిక మాధ్యమాల్లో పెట్టిన ఆ కవిత ద్వారా శాంతి సందేశాన్ని అందించారని తెలిపింది. జామ్‌నగర్‌లో జరిగిన సామూహిక వివాహ కార్యక్రమానికి హాజరైన ప్రతాప్‌గఢీ 'ఏ ఖూన్ కే ప్యాసే బాత్ సునో (రక్త దాహార్తుల్లారా వినండి) శీర్షికన ఓ కవిత రాసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. అయితే ఇది విద్వేషాలను రెచ్చగొట్టేలా ఉందంటూ జనవరి మూడో తేదీన జామ్‌నగర్ పోలీసులు కేసు పెట్టారు. దీనిపై ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

లెబనాన్‌పై ఇజ్రాయెల్ క్షిపణి దాడులు

టెల్ అవీవ్, బీరుట్, గాజా, మార్చి28: లెబనాన్ రాజధాని బీరుట్‌పై ఇజ్రాయెల్ ప్రతీకార దాడులు చేసింది. బీరుట్ దక్షిణ శివార్లలోని దహియేపై జరిగిన క్షిపణి దాడుల్లో పలు భవనాలు నేలమట్టమయ్యాయి. ఇజ్రాయెల్-హెజ్బొల్లా మధ్య గత నవంబరులో కాల్పుల విరమణ కుదిరాక తొలిసారిగా జరిగిన ఈ దాడితో లెబనాన్‌లో కలకలం రేగింది. లెబనాన్ నుంచి తమపై గత శనివారంతో పాటు శుక్రవారం కూడా రాకెట్ దాడులు జరిగాయని ఇజ్రాయెల్ ఆరోపించింది. రెండో సారి కూడా రాకెట్ దాడులు జరగడంతో నెతన్యాహు ప్రభుత్వం ప్రతిదాడులకు ఆదేశించింది. బీరుట్‌లో హెజ్బొల్లా ఆయుధ స్థావరాలపై క్షిపణి దాడులు జరిపినట్లు ఇజ్రాయెల్ బలగాలు ప్రకటించాయి. కాగా, ఇజ్రాయెల్‌పై రాకెట్లు ప్రయోగించినవారిని తక్షణమే అరెస్ట్ చేయాలని లెబనాన్ ప్రధాని నవాఫ్ సలామ్ ఆ దేశ ఆర్మీ చీఫ్‌ను ఆదేశించారు.

సైబర్ నేరగాళ్ల వేధింపులకు వృద్ధ దంపతులు బలి!

బెంగళూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల వేధింపులకు వృద్ధదంపతులు బలయ్యారు. డబ్బులు ఇవ్వకపోతే నగ్న చిత్రాలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తామని బెదిరించడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డారు. కర్ణాటక రాష్ట్రం బెళగావి జిల్లా ఖానాపుర తాలూకా బీడీ గ్రామానికి చెందిన రైల్వే రిటైర్డు ఉద్యోగి డియోగో నజరత్‌కు సైబర్ నేరగాళ్లు కొంతకాలంగా ఫోన్ చేస్తున్నారు. ఢిల్లీ క్రైం బ్రాంచ్ పోలీసులుగా పరిచయం చేసుకున్న వీరు డబ్బులు ఇవ్వాలని వేధించారు. సుమారు రూ.6 లక్షలు నగదు బదిలీ చేయించుకున్నారు. మరింత డబ్బు కావాలని, ఇవ్వకపోతే నగ్న చిత్రాలను సోషల్‌మీడియాలో పోస్టు చేస్తామని, కుటుంబ సభ్యులు, బంధువులు అందరూ చూస్తారని వీడియోకాల్ చేసి బెదిరించారు. దిక్కుతోచని డియోగో నజరత్(83), ఆయన భార్య పావియా నజరత్(79) ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. గురువారం ఇద్దరూ నిద్రమాత్రలు మింగారు. భార్య మృతి చెందిన తరువాత, డియోగో నజరత్ కత్తితో గొంతు కోసుకున్నారు. ఆత్మహత్యకు ముందు తమకు వచ్చిన బెదిరింపుల గురించి డియోగో సూసైడ్ నోట్ రాసిపెట్టారు.

గాలి జనార్దన్‌రెడ్డి కేసులో ముగిసిన సీబీఐ కోర్టు విచారణ

- మే 6న తుది తీర్పు



హైదరాబాద్, మార్చి 28: గాలి జనార్దన్‌రెడ్డి నేతృత్వంలోని ఓబుళాపురం మైనింగ్ కంపెనీ ఇనుప గనుల అక్రమాలపై సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం విచారణ శుక్రవారం ముగిసింది. మే ఆరో తేదీన తీర్పు వెలువరిస్తామని న్యాయస్థానం ప్రకటించింది. 2011లో సీబీఐ గాలి జనార్దన్‌రెడ్డిపై కేసు నమోదు చేయగా, చార్జిషీటు దాఖలు అనంతరం 13 ఏళ్లుగా ప్రత్యేక కోర్టులో విచారణ నడుస్తోంది. ఈ కేసులో నాలుగు నెలల్లో విచారణ పూర్తి చేసి తీర్పు వెల్లడించాలని గతంలో సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే న్యాయస్థానం విచారణ పూర్తి చేసింది. ఈ కేసులో గాలి జనార్దన్‌రెడ్డితో పాటు ఓఎంసీ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, మరో ఐదుగురు నిందితులుగా ఉన్నారు.

భూ విలయం



బ్యాంకాక్‌లో భూకంప తీవ్రతతో కుప్పకూలిన భవన సముదాయం



(మొదటి పేజీ తరువాయి)

అంతస్తులకు నిలయమైన థాయ్‌లాండ్ రాజధాని, ప్రముఖ పర్యాటక కేంద్రం బ్యాంకాక్‌లో పలు భవనాలు పేకమేడల్లా కూలిపోయాయి. నిర్మాణంలో ఉన్న 30 అంతస్తుల భవనం నిలువునా కూలిపోయిన దృశ్యాలు ప్రపంచవ్యాప్తంగా ప్రజలను నిరుత్తరులను చేశాయి. అంతపెద్ద భవనం క్షణాల్లో సిమెంటు రాళ్లు, ఇనుప తీగల కుప్పగా మారింది. ఈ ఒక్క భవనంలోనే 43 మంది నిర్మాణ కార్మికులు చిక్కుకున్నారని అంటున్నారు. శిథిలాల్లో చిక్కుకుపోయిన వారి ఆర్తనాదాల వీడియోలు సోషల్ మీడియాలో తిరుగుతున్నాయి. మయన్మార్, థాయ్‌లాండ్ రెండు దేశాల్లో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. భూకంప కేంద్రం ఉన్న మయన్మార్‌లో పరిస్థితి తీవ్రంగానే ఉంది. ఐరావతి నది మీద మాండలే నగరంలో 90 ఏళ్ల క్రితం కట్టిన ప్రఖ్యాత అవా వంతెన కుప్పకూలిపోయింది. దాంతో మాండలేకు, మయన్మార్ అతిపెద్ద నగరం యాంగూన్‌కు మధ్య రాకపోకలు దెబ్బతిన్నాయి. మాండలేలో బహుళ అంతస్తుల భవనం వంగిపోవడంతో పైభాగాన స్విమ్మింగ్‌పూల్ నుంచి నీరంతా జలపాతంలా దూకే దృశ్యాలను ప్రజలు చిత్రీకరించారు. మయన్మార్ రాజధాని నేపీటాలో వెయ్యి పడకల ఆసుపత్రి కూలిపోయి 20 మంది మరణించారు. మాండలే నగరంలోని మాండలే రాజప్రాసాదం, బౌద్ధ క్షేత్రం మహాముని పగోడా పునాదులు దెబ్బతిన్నాయి. ఎవరు సాయం ఇచ్చినా స్వీకరిస్తామని మయన్మార్ ప్రభుత్వం ప్రకటించింది. బ్యాంకాక్ నగరంలో పలు హోటళ్లు, బార్లు, రెస్టారెంట్లు ముందుజాగ్రత్తగా మూసేశారు. ప్రభుత్వం కూడా పర్యాటకులు ఎవరికీ సమాచారం ఇవ్వకుండా బయటకు వెళ్లొద్దని సూచించింది. బ్యాంకాక్‌ను ప్రభుత్వం విపత్తు ప్రాంతంగా ప్రకటించింది. తెలుగువారు ఎక్కువగా వెళ్లే పట్టాయా భూకంప కేంద్రానికి దూరంగా ఉండటంతో అక్కడ పెద్దగా ప్రభావం లేదు. అయితే, మరిన్ని ప్రకంపనలు వచ్చే అవకాశం ఉన్నందున పర్యాటకులు జాగ్రత్తగా ఉండాలని చెబుతున్నారు. భూకంపం కారణంగా థాయ్‌లాండ్‌లో విమానాశ్రయాలు మూసేయడంతో హైదరాబాద్ విమానాశ్రయానికి వచ్చే పలు విమానాలు రద్దు అయ్యాయి. ఆ విమానాల్లో ప్రయాణించాల్సిన ప్రయాణికులు సాయంత్రం నుంచి శంషాబాద్ విమానాశ్రయంలో ఎదురు చూస్తున్నారు. భూకంప కేంద్రం ఉపరితలానికి కేవలం పది కిలోమీటర్ల లోతులో ఉండటం వల్ల నష్టం తీవ్రత అధికంగా ఉందని భావిస్తున్నారు. భూకంపం నేపథ్యంలో థాయ్‌లాండ్ స్టాక్ ఎక్స్ఛేంజీని నిలిపేశారు.

కోల్‌కతాలోనూ ప్రకంపనలు

భూప్రకంపనలు భారత్ వరకు విస్తరించాయి. కోల్‌కతా, ఇంఫాల్‌లో భవనాలు కంపించాయి. భూకంపం నష్టంపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర ఆందోళన వెలిబుచ్చారు. రెండు దేశాలకు ఎలాంటి సాయం అవసరమైనా చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. మయన్మార్, థాయ్‌లాండ్ ప్రభుత్వాలతో భారత విదేశాంగ శాఖ టచ్‌లో ఉందని చెప్పారు. బంగ్లాదేశ్‌లో 7.3 తీవ్రతతో భూకంపం వచ్చింది. రాజధాని ఢాకా, చిట్టగాంగ్‌లలో ప్రకంపనలు వచ్చాయి. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. బ్యాంకాక్ సబర్బన్ ప్రాంతాల్లో 1.7 కోట్ల మంది నివసిస్తున్నారు. పర్యాటక ప్రాంతమైన బ్యాంకాక్‌లో ప్రజలంతా షాపింగ్ మాల్‌లు ఖాళీ చేసి నగరం మధ్యలో ఉన్న పార్క్‌లో పోగయ్యారు. భారతీయ పర్యాటకులు పెద్ద ఎత్తున ఉండే నగరం కావడంతో ప్రస్తుతం అక్కడే ఉన్న పర్యాటకుల బంధువులు ఆందోళనలో మునిగి పోయారు. యోగక్షేమాల కోసం ఫోన్లు ఎక్కువ కావడంతో నెట్‌వర్క్‌లు స్తంభించిపోయాయి. భారత ప్రభుత్వం భారతీయ పర్యాటకుల కోసం +66618819218 హెల్ప్‌లైన్ నంబర్‌ను ఏర్పాటు చేసింది. నైరుతి చైనాలోని యునాన్ రాష్ట్రంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని చైనా ప్రభుత్వం ప్రకటించింది. ప్రకంపనల భయానికి జనం ఇళ్లలోకి వెళ్లడం లేదు. మయన్మార్ సరిహద్దులోని చైనా పట్టణం జిన్హోంగ్‌లో భూమి ఒక నిమిషం పాటు కంపించిందని స్థానిక అధికారులు తెలిపారు. మయన్మార్, థాయ్‌లాండ్‌లకు కావాల్సిన మందులను పంపిస్తున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. 2004 సునామీ భూకంపం తర్వాత థాయ్‌లాండ్‌లో భూకంపాలను ఎదుర్కోవడానికి అన్ని రకాల వ్యవస్థలను సిద్ధం చేశారు. దాంతో ప్రాణనష్టం తక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నారు.



భూకంపంతో తీవ్రంగా దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న మయన్మార్ సైనిక నేత హ్లాయింగ్



భవన శిథిలాల్లో ఇనుప చువ్వల కింద చిక్కుకుపోయిన ఓ వ్యక్తి

బ్యాంకాక్‌లో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ కుటుంబం

- ఇద్దరు కుమారులు, కోడలితో పర్యటనకు వెళ్లిన ఆయన సతీమణి
- భూకంపంతో దెబ్బ తిన్న వారి హోటల్
- అప్రమత్తమై హుటాహుటిన ఎయిర్‌పోర్టుకు..



మక్కాన్‌సింగ్

హైదరాబాద్/కోల్‌సిటీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రామగుండం కాంగ్రెస్ ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ కుటుంబానికి బ్యాంకాక్‌లో ప్రాణాపాయం తప్పింది. అక్కడ చోటుచేసుకున్న భూకంపం నుంచి వారు సురక్షితంగా బయటపడ్డారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో రాజ్‌ఠాకూర్ హైదరాబాద్‌లోనే ఉండగా.. ఆయన సతీమణి మనాలీ ఠాకూర్, పెద్ద కుమారుడు ప్రతీక్, ఆయన భార్య, చిన్న కుమారుడు నితీశ్ గురువారం బ్యాంకాక్ పర్యటనకు వెళ్లారు. శుక్రవారం అక్కడ సంభవించిన భూకంపం తాకిడికి వారు విడిది చేసిన హోటల్ దెబ్బ తిన్నది. సమీపంలోని చాలా భవనాలు కూలిపోయాయి. రాజ్‌ఠాకూర్ సతీమణి మనాలీ ఠాకూర్ అప్రమత్తంగా వ్యవహరించి కుటుంబ సభ్యులను బయటకు తీసుకొచ్చారు. వారంతా హుటాహుటినా బ్యాంకాక్ విమానాశ్రయానికి చేరుకున్నారు. కాగా, తమ కుటుంబ సభ్యులు క్షేమంగానే ఉన్నారని, వారు ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ వెల్లడించారు.

అమెరికాకు సుంకాల తగ్గింపు ఆఫర్!

పలు అమెరికా వ్యవసాయ ఉత్పత్తులపై టారిఫ్ కోతకు భారత్ అంగీకారం

న్యూఢిల్లీ, మార్చి 28: అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టిన తర్వాత.. ఇతర దేశాల ఉత్పత్తులపై సుంకాల మోత మోగించడం, దానికి ప్రతిగా ఆయా దేశాలు కూడా అదే స్థాయిలో స్పందిస్తుండడం చూశాం. అయితే ఇందుకు భిన్నంగా భారత్ ముందుకు వెళుతోంది. తాజాగా ఆ దేశానికి మరింత రాయితీ కల్పిస్తూ.. అమెరికా వ్యవసాయ ఉత్పత్తులు బాదం, క్రాన్‌బెర్రీస్ వంటి వాటి దిగుమతులపై సుంకాల తగ్గింపునకు భారత్ అంగీకరించినట్లు తెలిసింది. ఈ మేరకు రెండు దేశాల ప్రభుత్వ వర్గాలను ఉటంకిస్తూ వార్తా సంస్థ రాయిటర్స్ తన కథనంలో పేర్కొంది. దీనిపై దక్షిణ, మధ్య ఆసియాకు అమెరికా ట్రేడ్ ప్రతినిధిగా ఉన్న బ్రెండెన్ లించ్‌తో ఢిల్లీలో జరిగిన వరుస సమావేశాల్లో చర్చలు జరిగినట్లు తెలిసింది. బోర్బన్ విస్కీతో పాటు బాదం, వాల్‌నట్స్, క్రాన్‌బెర్రీస్, పిస్తా, కాయధాన్యాలు వంటి వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాల తగ్గింపునకు భారత్ అంగీకరించిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇది వచ్చే వారం ట్రంప్ నిర్ణయించిన పరస్పర సుంకాలను తప్పించడంపై ఆశాభావాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, గత నెల బోర్బన్ విస్కీపై సుంకాన్ని భారత్ 150 శాతం నుంచి 100 శాతానికి తగ్గించింది. ఇక క్రాన్‌బెర్రీస్, బాదం, వాల్‌నట్స్‌పై సుంకాలు 30 నుంచి 100 శాతం వరకు ఉండగా, కాయధాన్యాలపై 10 శాతం వరకు ఉన్నాయి. చైనా, కెనడా, ఈయూ వంటి దేశాల మాదిరిగా కాకుండా భారత్ మాత్రం.. ట్రంప్‌ను ప్రసన్నం చేసుకొనేందుకు చురుకుగా ప్రయత్నిస్తోందని, 23 బిలియన్ డాలర్ల విలువైన అమెరికా దిగుమతులపై సగానికి పైగా సుంకాలను తగ్గించేందుకు సిద్ధంగా ఉందని రాయిటర్స్ ఇటీవల పేర్కొంది.

కేంద్ర ఉద్యోగులకు డీఏ 2% పెంపు

పెన్షనర్లకు డీఆర్ కూడా.. కేంద్ర క్యాబినెట్ నిర్ణయం

- ఖరీఫ్‌లో ఫాస్ఫేట్, పొటాష్ ఎరువులపైరూ.37,216 కోట్ల సబ్సిడీ



న్యూఢిల్లీ, మార్చి 28: కేంద్ర మంత్రివర్గం కేంద్ర ప్రభుత్వోద్యోగులకు, పెన్షనర్లకు శుభవార్త ప్రకటించింది. వారికి కరువు భత్యం (డీఏ), డీఏఫ్‌లను రెండు శాతం పెంచే ప్రతిపాదనకు ఆమోదముద్ర వేసింది. ప్రధాని మోదీ అధ్యక్షతన శుక్రవారం సమావేశమైన కేంద్ర కేబినెట్ దీనితో పాటు మరిన్ని కీలక నిర్ణయాలు తీసుకుందని రైల్వే, సమాచారప్రసార శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్ విలేకరులకు తెలిపారు. ప్రస్తుతం ఉద్యోగులు, పెన్షనర్ల మౌలిక వేతనం/పింఛనులో డీఏ, డీఆర్ 53 శాతంగా ఉన్నాయని.. ఇప్పుడవి 55 శాతానికి పెరిగినట్లు చెప్పారు. ఏడో వేతన సంఘం సిఫారసుల ఆధారంగా.. ధరల పెరుగుదలను పరిగణనలోకి తీసుకుని మంత్రివర్గం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ఈ ఏడాది జనవరి 1 నుంచి పెంపు అమల్లోకి వస్తుంది. దీనివల్ల 48.66 లక్షల మంది కేంద్ర ప్రభుత్వోద్యోగులు, 66.55 లక్షల మంది పెన్షనర్లు లబ్ధి పొందుతారని తెలిపారు. ఎనిమిదో వేతన కమిషన్ ఏర్పాటుకోసం ఎదురుచూస్తున్న వీరికి ఇప్పుడు వేతనాలు, పెన్షన్లు పెరుగుతాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అలాగే ఈ పెంపు కారణంగా కేంద్ర ఖజానాపై ఏటా రూ.6,614.04 కోట్ల భారం పడుతుందని మంత్రి చెప్పారు. కాగా.. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఫాస్ఫేట్, పొటాషియం ఎరువులపై రూ.37,216 కోట్ల సబ్సిడీ ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించింది. డీఏపీ ఎరువుల ప్రస్తుత రిటైల్ ధరలు యథాతథంగా కొనసాగుతాయి. రూ.22,919 కోట్లతో నాన్-సెమీకండక్టర్ ఎలక్ట్రానిక్స్ పరికరాలకు ఉత్పాదక ఆధారిత రాయితీ (పీఎల్‌ఐ) స్కీంను కూడా మంత్రివర్గం ఆమోదించింది. ఈ పరిశ్రమ ఎంతకాలంగానో ఈ నిర్ణయం కోసం ఎదురుచూస్తోందని, ఈ ప్యాకేజీ ఆరేళ్ల అమల్లో ఉంటుందని వైష్ణవ్ చెప్పారు. బిహార్లో అత్యంత కీలకమైన కోసీ మేచీ అంతర్గత అనుసంధాన ప్రాజెక్టును కూడా కేబినెట్ ఆమోదించింది. ప్రధానమంత్రి కృషి సించయీ యోజన-సత్వర సాగునీటి లబ్ధి పథకం (ఏఐబీపీ) కింద దీనికి ఆర్థిక సాయం అందించనున్నారు. ఈ పథకం అంచనా వ్యయం రూ.6,282.32 కోట్లు కాగా.. కేంద్రం బిహార్‌కు రూ.3,652.56 కోట్లు అందిస్తుంది. సాగునీరు, వరద నిర్వహణ కోసం ఇప్పుడున్న తూర్పు కోసి ప్రధాన కాలువను ఆధునికీకరించి.. కోసి నదిలో మిగులు జలాలను మహానంద బేసిన్‌లో సాగునీటి అవసరాలకు మళ్లించడం దీని ప్రధానోద్దేశం. ఈ ప్రాజెక్టుపై ఇప్పటికే నేపాల్‌తో సంప్రదింపులు జరుపుతున్నట్లు వైష్ణవ్ వెల్లడించారు. 2029నాటికి పథకం పూర్తవుతుందని, అరారియా, పూర్ణియా, కిషన్‌గంజ్, కతిహార్ జిల్లాల్లో 2.10 లక్షల హెక్టార్లకు అదనంగా సాగునీరు అందుతుందని చెప్పారు.

డీఏ బకాయిలు ఏప్రిల్ వేతనంలో!

పెరిగిన డీఏ/డీఆర్ బకాయిలను ఏప్రిల్ నెల వేతనంతో కలిపి అందిస్తారు. డీఏ పెంపుతో ఉద్యోగుల వేతనాలు పెరుగనున్నాయి. ఉదాహరణకు.. రూ.18 వేల మౌలిక వేతనం కలిగిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగికి (ఈ ఏడాది జనవరి 1 నుంచి) ఇక ప్రతి నెలా రూ.360 పెరుగుతుంది. 18 వేల మౌలిక వేతనం, నెలనెలా రూ.30 వేల జీతం పొందుతున్న ఉద్యోగికి ఇక డీఏ కింద రూ.9,900 అందుతుంది.

156 ప్రచండ్ హెలికాప్టర్ల కొనుగోలుకు ఓకే

భారత సైన్యం, వాయుసేన కోసం 156 తేలికపాటి యుద్ధ హెలికాప్టర్ల (ప్రచండ్)ను హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్) నుంచి కొనుగోలు చేసేందుకు శుక్రవారం భద్రతా వ్యవహారాల కేంద్ర క్యాబినెట్ కమిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించిన డీల్ విలువ రూ.62,000 కోట్లుగా ఉంది. ఇప్పటి వరకు హెచ్‌ఏఎల్‌కు ఇదే అతిపెద్ద ఆర్డరు కావడం గమనార్హం. ఈ హెలికాప్టర్లను హెచ్‌ఏఎల్... కర్ణాటకలోని బెంగళూరు, తుంకుర్ ప్లాంట్లలో తయారు చేయనుంది. ఇక 156 హెలికాప్టర్లలో 90 భారత సైన్యానికి, మిగతావి భారత వైమానిక దళానికి కేటాయించనున్నారు. చైనా, పాకిస్థాన్ సరిహద్దుల్లో కార్యకలాపాల కోసం వీటిని వినియోగించనున్నారు. ఇంత భారీ స్థాయి ఆర్డరును ఇవ్వడం వల్ల దేశంలో పెద్ద ఎత్తున ఉద్యోగాల కల్పనకు అవకాశం ఏర్పడుతుందని రక్షణ రంగ వర్గాలు చెబుతున్నాయి. ప్రచండ్ 5వేల మీటర్ల ఎత్తులో అలవోకగా లాండింగ్, టేక్ ఆఫ్ కాగలదు.

2 లక్షల మంది మహిళా కెప్టెన్లతో..

దేశవ్యాప్తంగా 'పింక్ ర్యాపిడో'

న్యూఢిల్లీ, మార్చి 28: దేశంలోనే అతి పెద్ద బైక్-ట్యాక్సీ ప్లాట్‌ఫామ్ ర్యాపిడో.. తన 'పింక్ మొబిలిటీ' పథకాన్ని దేశవ్యాప్తంగా విస్తరించేందుకు సిద్ధమైంది. దీని ద్వారా వచ్చే మూడేళ్లలో 2 లక్షల మంది మహిళలకు స్థిరమైన ఆదాయాన్ని సృష్టించడంతోపాటు, మహిళా ప్రయాణికులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణ అనుభవాన్ని కల్పించడమే తమ లక్ష్యంగా పేర్కొంది. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు.. ఆజాద్ ఫౌండేషన్, సఖా కన్సల్టింగ్ వింగ్స్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మూడు సంస్థలూ కలిసి.. ప్రొఫెషనల్ డ్రైవింగ్ నైపుణ్యాలు కలిగిన మహిళలకు బైక్ కొనుగోలు, రిజిస్ట్రేషన్ వంటివాటిలో సహాయం చేస్తాయి. వారికి సేఫ్టీ ట్రైనింగ్ ఇవ్వడంతో పాటు.. తరచుగా వర్క్‌షాపులు నిర్వహిస్తూ పలు అంశాలపై అవగాహన కల్పించనున్నాయి. ఈ పథకంలో చేరే మహిళలకు నెలకు రూ.25 వేల దాకా సంపాదించుకునే అవకాశం కల్పించడం ద్వారా వారి దీర్ఘకాల ఆర్థికభద్రతకు భరోసానివ్వడమే తమ లక్ష్యమని ర్యాపిడో చీఫ్ ఆఫ్ స్టాఫ్ శ్రావ్య రెడ్డి తెలిపారు. 'పింక్ ర్యాపిడో' సేవలను తొలుత చెన్నైలో ప్రారంభించిన ర్యాపిడో సంస్థ.. తర్వాత వాటిని హైదరాబాద్, ఢిల్లీ నగరాలకు విస్తరించింది. చెన్నైలో దాదాపు 350 మంది మహిళా కెప్టెన్లు (రైడర్లు) ఉండగా.. హైదరాబాద్‌లో 220 మంది, ఢిల్లీలో 170 మంది మహిళా రైడర్లు 'పింక్ ర్యాపిడో' ద్వారా ఉపాధి పొందుతున్నారు. కర్ణాటకలో కూడా ఈ సేవలను అందించేందుకు ర్యాపిడో కిందటి నెలలో ప్రయత్నాలు ప్రారంభించింది. 2025 చివరికల్లా కర్ణాటకలో 25 వేల మంది మహిళలకు 'పింక్ ర్యాపిడో' ద్వారా ఉపాధి కల్పించాలన్నది తమలక్ష్యంగా ఆ సంస్థ ప్రకటించింది.

డబ్ల్యూటీవోకు నిధులు నిలిపివేసిన అమెరికా

న్యూఢిల్లీ, మార్చి 28: ప్రపంచ వాణిజ్య సంస్థకు (డబ్ల్యూటీవో) అమెరికా నుంచి వెళ్లే నిధులను నిలిపివేసినట్లు ట్రేడ్ వర్గాలను ఉటంకిస్తూ రాయిటర్స్ నివేదించింది. ప్రభుత్వ వ్యయాలను తగ్గించుకునేందుకు ట్రంప్ ప్రభుత్వం చేపట్టిన చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అమెరికా పలు ప్రపంచ సంస్థల నుంచి తప్పుకుంటూ వస్తోన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో డబ్ల్యూహెచ్‌వో) నుంచి వైదొలుతున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. 2024లో డబ్ల్యూటీవో వార్షిక బడ్జెట్ 23.2 కోట్ల డాలర్ల బిలియన్ డాలర్లుగా ఉంది. ఇందులో అమెరికా 11% నిధులు సమకూరుస్తుంది. కాగా, స్వదేశంలో కోడిగుడ్ల ధరలను అదుపులోకి తెచ్చేందుకు అమెరికా ప్రపంచ వ్యాప్తంగా వాటి అన్వేషణలో పడింది! జర్మనీ, ఇటలీ, పోలాండ్, స్వీడన్ తదితర దేశాలను అమెరికా వ్యవసాయ శాఖ తమకు అర్జెంటుగా గుడ్లను సరఫరా చేయాలని కోరింది. కాగా అమెరికాలో బర్డ్‌ఫ్లూ ప్రబలడం వల్లనే ఈ పరిస్థితి తలెత్తిందని యూరోపియన్ పరిశ్రమల వర్గాలు తెలిపాయి.

లోకం తీరు



ఐఐటియన్లకూ ఉద్యోగాలు దొరకట్లే!

(మొదటి పేజీ తరువాయి)

ఆఫ్ టెక్నాలజీ(ఎన్ఐటీ)ల్లోనూ ఇదే పరిస్థితి నెలకొందని, 2022-23, 2023-24 మధ్య విద్యార్థులకు అందిన సగటు వేతన ప్యాకేజీల్లో తగ్గుదల నమోదైందని తెలిపింది. ఉద్యోగావకాశాలు పెంచడానికి ఉన్న మార్గాలను అన్వేషించి, తదనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఉన్నత విద్యాశాఖను కమిటీ కోరింది. ఐఐటీల్లో 2024-25 ప్లేస్‌మెంట్ల సీజన్ ఈ ఏడాది జూన్ 30 వరకూ కొనసాగనుంది. ఈ నివేదిక ప్రకారం.. ఐఐటీ(బీహెచ్‌యూ) వారాణసీలో ప్లేస్‌మెంట్ రేటు 83.15 శాతం నుంచి 88.04 శాతానికి పెరిగింది. ఈ ఒక్కచోట మాత్రమే 4.89 శాతం పెరుగుదల నమోదైంది. ఐఐటీ ధార్వాడ్‌లో ప్లేస్‌మెంట్లు 90.20 శాతం నుంచి 65.56 శాతానికి, ఐఐటీ జమ్మూలో 92.08 శాతం నుంచి 70.25 శాతానికి, ఐఐటీ రూర్కీ 98.54 శాతం నుంచి 79.66 శాతానికి తగ్గాయి. 2021-22లో మొత్తం 23 ఐఐటీలకు గాను 14 చోట్ల 90 శాతానికి పైగా ప్లేస్‌మెంట్లు నమోదవగా 2023-24లో 3 ఐఐటీలు (జోధ్‌పూర్, పట్నా, గోవా) మాత్రమే 90 శాతం మార్కును దాటాయి. 2022-23తో పోలిస్తే 2023-24లో తిరుపతి, గాంధీనగర్, ఖరగ్‌పూర్ ఐఐటీల్లో ప్లేస్‌మెంట్ల శాతం పెరిగింది.

హోటల్ ఫుడ్ బిల్లులో సర్వీసు ఛార్జీ వసూలు తగదు

» ఢిల్లీ హైకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ, మార్చి 28: హోటల్‌లో వినియోగదారులు కొనుగోలు చేసే ఆహార పదార్థాలకు ఇచ్చే బిల్లులో 'సర్వీసు ఛార్జీ'ని కూడా కలపడం నిబంధనలకు విరుద్ధమని శుక్రవారం ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. ఫుడ్ బిల్లులో ఆటోమేటిక్ రీతిలో సర్వీసు ఛార్జీని కలపడం నిషేధం అంటూ కేంద్ర వినియోగదారుల పరిరక్షణ ప్రాధికార సంస్థ (సీసీపీఏ) జారీ చేసిన మార్గదర్శకాలు సరైనవేనంటూ తీర్పు ఇచ్చింది. వివిధ పేర్లతో తప్పనిసరిగా చెల్లించాలన్న రీతిలో సర్వీసు ఛార్జీని విధించడం వినియోగదారుల హక్కుల ఉల్లంఘనేనని తెలిపింది. ఇది 'అనుచిత వ్యాపార విధానం' కిందకే వస్తుందని స్పష్టం చేసింది. అనుచిత వ్యాపార విధానాలు, వినియోగదారుల హక్కుల ఉల్లంఘనలను నిరోధిస్తూ 2022 జులైలో సీసీపీఏ మార్గదర్శకాలు జారీ చేసింది. వీటిని సవాలు చేస్తూ ఫెడరేషన్ ఆఫ్ హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్, నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ హైకోర్టును ఆశ్రయించాయి.

కామ్రాకు ముందస్తు బెయిల్

చెన్నై, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేను 'ద్రోహి'గా అభివర్ణిస్తూ విమర్శించిన వ్యవహారంలో ఆర్టిస్ట్ కునాల్‌కామ్రాకు మద్రాసు హైకోర్టు ముందస్తు బెయిలు మంజూరు చేసింది. కునాల్‌కామ్రా మహారాష్ట్రలో జరిగిన ఓ కార్యక్రమంలో శిందేను ఉద్దేశించి విమర్శలు చేశారు. దీంతో, శిందే అభిమానులు మహారాష్ట్రలోని ముంబై ఖర్ పోలీస్ స్టేషన్‌లో కునాల్‌పై ఫిర్యాదు చేశారు. కామ్రా ఏ క్షణంలోనైనా అరెస్టయ్యే అవకాశాలున్న నేపథ్యంలో, మద్రాసు హైకోర్టులో ముందస్తు బెయిలు కోరుతూ శుక్రవారం పిటిషన్ దాఖలుచేశారు. ఆయన విల్లుపురం జిల్లాకు చెందిన వారు కావడంతో ముందస్తు బెయిల్ కోరుతూ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు.

డిజిటల్ చానళ్ల విప్లవం

దేశ వినోద, మీడియా రంగంలో ఇప్పుడు ఇదే నంబర్‌వన్



» ఆదాయపరంగా గతేడాది టీవీచానళ్లనూ దాటేసిన వైనం
» డిజిటల్ యాడ్స్‌కు ప్రాధాన్యం ఇస్తున్న కార్పొరేట్ కంపెనీలు
» తగ్గుతున్న ప్రింట్, టీవీ మీడియా మార్కెట్ వాటా, ఆదాయం

> 2024లో భారతీయులు మొత్తంగా 1.1 లక్షల కోట్ల గంటలు సెల్‌ఫోన్ స్ర్కీన్ చూస్తూ గడిపారు. సగటున ఇది ఒక వ్యక్తికి రోజుకు ఐదు గంటలతో సమానం.

న్యూఢిల్లీ, మార్చి 28: ప్రస్తుతం మన దేశంలో ఒక విప్లవం నడుస్తోంది. దాని పేరే డిజిటల్ చానల్స్ ఈ విప్లవం ఏ స్థాయిలో ఉందంటే.. గతేడాది దేశ వినోద, మీడియా రంగం రూ.2.5 లక్షల కోట్ల విలువైన వ్యాపారాన్ని నమోదు చేయగా.. దాంట్లో అత్యధిక వాటా డిజిటల్ చానల్స్‌దే. వినోద, మీడియా రంగంలో ఎప్పుడూ తొలిస్థానంలో ఉండే టెలివిజన్ చానళ్లను దాటి వేసి డిజిటల్ చానల్స్ మొట్టమొదటిసారిగా నెంబర్‌వన్ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. దీనికి కారణం.. జనం వినోదం కోసమైనా, వార్తల కోసమైనా ఇప్పుడు మొబైల్ ఫోన్ వైపే చూస్తున్నారు. 2024లో భారతీయులు మొత్తంగా 1.1 లక్షల కోట్ల గంటలు సెల్‌ఫోన్ స్ర్కీన్ చూస్తూ గడిపారు. సగటున ఇది ఒక వ్యక్తికి రోజుకు ఐదు గంటలతో సమానం. ఈ ఐదు గంటల్లో దాదాపు 70% సమయం సోషల్ మీడియా, గేమ్‌లు, వీడియోలను చూడటంతోనే గడుస్తోంది. ఈ వివరాల్ని బహుళజాతి కంపెనీ 'ఈవై' తన వార్షిక నివేదికలో వెల్లడించింది. పలు ఆసక్తికరమైన అంశాలు ఈ నివేదికలో ఉన్నాయి.

అంతర్జాతీయంగా మూడో స్థానం

దేశ ప్రజలు మొబైల్‌ఫోన్‌ను చూడటానికి రోజువారీగా వెచ్చిస్తున్న సగటు సమయం ప్రకారం.. ప్రపంచంలో భారత్ మూడోస్థానంలో ఉంది. ఇండొనేషియా, బ్రెజిల్ తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి. అయితే, మొత్తంగా దేశం యావత్తూ సెల్‌ఫోన్ మీద గడిపిన సమయం ప్రకారం చూస్తే.. భారత్ ప్రపంచంలోనే మొదటిస్థానంలో ఉంది. ఈ నేపథ్యంలోనే, భారత్‌లో పలు కార్పొరేట్ కంపెనీలు ఇప్పుడు టీవీ ప్రకటనలు, బిల్‌బోర్డుల కన్నా డిజిటల్ అడ్వర్టైజింగ్ మీద ఎక్కువ మొత్తం వ్యయం చేస్తున్నాయని పలు సర్వేల్లో వెల్లడవుతోంది.

ఇన్‌ఫ్లుయెన్సర్ల హవా

భారత్‌లో కొనసాగుతున్న డిజిటల్ విప్లవం కారణంగా.. లక్షలాది మంది కంటెంట్ క్రియేటర్లు కొత్తగా రంగంలోకి వస్తున్నారు. చిన్న చిన్న ఆరోగ్య చిట్కాల నుంచి సెలెబ్రిటీలతో ఇంటర్వ్యూల వరకూ, విహార యాత్రల నుంచి సమకాలీన రాజకీయాల వరకూ.. వీరు ఏ అంశాన్నీ వదలటం లేదు. ప్రస్తుతం ఈ కంటెంట్ క్రియేటర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లతో.. దేశ వినోదరంగంలో ఓ భారీ పరిశ్రమనే రూపు దిద్దుకుంటోంది. ఇది కార్పొరేట్లకు కూడా ప్రయోజనకరంగానే ఉంటోంది. టీవీచానళ్లలో, పత్రికల్లో, బిల్‌బోర్డుల్లో ప్రకటనలు ఇచ్చే పాతధోరణి స్థానంలో.. తమ ఉత్పత్తి పట్ల ఆసక్తి చూపే వినియోగదారులకు మాత్రమే తమ యాడ్ వెళ్లేలా వారు ఇప్పుడు ప్రకటనలు ఇవ్వగలుగుతున్నారు. మార్కెటింగ్ రంగంలో కంటెంట్ క్రియేటర్లు నేడు ఒక బలమైన శక్తిగా అవతరించారు. వారు వినోదాన్ని అందించడమే కాక.. జనం ఏది కొనాలి? ఎక్కడ కొనాలి? ఏ బ్రాండ్ మంచిది? వంటి అంశాల్ని ప్రభావితం చేస్తున్నారు. అయితే, దీని ప్రభావం టెలివిజన్, పత్రికలు, రేడియో వంటి సంప్రదాయ మీడియాపై తీవ్రంగా పడుతోంది. 2024లో సంప్రదాయ మీడియా ఆదాయం, మార్కెట్ వాటా తగ్గినట్లుగా ఈవై నివేదిక వెల్లడించింది. దేశంలో అత్యంత చవకగా మొబైల్ డేటా లభించటం ఈ డిజిటల్ విప్లవానికి వెన్నుదన్నుగా నిలుస్తోంది. గతేడాది భారతీయుల సగటు డేటా వినియోగం నెలకు 27.5 జీబీగా నమోదైంది. దేశ జనాభాలో 42% మంది (56.2 కోట్ల మంది) ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్లను వినియోగిస్తున్నారు.

జస్టిస్ వర్మ బదిలీకి కేంద్రం ఓకే



న్యూఢిల్లీ, మార్చి 28: నోట్ల కట్టల వ్యవహారంలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలంటూ సుప్రీం కోలీజియం చేసిన సిఫారసుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ మేరకు కేంద్ర న్యాయశాఖ ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. అయితే, ఆయనకు ప్రస్తుతానికి ఎలాంటి న్యాయపరమైన విధులూ కేటాయించవద్దని అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి సుప్రీంకోర్టు సూచించింది. మరోవైపు.. జస్టిస్ వర్మ ఇంటి ప్రాంగణంలోని స్టోర్ రూమ్‌లో సగం కాలిన నోట్లకట్టలు కనిపించిన నేపథ్యంలో ఆయనపై ఎఫ్ఐఆర్ దాఖలుకు ఆదేశించాలంటూ న్యాయవాది మాథ్యూస్ జె నెడుంపర వేసిన పిల్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం తోసిపుచ్చింది. ఈ వ్యవహారంపై ఇప్పటికే సుప్రీం కోలీజియం నియమించిన త్రిసభ్య కమిటీ జరుపుతున్న అంతర్గత విచారణ పురోగతిలో ఉందని ధర్మాసనం గుర్తు చేసింది. అంతర్గత విచారణ అనేది దర్యాప్తు సంస్థలు జరిపే నేర దర్యాప్తునకు ప్రత్యామ్నాయం కాదని, అసలు అది కోర్టు పని కాదని, దాన్ని పోలీసులకు వదిలేయాలని న్యాయవాది నెడుంపర వాదించారు. దీంతో.. "అంతర్గత విచారణ పూర్తి కానివ్వండి" అని జస్టిస్ ఓకా సమాధానమిచ్చారు.

అత్యాధునిక ఎఫ్‌పీవీ డ్రోన్ పరీక్ష విజయవంతం

(మొదటి పేజీ తరువాయి)



ఎక్స్‌లో పోస్టు చేసింది. ఈ పరీక్ష విజయవంతమవడంతో భారత్ డ్రోన్ టెక్నాలజీలో మరో అడుగు ముందుకేసినట్లయింది. ఛండీగఢ్‌లోని డీఆర్‌డీవోకు చెందిన టెర్మినల్ బాలిస్టిక్ రీసెర్చ్ ల్యాబొరేటరీ సాయంతో.. సైన్యానికి చెందిన ఫ్లూర్- ద- లిస్ బ్రిగేడ్ ప్రత్యేక యూనిట్ రైజింగ్ స్టార్ డ్రోన్ బ్యాటిల్ స్కూల్‌లో ఈ డ్రోన్‌ను అభివృద్ధి చేశారు. ఈ డ్రోన్‌లో పూర్తి స్థాయిలో స్వదేశీ పరికరాలనే వాడినట్లు తెలుస్తోంది. లక్ష్యాలను కచ్చితంగా ఛేదించేలా పైలట్లకు వీటిపై పూర్తిస్థాయి నియంత్రణ ఉండేలా ద్విభద్రతా వ్యూహంతో వీటిని రూపొందించారు. కాగా, ఈ డ్రోన్లు శత్రువులకు సంబంధించిన సమాచారాన్ని వీడియో రూపంలో పైలట్లకు ఎప్పటికప్పుడు చేరవేయడంతో వారికి యుద్ధ క్షేత్రాన్ని అంచనా వేసే అవకాశం లభిస్తుంది. నిఘా, గస్తీ లక్ష్యాలపై దాడికి, ఎలక్ట్రానిక్ యుద్ధ తంత్రానికి వాడే ఈ డ్రోన్లు, చిన్న సైజులో ఉండడంతో దళాలు ఎక్కడికైనా వీటిని సులువుగా తరలించి ఆపరేషన్లు చేపట్టవచ్చు. రష్యా- ఉక్రెయిన్ యుద్ధంలో ఈ డ్రోన్లను విరివిగా వినియోగిస్తున్నారు.

నాగ్ క్షిపణి వ్యవస్థ కోసం ఏవీఎన్ఎల్‌తో రక్షణ శాఖ డీల్

కంది/అల్వాల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): నాగ్ క్షిపణి వ్యవస్థ (ట్రాక్డ్ వర్షన్) కోసం సంగారెడ్డి జిల్లా ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీలోని ఏవీఎన్ఎల్(ఆర్మ్‌డ్ వెహికిల్స్ నిగమ్ లిమిటెడ్)తో రక్షణశాఖ ఒప్పందం చేసుకొంది. దీని విలువ రూ.1,801కోట్లు. దీంతో పాటు, 5వేల అత్యాధునిక సైనిక వాహనాల కోసం రక్షణశాఖ ఫోర్స్ మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా సంస్థలతో రక్షణ శాఖ ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం విలువ దాదాపు రూ.700కోట్లు. ఒక్కో సైనిక వాహనం 800కిలోల వరకు మోసుకెళ్లగలదు.

రామప్పకు సాస్కి స్కీం ద్వారా రూ.73 కోట్లు

వెంకటాపూర్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలోని రామప్ప దేవాలయానికి కేంద్ర ప్రభుత్వం సాస్కి స్కీం ద్వారా రూ.73.74కోట్లు మంజూరు చేసింది. రామప్ప ఆలయానికి పక్కనే సరస్సు, దాని సమీపంలో భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని కోటగుళ్లు, చెరువు ఇతర ప్రదేశాలను ఓ టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చేసి పలు సౌకర్యాలు కల్పించబోతున్నారు. మరో రెండు, మూడు రోజుల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. కాకతీయ రుద్రేశ్వరస్వామి సర్క్యూట్, రామప్ప ద్వీపం, గణపసముద్రం చెరువు వద్ద మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయనున్నారు.

కులోన్మాద హత్య

(మొదటి పేజీ తరువాయి)



సాయి కుమార్

తీవ్రగాయాలతో రక్తమోడుతున్న స్థితిలో ఆ యువకుడు హాహాకారాలు పరుగులు పెట్టినా.. కనికరించకుండా వెంబడించి మరీ పదే పదే నరికి చంపాడు. ఈ కులోన్మాద హత్య పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం ముప్పిరితోట గ్రామంలో జరిగింది. హతుడు ఆ గ్రామానికి చెందిన పూరేళ్ల పరశురాములు గౌడ్, జ్యోత్స్న దంపతుల కుమారుడు సాయి కుమార్ గౌడ్ (18). కూతురు నాలుగేళ్ల క్రితం డెంగీతో మృతి చెందడం, మిగిలిన ఒక్కగానొక్క సంతానం తాజాగా హత్యకు గురవడంతో ఆ తల్లిదండ్రులు కంటికీమంటికి ధారగా రోదిస్తున్నారు. సాయి కుమార్ ఇంటర్ చదువును మధ్యలోనే ఆపేశాడు. అదే గ్రామంలోని ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన తన సహాధ్యాయి, సుల్తానాబాద్‌లో ఇంటర్ చదువుతున్న 18 ఏళ్ల యువతిని రెండేళ్లుగా ప్రేమిస్తున్నాడు. ఇది తెలిసి యువతి తండ్రి ముత్యం సదయ్య అలియాస్ సది, సాయికుమార్‌ను పలుమార్లు మందలించినట్లు తెలుస్తోంది. 27న సాయి పుట్టినరోజు కావడంతో అతడికి యువతి శుభాకాంక్షలు తెలిపినట్లు సమాచారం. ఇది తెలిసిన సదయ్య, సాయిని ఎలాగైనా చంపాలనుకొని అతడి కదలికలపై దృష్టిపెట్టాడు. సాయి, అతడి స్నేహితులు కలిసి ఆ రోజు రాత్రి 9.30కు గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో మద్యం తాగుతున్నారు. అక్కడికి ద్విచక్రవాహనంపై వచ్చిన సదయ్య వెంట తెచ్చుకున్న గొడ్డలితో సాయి మెడపై నరికాడు. ఇది చూసి.. సాయి మిత్రులు భయంతో అక్కడి నుంచి పరుగులు తీశారు. తీవ్రగాయాలతో.. రక్తం కారుతుండగా సాయి, శక్తినంతా కూడదీసుకొని అక్కడి నుంచి తన మేనత్త ఇంటివైపు పారిపోయేందుకు విఫలయత్నం చేసి కుప్పకూలాడు. అప్పటికీ కోపం చల్లారని సదయ్య, గొడ్డలితో మరో రెండుసార్లు సాయి మెడపై దాడిచేసి అక్కడి నుంచి పారిపోయాడు. సాయిని కుటుంబసభ్యులు సుల్తానాబాద్‌లోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నిందితుడు, అతడి కుటుంబసభ్యులు గ్రామం నుంచి పారిపోయారు. అయితే సదయ్యను జూలపల్లి మండలం కోనరావుపేట వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తమ కుమారుడిని నరికి చంపిన వాళ్లను కూడా నరికి చంపాలంటూ హతుడి తల్లి బిగ్గరగా రోదిస్తూ డిమాండ్ చేసింది.

> **అమ్మాయి ముందే హెచ్చరించింది**
>
> కులోన్మాదమే ఈ హత్యకు కారణం. తమ అమ్మాయి వేరే కులం అబ్బాయితో ప్రేమలో పడిందని తెలిసే ఆమె తండ్రి సదయ్య పథకం ప్రకారం నా బిడ్డను నరికి చంపాడు. గురువారం సాయి పుట్టినరోజు. ఆ అమ్మాయి ప్రత్యేకంగా కేక్ తీసుకొచ్చి సాయితో కట్ చేయించినట్లు తెలిసింది. మధ్యాహ్నం తర్వాత గ్రామంలో కొందరు వ్యక్తులు బైక్‌లపై చక్కర్లు కొట్టడం గమనించి.. సాయిని బయట తిరగొద్దని అప్రమత్తం చేశాను. సాయంత్రం స్నేహితులు రావడంతో కేక్ కట్ చేసివస్తానంటూ సాయి బయటకు వెళ్లాడు. అయితే తమ బంధువులు సాయిని చంపాలని చూస్తున్నారని ఆ అమ్మాయి మమ్మల్ని గతంలోనే హెచ్చరించింది. ఇదివరకు ఓ పెళ్లిలో, వినాయక చవితి రోజు సాయిపై యువతి బంధువులు దాడికి యత్నించారు.. అప్పుడు డయల్ 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదు.
>
> -హతుడి తండ్రి పరశురాములు

పాపం.. పిల్లలు..

» అమీన్‌పూర్‌లో ముగ్గురి మృతి
» తల్లిదండ్రుల తీరుపై అనుమానాలు



గౌతమ్, మధుప్రియ, సాయికృష్ణ (ఫైల్)

అమీన్‌పూర్, తలకొండపల్లి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఆ దంపతులకు పదేళ్లలోపు వయసున్న ముగ్గురు పిల్లలున్నారు. రాత్రి చిన్నారులతో కలిసి భోజనం చేసి పడుకున్నారు. తెల్లవారుజామున భార్య కడుపునొప్పి భరించలేక హాహాకారులు చేయగా.. పడుకున్న ముగ్గురు పిల్లలు పడుకున్నట్లుగానే చనిపోయి ఉన్నారు. భర్తకు ఎలాంటి హానీ జరగలేదు. అతడే భార్యను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించాడు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో ఈ ఘటన జరిగింది. ముగ్గురు పిల్లల మృతికి, తల్లి తీవ్ర అస్వస్థతకు విషాహారమే కారణమా? పిల్లలతో కలిసి తల్లి ఆత్మహత్య చేసుకోవాలనుకుందా? లేదంటే.. ఈ ఘటనలో భర్త ప్రమేయం ఉందా? కొన్నాళ్లుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండటంతో ఘటనపై ఇలా తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం మెదక్‌పల్లికి చెందిన అవురించింతల చెన్నయ్య ఉపాధి కోసం 20 ఏళ్ల క్రితం హైదరాబాద్ వెళ్లాడు. మొదటి భార్య చనిపోవడంతో 2005లో రజితను రెండో వివాహం చేసుకున్నాడు. ఈ దంపతులకు సాయికృష్ణ (12), గౌతమ్ (8), మధుప్రియ (10) సంతానం. ఈ కుటుంబం అమీన్‌పూర్ రాఘవేంద్రకాలనీలోని అద్దె ఇంట్లో ఉంటోంది. చెన్నయ్య వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తుండగా, రజిత ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా చేస్తోంది. అయితే రజితపై అనుమానం పెట్టుకున్న చెన్నయ్య ఆమెతో తరచూ గొడవ పడేవాడు. అతడి వేధింపులు భరించలేక ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. పెద్దలు నచ్చజెప్పడంతో చెన్నయ్య, రజిత మళ్లీ ఒక గూటికింద చేరారు. భర్త తనను మళ్లీ వేధిస్తే.. పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకుంటానని అప్పట్లోనే రజిత హెచ్చరించినట్లు తెలిసింది. గురువారం రాత్రి 8 గంటలకు చెన్నయ్య, రజిత.. పిల్లలతో కలిసి భోజనం చేశారు. రజిత, పిల్లలు పెరుగన్నం తినగా, చెన్నయ్య పప్పుతో భోజనం చేశాడు. అనంతరం వాటర్ ట్యాంకర్ ట్రాక్టర్‌ను తీసుకుని చెన్నయ్య చందానగర్ వెళ్లి, రాత్రి 11గంటలకు ఇంటికి వచ్చి పడుకున్నాడు. తెల్లవారు జామున 3 గంటలకు రజిత కడుపునొప్పి అంటూ నిద్రలేచి.. బిగ్గరగా రోదించడంతో చెన్నయ్య, ఇరుగుపొరుగు వారి సహకారంతో ఆమెను ఆస్పత్రికి తరలించాడు. అయితే.. ఇంట్లో అప్పటికే ముగ్గురు పిల్లలు నిద్రలోనే ప్రాణాలు విడిచారు. ఇంట్లో పెరుగన్నం, ఇతర ఆహార పదార్థాలను క్లూస్ టీం సేకరించి పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపింది. నివేదిక వచ్చాక.. వాస్తవాలు తెలుస్తాయని, తల్లిదండ్రుల్లో ఎవరు దారుణానికి పాల్పడ్డారనేది విచారణలో తేలాల్సి ఉందన్నారు. రజిత తల్లిదండ్రులు, బంధువులు చెన్నయ్యపైనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతూ చెప్పారు. ఆ రోజు రాత్రి చెన్నయ్య పెరుగన్నం తినకపోవడంపైనా, రాత్రి పదకొండింటికి ఇంటికొచ్చి నురగలు కక్కుకున్న స్థితిలో విగతజీవులుగా పడివున్న పిల్లలను గమనించకుండానే నిద్రకు ఉపక్రమించడంపైనా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. చెన్నయ్యను పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

చైనా-బంగ్లా చెలిమి

బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ శుక్రవారం చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో సమావేశమయ్యారు. భేటీ దిగ్విజయంగా జరిగిందని, స్నేహం, సహకారం, ఇచ్చిపుచ్చుకోవడాల గురించి దేశాధినేతలు ఇద్దరూ మాట్లాడుకున్నారని, రెండుదేశాల మధ్య ఆర్థిక, సాంకేతిక సహకార ఒప్పందాలు, పలురంగాల్లో అరడజనుకు పైగా అవగాహనలు కుదిరాయని మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో బంగ్లాదేశ్ పేర్కొంది. పెట్టుబడులు, చైనా ఇండస్ట్రియల్ ఎకనామిక్ జోన్, మోంగ్లాపోర్టు అభివృద్ధి, తీస్తా నదీజలాల ప్రాజెక్టు నిర్వహణ తదితర అంశాలమీద నిర్ణయాలు జరిగాయని, ఏకచైనా సూత్రాన్ని, దాని సార్వభౌమత్వ, ప్రాదేశిక సమగ్రత పరిరక్షణ హక్కులను బంగ్లాదేశ్ సమర్థించిందని ఆ ప్రకటన పేర్కొంది. మీ దేశంలో మా వాళ్ళతో పెట్టుబడులు పెట్టించే బాధ్యతనాది అని చైనా అధ్యక్షుడు హామీ ఇచ్చారని, యూనస్ ప్రభుత్వానికి తన సంపూర్ణ మద్దతు ప్రకటించారని బంగ్లాదేశ్ ఆ ప్రకటనలో చెప్పుకుంది. నాలుగు రోజుల చైనా పర్యటనకు యూనస్ మార్చి 26న బయలుదేరిననాడే బంగ్లాదేశ్ 53వ స్వాతంత్ర్య దినోత్సవం. భారత్ నైతిక, సైనిక సహకారంతో బంగ్లాదేశ్ విముక్తి జరిగిన రోజునే యూనస్ తన చైనా పర్యటనకు ఎంచుకోవడం, చైనా పంపిన ప్రత్యేక విమానంలో అన్ని రంగాలకు చెందిన సలహాదారులను, అధికారులను వెంటబెట్టుకొని పోవడం వెనుక భారతదేశానికి స్పష్టమైన సందేశం ఉన్నదని విశ్లేషకుల అనుమానం.

తొలిగా భారతదేశంలోనే పర్యటిద్దామని యూనస్ అనుకున్నారని, కానీ, సానుకూలమైన ఆహ్వానం లభించలేదని ఆయన ప్రెస్ సెక్రటరీ ఈ మధ్య ఓ వ్యాఖ్య చేసిన విషయం తెలిసిందే. గత ఏడాది ఆగస్టులో జరిగిన తిరుగుబాటులో షేక్ హసీనా తన ప్రధాని పదవికోల్పోయి, భారతదేశంలో ఆశ్రయం పొందుతున్నప్పటినుంచీ భారత్-బంగ్లా సంబంధాలు అగాధాన్ని అంటాయి. హిందూ మైనారిటీలమీద దాడులు, ఊచకోతలు యధేచ్ఛగా సాగిపోతున్నాయంటూ మన ప్రభుత్వం విమర్శలు చేయడం, మరోపక్క యూనస్ ప్రభుత్వాన్ని హసీనా ఇక్కడ నుంచి తీవ్రంగా విమర్శిస్తూండటం అగాధాన్ని మరింత పెంచింది. మతఛాందసులను నియంత్రించలేకపోగా, ఆ దాడులు మతపరమైనవి కావనీ, అంతాసవ్యంగా ఉన్నదనీ యూనస్ చేసిన సమర్థింపులు డొల్లవని అనతికాలంలోనే తేలిపోయింది. మొన్న డిసెంబరులో మన విదేశాంగశాఖ కార్యదర్శి మిస్రీ ఆ దేశాన్ని సందర్శించినప్పుడు కూడా ఈ నేరాల విషయంలో మన ఆందోళనను కుండబద్దలుకొట్టి వచ్చారు. ఈ నేపథ్యంలో, మార్చి 26 విముక్తి దినోత్సవాన్ని పురస్కరించుకొని భారత రాష్ట్రపతి, ప్రధాని బంగ్లాదేశ్ నేతకు ప్రత్యేక సందేశాలు పంపడం, బంగ్లాదేశ్ ఆవిర్భావంలో భారత్ పాత్రను గుర్తుచేస్తూ యూనస్‌కు మోదీ లేఖ రాయడం బాగుంది. బంగ్లాదేశ్‌లో షేక్ ముజిబూర్ రహ్మాన్ జ్ఞాపకాలను, వారసత్వాన్ని తుడిచిపెట్టేందుకు, ఆ విముక్తిపోరాటాన్ని సైతం ప్రజల మస్తిష్కాలనుంచి తుడిచివేసేందుకు విశేష ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో వాటి ప్రస్తావనలు అక్కడి వారికి నచ్చకపోవచ్చునేమో. దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చింది 1971లోనా, 2024 ప్రజాపోరాటంతోనా అంటూ బిఎన్‌పి, జమాత్ వంటివి నిర్దిష్టమైన ఎజెండాతో, చరిత్రను చెరిపివేసే లక్ష్యంతో వ్యవహరిస్తున్నాయి. విముక్తి పోరాటం గురించి మాట్లాడుతున్న వారిని దేశద్రోహులుగా అభివర్ణిస్తున్నాయి. మరోపక్క, తమది లౌకికవాద, తటస్థదేశంగా ఉండాలన్న సదాశయంతో విద్యార్థి నేతలు గత నెలలో ఆరంభించిన పార్టీ మతఛాందసులను తట్టుకొని నిలిచి, ప్రజలను ఏ మేరకు ప్రభావితం చేయగలదో చూడాలి.

శాంతి, స్థిరత్వం, ప్రజాశ్రేయస్సు, ఉమ్మడి ప్రయోజనాలకోసం కలిసి నడుద్దామని యూనస్‌కు రాసిన లేఖలో మోదీ ప్రతిపాదించడం ప్రశంసనీయమైనది. సంక్షోభంలో ఉన్న బంగ్లాదేశ్‌ను ఆదుకొనే పేరిట చైనా మరింత ఉధృతంగా, మరిన్ని రంగాల్లోకి ప్రవేశించే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది. రుణాలకు వడ్డీలు తగ్గించడం, కొత్త ప్రాజెక్టులకు మద్దతు, మరిన్ని అప్పులు సహా పలు ప్రతిపాదనలను చైనా పర్యటనలో యూనస్ చేశారట. స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం, బిఆర్‌ఐ దిశగా రెండుదేశాలూ అడుగులు వేస్తూ, బంగ్లాదేశ్-పాకిస్థాన్-చైనా వేగంగా ఒక్కటవుతున్న వాతావరణం మనకు ఇబ్బంది కలిగించేదే.

సుంకాల పోరులో ఇదీ మన కర్తవ్యం



▪ పి. చిదంబరం

'పళని' పలుకు

ప్రపంచ దేశాలు ఆధునిక పైడ్ పైపర్ (సుప్రసిద్ధ జర్మన్ జానపద గాథలో వేణువు ఊది పిల్లలను వెంటబెట్టుకుని వెళ్లిన వ్యక్తి)ను అనుసరిస్తాయా లేదా అనేది ఏప్రిల్ 2, 2025న, ఆ తరువాత రోజుల్లో మనకు తెలుస్తుంది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రారంభించనున్న సుంకాల సమరం గురించి నేను ప్రస్తావిస్తున్నాను. లక్ష్యంగా పెట్టుకున్న ఇతర దేశాల నుంచి దిగుమతి అయిన సరుకులపై అమెరికా, శిక్షాత్మక సుంకాలు విధిస్తే, ఆ చర్య ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటీవో) నిబంధనలను, బహు పక్షీయ వ్యాపార ఒడంబడికలను, అంతర్జాతీయ చట్టాలు, ఒప్పందాలను ఉల్లంఘించడమే అవుతుంది. అయితే అమెరికా 47వ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చట్టాలను -అమెరికావి అయినా, ఇతర దేశాలవి అయినా- కించిత్ కూడా లెక్క చేసే వ్యక్తి కాదు. అసలు ఆయనకు ఆయనే ఒక చట్టం కదా. తన మాటను అందరూ ఒక శిలా శాసనంగా పాటించాలని ఆయన ఆశిస్తారు.

శిక్షాత్మక సుంకాల విధింపునకు ట్రంప్ కొన్ని 'టార్గెట్' దేశాలను గుర్తించారు. ఆ దేశాల నుంచి ఎంపిక చేసుకున్న దిగుమతి సరుకులపై పెద్ద ఎత్తున సుంకాలు విధిచేందుకు ఆయన సంకల్పించారు. ఇందుకు ట్రంప్ గుర్తించిన దేశాల జాబితాలో భారత్ కూడా ఉన్నది. దేశీయ మార్కెట్‌లోకి ప్రవేశించి, దేశి సరుకులతో పోటీ విదేశీ వస్తువులకు అవరోధాలు కల్పించేందుకు ఉద్దేశించినవే సుంకాలు. ఈ లక్ష్య పరిపూర్తికి సుంకాల (అంటే కస్టమ్స్ సుంకాలు)తో పాటు మరికొన్ని ఇతర పన్నులు (యాన్టి-డంపింగ్ డ్యూటీ అందుకొక ఉదాహరణ) కూడా విధించడం పరిపాటి. ప్రత్యేక పరిస్థితులలో వీటిని విధించడం ప్రతి దేశంలోను జరుగుతుంది. అయితే ఈ సుంకాలు లేదా పన్నులను సవాల్ చేయడమనేది సంబంధిత దేశీయ న్యాయస్థానాలలో మాత్రమే జరగాలి. కాగా అన్ని దేశాలలోను న్యాయస్థానాలు విదేశీ ఎగుమతిదారుల కంటే దేశీయ పరిశ్రమల ప్రయోజనాలను కాపాడేందుకు అధిక ప్రాధాన్యమిస్తాయని మరి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. వీటితో పాటు సరుకుల నాణ్యతా ప్రమాణాల పరిరక్షణ, ప్యాకేజింగ్ ప్రమాణాలు, పర్యావరణ సంబంధిత మార్గదర్శకాలు పేరిట సుంకాలేతర అవరోధాలూ అమల్లో ఉంటాయి. ఈ స్వీయ లేదా స్వార్థ ప్రయోజనాన్నే సంరక్షణవాదంగా పరిగణిస్తారు.

'స్వయం సమృద్ధి' లేదా 'స్వావలంబన'కు దోహదం చేసే మార్గాలలో ఒకటి సంరక్షణవాదం. ఈ సంరక్షణవాదాన్ని దేశ భక్తిగా తికమక పడకూడదు. 'స్వయం సమృద్ధి' వాదాన్ని ఆధునిక అర్థశాస్త్రం, అనుభావిక రుజువులు తిరస్కరించాయి. స్వయం సమృద్ధి అనేది ఒక మిథ్య. ఏ దేశమూ తన ప్రజలు ఆకాంక్షిస్తున్న, వినియోగిస్తున్న సరుకులు, సేవలు అన్నిటినీ ఉత్పత్తి చేయలేదు దేశీయ పరిశ్రమల సంరక్షణకు ప్రాధాన్యమిచ్చే దేశం అల్ప ఆర్థికాభివృద్ధిని మాత్రమే సాధిస్తుంది. పెట్టుబడులను స్వల్పస్థాయిలో మాత్రమే సమకూర్చుకోగలుగుతుంది. నాసిరకం సరుకులను మాత్రమే ఉత్పత్తి చేయగలుగుతుంది. తమ అభిరుచులకు అనుగుణంగా సరుకులను ఎంపిక చేసుకునేందుకు ప్రజలకు అవకాశముండదు. ఉత్పత్తిదారుల నుంచి వినియోగదారులకు అందే సేవలు నాణ్యమైనవిగా ఉండవు. సంరక్షణవాద విధానాలు కాక, స్వేచ్ఛా విపణి విధానాలే ఆర్థికాభివృద్ధికి ప్రధాన చోదనశక్తులని గత యాభై సంవత్సరాల చరిత్ర నిర్ణయాత్మకంగా నిరూపించింది. ప్రపంచ సంపన్న దేశాలన్నీ పోటీదాయక ఆర్థిక విధానాలను, స్వేచ్ఛా వాణిజ్య పద్ధతులనూ అనుసరించినవే.

భారత్ నాలుగు దశాబ్దాల పాటు సంరక్షణ విధానాలను అనుసరించింది. దిగుమతులపై ఆంక్షలు విధించింది. ఫలితంగా మన ఎగుమతులు పరిమితమయ్యాయి. అంతకంతకూ కుదించుకుపోయాయి. వాణిజ్య మంత్రిత్వ శాఖలో ఒక ప్రత్యేక విభాగం ఉన్నది. చీఫ్ కంట్రోలర్ ఆఫ్ ఇంపోర్ట్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్' అన్న ఉన్నతాధికారి ఆధ్వర్యంలో పలువురు అధికారులు, ఉద్యోగులు ఆ విభాగంలో ఉన్నారు. అయితే ఒక ప్రశ్నను ఎవరూ లేవనెత్తలేదు: 'దిగుమతులపై నియంత్రణకు ఒక ప్రధానాధికారి ఉండడం అర్థం చేసుకోదగిన విషయమే. అయితే ఎగుమతుల నియంత్రణకు ప్రధానాధికారి ఎందుకు?'. విదేశీమారక ద్రవ్యం ఎంతగానో అవసరమున్న దేశంలో ఎగుమతులపై నియంత్రణకు ప్రత్యేకంగా ఒక ఉన్నతాధికారి ఎందుకు? ఈ ప్రశ్నను ఎవరూ అర్థం చేసుకోలేదు.

1991లో ఆర్థికమంత్రిగా డాక్టర్ మన్మోహన్‌సింగ్ నియమితులయ్యారు. ఆయన ఆర్థిక విధానాలు సంరక్షణవాదాన్ని త్యజించేందుకు దారితీశాయి. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో అనుసంధానమయింది. 1991-92లో ప్రకటించిన కొత్త విదేశీ వాణిజ్య విధానం కాలం చెల్లిన వాణిజ్య నిబంధనలకు స్వస్తి చెప్పింది. భారత్ స్వేచ్ఛా వాణిజ్య విధానాలను పూర్తిగా అనుసరించడం ప్రారంభించింది. సంరక్షణ విధానాలు గతించిన చరిత్రగా మారిపోయాయి. ఆంక్షలను తొలగించారు. నియమ నిబంధనలను సరళీకరించారు. దిగుమతులపై సుంకాలను క్రమేణా తగ్గించారు. భారతీయ పారిశ్రామికవేత్తలకు విదేశీ పారిశ్రామిక వేత్తల నుంచి పోటీ ఎదురయింది. ఈ పోటీలో దేశీయ పారిశ్రామికవేత్తలు అద్భుత విజయాలు సాధించారు. ప్రపంచీకరణ విధానాలతో దీర్ఘకాలిక, స్వల్పకాలిక ప్రయోజనాలు అపరిమితంగా సమకూరాయి.

2014లో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు భారత్ మళ్లీ సంరక్షణవాదాన్ని అనుసరించడం ప్రారంభమయింది. స్వయం సమృద్ధి ఒక విచిత్ర పేరు-ఆత్మ నిర్భరత- ను సంతరించుకున్నది! ప్రపంచం ఎంతో మారిపోయిందన్న సత్యాన్ని గుర్తించడంలో మోదీ ప్రభుత్వం విఫలమయింది. అనేక దేశాలు తమ 'తులనాత్మక అనుకూలత'లను కనుగొన్నాయి. ఆ సానుకూలతలను తమకు ప్రయోజనకరంగా వినియోగించుకున్నాయి. 'సప్లై చైన్స్' (ఉత్పత్తి, సరఫరా ప్రక్రియల పరంపర) అనే కొత్త పద్ధతి అమలులోకి వచ్చింది. మొబైల్ ఫోన్ లాంటి ఒక పరికరం ఉత్పత్తి పూర్తిగా ఒక దేశంలో కాక, అనేక దేశాలలో జరగడం పరిపాటి అయింది. ఈ కొత్తఉత్పత్తి ప్రక్రియ సర్వసాధారణమైపోయింది. 'మేడ్ ఇన్ జర్మనీ', 'మేడ్ ఇన్ జపాన్' అనే ప్రతిష్ఠాత్మకత గతించిన విషయమైపోయింది. అనేక వస్తువులు 'మేడ్ ఇన్ ది వరల్డ్'గా ప్రపంచ వ్యాప్తంగా వినియోగదారులకు అందుబాటులోకి వచ్చాయి. మోదీ ప్రభుత్వ ఆత్మనిర్భర్ సాధించిందేమిటి? త్యజించిన నియమ నిబంధనలు, లైసెన్స్‌ల విధానం, ఆంక్షలు, మరీ ముఖ్యంగా సుంకాలను పునః ప్రారంభించడమే కాదూ?



సుంకాల సమరంలో భారత్ అనుసరించాల్సిన వివేకవంతమైన మార్గం ఏమిటి? ఒక కలెక్టివ్‌గా ఏర్పడేందుకు కెనడా, బ్రిటన్, ఫ్రాన్స్ జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా దేశాలకు భారత్ నచ్చజెప్పాలి. ఉమ్మడి ప్రయోజనాలను కాపాడుకునేందుకు సంఘటితమైన ఈ మిత్ర దేశాలతో సమష్టిగా చర్చలు జరిపేలా అమెరికాను ఒత్తిడి చేయాలి. ట్రంప్ ప్రభుత్వంతో చర్చల ద్వారా ప్రపంచ దేశాల సుస్థిర ఆర్థికాభివృద్ధికి దోహదం చేసే ఒక సమగ్ర ఒప్పందానికి రావాలి.

సరే, ట్రంప్ మహాశయుడు రెండోసారి అధికారానికి వచ్చిన కొద్ది రోజులకే సుంకాల సమరానికి నాందిగా మొదటి అస్త్రాన్ని ప్రయోగించాడు. అల్యూమినియం, ఉక్కు దిగుమతులపై సుంకాలు పెంచాడు. అయితే వెనుకడుగు వేసి ఆ సుంకాల వసూలును వాయిదా వేసి, అందుకు కొత్త తేదీ నిర్దేశించాడు. మార్చి 26న ఆటోమొబైల్స్, వాటి విడిభాగాల దిగుమతులపై భారీ సుంకాలు విధించాడు. ట్రంప్ నిర్ణయాలు, చర్యలకు భారత్ ప్రతిస్పందన ఇంతవరకు గోప్యంగా, ప్రతి చర్యలు చేపట్టే రీతిలో ఉన్నది. 2025-26 కేంద్ర బడ్జెట్‌లో సుంకాల తగ్గింపును ప్రభుత్వం ప్రకటించింది. ఈ చర్య ట్రంప్‌ను ఏమీ ప్రభావితం చేయలేదు. ఇండియాకు అనుకూలంగా ఆయన వైఖరిని మారగలదనే సూచనలు కనిపించడం లేదు. వైట్ హౌజ్ సమావేశంలో నరేంద్ర మోదీ మెరమెచ్చు మాటలు మాట్లాడారు. అయితే అవేమీ ట్రంప్‌ను సంతృప్తిపరచలేదు. ద్రవ్య బిల్లును ఆమోదించిన సమయంలో డిజిటల్ సర్వీస్ ట్యాక్స్ ('గూగుల్ ట్యాక్స్)ను ఉపసంహరించుకున్నారు. అమెరికాకు మరిన్ని రాయితీలు ఇచ్చే విషయమై మోదీ ప్రభుత్వం చర్చలు జరుపుతోంది. దేశ దేశాల ఆర్థిక వ్యవస్థలను కుదిపివేయనున్న ట్రంప్ సుంకాల సమరాన్ని ఎదుర్కొనేందుకు ఇది సరైన దృక్పథమేనా? సరైనదనే భావన కలిగించే రీతిలో ప్రభుత్వ తీరు లేదు. భారత్-అమెరికా పరస్పర ప్రయోజనాలకు మేలు కలిగే విధంగా సమస్త సుంకాల విషయమై సమగ్రంగా చర్చించాలి. తన స్నేహితుడు ట్రంప్ తత్వం మోదీకి బాగా తెలుసు కనుక సుంకాల విషయంలో తగ్గారు. ట్రంప్ నిర్దేశాలను పాటించేందుకు సుముఖమయ్యారు. అయితే భారత్ ప్రయోజనాలను సంరక్షించడంలో మోదీ సఫలమవుతారా లేదా అన్నది ఇప్పుడే స్పష్టంగా చెప్పలేము.

ట్రంప్ ప్రారంభించనున్న సుంకాల యుద్ధంలో తన ప్రయోజనాలను రక్షించుకునేందుకు భారత్‌కు ఇతర దేశాల మద్దతు, సహాయ సహకారాలు ఎంతైనా అవసరం. అలాగే ఆ దేశాలకూ అమెరికాపై వాణిజ్య పోరులో విజయం సాధించాలంటే భారత్ మద్దతు తప్పనిసరి. కెనడా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా ఈ సుంకాల పోరులో భారత్‌తో కలిసి వచ్చే దేశాలు. భారత్ అనుసరించాల్సిన వివేకవంతమైన మార్గమేమిటి? ఒక కలెక్టివ్‌గా ఏర్పడేందుకు ఆ దేశాలకు నచ్చజెప్పి అంగీకరించేలా చేసేందుకు భారత్ పూనుకోవాలి. ఉమ్మడి ప్రయోజనాలను కాపాడుకునేందుకు సంఘటితమైన ఈ మిత్ర దేశాలతో సమష్టిగా చర్చలు జరిపేలా అమెరికాను ఒత్తిడి చేయాలి. ట్రంప్ ప్రభుత్వంతో చర్చల ద్వారా ప్రపంచ దేశాల సుస్థిర ఆర్థికాభివృద్ధికి దోహదం చేసే ఒక సమగ్ర ఒప్పందానికి రావాలి.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

స్వాభిమాన భారత స్వాప్నికుడు

స్వాభిమాన భారతాన్ని సాధించాలనే సంకల్పంతో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌కు పురుడు పోశారు డాక్టర్ కేశవరావు బలిరాం పంత్ హెడ్గేవార్. బ్రిటిష్ వారి విభజించు, పాలించు అనే దుష్ట నీతిని గ్రహించిన హెడ్గేవార్.. దేశ ఐక్యతకు ప్రతిన బూనారు. 1889 ఏప్రిల్ 1న (ఉగాది పండుగ రోజున) బలిరాం పంత్ హెడ్గేవార్, రేవతి బాయ్ దంపతులకు కేశవరావు జన్మించారు. మహారాష్ట్రలోని నాగపూర్‌లో జన్మించినా, వారి పూర్వీకులది తెలంగాణలోని నిజామాబాద్ జిల్లా కందకుర్తి గ్రామం. బాల్యం నుంచే భరతమాత వైభవం కోసం తపించిన హెడ్గేవర్.. స్వాతంత్ర్య సమరంలో పాలు పంచుకున్నారు.

అడుగడుగునా భారతీయ జవసత్వాలు నింపుకున్న హెడ్గేవర్.. విక్టోరియా మహారాణి జయంతి సందర్భంగా పంచిన మిఠాయిలను విసిరేసి స్వాభిమానం చాటుకున్నారు. తోటి విద్యార్థులను కూడగట్టి విదేశీ జెండాలను పెకిలించి వేశారు. పాఠశాల సందర్శనకు వచ్చిన ఆంగ్లేయ అధికారులకు వందేమాతరం.. భారత్ మాతాకీ జై... నినాదాలతో స్వాగతం పలికారు. పేదరికంలో పుట్టినప్పటికీ, చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయినప్పటికీ పట్టు సడలని.. మొక్కవోని దీక్షతో ఉన్నత విద్యాభ్యాసం పూర్తి చేశారు. సుఖమయ జీవితాన్ని త్యాగం చేసి.. తల్లి భారతి ఔన్నత్యం కోసం తనను తాను సమర్పించుకున్నారు.

కాంగ్రెస్ పార్టీ సభ్యుడుగా అనేక బ్రిటిష్ వ్యతిరేక ఉద్యమాలలో పాల్గొని జైలు జీవితం అనుభవించారు. 1921లో ఖిలాఫత్ ఆందోళనకు మహాత్మాగాంధీ మద్దతు ఇవ్వడం నచ్చక, సొంతబాట పట్టారు. దేశంలో జరుగుతున్న పరిస్థితులు గమనిస్తుంటే చెల్లాచెదురైన హిందూ సమాజాన్ని ఏకం చేయాల్సిన అవసరం ఉందని గ్రహించారు. కులాలు, జాతులు, వర్ణాలు, వర్గాల పేరుతో ఎవరికి వారేగా ఉంటున్న హిందూ సమాజాన్ని ఏకం చేయాలని సంకల్పించారు. దేశానికి స్వాతంత్ర్యం రావడం ఖాయమని, అయితే దాన్ని స్వాభిమాన స్వాతంత్ర్యంగా నిలుపుకొని భారతీయ మూలాలను పరిరక్షించాలని నిర్ణయించారు.



కులాలు, వర్ణాలు, వర్గాల పేరుతో ఎవరికి వారేగా ఉంటున్న హిందూ సమాజాన్ని ఏకం చేయాలని హెడ్గేవర్ సంకల్పించారు. దేశానికి స్వాతంత్ర్యం రావడం ఖాయమని, అయితే దాన్ని స్వాభిమాన స్వాతంత్ర్యంగా నిలుపుకొని భారతీయ మూలాలను పరిరక్షించాలని నిర్ణయించారు. ఈ లక్ష్యంతో 1925 విజయదశమి రోజున కేవలం ఐదుగురు సభ్యులతో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌ను ఆయన ప్రారంభించారు.

1925 విజయదశమి రోజున కేవలం ఐదుగురు సభ్యులతో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌కు పురుడు పోశారు డాక్టర్ హెడ్గేవర్. మహారాష్ట్రలోని నాగపూర్‌లో ప్రారంభమైన ఆర్ఎస్ఎస్‌ను హిమాలయాల నుంచి కన్యాకుమారి వరకు విస్తరించాలని ప్రతిన బూనారు. "అఖండ భారత్ హమారా హై" అంటూ నినదించారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ విస్తరణలో పట్టుదల, క్రమశిక్షణ, దేశభక్తి కలిగిన సుశిక్షితులైన స్వయం సేవకుల తయారీ కోసం సంఘ శాఖలను ప్రారంభించారు. నిస్వార్థంగా దేశం కోసం పనిచేసే సైనికులను తీర్చిదిద్దారు. విశ్వంలోని హిందువులందరినీ ఒక్కటి చేయాలనే ఏకైక లక్ష్యం ఏర్పాటు చేసుకుని, దార్శనికత ప్రదర్శించారు. ఆజన్మాంతం బ్రహ్మచారిగా ఉంటూ త్రికరణశుద్ధితో భరతమాత సేవలో తనువు సమర్పించుకున్న భరతమాత ముద్దుబిడ్డ డాక్టర్ హెడ్గేవర్. హిందువులంతా సంఘటితమైతేనే జాతీయత సాధ్యమని, అందుకు సంఘ శాఖలే ప్రధాన భూమిక పోషించాలని స్వయం సేవకులకు ఉద్బోధించారు. భారతీయులందరూ ఒకే కుటుంబానికి చెందినవారుగా ఆత్మీయతను నూరిపోశారు. 'వందేమాతరం', 'భారత్ మాతాకీ జై'.. అనే నినాదాలు మంత్రాలుగా మలిచి ప్రతి వ్యక్తిలో జాతీయభావాలు నూరిపోశారు. సంఘ్ శాఖల ద్వారా దేశభక్తుల తయారీని ప్రారంభించారు.

సంఘ్ శాఖలో సామాజిక సమరసతకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు డాక్టర్ హెడ్గేవర్. కుల జాడ్యానికి తావులేకుండా స్వయం సేవకులను తయారు చేశారు. "అందరం హిందువులం.. అందరం భారతీయులం" అనే ఆత్మీయ భావనను తీసుకువచ్చారు. ఒక సందర్భంలో సంఘ్ శిబిరాన్ని మహాత్మాగాంధీ సందర్శించి, అందులోని స్వయంసేవకులను మీరు ఏ కులానికి చెందినవారు అని ప్రశ్నించారు. దీంతో మేమంతా హిందువులం అని స్వయం సేవకులు సమాధానం చెప్పారు. మరొక సందర్భంలో డాక్టర్ అంబేడ్కర్ సంఘ శిబిరాన్ని సందర్శించారు. ఇక్కడ కులాల కుంపటి లేకుండా సామాజిక సమరసత వెల్లివిరియడం చాలా ఆనందంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు.

1925లో ప్రారంభమైన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ విస్తరణ కోసం ప్రచారక్ వ్యవస్థను ఏర్పాటు చేశారు హెడ్గేవర్. "ఆ జీవన పర్యంతం సమాజసేవకే అంకితం" అని ప్రతి వ్యక్తి మదిలో నింపి.. సజ్జన సమాజ నిర్మాణానికి తోడ్పడ్డారు. ఆ విధంగా తయారైన స్వయం సేవకులు దేశ నలుమూలలా విస్తరించి, హైందవ సమాజ జాగృతి కోసం కంకణం కట్టుకొని పనిచేశారు. 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం రానే వచ్చింది. వచ్చిన స్వాతంత్ర్యాన్ని నిలుపుకునేలా, స్వాభిమాన భారతాన్ని తయారు చేసేలా సంఘాన్ని కూడా విస్తరించారు. హిందూ సమాజాన్ని పట్టిపీడిస్తున్న అనేక రుగ్మతలను ఒక్కొక్కటిగా పారదోలుతూనే హిందూ ఐక్యతకు ప్రాధాన్యమిచ్చారు స్వయం సేవకులు. దేశంలోని అన్ని రంగాలలో రాజకీయ, విద్యార్థి, కార్మిక, కర్షక, రైతు, మేధావి... ఇలా అన్ని క్షేత్రాలలో స్వయంసేవకుల ప్రాధాన్యం పెంచారు. ఫలితంగా స్వాతంత్ర్యానంతరం కాశ్మీర్ కోసం.. అయోధ్య రామ మందిరం కోసం అనేక ఉద్యమాలు చేసి ప్రాణత్యాగం చేసిన స్వయం సేవకులను, కర సేవకులను తయారు చేశారు. వారు సంఘ్ సిద్ధాంతాన్ని వ్యాపింప చేశారు. సమర్థ నాయకులు అటల్ బిహారీ వాజ్‌పాయి, నరేంద్ర మోదీ వంటి ప్రధానమంత్రులను సంఘ్ తయారు చేసింది.

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కేవలం భారతదేశానికే పరిమితం కాకుండా హెచ్ఎస్ఎస్ (హిందూ స్వయంసేవక్ సంఘ్) పేరుతో ప్రపంచంలోనే 60కి పైగా దేశాలలో విస్తృతంగా పనిచేస్తోంది. ఆర్ఎస్ఎస్‌కు అనుబంధంగా ధార్మిక కార్యక్రమాల కోసం విశ్వహిందూ పరిషత్‌ను స్థాపించి హిందూ ఐక్యత కోసం కృషి చేస్తున్నది. ఒక మాటలో చెప్పాలంటే నాడు హెడ్గేవర్ నాటిన మొక్క నేడు మానుగా మారి, మహావృక్షమైంది. ఇంతటి గొప్ప సంస్థ ప్రారంభమై 100 సంవత్సరాలు పూర్తి అవుతున్న శుభ సందర్భంలో డాక్టర్ హెడ్గేవర్ జయంతిని స్మరించుకోవడం అత్యంత ఆవశ్యకం.

• పగుడాకుల బాలస్వామి
విశ్వహిందూ పరిషత్, తెలంగాణ

పండుగ రోజే ఎందుకు?

రాష్ట్రంలోని తెలుగు ప్రజలకు ముఖ్యంగా హిందువులకు ఎన్నో పండుగలు ఉన్నా, అందులో ముఖ్యమైనవి తెలుగు సంవత్సరం మొదటి పండుగ ఉగాది, తర్వాత దసరా, దీపావళి. ఈ రోజుల్లో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ఉత్సాహంగా పండుగ జరుపుకుంటారు. రాష్ట్ర ప్రభుత్వం ఏదో ఒక కార్యక్రమాన్ని హిందువుల పండుగ రోజే మొదలు పెట్టడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉద్యోగస్తులు ఆ పండుగలు జరుపుకోలేకపోతున్నారు. దీంతో వారి భార్యాపిల్లలు నిరుత్సాహానికి గురి అవుతున్నారు. ఉదాహరణకు గత ప్రభుత్వ హయాంలో కొత్త జిల్లాల ఏర్పాటు దసరా రోజే ప్రారంభించడం, అది కూడా రాత్రిపూట పోస్టింగ్స్ ఇవ్వడంతో ఆదరాబాదరాగా కుటుంబానికి దూరంగా ఆ కార్యక్రమాల్లో పాల్గొనాల్సి వచ్చింది. అదేవిధంగా ప్రస్తుత ప్రభుత్వం ఉగాది రోజే అంటే, మార్చి 30న రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నది. ఈ కార్యక్రమాన్ని హుజూర్‌నగర్ నుంచి ముఖ్యమంత్రి ప్రారంభిస్తే, మిగతా ప్రాంతాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు మొదలు పెట్టాలని నిర్ణయించారు. దీంతో ఆ రోజు ముఖ్యంగా రెవెన్యూ ఉద్యోగులు, పౌరసరఫరాల సిబ్బంది కుటుంబంతో ఉగాది పండుగ జరుపుకునే అవకాశం కోల్పోతారు. దీంతో కుటుంబసభ్యులు నిరుత్సాహానికి గురై, మనస్పర్థలు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి పండుగ రోజుల్లో కాకుండా ఇతర రోజుల్లో ఇటువంటి కార్యక్రమాలను చేపట్టేలా తగు చర్యలు తీసుకోవాలి.

– సురేష్ పొద్దార్
రిటైర్డ్ జాయింట్ కలెక్టర్

రుణమాఫీ చుట్టూ ఎందుకంత లొల్లి?

భారత ప్రభుత్వ ఆధీనంలోని నేషనల్ శాంపుల్ సర్వే సంస్థ (NSSO) 2021లో ఇచ్చిన 'వ్యవసాయ కుటుంబాలు & భూకమతాల వాస్తవిక పరిస్థితులు-2021' అనే నివేదిక ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో 91శాతం గ్రామీణ రైతు కుటుంబాలు అప్పుల ఊబిలో చిక్కుకున్నాయి. ఇది జాతీయ సగటు కంటే దాదాపు రెట్టింపు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర గ్రామీణ వ్యవసాయ కుటుంబాల సగటు రుణభారం రూ.1,52,000. ఇది కూడా జాతీయ సగటుతో పోలిస్తే రెట్టింపే. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో మొత్తం గ్రామాల్లో కుటుంబాల సంఖ్య సుమారు 49లక్షలు కాగా అందులో 26 లక్షల 55 వేలు (54శాతం) వ్యవసాయ కుటుంబాలుగా పేర్కొన్నారు. దీని ప్రకారం తెలంగాణ గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తూ వ్యవసాయం మీద పూర్తిగా ఆధారపడి ఉన్న కుటుంబాల సంఖ్య కేవలం 26 లక్షల 55 వేలు మాత్రమే. ఇందులో 90 శాతం షెడ్యూలు కులాలు, వెనుకబడిన తరగతులకు సంబంధించిన వాళ్లే. అదేవిధంగా తెలంగాణలో ప్రతి వ్యవసాయ కుటుంబ సగటు భూ విస్తీర్ణం 2 ఎకరాల 6 గుంటలు. దీని ప్రకారం తెలంగాణలో వాస్తవంగా గ్రామాల్లో నివసిస్తూ మొత్తం వ్యవసాయ కుటుంబాలు సాగు చేస్తున్న నికర విస్తీర్ణం 57 లక్షల 8 వేల 250 ఎకరాలు మాత్రమే. అయితే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం ఈ సంఖ్యను భూమి యాజమాన్య పాస్‌బుక్‌లతో పోల్చి దాదాపుగా 68లక్షలుగా చెప్తున్నారు. ఇది కేవలం భూ యజమానుల పాస్ బుక్‌ల సంఖ్య మాత్రమే. అంతేకాకుండా గ్రామాల్లో నివాసం లేని, వ్యవసాయేతర వృత్తులలో పనిచేస్తూ పట్టణ ప్రాంతాలలో నివసిస్తున్న భూ యజమానుల కుటుంబాలను కూడా వ్యవసాయ కుటుంబాలుగా పరిగణిస్తూ వ్యవసాయ కుటుంబాల సంఖ్యను అధికంగా చూపిస్తున్నారు.

వాస్తవానికి భారత ప్రభుత్వం ఎన్ఎస్ఎస్ (NSS) నివేదిక ఇచ్చిన నిర్వచనం ప్రకారం, గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ కుటుంబం అంటే సొంతభూమి ఉండి అయా కుటుంబ సభ్యులు ఒకే ఇంటిలో ఉంటూ వ్యవసాయమే ప్రధాన వృత్తిగా ఉన్న కుటుంబం. గ్రామాలలో భూమి ఉండి, అయా కుటుంబాలు వ్యవసాయేతర వృత్తులలో స్థిరపడి పట్టణ, నగర ప్రాంతాల్లో నివసిస్తున్న కుటుంబాలను వ్యవసాయ కుటుంబాలుగా పరిగణించరు. దీనిని బట్టి చూస్తే భారత ప్రభుత్వం గానీ లేదా రాష్ట్ర ప్రభుత్వం గానీ వ్యవసాయదారులకు ఇచ్చే ఏ లబ్ధి పథకమైనా గ్రామాలలో నివసిస్తూ వ్యవసాయం మీద ఆధారపడి ఉన్న కుటుంబాలకు మాత్రమే దక్కాల్సిన అవసరం ఉంది. అంతేకాకుండా భూమి లేకుండా కౌలుదారులుగా వ్యవసాయం చేస్తున్న కుటుంబాలకు కూడా ఈ ఫలితాలు అందాలి. ఐతే కౌలుదారులకు గుర్తింపు గానీ, కౌలుదారుల కోసం ఎలాంటి వ్యవసాయ సంబంధించిన ప్రభుత్వ ఫలాలు గానీ ఈనాటికీ అందటం లేదు.

ఇక తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన రుణమాఫీ పథకం గురించి విశ్లేషిద్దాం. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలోను, వరంగల్ రైతు డిక్లరేషన్ సభలోను ఇచ్చిన హామీ ప్రకారం అసలు, వడ్డీ కలిపి రూ.2లక్షల పంట రుణాల బకాయి ఉన్న రైతు కుటుంబాలకు ఏకకాలంలో పూర్తి స్థాయి రుణ విముక్తి కల్పిస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే ఆ దిశగా త్వరత్వరగా అడుగులు వేసి జూలై 15, 2024 నాడు రుణమాఫీకి సంబంధించిన స్పష్టమైన మార్గదర్శకాలను విడుదల చేశారు. ఆయా మార్గదర్శకాల ప్రకారం మూడు దశలలో ఏకకాలంలో దాదాపు 25 లక్షల వ్యవసాయ కుటుంబాలకు సుమారు రూ.21,500కోట్ల రుణాలను ఆగస్టు నాటికి మాఫీ చేశారు. తొలుత రుణమాఫీ పథకం కోసం దాదాపుగా రూ.31వేల కోట్లు అవసరం ఉంటుందని అంచనాలు వేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన గణాంకాల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తూ వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలతో పాటు పట్టణ, నగర ప్రాంతాలలో వ్యవసాయేతర వృత్తుల్లో స్థిరపడి గ్రామీణ ప్రాంతాల్లో భూమి ఉన్న కుటుంబాల సంఖ్యను పరిగణనలోకి తీసుకొనడం వలన ఈ సంఖ్య అధికమైంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం ఆదాయపన్ను చెల్లించే కుటుంబాలను రుణమాఫీ పథకం నుండి మినహాయించారు. దీనివలన గ్రామాలలో భూమి ఉన్నప్పటికీ ఆయా కుటుంబాలు వ్యవసాయేతర వృత్తులలో స్థిరపడి ఆదాయం పన్ను పరిధిలోకి వచ్చి పట్టణ, నగరాల్లో ఉన్న చాలా కుటుంబాలకు ఈ రుణమాఫీ పథకం వర్తించలేదు. వాస్తవానికి రుణమాఫీ పథకం వ్యవసాయేతర ఆదాయ వనరులపై ఆధారపడ్డ కుటుంబాలకు భూమి ఉన్నప్పటికీ వర్తింపచేయడం సబబు కాదు. ఈ నేపథ్యంలో తొలుత అంచనా వేసిన రూ.31వేల కోట్ల రుణమాఫీ కంటే ప్రభుత్వంపై ఆర్థిక భారం తగ్గిన మాట వాస్తవం. దీని అర్థం, అర్హత ఉన్న ప్రతి వ్యవసాయ కుటుంబానికి రుణమాఫీ పథక ఫలాలు అందాయి. అందలేదన్న ప్రతిపక్షాల విమర్శ అర్థరహితం. అయితే గ్రామీణ ప్రాంతాలలో కొన్ని వ్యవసాయ కుటుంబాలకు రుణమాఫీకి పూర్తిగా అర్హత ఉన్నప్పటికీ కొన్ని సాంకేతికపరమైన లోపాలతో రుణమాఫీ ఫలాలు అందలేదన్న మాట వాస్తవం. ఈ సంఖ్య ఎంత అనేది ఇప్పటికీ స్పష్టత లేదు.

భారతదేశ చరిత్రలో ఒక రాష్ట్రంలో దాదాపు 95శాతం పైగా వ్యవసాయ కుటుంబాలకు ఏకకాలంలో రుణవిముక్తి కల్పించిన రాష్ట్రం తెలంగాణ. ఇది ఒక చారిత్రాత్మక నిర్ణయం. అర్హత ఉన్న ప్రతి వ్యవసాయ కుటుంబానికి రుణమాఫీ పథక ఫలాలు అందాయి. అందలేదన్న ప్రతిపక్షాల విమర్శ అర్థరహితం.



ఇప్పటివరకు ఈ పథకం ద్వారా రుణ విముక్తి పొందిన గ్రామీణ వ్యవసాయ కుటుంబాల సంఖ్య దాదాపు 25 లక్షలు. అనగా భారత ప్రభుత్వం ఎన్ఎస్ఎస్ఓ, 2021 నివేదికలో పేర్కొన్న గణాంకాల ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 95 శాతం గ్రామీణ వ్యవసాయ కుటుంబాలకు ఈ రుణమాఫీ పథకం ద్వారా రుణ విముక్తి జరిగినట్లు అయింది. అయితే ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నట్లు ఇంకా 40 శాతం వ్యవసాయ కుటుంబాలకి రుణమాఫీ పథకం ఫలాలు అందలేదు అనేది అవాస్తవం. ఒకవేళ నూటికి నూరు శాతం గ్రామీణ వ్యవసాయ కుటుంబాలకు రెండు లక్షల పంట రుణం, వడ్డీ బకాయిల నుండి రుణ విముక్తి చేయాలనుకున్నా ఇంకా మిగిలి ఉన్న గ్రామీణ వ్యవసాయ కుటుంబాల సంఖ్య 1,55,000లకు మించదు.

భారతదేశ చరిత్రలో ఒక రాష్ట్రంలో దాదాపు 95శాతం పైగా వ్యవసాయ కుటుంబాలకు ఏకకాలంలో రుణముక్తి కల్పించిన రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం. ఇది ఒక చారిత్రాత్మక నిర్ణయం. రైతులలో ఎంతో ఆత్మవిశ్వాసాన్ని కలిగించే సంఘటన. ఎందుకంటే గత 25 సంవత్సరాల నుంచి గణాంకాలను విశ్లేషించినట్లయితే తెలంగాణ గ్రామీణ వ్యవసాయ కుటుంబాలలో 2007 నాటికి 80 శాతం వ్యవసాయ కుటుంబాలు అప్పుల ఊబిలో ఉండేవి. ఆ సంఖ్య నానాటికీ పెరుగుతూనే వచ్చింది తప్ప తగ్గలేదు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిన తర్వాత అధికారంలోకి వచ్చిన ఆనాటి టీఆర్ఎస్ ప్రభుత్వం రూ.లక్ష లోపు రైతులకు రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చింది. అయితే, నాలుగు సమాన విడతలుగా నాలుగేళ్ళలో రుణమాఫీ చేయడం ద్వారా రైతులకు ఎలాంటి ప్రయోజనం జరగలేదు. ఎందుకంటే ఈ విడతల వారి రుణమాఫీ ద్వారా అదనపు వడ్డీ భారం రైతాంగం మీద పడడమే గాక, ఆ తర్వాత బ్యాంకు నుంచి కొత్త రుణాన్ని పొందే అవకాశాన్ని కూడా కోల్పోయారు. అదేవిధంగా 2018లో తిరిగి అధికారంలోకి వచ్చిన నాటి టీఆర్ఎస్ ప్రభుత్వం, మళ్లీ లక్ష రూపాయల లోపు రుణమాఫీ చేస్తామని చెప్పింది. అయితే ఇది 2023 నవంబర్ నాటికి అరకొరగా మాత్రమే అమలు చేసి దాదాపు తొమ్మిది వేల కోట్లు రుణమాఫీ చేయకుండానే అధికారం నుండి వైదొలగవలసి వచ్చింది. అంటే 2014 నుండి 2023 వరకు నాటి టీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష రూపాయల రుణమాఫీ చేస్తామని చెప్పి విడతల వారీగా ఒకసారి, అరకొరగా మరొకసారి చేసి దాని ప్రయోజనాలను పూర్తిస్థాయిలో రైతులకు అందకుండా చేసింది. అందువల్లనే తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా రైతు సంక్షోభం, రైతు ఆత్మహత్యలు ఆగలేదు.

ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి రాగానే రుణమాఫీ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలుచేయడం వలన దాదాపు 95శాతం గ్రామీణ వ్యవసాయ కుటుంబాలు రుణ విముక్తి పొందాయి. ఈ రుణ విముక్తి అన్నదాతల్లో ఎంతో ఆత్మవిశ్వాసాన్ని కల్పించింది. అంతేకాకుండా ముస్ముందు అన్నదాతల ఆత్మహత్యలు గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. ఈ రుణ విముక్తితో అన్నదాతలకు కొత్త అప్పులు బ్యాంకుల నుండి లభించే అవకాశం సులభమైనది. తద్వారా, అన్నదాతలు అప్పుల కోసం వడ్డీ వ్యాపారస్తులపై ఆధారపడడం గణనీయంగా తగ్గుతుంది. బ్యాంకులు ఇచ్చే కొత్త అప్పుల ద్వారా సకాలంలో పెట్టుబడులు కుదిరి వ్యవసాయ ఉత్పత్తులను అధికం కావడంతో పాటు రైతుల ఆదాయం కూడా పెరిగే అవకాశం ఉంటుంది.

▪ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య
వ్యవసాయ ఆర్థికవేత్త



సన్నాల పండుగ

వచ్చే నెల 1 నుంచి సన్న బియ్యం పంపిణీ



- ఉగాది కానుకగా ప్రారంభించనున్న ప్రభుత్వం
- ఏర్పాట్లు చేస్తున్న పౌరసరఫరాల శాఖ అధికారులు
- నెలాఖరుకు రేషన్ దుకాణాలకు చేరనున్న స్టాకు
- ప్రస్తుతం పాత కార్డుదారులకే సరఫరా
- ఇంకా పరిశీలన దశలోనే కొత్త అర్జీలు
- ఆందోళనలో కొత్త రేషన్ కార్డుదారులు

హనుమకొండ సిటీ/వరంగల్ కలెక్టరేట్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఉగాది కానుకగా రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 30వ తేదీ నుంచి రేషన్ షాపుల నుంచి సన్న బియ్యం పంపిణీ చేయనుంది. కార్డు కలిగిన వారిలో కుటుంబంలోని ఒక్కొక్కరు ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం పొందనున్నారు. ఈ నెల 29వ తేదీలోగా జిల్లాలోని చౌక డిపోలకు సన్న బియ్యం స్టాకు చేరనుంది. ఆ తరువాత ప్రభుత్వ నిర్దేశానుసారం సన్నాల పంపిణీ కానుంది. వాస్తవానికి ప్రతీ నెల 1 నుంచి 20వ తేదీ వరకు బియ్యం పంపిణీ అవుతుంది. అయితే ఉగాది కానుకగా ప్రభుత్వం బియ్యం పంపిణీ చేపట్టనుండడంతో ఈ సారికి మాత్రం మార్చి 30వ తేదీ నుంచి పంపిణీ జరుగనుంది. ఈ మేరకు జిల్లాల్లో ఉన్న తెల్లరేషన్‌కార్డులు, డిమాండ్ వివరాలను పౌర సరఫరాల శాఖ అధికారులు ప్రభుత్వానికి అందచేశారు. గోదాముల నుంచి డిపోలకు బియ్యం చేరవేత చర్యలను అధికారులు చేపట్టనున్నారు. తెల్లరేషన్‌కార్డు దారులకు సన్న బియ్యం పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈసారి రూ.500 బోనస్‌తో కొనుగోలు చేసింది. గతంలో కాకుండా 37 శాతం బ్యాంక్ గ్యారెంటీతో మిల్లర్లకు సీఎంఆర్‌కు అప్పగించింది. వాస్తవానికి నూతన సంవత్సరం నుంచే సన్న బియ్యం అందుతాయనే సంకేతాలను ప్రభుత్వం ఇచ్చింది. అయితే జాప్యం జరిగి చివరకి ఉగాది కానుకగా నిరుపేదలకు సన్న బియ్యాన్ని అందించే చర్యలు చేపట్టింది.

పేదలకు చేకూరనున్న లబ్ధి

సన్న బియ్యం ధరలు ఆకాశాన్ని తాకుతుండటంతో వచ్చే నెల నుంచి ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తుందని ప్రకటించడంతో పేద, మధ్య తరగతి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అనేక కుటుంబాలు దొడ్డు రకం బియ్యం తినకుండా మార్కెట్‌లో సన్న బియ్యం కొనుగోలు చేస్తున్నారు. వాటికి క్వింటాకు రూ. 5000 నుంచి రూ.6,500 వరకు ధర పలుకుతోంది. ఇంత ధర పెట్టిన పేదలు సన్న బియ్యం కొనుగోలు చేయాలంటే తలకుమించిన భారమే అవుతోంది. ఈనేపథ్యంలో సన్నబియ్యం సరఫరా చేస్తే పేద, మధ్య తరగతి ప్రజలకు ఆర్థిక భారం తగ్గనుంది.

దొడ్డు బియ్యం పక్కదారి

ప్రస్తుతం ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున దొడ్డు బియ్యాన్ని ఇస్తుండగా వాటిని తినేందుకు అనేక మంది ఆసక్తి చూపడం లేదు. ఆ బియ్యాన్ని రూ.10 నుంచి రూ.15 చొప్పున బయట విక్రయిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో రేషన్ డీలర్లే బియ్యానికి బదులు నగదు ఇస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

పాత కార్డుదారులకే పంపిణీ

ఉగాది కానుకగా తెల్లకార్డుదారులకు ప్రభుత్వం అందించే సన్న బియ్యం ప్రస్తుతానికి పాత కార్డుదారులకే అందనున్నాయి. కొత్త రేషన్‌కార్డు దరఖాస్తుదారులకు సన్నాలు ఇప్పట్లో లేనట్లేనని తెలుస్తోంది. కొత్త రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారు మరికొంత సమయం వేచి చూడాల్సి ఉంది. రేషన్‌కార్డు చేతిలో పడితే అందరితో పాటు సన్న బియ్యం పొందవచ్చు అని ఆశపడిన దరఖాస్తుదారులకు ప్రస్తుతానికి నిరాశే కలిగింది. అయితే ముమ్ముందు దరఖాస్తుల పరిశీలన కొనసాగిస్తూనే అర్హులుగా ఎంపికైన లబ్ధిదారులకు తరువాత కోటాల్లో అందించనున్నారు.

ఇంకా పరిశీలన దశలోనే కొత్త అర్జీలు

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాల్లో తెల్లరేషన్ కార్డు కోసం నిరుపేదలు దరఖాస్తు చేసుకున్నారు. అదే విధంగా కుటుంబంలోని సభ్యుల చేరిక, మార్పులు, చేర్పుల విషయంలో కూడా దరఖాస్తు చేశారు. మండలాలు, గ్రామాలు, డివిజన్ల వారిగా ప్రజాపాలన ద్వారా ప్రజల నుంచి దరఖాస్తులను అధికారులు సేకరించారు. అయితే నెలలు గడిచినా ఈ దరఖాస్తుల పరిశీలన ఇంకా పూర్తి కాలేదు. సేకరించిన దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి అర్హులను తేల్చాలి ఉంది. అర్హులుగా తేలిన వారి జాబితాను సిద్ధం చేసి వారికి కూడా సన్న బియ్యం అందించాల్సి ఉంది. అయితే విచారణ జరపాల్సిన జీడబ్ల్యూఎంసీ, రెవన్యూ శాఖల అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా కార్డుల పరిశీలన జరగడం లేదు. పరిశీలన జరిపి క్షేత్రస్థాయిలో అర్హులుగా తేల్చిన జాబితాను జిల్లా పౌర సరఫరాల శాఖకు అందిస్తే కొత్తగా పెరిగిన కార్డులు, ఆ మేరకు సభ్యుల లెక్క చొప్పున సన్న బియ్యం డిమాండ్‌ను జిల్లా పౌర సరఫరాల శాఖ సేకరిస్తుంది. పరిశీలన పూర్తి కాకపోవడంతో కొత్తకార్డుల జారీ కాలేదు. ఈ క్రమంలో కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి నిరాశే మిగిలింది. దరఖాస్తుల పరిశీలన ఎప్పటికి పూర్తవుతుందనే దానిపై కూడా ఇంకా స్పష్టత లేదు. వచ్చే నెలలో జరిగే పంపిణీ సమయానికైనా కొత్త కార్డులు దరఖాస్తుదారుల చేతిలో పడనున్నాయా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతానికి అయితే పాత కార్డుదారులకే పంపిణీ చేసే చర్యలు జరుగుతున్నాయి.

కొత్త కార్డుల కోసం ఎదురు చూపులు

నూతన రేషన్ కార్డులను జారీతోపాటు మార్పులు, చేర్పులకు అవకాశం కల్పిస్తున్నట్లు ప్రకటించినా ప్రభుత్వం ఇప్పటి వరకు పంపిణీ చేయకపోవడంతో నిరీక్షణ తప్పడం లేదు. వచ్చే నెల నుంచి సన్న బియ్యం పంపిణీ చేయాలన్నా, రాజీవ్ యువ వికాసం కింద వివిధ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నా రేషన్ కార్డు తప్పనిసరి. అయితే నూతన రేషన్‌కార్డులు జారీ కాకపోవడంతో అర్హులైన పలువురు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం కావాల్సిన పరిస్థితి నెలకొంది.

కార్డులు.. షాపులు..

హనుమకొండ జిల్లాలో 2,28,373 తెల్లకార్డుదారులు ఉన్నారు. 414 రేషన్ షాపులు ఉన్నాయి. తెల్లకార్డుల డిమాండ్ మేరకు 4262.749 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం పంపిణీ కావాల్సి ఉంది.

వరంగల్ జిల్లా వ్యాప్తంగా 509 రేషన్ దుకాణాలు ఉండగా మొత్తం కార్డులు 2,66,674 ఉన్నాయి. ఇందులో ఆహార భద్రత కార్డులు 2,53,064, అంత్యోదయ కార్డులు 13,603, అన్నపూర్ణ కార్డులు 7 ఉన్నాయి. వీటి ద్వారా మొత్తం 7,87,823 మంది లబ్ధి పొందుతున్నారు. ప్రతీ నెల 4977.333 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు.

దాడుల వెనుక ఉన్నదెవరో

బయటపెట్టాలి

- అల్లరి మూకలను రక్షించే ధోరణిలో పోలీసుల చర్యలు
- నిందితులకు మంత్రి కొండా సురేఖ అభయం
- బీజేపీ రెండు జిల్లాల అధ్యక్షులు సంతోష్‌రెడ్డి, రవికుమార్



మీడియాతో మాట్లాడుతున్న కొలను సంతోష్‌రెడ్డి, గంటా రవికుమార్

రాంనగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో కొద్దికాలంగా హిందువులపై జరుగుతున్న దాడుల వెనుక ఉన్నదెవరో పోలీసులు బయటపెట్టాలని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం బీజేపీ పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హనుమకొండ మచిలీబజార్‌లో బోనాలు చేసుకుంటున్న క్రమంలో కొంతమంది యువకులు గ్యాంగ్‌గా వచ్చి డీజే పెట్టిన యువకులపై దాడులు చేసి తీవ్రంగా గాయపరిచారన్నారు. ఆ తర్వాత సంక్రాంతి సందర్భంగా పతంగులు ఎగురవేస్తున్న యువకులపై దాడులు చేశారన్నారు. తాజాగా హనుమకొండలో ఓ మతానికి చెందిన యువతికి ఉపాధి కల్పించే క్రమంలో యువతికి సంబంధించిన 30 మంది యువకులు సాయిచరణ్ అనే యువకుడిని నగరమంతా తిప్పుతూ దాడి చేశారన్నారు. ఈ ఘటనలో 30 మందిపై ఎఫ్ఐఆర్ చేసి ఆరుగురిని మాత్రమే పోలీసులు జైలుకు తరలించారన్నారు. అయితే వారిపై పోలీసులకు అంత ప్రేమ ఎందుకని ప్రశ్నించారు. వారి వెనుకాల ఉన్న అసలు సూత్రధారుల పేర్లు పోలీసులు బయటపెట్టాలన్నారు. వరంగల్ నగరంలో మైనర్లను కిడ్నాప్ చేసి వ్యభిచార రొంపిలో దింపేందుకు ప్రయత్నించిన కిలేడీ ముఠా వెనుకాల ఓ ప్రముఖ వ్యక్తి ఉన్నప్పటికీ పోలీసులు బయట పెట్టకపోవడం వెనుక అంతర్యమేంటని ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో ఏ ఒక్క హిందువుపై దాడిజరిగినా సహించేదిలేదని హెచ్చరించారు. బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ ఇటీవల వరంగల్ నగరంలో పాఠశాల పిల్లలతో ఓ ముఠా సెక్స్‌రాకెట్ నిర్వహించడం వెనుక కొన్ని మత సంస్థలకు చెందిన వ్యక్తులు, రౌడీషీటర్లున్నారని ఆరోపించారు. గతంలో మండిబజార్‌లోని సాయిబాబా గుడి వద్ద జరిగిన హత్య నిందితులను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కాపాడితే ప్రజలు బుద్ధిచెప్పారన్నారు. ఇప్పుడు ఓటు బ్యాంకు కోసం కొందరిని మంత్రి కొండా సురేఖ కాపాడుతున్నారని ఆరోపించారు. శివనగర్‌లో వినాయకుడి విగ్రహాన్ని కొందరు ధ్వంసం చేశారని గుర్తుచేశారు. రంగశాయిపేటలోని మహంకాళీ ఆలయం స్థలాన్ని స్థానిక మంత్రి అనుచరులు ఇతర మతస్థులకు కట్టబెట్టేలా ప్రయత్నిస్తున్నారన్నారు. నిషేధిత సంస్థలతో సంబంధాలున్న వ్యక్తులను వెంటనే అరెస్టు చేసి వరంగల్‌లో శాంతియుత వాతావరణం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంపై సీపీని కలిసి ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు కాశీప్రసాద్, బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు, కార్పొరేటర్ గురుమూర్తి, అరణ్యరెడ్డి పాల్గొన్నారు.

గంజాయిపై

ఉక్కుపాదం

నార్కోటిక్స్ బ్యూరో ఎస్పీ సీహెచ్ రూపేశ్



నార్కోటిక్ సిబ్బందితో సమావేశమైన ఎస్పీ రూపేశ్

వరంగల్ క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గంజాయి అక్రమ రవాణాతో పాటు వినియోగంపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని నార్కోటిక్స్ బ్యూరో ఎస్పీ సీహెచ్ రూపేశ్ అన్నారు. ఇటీవలే నార్కోటిక్స్ ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన రూపేశ్.. శుక్రవారం వరంగల్ నార్కోటిక్స్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులతో పాటు సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. మాదకద్రవ్యాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతయుతంగా వ్యవహరించాలన్నారు. కలిసికట్టుగా పనిచేస్తేనే మాదకద్రవ్యాల ముప్పు నుంచి రాష్ట్రాన్ని కాపాడొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ సైదులు, సీఐ రవిందర్, ఎస్సైలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియను

వేగవంతం చేయాలి



సమీక్ష సమావేశంలో పాల్గొన్న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సురేఖ, సీతక్క, తదితరులు

- బేస్‌మెంట్ పూర్తయిన ఇళ్లకు తక్షణమే చెల్లింపులు
- వేసవిలో ఏ గ్రామంలో తాగునీటి సమస్య రాకుండా చూసుకోవాలి
- జూన్‌లో వరంగల్ సూపర్ స్పెషాలిటీ అస్పత్రి పూర్తి
- మడికొండ డంపింగ్‌యార్డుకు శాశ్వత పరిష్కారం చూస్తున్నాం..
- ఉమ్మడి వరంగల్ జిల్లా సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

7

లక్ష్యాన్ని చేరుకోని ఎల్‌ఆర్‌ఎస్

- అధికారుల సమన్వయలోపంతో బల్దియా వెనుకంజ
- ఈ నెల 31 వరకు ముగింపు కావడంతో బేజారు
- గడువు పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి
- త్వరలో వెలువడనున్న ప్రభుత్వ ఉత్తర్వులు



నయీంనగర్ హెల్ప్‌డెస్క్ వద్ద ఫీజు చెల్లిస్తున్న ప్రజలు

6

కేయూ పార్ట్ టైమ్ అధ్యాపకుల ఆశలపై నీళ్లు



హైదరాబాద్ ఈసీ సమావేశానికి హాజరైన కేయూ పాలక మండలి సభ్యులు, ఎఫ్‌వో తదితరులు

కేయూ బడ్జెట్ ప్రతిపాదనలకు ఆమోదం

- ఏప్రిల్, మేలో కాన్వకేషన్, తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌కు ఓకే..
- రిజిస్ట్రార్ సహా కొత్త నియామకాలకు పచ్చజెండా
- హైదరాబాద్‌లో వాడీవేడిగా పాలకమండలి సమావేశం

7

లక్షలాది మందితో రజతోత్సవ సభ

- రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు తరలిరావాలి
- సభ విజయవంతానికి నిర్వహణ కమిటీల ఏర్పాటు
- మాజీ ఎంపీ వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్ కుమార్, నేతలు

హనుమకొండ టౌన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఆవిర్భవించి 25 ఏళ్లు అవుతున్న సందర్భంగా నిర్వహించే రజతోత్సవ సభను లక్షలాదిగా తరలివచ్చి విజయతంతం చేయాలని బీఆర్ఎస్ నేతలు, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, పెద్ది సుదర్శన్ రెడ్డి, వొడితల సతీష్, తాటికొండ రాజయ్య, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ కోసమే పుట్టిన పార్టీ నాటి టీఆర్ఎస్, ప్రస్తుత బీఆర్ఎస్ అని అన్నారు. పార్టీ ఆవిర్భవించినప్పటి నుంచి 25 ఏళ్లు తెలంగాణ కోసం, ప్రజల కోసం పని చేసిందన్నారు. ఈ క్రమంలో పార్టీ రజతోత్సవ సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో పార్టీ అధినేత కేసీఆర్ నినాదం ప్రజలకు వినిపిస్తారని, అలాగే మరో 25 ఏళ్ల కోసం మార్గనిర్దేశం చేస్తారని పేర్కొన్నారు. దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. త్యాగాలు, పోరాటాల ద్వారా తెలంగాణను సాధించి, 10 ఏళ్లపాటు దేశంలోనే నెంబర్‌వన్‌గా రాష్ట్రాన్ని కేసీఆర్ నిలిపారని అన్నారు. ఏప్రిల్ 27న ఎల్కతుర్తిలో లక్షలాది మంది బీఆర్ఎస్ శ్రేణులతో సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ 25 ఏళ్ల సభను ఉమ్మడి వరంగల్‌జిల్లాలో నిర్వహించేందుకు నిర్ణయించిన కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. 1200ఎకరాల్లో సభ నిర్వహించేందుకు రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. అలాగే సభకు 45 నుంచి 50వేల వాహనాల్లో బీఆర్ఎస్ శ్రేణులు తరలివస్తారని తెలిపారు. వేసవిలో కార్యకర్తలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా 10లక్షల మజ్జిగ ప్యాకెట్లు, 10 లక్షల వాటర్‌బాటిళ్లు అందజేస్తామని తెలిపారు. మూడు రోజులలో సభ నిర్వహణ కోసం కమిటీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. వొడితెల సతీష్ మాట్లాడుతూ.. సభకు వలంటీర్లను ఇప్పటికే తీసుకున్నామని, వాహనాలు, ఇతర పార్కింగ్ స్థలాలను గుర్తించామని తెలిపారు. తాటికొండ రాజయ్య మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలను అభివృద్ధి వైపు నడిపించడమే కేసీఆర్ లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, బానోత్ శంకర్‌నాయక్, రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్ భాస్కర్, నాయకులు జోరిక రమేష్, పులి రజినీకాంత్, మేడిపెల్లి శోభన్‌బాబు, రామ్మూర్తి, నయిమోద్దీన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దేవాదుల ఫేజ్ 2, 3 పంపింగ్ బంద్

- విద్యుత్ సరఫరాలో అంతరాయం
- శుక్రవారం సాయంత్రం పునరుద్ధరణ


ఆఫ్ చేసిన దేవాదుల మోటార్లు

కన్నాయిగూడెం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని గుట్టల గంగారం వద్ద ఉన్న జే చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టులో విద్యుత్ సరఫరాలో అంతరాయంతో పంపింగ్‌ను గురువారం అర్ధరాత్రి నిలిపి వేశారు. ట్రాన్స్‌కో సబ్ స్టేషన్ లోని రెండో ఫీడర్‌లో విద్యుత్ సరఫరాలో హై ఓల్టేజీ , లో ఓల్టేజీ కారణంగా ఫేజ్ 2 లో రెండు మోటార్లు , ఫేజ్ 3 లో 2 మోటార్లను ఆఫ్ చేసిన అధికారులు శుక్రవారం మధ్యాహ్నం వరకు ఫేజ్ 3 లోని మరో రెండు మోటార్ల ద్వారా 583 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేశారు. ట్రాన్స్ కో సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు నిర్వహించి సరిచేసిన అనంతరం శుక్రవారం సాయంత్రం ఫేజ్ 2 లో రెండు , ఫేజ్ 3 లో మరో రెండు మోటార్లను ఆన్ చేసి మొత్తం 6 మోటార్ల ద్వారా 1661 క్యూ సెక్కుల నీటిని భీంఘనపూర్ రిజర్వాయర్‌కు ఎత్తి పోస్తున్నారు. ఇదిలా ఉండగా తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజీలోకి ఇన్ ఫ్లో కొనసాగుతుంది. ఎగువ నుంచి 1380 క్యూ సెక్కుల ఇన్ ఫ్లో వస్తుండడంతో బ్యారేజీలోని మొత్తం 59 గేట్లు మూసి వచ్చిన నీటిని వచ్చినట్లు నిల్వ చేస్తున్నారు. ఎగువనుంచి వచ్చే ఇన్ ఫ్లో కంటే పంపింగ్ చేసే నీళ్ల ఎక్కువ క్యూసెక్కుల నీళ్ల ఉండడంతో బ్యారేజి లోని నీటి నిల్వలు రోజు రోజుకు తగ్గి పోతున్నాయి. ఈ పంపింగ్ ఇలాగే కొన్ని రోజులు కొనసాగితే బ్యారేజీ డెడ్ స్టోరేజ్ కి చేరే ప్రమాదం ఉంది. బ్యారేజీ పూర్తి స్థాయి నీటి మట్టం 6.94 టీఎమ్సీలు కాగా ప్రస్తుతం కేవలం 1.55 టీఎమ్సీల నీళ్ల నిల్వ ఉన్నాయి. బ్యారేజీ వద్ద 75.45 మీటర్ల నీటి మట్టం నమోదు కాగా దేవాదుల ఇన్‌టేక్‌వెల్ వద్ద 75.35 మీటర్ల నీటి మట్టం నమోదయ్యింది.

గోపు ధరణికి డాక్టరేట్



కాజీపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కాజీపేట రహ్మత్‌నగర్‌కు చెందిన గోపు ధరణికి చెన్నై వెల్స్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. 'ది ఇంప్లిమెంటేషన్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ కేర్ ప్లాన్ ఫర్ స్ట్రోక్ పేషెంట్ ఇన్ టెరిషియరీ ఆస్పత్రి' అనే అంశంపై ప్రొఫెసర్ అఖిలాదేవి పర్యవేక్షణలో చేసిన పరిశోధనలకు డాక్టరేట్ లభించింది. ధరణి ప్రస్తుతం కాజీపేట సోమిడిలోని నేతాజీ సైన్స్ కళాశాలలో ఫార్మ్‌డీ హెడ్‌గా పనిచేస్తున్నారు. శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ బాబురావు, ఇతర సిబ్బంది ఆమెను అభినందించారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు : ఏసీపీ

వరంగల్ క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనం నడిపితే జైలు తప్పదని ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ హెచ్చరించారు. వరంగల్, హనుమకొండ, కాజీపేట పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో గురువారం చేపట్టిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో 51 కేసులు నమోదు చేయగా ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష, ఒకరికి సోషల్ సర్వీసింగ్ విధిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేయగా మిగతా వారికి రూ.64,800 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

గడ్డి మందు తాగిన వ్యక్తి మృతి

మహబూబాబాద్ రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందిన ఘటన మహబూబాబాద్ మండలం సీత్లాతండా శివారు ఈర్యతండాలో శుక్రవారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై దీపిక రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఈర్యతండాకు చెందిన బానోత్ రవి(35) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల ఇంటి అవసరాల కోసం రూ.50వేలు అప్పు తీసుకురాగా, అవి ఎలా తీర్చాలనే మనోవేదనకు గురై ఈనెల 25న ఇంట్లో ఎవరూలేని సమయంలో గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి రవి మృతి చెందాడు. మృతుడికి భార్య అరుణ, కుమారుడు ఉదయ్‌కుమార్ ఉన్నారు. భార్య అరుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తీవ్ర దుఃఖంతో ఎస్సెస్సీ పరీక్ష రాసిన కుమారుడు

మహబూబాబాద్ మండలం సీత్లాతండా శివారు ఈర్యతండాకు చెందిన పదో తరగతి విద్యార్థి బానోత్ ఉదయ్‌కుమార్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఇటీవల పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా విద్యార్థి ఉదయ్‌కుమార్ తండ్రి బానోత్ రవి గడ్డి మందు తాగి మృతి చెందాడు. ఓ వైపు తండ్రి మృతదేహం ఇంటి వద్ద ఉండగా మరోవైపు కుమారుడు ఉదయ్ తీవ్ర దుఃఖంలో సైతం పరీక్ష కేంద్రానికి వెళ్లి ఫిజికల్ సైన్స్ (పేపర్-1)ను రాశాడు. అనంతరం తండ్రి అంత్యక్రియలను నిర్వహించాడు.

లక్ష్యాన్ని చేరుకోని ఎల్ఆర్ఎస్

- అధికారుల సమన్వయ లోపంతో బల్దియా వెనుకంజ
- ఈ నెల 31 వరకు ముగింపు కావడంతో బేజారు
- గడువు పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి
- త్వరలో వెలువడనున్న ప్రభుత్వ ఉత్తర్వులు ?


వరంగల్ బల్దియా కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ చెల్లింపుల కోసం వచ్చిన నగరవాసులు

వరంగల్ కార్పొరేషన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ ఫీజులు చెల్లింపుల గడువుకు ఇంకా సమయం ఒక్క రోజే ఉండడంతో ఫీజు చెల్లింపు సాధ్యమవుతుందా? అనే సందేహాలు ఉన్నాయి. దీంతో గడువు కావాలని అధికారులు రాష్ట్రప్రభుత్వాన్ని కోరినట్టు విశ్వసనీయ సమాచారం. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపు గడువు ప్రకటించలేకపోతున్నామని, టార్గెట్ పూర్తి చేసే వరకు ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపులు చేపట్టాలని రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల ఉన్నతాధికారులకు మౌఖిక ఆదేశాలు అందినట్టు తెలిసింది. అయితే వరంగల్ బల్దియాతో పాటు ఇతర మున్సిపాలిటీలకు మరో నెల లేదా రెండు మాసాలు గడువు పొడిగించవచ్చని బల్దియా ఉన్నతాధికారి ఒకరు అభిప్రాయం వ్యక్తం చేశారు.

వెనుకంజ

రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ (ల్యాండ్ రెగ్యులేషన్ స్కీమ్) ఫీజులో 25 శాతం రాయితీతో మార్చి 31వరకు గడువు అని ప్రకటించింది. ఈ మేరకు బల్దియాతో పాటు సర్కిల్ కార్యాలయాలలో 12 హెల్ప్‌డెస్క్‌లు పని చేస్తున్నాయి. ఎల్ఆర్ఎస్ వసూళ్లలో రాష్ట్రంలోని 148 మున్సిపాలిటీలు కొంత ముందంజలో ఉన్నా వరంగల్ బల్దియా వెనుకంజలో ఉందని విమర్శలు వస్తున్నాయి. అవగాహనలేని అధికారులు హెల్ప్‌డెస్క్‌లలో విధులు నిర్వర్తించడంవల్ల ఫీజులు చెల్లించేందుకు ప్రజలను ఒప్పించలేకపోతున్నారు. భూ యజమానులకు, రియల్టర్లకు ఇంకా చాలామందికి ఎల్ఆర్ఎస్ చెల్లింపులపై క్షేత్రస్థాయి ప్రచారం, అవగాహన కల్పించకపోవడంవల్ల వేలాదిమంది అర్హులైనవారు చెల్లింపులు చేపట్టలేకపోతున్నారు.

టార్గెట్ చేరుకోని అధికారులు

వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో విలీన గ్రామాలను కలుపుకుని 66 డివిజన్‌లలో 1,01,252 దరఖాస్తులు రాగా, ఇప్పటివరకు 61,568 దరఖాస్తులు ఫీజు చెల్లంపులు జరిపేందుకు పరిశీలింపబడ్డాయి. 6,450 దరఖాస్తుల యజమానులు రాయితీతో కూడిన ఫీజులను చెల్లించారు. కాగా 4,945 ప్రొసీడింగ్స్ పొందాయని, 1,498 శుక్రవారం వరకు ప్రాసెస్ జరుగుతున్నాయని బల్దియా అధికారులు తెలిపారు. ఇంకా 40 వేలకు పైగా దరఖాస్తుదారులు ఎల్ఆర్ఎస్‌ను పట్టించుకోవడం లేదని అధికారులు తెలిపారు. ఎల్ఆర్ఎస్ తొలి విడత ఫీజు రూ.1000 చెల్లించిన వారి స్థలం వద్దకు అధికారులు వెళ్లి పూర్తి రిపోర్టు కార్యాలయంలో ఇవ్వకపోవడం వల్ల ఎల్-1 (లెవల్-1) వద్దనే రెండు మాసాలుగా దరఖాస్తులు ఆగి ఉండడంతో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ కుంటుపడినట్టు తెలుస్తోంది. అంతే కాకుండా నిత్యం సాంకేతిక కారణాలు చెప్పి అధికారులు తప్పించుకున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిన బల్దియా, ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంవల్ల చెల్లింపులు వెనకబడ్డాయి. అయితే కొన్ని భూములు ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్), ప్రభుత్వ భూములు, కోర్టు కేసులు, ప్రొహిబిటెడ్ ల్యాండ్‌లలో భూములు కలిగి ఉన్న వారు ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించేందుకు ముందుకు రావడం లేదు. ఈ క్రమంలో భూముల పర్యవేక్షణ చేయకపోయినా ఎల్ఆర్ఎస్ ఫీజులు చెల్లించవచ్చని ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడంతో ఇప్పటివరకు బల్దియాకు రూ.48కోట్లు జమ అయినట్టు అధికారులు తెలిపారు.

మరో 24 గంటలే గడువు

ఎల్ఆర్ఎస్ ఫీజులు చెల్లించేందుకు ప్రజలకు మరో 24 గంటల సమయం మాత్రమే మిగిలి ఉంది. మార్చి 31 వరకు గడువు కాగా, చివరి రెండు రోజులు సెలవులు ఉన్నాయి. 30వ తేదీ ఆదివారం (ఉగాది), 31 రంజాన్ పర్వదినం సెలవులు ఉన్న కారణంగా ఒక్క 29 అమావాస్య మాత్రమే మిగిలి ఉంది. కొందరు సెంటిమెంట్‌తో శుక్రవారమే రాగా, అధికారులు తలలు పట్టుకుంటున్నారు. దీంతో కొందరు సిబ్బంది సెలవు పెట్టి మరీ తప్పించుకున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఎల్ఆర్ఎస్ ఫీజులో 25 శాతం తగ్గింపుతో మరో మూడు మాసాలు గడువు పొడిగించాలని వరంగల్ నగర వాసులు డిమాండ్ చేస్తున్నారు. ఎల్ఆర్ఎస్‌పై అవగాహన లేకపోవడంవల్ల చాలామంది ఫీజును చెల్లించలేకపోయామని చెబుతున్నారు. బల్దియాలో అధికారులు సరైన సమాధానం, సమాచారం ఇవ్వకపోవడం వల్ల ఫీజు చెల్లింపులో జాప్యం జరిగిందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజల అవసరాలను దృష్టి ఉంచుకుని ఎల్ఆర్ఎస్ ఫీజు గడువులను పెంచి సహకరించాలని డిమాండ్ చేస్తున్నారు.

మొండి రోగాలకు ఔషధాలను అందించాలి

కేయూ ఫార్మసీ డీన్ గాదె సమ్మయ్య



అధ్యాపకులకు ధ్రువపత్రాలు ఇస్తున్న డీన్ గాదె సమ్మయ్య

కేయూ క్యాంపస్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో రోజురోజుకూ విజృంభిస్తున్న మొండి రోగాలకు సరైన ఔషధాలను కనుకుని ప్రజలను కాపాడాల్సిన బాధ్యత ఫార్మసిస్టులదేనని కేయూ ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య అన్నారు. శుక్రవారం హనుమకొండ వాగ్దేవి ఫార్మసీ కళాశాలలో రెండురోజుల జాతీయ సదస్సు ముగిసింది. 'సీసీఎస్ఈఏ ఎథికల్ రెస్పాన్స్‌బులిటీస్ ఆఫ్ స్టూడెంట్ రీసెర్చర్స్ ఇన్ హ్యాండిలింగ్ ఆఫ్ ఎక్స్‌పరిమెంటల్ ఎనిమిల్స్ ఇన్ ఫార్మకాలజికల్ అండ్ టాక్సికాలజికల్ రిసెర్చ్' అనే అంశంపై ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన ముగింపు సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ గాదె సమ్మయ్య మాట్లాడారు. ఔషధాలు మెడిసినల్ కెమిస్ట్రీ, ఫైటోకెమిస్ట్రీ, డ్రగ్ మాలిక్యూల్, ఫార్మకాలజీ ల్యాబ్‌లో స్క్రీనింగ్ కాబడి ఫార్ములేషన్ ల్యాబ్‌లో తయారు అవుతాయని వెల్లడించారు. ఔషధాల తయారీలో మూడు ప్రధాన విభాగాలు కీలకమన్నారు. యాంటీ బయాబెటిక్, క్యాన్సర్లకు సరైన ఔషధాలకు పరిశోధనలు జరుగుతున్నాయని వివరించారు. ఔషధాల తయారీలో ఫార్మసిస్టుల భాగస్వామ్యం అవుతున్నారని చెప్పారు. కేయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.ప్రసాద్, హైదరాబాద్ ఎన్ఐఎస్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.హరిశంకర్, హైదరాబాద్ పుల్లారెడ్డి ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ బి.వీరేశ్‌లు రీసర్చ్ మాడల్స్‌ను విశదీకరించారు. సీసీఎస్‌సీఏ గ్రాంట్ సాధించిన డాక్టర్ ఈ.వెంకటేశ్వర్లు, డాక్టర్ బీఎస్ శరవణభవలను అభినందించారు. అధ్యాపకులు పి.గిరిజ, శ్రవణ్‌కుమార్, కుమారస్వామి, సీహెచ్ మహేశ్, స్వర్ణలత, పావని, లక్ష్మీకల్యాణి, మాధవి, ఈ సుమలత, రజని, రాగిణి, రశ్మిత, శ్రీలేఖ, శృతి, ముకరంద్, షఫియానసీర్, లావణ్య, స్నేహప్రియ, కమల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే రానున్న ఉగాది పండుగను పురస్కరించుకుని విశ్వావసు నామ వేడుకలను నిర్వహించారు. వాగ్దేవి కళాశాలల వ్యవస్థాపకుడు డాక్టర్ చందుపట్ల దేవేందర్‌రెడ్డి, డాక్టర్ సీహెచ్ వాహినీదేవి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సభకు అనుమతివ్వండి

కాజీపేట ఏసీపీకి బీఆర్ఎస్ నేతల వినతి



కాజీపేట ఏసీపీకి వినతి పత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హనుమకొండ టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 27న ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ 25ఏళ్ల రజతోత్సవ సభ నిర్వహణకు అనుమతినివ్వాలని కాజీపేట ఏసీపీకి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శుక్రవారం దరఖాస్తు చేశారు. సభ నిర్వహణకు సంబంధించి భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, ఇతర అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏసీపీని కలిసిన వారిలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, సతీష్‌కుమార్, పార్టీ ప్రధాన కార్యదర్శి గ్యాదరి బాలమల్లు, మాజీ రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్ వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ పెన్షన్‌లో మాయాజాలం ?

- చనిపోయిన రిటైర్డ్ ఉద్యోగి పేరుతో 13 ఏళ్లుగా డ్రా
- రూ.40 లక్షలకు పైగా స్వాహా చేసిన వైనం
- అదే పేరుతో ఉన్న వ్యక్తిని చూపి లైఫ్ సర్టిఫికెట్
- హనుమకొండ జిల్లా హసన్‌పర్తిలో వెలుగులోకి..

హసన్‌పర్తి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): చనిపోయిన రిటైర్డ్ ఉద్యోగి పేరిట 13ఏళ్లుగా పెన్షన్ డ్రా చేస్తున్నారని, 2012లో మృతిచెందిన అతడి స్థానంలో అదే గ్రామంలోని, అదేపేరు, తండ్రి పేరుతో ఉన్న వ్యక్తిని చూపుతూ లైఫ్ సర్టిఫికెట్ సమర్పించి పెన్షన్ మాయాజాలానికి పాల్పడినట్టు సమాచారం. హనుమకొండ జిల్లా హసన్‌పర్తిలో జరిగినట్టుగా ప్రచారం జరుగుతున్న ఈ పెన్షన్ డ్రా బాగోతం గురించిన ప్రాథమిక వివరాలివీ. హసన్‌పర్తికి చెందిన వేల్పుల రాములు పంచాయతీరాజ్‌శాఖలో ఉద్యోగం చేసి ఉద్యోగ విరమణ పొందాడు. ఆ తర్వాత ప్రతీ నెల పెన్షన్ తీసుకుంటూ అతడు 2012లో మృతి చెందాడు. రాములుకు వేల్పుల కొమరయ్య, మనోహర్ ఇద్దరు కుమారులుండగా, 2024లో మనోహర్ మృతి చెందాడు. అయితే ఇదే గ్రామానికి చెందిన వేల్పుల రాములు పేరు కలిగిన మరో వ్యక్తి వృద్ధాప్య పింఛనుగా ప్రతీనెల రూ.2వేలు హసన్‌పర్తి బ్యాంకు ఖాతాలో జమయ్యేది. ఈ క్రమంలోనే గతేడాది మే నుంచి రాములుకు రావల్సిన వృద్ధాప్య పింఛను ఆగిపోయింది. దీంతో అతడి కుటుంబసభ్యులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగ్గా.. రాములు పేరుతో సర్వీస్ పెన్షన్ వస్తోందని చెప్పారు. దీంతో అవాక్కైన ఆ కుటుంబ సభ్యులు పూర్తి వివరాలను సేకరించే ప్రయత్నం చేయగా హసన్‌పర్తికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి వేల్పుల రాములు విషయం వెలుగులోకి వచ్చింది. ఇద్దరి పేర్లు, తండ్రి పేర్లు ఒకటే కావడం, గ్రామం కూడా ఒకటే ఉండటాన్ని అదనుగా తీసుకున్న కొందరు వ్యక్తులు వృద్ధాప్య పింఛను పొందే రాములును నమ్మించి రిటైర్డ్ ఉద్యోగి రాములు స్థానంలో చూపుతూ ప్రతీ ఏటా లైఫ్ సర్టిఫికెట్ తీసి ప్రభుత్వానికి సమర్పిస్తున్నారని తెలిసింది. ఇలా 2012 నుంచి 2024 మే వరకు సుమారు రూ.40లక్షలకుపైగా సర్వీస్ పెన్షన్‌ను వారు అక్రమంగా పొందుతున్నారని వెల్లడైనట్టు సమాచారం. ఈ నేపథ్యంలో వృద్ధాప్య పింఛను అందుకుంటున్న రాములు మనవడు వేల్పుల కార్తీక్ స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు సమాచారం. అమాయకుడు, వృద్ధుడైన తమ తాతకు మాయమాటలు చెప్పి మోసం చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరినట్టు తెలిసింది. అయితే రిటైర్డ్ ఉద్యోగి వేల్పుల రాములు పేరుపై మరో వ్యక్తికి రెవెన్యూ అధికారులు లైఫ్ సర్టిఫికెట్ జారీ చేయడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాములు బతికి ఉన్నట్లు లైఫ్ సర్టిఫికెట్ దరఖాస్తు చేసిన వారి వివరాలను సేకరించడం, రిటైర్డ్ ఉద్యోగి బ్యాంకు ఖాతా లావాదేవీలను పరిశీలిస్తే పెన్షన్ బాగోతం వెలుగులోకి వస్తుంది. ఈ సర్వీస్ పెన్షన్ మాయాజాలంలో అంశం ఇటు రెవెన్యూ అధికారులతో పాటు సర్టిఫికెట్ దరఖాస్తు కోసం సాక్షులుగా వ్యవహరించిన ఇతర ఉద్యోగుల పాత్ర ఏంటనేది చర్చనీయాంశమైంది. దీని వెనుక ఎవరున్నారనే అంశాలు పోలీసుల విచారణతో వెలుగులోకి వస్తాయన్న చర్చ జరుగుతోంది.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7050	5300
మక్కలు	2181	1521
కందులు	6551	3022
పెసళ్లు	7308	3022
పల్లికాయ (సూక)	7300	5200
పల్లికాయ (పచ్చిది)	5650	4575
పసుపు (కాడి)	9329	8534
పసుపు (గోల)	7407	6700
తేజ మిర్చి	12650	9500
వండర్ హాట్	14200	12000
యూఎస్ 341	11600	9000
దీపిక	13000	10000
దేశీ	29000	18000
సింగిల్‌పట్టి	28000	20000
తాలు మిర్చి	5000	2500

- వరంగల్ వ్యవసాయం

అగ్నివీర్‌కు 8 మంది ఎంపిక

అశోక్‌నగర్ సైనిక్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ


ఈశ్వర్


ఆకాశ్



అంజి


అభిలాష్


రాజేందర్



శ్రవణ్


ఆనంద్


సాయికుమార్

ఖానాపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని అశోక్‌నగర్‌లోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఆర్మ్‌డ్ ఫోర్స్ ప్రిపరేటరీ అకాడమీ (సైనిక్ స్కూల్)కు చెందిన 8మంది డిగ్రీ విద్యార్థులు అగ్నివీర్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ గట్ల సురేందర్ శుక్రవారం తెలిపారు. బీఏ తృతీయ సంవత్సరానికి చెందిన జె.అభిలాష్, డి.రాజేందర్, కె.సాయికుమార్, బీఏ ద్వితీయ సంవత్సరానికి చెందిన కె.ఆనంద్, కె.అంజి, ఆర్.ఆకాష్, బీఎస్సీ ద్వితీయ సంవత్సరానికి చెందిన బి.శ్రావణ్, బీఏ స్సీ మొదటి సంవత్సరం నుంచి వై.ఈశ్వర్ ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సురేందర్ మాట్లాడుతూ.. పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు, ఆర్మీ శిక్షకుల అంకితభావం, విద్యార్థుల కఠోర కృషి, పట్టుదల ఫలితంగా సైనిక్ స్కూల్ విద్యార్థులు భారతదేశ రక్షణ దళంలోకి ప్రవేశం పొందే అర్హత సాధించినందుకు ఆనందంగా ఉందన్నారు. వారిని గురుకులాల రీజినల్ కో-ఆర్డినేటర్ డీఎస్.వెంకన్న, ప్రిన్సిపాల్ సురేందర్, డైరెక్టర్ శ్రీనివాస్ స్వామి, వీపీ కుమార్, ఉప్పలయ్య అభినందించారు.


ఏసీపీకి ఫిర్యాదు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎస్సై, హోంగార్డుపై ఏసీపీకి ఫిర్యాదు

వరంగల్ క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో బాధితుడిని భయభ్రాంతులకు గురిచేస్తూ నిందితుల పక్షాన నిలబడుతున్న సంగెం ఎస్సై నరేశ్‌తోపాటు హోంగార్డు కిషన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ మామునూర్ ఏసీపీ తిరుపతిని శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కలిసి ఫిర్యాదు చేశారు. బాధితుడు దామెర కిషోర్‌పై జరిగిన దాడి దృశ్యాలను ఈ సందర్భంగా ఏసీపీకి అందజేశారు. ఏసీపీకి ఫిర్యాదు చేసిన వారిలో ఎమ్మార్పీఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్, ఎంఎస్పీ నేతలు మంద కుమార్, వేల్పుల సూరన్న, బొడ్డు దయాకర్, బుర్రి సతీష్, బిర్రు మహేందర్, మంద రాజు, తడుగుల విజయ్ ఉన్నారు.

ఉద్యోగ శిక్షణకు వెళ్లి వస్తూ..

- రోడ్డు ప్రమాదంలో యువతి మృతి
- మరో యువతికి తీవ్రగాయాలు


దాడి కీర్తి (ఫైల్)

ఎల్కతుర్తి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగంలో భాగంగా శిక్షణకు వెళ్లి తిరిగి బైక్‌పై వస్తున్న యువతులను లారీ ఢీ కొనడంతో తీవ్రగాయాలై ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం ఎల్కతుర్తి మండలం శాంతినగర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఎస్సై అక్కినపెల్లి ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హసన్‌పర్తి మండల కేంద్రానికి చెందిన దాడి రాజు - దేవేంద్ర దంపతులకు ఒక కుమారుడు, ఒక కూతురు దాడి కీర్తి (24) ఉన్నారు. రాజు ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కీర్తి ఎస్సార్ యూనివర్సిటీలో బీఎస్సీ అగ్రికల్చర్ పూర్తి చేసింది. ఈ క్రమంలో ఆగ్రోస్ కంపెనీలో డ్రోన్ ఆపరేటర్‌గా ఉద్యోగం వచ్చింది. విధుల్లో భాగంగా కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం తాడికల్‌లో ఫీల్డ్‌వర్క్ కోసం వెళ్లింది. విధులు ముగించుకొని తిరిగి భీమారం గ్రామానికి చెందిన తన స్నేహితురాలు చందన బైక్‌పై ఇద్దరు కలిసి హసన్‌పర్తికి బయలుదేరారు. ఈ క్రమంలో మార్గమధ్యంలో శాంతినగర్ గ్రామ శివారు వద్ద లారీ వేగంగా బైక్‌ను వెనక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనం వెనకాల కూర్చున్న కీర్తి పైనుంచి లారీ వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆమెను 108 ద్వారా వరంగల్ లోని ఓ ఆస్పత్రికి తరలించగా మృతిచెందింది. ద్విచక్ర వాహనం నడుపుతున్న చందనకు సైతం గాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలి తండ్రి దాడి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

చెడ్డీ గ్యాంగ్ కోసం పోలీసుల జల్లెడ

- మద్యం బాటిల్ బార్ కోడ్ ఆధారంగా ఆరా
- నగరం విడిచి వెళ్లిపోయినట్టుగా అనుమానాలు

వరంగల్ క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో చొరబడ్డ చెడ్డీ గ్యాంగ్ కోసం కమిషనరేట్ పోలీసులు నగరం అంతా జల్లెడ పడుతున్నారు. మంగళవారం అర్ధరాత్రి హనుమకొండ పోలీసు స్టేషన్ పరిధిలో చెడ్డీ గ్యాంగ్ చోరీ చేసిన ఇంటితో పాటు పక్కింట్లో మద్యం బార్‌కోడ్ ఆధారంగా చెడ్డీ గ్యాంగ్ కోసం పోలీసులు గాలించడం మొదలుపెట్టారు. బార్‌కోడ్ స్కాన్ చేయగా వరంగల్‌లోని ఓ వైన్‌షాప్‌లో కొన్నట్టు తెలియడం తో పోలీసులు అక్కడికి వెళ్లి వైన్స్ పరిసరాల ప్రాంతాల్లో విస్తృతంగా గాలింపు చర్యలు చేసినట్టుగా సమాచారం. చోరీ జరిగిన ఇంటి నుంచి వరంగల్ వరకు చెడ్డీ గ్యాంగ్ ఎలాంటి ఆనవాళ్లు దొరకకుండా జాగ్రత్త పడడంతో పోలీసులకు సవాల్‌గా మారింది. రైల్వేస్టేషన్లో, బస్టాండ్లలో కూడా చెడ్డీగ్యాంగ్ కోసం గాలించినా ఆచూకీ లభ్యం కానట్టు తెలుస్తోంది. దీంతో చెడ్డీ గ్యాంగ్ నగరం దాటి వెళ్లనట్టుగా పోలీసులు అనుమానిస్తున్నారు.

మామునూరు పీఎస్ పరిధిలో..

మామునూరు పీఎస్ పరిధిలో జనవరిలో ఓ వైన్‌షాప్‌తో పాటు విశ్రాంత ఉద్యోగి ఇంట్లో చోరీకి పాల్పడి పెద్ద మొత్తంలో ఆస్తులను కాజేసినట్లు సమాచారం. చెడ్డీ గ్యాంగ్ తరహాలోనే యూపీ గ్యాంగ్ ఈ చోరీలో పాలుపంచుకున్నట్లు కేసు నమోదైంది. అయినా ఆ ముఠాను పట్టుకోవడంలో పోలీసులు విఫలమైనట్లుగా తెలుస్తోంది.

నేడు కాకతీయ వర్సిటీ అకాడమిక్ సెనెట్ సమావేశం

కేయూ క్యాంపస్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కేయూ 40వ అకాడమిక్ సెనెట్ సమావేశం మార్చి 29న శనివారం ఉదయం 11 గంటలకు సెనెట్ హాల్‌లో నిర్వహిస్తామని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం తెలిపారు. 2023-24 వార్షిక ఖాతాలు, రివైజ్డ్ బడ్జెట్ అంచనాలు, 2024-25, 2025-26 వార్షిక బడ్జెట్ అంచనా, 2023-24 స్టాండింగ్ కమిటీ మినిట్స్ అప్రూవల్స్, 2023-24 ఏడాది వార్షిక నివేదికతో పాటు ఇతర అంశాలపై అకడమిక్ సెనెట్ కమిటీ చర్చిస్తోందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కేయూ అకాడమిక్ సెనెట్ సభ్యులు, పాలక మండలి సభ్యులు, డీన్లతో పాటు ఇతర విభాగాల అధికారులు పాల్గొంటారని వివరించారు.

విలీనం మంచికే..

వేర్వేరుగా నిర్వహణ

స్వయం సహాయక సంఘాల సంస్థాగత నిర్మాణం, బ్యాంక్ లింకేజీ స్త్రీనిధి, రుణాల మంజూరు, ఆర్థికంగా వ్యాపార రంగాల్లో అభివృద్ధి సాధించేలా అందించే ప్రోత్సాహం తదితర అంశాలు ఒకేలా ఉన్నా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వేర్వేరు విభాగాలుగా నిర్వహణ కొనసాగుతోంది. పట్టణ ప్రాంతాల్లోని సంఘాల నిర్వహణను మున్సిపల్ కార్యాలయం పరిధిలోని మెప్మా పరిశీలిస్తుండగా, గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల బాధ్యతను సెర్ప్ చూస్తోంది. రెండు విభాగాల లక్ష్యం మహిళ సాధికారత, వారి ఆర్థికాభివృద్ధే. ఇలా వేర్వేరుగా కొనసాగితే మహిళా శక్తి కార్యక్రమం పట్టణాల్లో అంత పటిష్టంగా అమలు కావడం లేదని భావించిన ప్రభుత్వం పట్టణాల్లోని స్వయం సహాయక సంఘాలన్నింటినీ సెర్ప్ పరిధిలోకి తీసుకురావాలని నిర్ణయించింది.

విలీనం వల్ల ప్రయోజనాలు

వరంగల్ మహానగర పాలక సంస్థతో పాటు ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది మున్సిపాలిటీల్లోకి చుట్టుపక్కల గ్రామాలను విలీనం చేయడంవల్ల ఆ గ్రామాల ప్రజలు కొన్నేళ్లుగా ఉపాధి హామీ పథకానికి దూరమవుతున్నారు. సెర్ప్‌లో మెప్మా విలీనమవటం వల్ల గ్రామీణ, పట్టణ ప్రాంతమనే తేడా లేకుండా పని కోరుకునేవారందరికీ ఉపాధి లభిస్తుంది. రెండు సంస్థలు విడిగా పని చేస్తే సాంకేతిక వినియోగంలో అడ్డంకులు ఎదురవుతాయి. విలీనం ద్వారా ఒకే డిజిటల్ వేదికను సృష్టించి లబ్ధిదారుల గుర్తింపు, పథకాల అమలు పర్యవేక్షణ సులువు తుంది. ప్రధానంగా సిబ్బంది కార్యాలయాల కొరత తీరుతుంది. ఉదాహరణకు ఆరు జిల్లాలు వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లిలలో సెర్ప్‌లో సుమారు 1200 మంది సిబ్బంది విధుల్లో ఉంటే మెప్మాపరిధిలో 180 మంది మాత్రమే పనిచేస్తున్నారు. సెర్ప్, మెప్మా ఏకీకృతం వల్ల సిబ్బంది కొరత తీరటమే కాకుండా పనితీరు మెరుగు పడుతుంది.

హనుమకొండ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)ను విలీనం చేయడంవల్ల నిర్వహణ పరంగా, ప్రభుత్వ పథకాల అందుబాటు విషయంలో మహిళాసంఘాల్లోని సభ్యులకు మరింత మేలు జరుగుతుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతున్నది. ఇన్నాళ్లూ ఈ రెండు సంస్థలు వేరువేరుగా పని చేయడం వల్ల ఎదురైన ఇబ్బందులు తొలగిపోతాయని అధికారులు చెబుతున్నారు. విలీనం వల్ల ప్రభుత్వం అందించే ప్రయోజనాలు అందరికీ సమానంగా అందుతాయంటున్నారు. విలీనంతో వరంగల్ మహానగర పాలక సంస్థతో సహా తొమ్మిది మున్సిపాలిటీల పరిధిలోని 8,623 సంఘాల్లోని 98వేల మంది మెప్మా సభ్యులు సెర్ప్ పరిధిలోకి వస్తారు. ఉద్యోగుల హోదాలు మారుతాయి. వేతనాలూ పెరుగుతాయి.

మున్సిపాలిటీల్లోకి గ్రామాల విలీనంతో..

పట్టణీకరణ శరవేగంగా జరుగుతోంది. కొత్తగా పలు మున్సిపాలిటీలు ఏర్పడుతున్నాయి. అనేక గ్రామాలు వీటిలో విలీనమై పట్టణ స్వభావాన్ని సంతరించుకుంటున్నాయి. కొన్ని మేజర్ పంచాయతీలు పురపాలక సంఘాలుగా మారుతున్నాయి. అప్పటివరకు సెర్ప్‌లో ఉన్న ఈ గ్రామాలు మెప్మా పరిధిలోకి వచ్చేసరికి అవి పొందే ప్రయోజనాల్లో వ్యత్యాసాలు కలుగుతున్నాయి. సెర్ప్ ద్వారా అందుతున్న ప్రభుత్వ పథకాలు మెప్మాలో పొందే పరిస్థితి ఉండడం లేదు. ఉపాధి హామీ పనుల వర్తింపే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. దీంతో సహజంగానే మెప్మా పరిధిలోకి వచ్చిన సెర్ప్ సభ్యుల్లో అసంతృప్తి వ్యక్తం అవుతోంది. పైగా సెర్ప్ ద్వారా చాలా పథకాలు అమలవుతున్నాయి. ఈ నేపథ్యంలో సెర్ప్‌లో మెప్మాను విలీనం చేయాలనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చింది. ఇందిరా మహిళా శక్తి మిషన్ కింద పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా స్వయం సహాయక సంఘాలను ఒకే గొడుగు కిందికి తీసుకువచ్చేలా ఉత్తర్వులు జారీ చేసింది. ఇన్నాళ్లు వేర్వేరుగా ఉన్న గ్రామీణ, పట్టణ స్వయం సహాయక సంఘాలన్నీ సెర్ప్ పరిధిలోకి రానున్నాయి. స్వయం సహాయక సంఘాల నిర్వహణ, మహిళా శక్తి పథకం అమలు, ఉద్యోగులు, సిబ్బందికి విధులు, బాధ్యతల కేటాయింపు తదితర అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు ప్రభుత్వం ప్రకటించాల్సి ఉన్నది. దీనిపై కసరత్తు జరుగుతోంది. ఏప్రిల్ మొదటి వారంలో ఉత్తర్వులు రానున్నట్టు సమాచారం. ప్రభుత్వ విలీన నిర్ణయంపై మెప్మా ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పెరగనున్న సమన్వయం

సెర్ప్, మెప్మా ఈ రెండు సంస్థల లక్ష్యం పేదరిక నిర్మూలనే అయినప్పటికీ గ్రామీణ ప్రాంతాలపై సెర్ప్ దృష్టి సారిస్తుంది. పట్టణ ప్రాంతాల్లో పేదరికాన్ని తగ్గించేందుకు మెప్మా పని చేస్తుంది. వీటిని ఒకే సంస్థగా మార్చటం వల్ల వనరుల సమన్వయం పెరుగుతుంది. తద్వారా ప్రభుత్వ విధానాల అమలులో ఏకరూపత వస్తుంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాలు సమతుల్య అభివృద్ధిని సాధించేందుకు అవకాశాలు ఏర్పడుతాయి. ఉదాహరణకు ఇటీవల రాష్ట్రప్రభుత్వం మహిళా స్వయం సహాయక సంఘాలకు సెర్ప్ ద్వారా బస్సులు కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకు ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టింది. అయితే ఇది మెప్మాకు వర్తించకపోవటంతో పట్టణ మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు నిరాశకు గురయ్యారు. ప్రభుత్వ తాజా నిర్ణయం ఇలాంటి సమస్యలకు చెక్ పెట్టనున్నది.



విలీనంతో మరిన్ని ప్రయోజనాలు



మేన శ్రీను, హనుమకొండ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ

రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి మిషన్-2025ను ప్రారంభించింది. మహిళా అభివృద్ధే లక్ష్యంగా చేపట్టిన ఈ పథకంలో భాగంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా స్వయం సహాయక సంఘాలను ఒకే గొడుకు కిందకు తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. సెర్ప్ ఆధ్వర్యంలో ఉపాధి కల్పన కార్యక్రమాలు, మెప్మాద్వారా పట్టణ ప్రాంతాల్లో నైపుణ్య శిక్ష, వీధివ్యాపారులకు మద్దతు వంటి పథకాలు అమలవుతున్నాయి. వీటిని ఒకే గొడుగు కిందికి తీసుకురావడం వల్ల పట్టణ, గ్రామీణ పేదలకు సమగ్రమైన ప్రయోజనాలు అందించేందుకు వీలు కలుగుతుంది. పైగా ఇటీవల కాలంలో చాలా గ్రామాలు మున్సిపాలిటీల్లో విలీనం అవుతున్నాయి. దీనితో అప్పటి వరకు సెర్ప్ కింద ఉన్న ఇవి మెప్మాపరిధిలోకి వస్తున్నాయి. దీనితో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సెర్ప్, మెప్మా విలీనం అయితే ఈ సమస్య ఉండదు.

సెర్ప్‌లోకి మెప్మా ఉద్యోగులు

ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో పని చేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది, రిసోర్సు పర్సన్లు సెర్ప్ పరిధిలోకి రానున్నారు. డీఆర్‌డీవో ఆధ్వర్యంలో వీరు విధులు నిర్వహించనుండగా హోదాలు మారనున్నాయి. మెప్మా పరిధిలో 180 మంది రిసోర్సుపర్సన్లు పని చేస్తుండగా వీరు సెర్ప్ పరిధిలో వీవోలుగా మరనున్నారు. 18 మంది సీవోలు సీసీలుగా, ఇద్దరు టీఎంసీలు ఎంపీఎంలుగా, ఏడీఎంసీ ఒకరు ఏపీఎంగా, డీఎంసీగా వ్యవహరించే అధికారికి డీపీఎం హోదా దక్కనున్నది. వీరితో పాటు యూఎల్ఈ, కంప్యూటర్ ఆపరేటర్లు, అటెండర్లు సెర్ప్ పరిధిలోనూ అదే పోస్టుల్లో విధులు నిర్వహించే అవకాశం ఉంది. సెర్ప్ పరిధిలో విలీనం అయితే మెప్మా ఉద్యోగుల వేతనాలు పెరగడంతో పాటు బదిలీలు కూడా జరిగే అవకాశం ఉంది. పట్టణాల్లోని మెప్మా రిసోర్సు పర్సన్లకు రూ.6వేలు వేతనం చెల్లిస్తుంటే, సెర్ప్ ఆర్పీలకు నెలకు రూ.5వేల చొప్పు చెల్లిస్తున్నారు. ఈ రెండు సంస్థలను కలిపితే జీతాలు పెరుగుతాయా? తగ్గుతాయా? అన్నది స్పష్టం కావలసి ఉన్నది.

- సెర్ప్ - మెప్మా కలయికతో సత్వర సేవలకు అవకాశం
- గ్రామీణ, పట్టణ సభ్యులకు సమ ప్రయోజనం
- పాలనాపరంగా తొలగనున్న ఇబ్బందులు
- తీరనున్న సిబ్బంది కొరత.. స్వాగతిస్తున్న మెప్మా ఉద్యోగులు

సంఘాలు - సభ్యులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో సెర్ప్ పరిధిలో మొత్తం 3,073 గ్రామైక్య సంఘాలు, 58,239 స్వయం సహాయ సంఘాలు, 71 మండల సమాఖ్యలు, 6 జిల్లా సమాఖ్యలు, 6,82,564 మంది సభ్యులు ఉన్నారు. కాగా మెప్మా కింద వరంగల్ నగర పాలక సంస్థతో పాటు తొమ్మిది పురపాలక సంఘాల పరిధిలో 8,623 స్వయం సహాయక సంఘాలు, 98,256 మంది సభ్యులు ఉన్నారు. వీరంతా ఒకే గొడుకు కిందకు వస్తారు. పరిపాలన సులువవుతుంది. ప్రయోజనాలు అందరికీ సమానంగా అందుతాయి.

కిశోర బాలికల సంఘాలు

దేశంలోని ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో 15-18 ఏళ్ల మధ్య వయసున్న బాలికలకు అర్హత కల్పిస్తూ ప్రత్యేకంగా కిశోర బాలికల సంఘాలను ఏర్పాటు చేయాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది. కిశోర బాలికల గ్రూపులోని సభ్యులకు 18 ఏళ్లు నిండిన తర్వాత వారికి స్వయం సహాయక సంఘాల్లో చేరేందుకు వీలు కల్పిస్తారు. సెర్ప్, మెప్మాను ఏకీకృతం చేయడం వల్ల ఈ సంఘాల విలీనం సులభం అవుతుంది. స్వయం సహాయక సంఘాల్లో కొత్త సభ్యులను చేర్పించే ప్రక్రియ కొనసాగుతోంది. దీనితో ఎస్‌హెచ్‌జీల సంఖ్య గణనీయంగా పెరగనున్నది. ఈ సంఘాలన్నిటిని సమన్వయం చేయడానికి విలీనం దోహద పడుతుంది.

ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలి

- బేస్‌మెంట్ పూర్తయిన ఇళ్లకు తక్షణమే చెల్లింపులు
- జూన్‌లో వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పూర్తి
- ఉమ్మడి వరంగల్ జిల్లా సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి


సమీక్షలో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు

వరంగల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, బేస్‌మెంట్ వరకు పూర్తయిన ఇళ్లకు తక్షణమే బిల్లులు చెల్లింపులు చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్‌శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా మంత్రులు కొండా సురేఖ, సీతక్కలతో పాటు ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. పైలెట్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ వేగవంతం చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని, దీనిని దృష్టిలో పెట్టుకుని కలెక్టర్లు పని చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం నాలుగు విడతల్లో చెల్లింపులు చేస్తుందని, మొదటి విడతలో బేస్‌మెంట్ లెవల్ పూర్తయిన ఇళ్లకు రూ.లక్ష చెల్లిస్తుందన్నారు. వివరాలను అధికారులు హౌసింగ్ విభాగానికి పంపిస్తే తక్షణమే బిల్లులు చెల్లిస్తారని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో ఇళ్ల స్థలాలు లేని అర్హత కలిగిన లబ్ధిదారులకు ఇప్పటి వరకు కేటాయించని 2బీహెచ్‌కే ఇళ్లను కేటాయించాలని సూచించారు. అలాగే అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణానికి కాంట్రాక్టర్లు ముందుకు రాకుంటే లబ్ధిదారులే ఆ ఇళ్లను పూర్తి చేసుకునేందుకు ముందుకు వస్తే బిల్లులను ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని లబ్ధిదారులను ఎంపిక చేసి, ఇళ్లను కేటాయించాలని మంత్రి కోరారు.

తాగునీటి సమస్య తలెత్తవద్దు

వేసవికాలంలో ఏ ఒక్క గ్రామంలో, పట్టణంలో కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి సూచించారు. కలెక్టర్లు తాగునీటి సమస్యకు అధిక ప్రాధాన్యమివ్వాలన్నారు. జిల్లా అధికారులతో సమన్వయం చేసుకుని, వారంలో మూడు రోజులు అధికారులు గ్రామాల్లో, వార్డుల్లో పర్యటించాలని కోరారు. వచ్చే మూడు నెలలు చాల కీలకమని, ప్రజలకు ఎక్కడ తాగునీటి గురించి ఇబ్బంది పడకుండా.. నీళ్లు రావటం లేదనే విమర్శలు రాకుండా పని చేయాలని అధికారులను ఆదేశించారు. నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయటం, చెడిపోయిన బోర్లు, హ్యాండ్‌పంప్‌లకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరారు.

జూన్‌లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి..

వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రెండు నెలల్లో భవన నిర్మాణ పనులు పూర్తి చేసి, మరో నెల రోజుల్లో వైద్య సేవలకు అవసరమైన పరికరాలను అమర్చి జూన్ చివరి నాటికి సూపర్ స్పెషాలిటీ సేవలను అందుబాటులోకి తీసుకరావాలని మంత్రి సూచించారు. ఈ అస్పత్రి అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణ ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందుతాయని మంత్రి అన్నారు.

మడికొండ డంపింగ్ యార్డు.. భద్రకాళీ చెరువు పూడికతీతపై..

చెత్త సమస్యతో ఇబ్బందులు పడుతున్న మడికొండవాసులకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వారం రోజుల్లో తాత్కాలిక పరిష్కారం చూపించి, ఆ తరువాత శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. దీనికి సంబంధించి సీడీఎంఏ డైరెక్టర్ శ్రీదేవి స్వయంగా డంపింగ్ యార్డు వద్దకు వెళ్లి, పరిష్కార మార్గాలను సూచించాలని మంత్రి ఆదేశించారు. వరంగల్, కరీంనగర్ రహదారి ప్రాంతంలో శాశ్వత డంపింగ్ యార్డు కోసం 150 నుంచి 200 ఎకరాల భూమిని సేకరించాలని ఆయా జిల్లాల కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. అలాగే వరంగల్ నగరంలోని భద్రకాళి చెరువు పూడికతీత పనులను ఎట్టి పరిస్థితుల్లో వర్షాకాలం ప్రారంభమయ్యేలోపు పూర్తి చేయాలన్నారు. అలాగే వరంగల్ స్మార్ట్ సిటీ పనుల విషయంలో అధికారులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని మంత్రి పొంగులేటి సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాష్‌రెడ్డి, యశస్వినిరెడ్డి, దొంతి మాధవరెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, కేఆర్.నాగరాజు, రామచంద్రనా యక్, మురళీనాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మేయర్ గుండు సుధారాణి, మునిసిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, ఆర్అండ్‌బీ కార్యదర్శి హరిచందన, వరంగల్, హనుమకొండ, జనగామ, ములుగు, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్లు సత్యశారద, ప్రావీణ్య, రిజ్వాన్‌పాషా, దివాకర, అద్వైత్‌కుమార్, రాహుల్‌శర్మ, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్వినితానాజీ వాఖేడ్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వావసుకు శుభస్వాగతం

- నగరంలో జోరుగా ఉగాది కవి సమ్మేళనాలు
- ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందజేత

హనుమకొండ కల్చరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ ఉగాది పర్వాన్ని పురస్కరించుకొని నగరంలో గురు, శుక్రవారాల్లో జరిగిన కవి సమ్మేళనాలు సాహితీ లోకాన్ని ఆనంద డోలికల్లో ఓలలాడించాయి. వరంగల్ దర్శన్ ఆధ్వర్యంలో నక్కలగుట్టలో పెండెం రమేశ్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన వేడుకలు నేత్రపర్వంగా జరిగాయి. బ్రహ్మశ్రీ జగన్ మోహన్‌శర్మ పంచాంగ పఠనం నిర్వహించారు. విశ్వావస నామ ఏడాదిలో ప్రజలకు రాశుల వారిగా శుభ, అశుభ ఫలితాలు, ఆదాయ వ్యయాలను చెప్పారు. అనంతరం తిరునగరి నరేందర్ సంయోజకత్వంలో నిర్వహించిన ఉగాది కవి సమ్మేళనాన్ని పొట్లపల్లి శ్రీనివాస రావు ప్రారంభించారు. ఆడెపు చంద్రమౌళి, డాక్టర్ అడ్లూరి వెంకటేశ్వర్లు, చేపూరి శ్రీరామ్, మెరుగు అనురాధ, మన్ననూరి రాజేశ్వర్‌రావులు పద్య కవితలతో వసంతుని స్వాగతించగా వల్స పైడి, గట్టు రాధిక, వాసిరెడ్డి కృష్ణారావు, తిరునగరి పద్మ, పొగాకు సునీతారాణి తదితరులు అద్భుత వచనంతో కవితాగానం చేశా రు. ఈ సందర్భంగా కవులను బంక సరళ దుశ్శాలువాలతో ఆత్మీయంగా సత్కరించారు.

భాషా నిలయంలో..

అంతకుముందు హనుమకొండలోని రాజరాజ నరేంద్రాంధ్ర భాషా నిలయంలో జాతీయ సాహిత్య పరిషత్ నగరశాఖ, భాషా నిలయం సంయుక్త ఆధ్వర్యంలో ఉగాది పర్వాన్ని పురస్క రించుకొని పెద్దఎత్తున నిర్వహించిన కవి సమ్మేళనంలో ద్విభా షలకు చెందిన 62 మంది కవులు పాల్గొని కవితాగానం చేయడం విశేషం. భాషా నిలయం ఉపాధ్యక్షుడు న్యాలకొండ భాస్కర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో భాషా నిలయం ప్రధాన కార్య దర్శి కుందావజ్జుల కృష్ణమూర్తి, జాతీయ సాహిత్య పరిషత్ కార్య దర్శి తాడిచర్ల రవి మాట్లాడుతూ.. ఉగాది పండగకు తెలుగు సాహిత్యానికి అవినాభావ సంబంధం ఉందన్నారు. నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ తాము ఈ కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శనిగరపు రాజమోహన్, గజవెల్లి నర్సింహస్వామి, ఉదయశ్రీ ప్రభాకర్, దేశిని శ్రీధర్, అరుణ కీర్తిపతాక, తాడూరి అరుణ, గన్నోజు ప్రసాద్, సముద్రాల కుమారస్వామి, తదితర కవులు అద్భుత కవితాగానాలు చేసి శ్రోతలను అలరింపజేశారు. ఈ సందర్భంగా కవులందరినీ నిర్వాహకులు సముచితంగా సత్కరించారు.

భాషోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో..

హనుమకొండ సాయిబాబా ఆలయ కల్యాణ మండపంలో శుక్రవారం రాత్రి రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో విశ్వావసు నామ ఉగాది వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించారు. భాషోపాధ్యాయ సంస్థ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అడ్లూరి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు చక్రవర్తుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. భాషోపాధ్యాయులు చేస్తున్న సేవలను గుర్తిస్తూ ఈసారి తెలుగు, హిందీ ఉపాధ్యాయులనే కాక ఆంగ్ల భాషోపాధ్యాయులను కూడా తమ సంస్థ ద్వారా సత్కరింపజేస్తున్నట్లు చెప్పారు. వీరితోపాటు పలువురు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులను కూడా వారి సేవలను గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందజేస్తున్నామన్నారు. సత్కారం అందుకున్న ప్రధానోపాధ్యాయులు కె.రాజన్న ములుగు, బి.అన్నపూర్ణ భూపాలపల్లి, ఎం.సునీతరాణి హనుమకొండ, ఎడబాటి సంపత్‌రావు వరంగల్, గుమ్మడి లక్ష్మీనారాయణ మహబూబాబాద్, కె.నర్సింహారెడ్డి జనగామలను ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందజేశామన్నారు. ఆంగ్ల విభాగం నుంచి ఈసారి కె.శ్రీనివాస్‌రెడ్డి, సంపత్, రవిశంకర్, టి.నరేందర్, ఆర్.శ్రీధర్, ఎస్.మమత, టి.వెంకటేశ్వర్‌రావు, బి.అనిత, సత్యనారాయణ, తెలుగు విభాగం నుంచి విష్ణుమూర్తి, లత, వంశీకృష్ణ, ఎస్.మురళీ, అరుణ, పద్మ, రవీందర్, ఉదయశ్రీలకు, హిందీ విభాగం నుంచి మరో 8 మందిని ఎంపిక చేసి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను ప్రదానం చేశారు. అంతేగాక ఉగాది కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులను కూడా సత్కరించారు. వరంగల్ డీఈవో ఎం.జ్ఞానేశ్వర్, ఏఎంఓలు సృజన్ తేజ, అంబటి శ్రీనివాస్‌రెడ్డి, భాషోపాధ్యాయ సంస్థ నాయకులు సిహెచ్. చంద్రమోహన్, పెండ్యాల బ్రహ్మయ్య, షేక్ హాజీ నూరారీ, మర్రిపెల్లి రమేశ్, పాలోజు శ్రీహరి, ముడుంబై ప్రవీణ్, గుండు రవి, కానుగుల భద్రయ్య, పి.శ్రీనివాసచారి, టి.పద్మ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మడత భాస్కర్ రాసిన నానీల శిల్పాలు గ్రంథాన్ని చక్రవర్తుల శ్రీనివాస్ అంకితంగా అందుకున్నారు. నాలుగు గంటల పాటు ఏకధాటిగా ఈ కార్యక్రమం ఉల్లాసంగా జరిగింది.


కవి సమ్మేళనంలో పాల్గొన్న కవయిత్రులు

కేయూ పార్ట్ టైమ్ అధ్యాపకుల ఆశలపై నీళ్లు

- కేయూ బడ్జెట్ ప్రతిపాదనలకు ఆమోదం
- వాడీవేడిగా కేయూ పాలకమండలి సమావేశం

కేయూ క్యాంపస్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కేయూలో పనిచేస్తున్న పార్టుటైమ్ అధ్యాపకుల కాంట్రాక్టు ఆశలపై వర్సిటీ పాలక మండలి నీళ్ల చల్లింది. శుక్రవారం హైదరాబాద్ సెక్రటేరియట్‌లో కేయూ అత్యున్నత పాలకమండలి సమావేశం జరిగింది. కేయూ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం, రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితారాణా, హయ్యర్ ఎడ్యుకేషన్ సెక్రటరీ శ్రీదేవసేనా, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ డిప్యూటీ సెక్రటరీ సుజాత, కేయూ పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్, ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, డాక్టర్ వి.నవీన్, డాక్టర్ రమ, డాక్టర్ చిర్రా రాజు గౌడ్, డాక్టర్ సుకుమారి, డాక్టర్ అనితారెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పాలక మండలిలో వర్సిటీలో ప్రధాన ఎజెండాగా వర్సిటీ 2023-24 ఆర్థిక సంవత్సర బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చించారు. రూ.4.8కోట్ల బడ్జెట్ ప్రతిపాదనలకు కేయూ పాలక మండలి ఫైనాన్స్ కమిటీ ఆమోద ముద్ర వేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం వర్సిటీల్లో పనిచేసే అధ్యాపకుల ఉద్యోగ విరమణ వయస్సును 65 ఏళ్లకు పెంచుతూ తీసుకున్న నిర్ణయానికి ఓకే చెప్పింది. అయితే ప్రభుత్వం వెలువరించిన జీవోను కచ్చితంగా అమలు చేయాలని కీలక నిర్ణయం వెలువరించింది. ఒక్కరోజు తేడాతో ఉద్యోగ విరమణ చేసిన వారికి జీవో వర్తించదని కరాఖండిగా నిర్ణయం తీసుకుంది. జీవో మేరకు మళ్లీ వర్సిటీలో నియమితులైన కాంట్రాక్టు, రెగ్యులర్ ప్రొఫెసర్లపై ఏమైనా సందేహాలుంటే సవరించాలని సూచించారు. పెంచిన వయస్సును జీవోను అనుసరించి ఇటీవల పునర్నియమితులైన ముగ్గురు కాంట్రాక్టు అధ్యాపకుల నియామకాలకు పాలకమండలి ఆమోదముద్ర వేయకుండా మరోసారి సరిచూడాలని సూచించారు.

కాన్వకేషన్, తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌కు ఏర్పాట్లు

వర్సిటీలో కాన్వకేషన్, తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ జరుపుకునేందుకు పచ్చజెండా ఊపారు. కాన్వకేషన్‌ను ఏప్రిల్ ఆఖరువారంలో కానీ మే మొదటి వారంలో చేసేందుకు తేదీలను చూపారు. వర్సిటీ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను పురస్కరించుకుని ఆగస్టులో తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ నిర్వహణకు సమ్మతించారు. ఆయా ఏర్పాట్లు, నిర్వహణ పనులు చేసుకోవాలని ఈసీ వర్సిటీ అధికారులకు సూచించింది. కాకతీయ యూనివర్సిటీ ఆరోగ్యకేంద్రంలో కొత్తగా మెడికల్ ఆఫీసర్లను నియమించుకునేందుకు పాలకమండలి సమ్మతించింది. అయితే డీఎంహెచ్‌వో అధికారుల నిర్దేశాలను చూడాలని సూచనలు చేశారు.

ప్రహరీ, భవనాలపై తిరకాసు

కేయూలో ప్రహరీ నిర్మాణంతో పాటు భవనాల అనుమతి కోసం వర్సిటీ అధికారులు రూపొందించిన ప్రతిపాదనలు అంశాలన్నీ సక్రమంగా లేవని పాలక మండలి తిరస్కరించింది. భవనాల నిర్మాణాలు, ప్రహరీపై కచ్చితమైన వివరాలతో నివేదికను సిద్ధం చేయాలని సూచించారు. అలాగే బిల్డింగ్ డివిజన్‌లో అవసరాల కోసం తాత్కాలిక సిబ్బంది నియామకాల కోసం టెక్నికల్ స్టాఫ్ కావాలని చేసిన విజ్ఞప్తిని పెండింగ్‌లో పెట్టారు. ప్లంబర్‌తో పాటు ఇతర అవసరాల కోసం వర్సిటీలో ఎక్సెస్‌లో ఉన్న బోధనేతర సిబ్బందిని వినియోగించుకోవాలని సూచించారు.

రూ.4.8 కోట్లకు బడ్జెట్ ఫైనాన్స్ కమిటీ ఆమోదం

కేయూ పాలకమండలి ఈ ఏడాదికి బడ్జెట్ ప్రతిపాదనలకు కేయూ ఫైనాన్స్ కమిటీ ఒకే చెప్పింది. వర్సిటీ ఫైనాన్స్ కమిటీలో కేయూ వీసీ, రిజిస్ట్రార్లతో పాటు పాలక మండలిలో నామినీలు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, డాక్టర్ కారుకాల అనితారెడ్డి, ఫైనాన్స్ ఆఫీసర్ తోట రాజయ్యతో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. వర్సిటీలో ప్రధాన ఎజెండాగా వర్సిటీ 2025-26 ఆర్థిక సంవత్సర బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చించారు. రూ.4.8కోట్ల బడ్జెట్ ప్రతిపాదనలకు కేయూ ఫైనాన్స్ కమిటీ ఆమోద ముద్ర వేశారు.



రిజిస్ట్రార్ నియామకానికి ఓకే

కేయూలో ఇటీవల రిజిస్ట్రార్‌గా నియమితులైన వల్లూరి రామచంద్రం నియామకానికి పాలక మండలి ఓకే చెప్పింది. రిజిస్ట్రార్‌తో పాటు ఇతర పరిపాలన అధికారుల నియామకాలను ఆమోదించారు.

టేబుల్ ఎజెండాలు వద్దు

పాలక మండలి సమావేశాల్లో గతంలో మాదిరిగా టేబుల్ ఎజెండాలు తీసుకురావద్దని ప్రిన్సిపాల్ సెక్రటరీ యోగితా రాణా స్పష్టమైన ఆదేశాలిచ్చారు. నిర్దిష్టమైన షెడ్యూల్ మేరకు ముందుగా ఇచ్చిన ఎజెండాలోని అంశాలపైనే పాలక మండలిలో చర్చలు, అమోదముద్ర ఉంటుందని తెల్చి చెప్పారు. టేబుల్ ఎజెండాలు వద్దని సున్నితమైన హెచ్చరికలు జారీ చేశారు.

పాలక మండలి వద్దకు అశోక్‌బాబు

హైదరాబాద్ సెక్రటేరియట్‌లో శుక్రవారం జరిగిన వర్సిటీ పాలక మండలి సమావేశం వద్దకు వర్సిటీలో సస్పెన్షన్ వేటులో ఉన్న ఏఆర్ పి.అశోక్‌బాబు వెళ్లారు. రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితారాణా, ఇతర పాలక మండలి సభ్యులను కలిసేందుకు ప్రయత్నించారు. తనతో తెచ్చుకున్న పత్రాలను చూపేందుకు ప్రయత్నించారు అయితే యోగితారాణి సిబ్బంది అశోక్‌బాబును వద్దంటూ వెనక్కి పంపించారు. అలాగే ఇతర పాలక మండలి సభ్యులను కలిసేందుకు ప్రయత్నించినా ససేమిరా అన్నట్లు తెలిసింది. అయితే అశోక్‌బాబుపై టేబుల్ ఎజెండాగా ప్రస్తావించేందుకు వర్సిటీ అధికా రులు ప్రయత్నించగా అప్పటికే ప్రిన్సిపల్ సెక్రటరీ టేబుల్ ఎజెండాలు వద్దంటూ సూచించారు. దీంతో అశోక్‌బాబు అంశం పెండింగ్‌లో పడినట్లయింది.

హాట్‌హాట్‌గా పాలక మండలి సమావేశం

కేయూ పాలక మండలి సమావేశం శుక్రవారం హైదరాబాద్‌లో హాట్‌హాట్‌గా జరిగింది. ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితారాణి ప్రతీ అంశాన్ని రూల్స్ యూజీసీ గైడ్‌లైన్ మేరకు ఉన్నాయా..? పాలక మండలి పరిధిలోకి వచ్చే అంశాలు ఏమిటీ..? అలాగే రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన నిర్ణయాలు ఎమిటనే అంశాలపై వర్సిటీ అధికారులతో చర్చించారు. ప్రతీది కచ్చితంగా నిబంధనల మేరకే చేయాలని అదేశాలిచ్చారు. వర్సిటీ ఉన్నతాధికారులు ఏది చెప్పినా రూల్స్‌లో ఇదెక్కడుంది..? ఏమని ఉంది? అనే అంశాలను ఆరా తీసినట్లు సమాచారం. పార్టుటైమ్ టూ కాంట్రాక్టు కన్వర్షేషన్ రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో నిర్ణయం తీసుకోవాలనే సూచనలు చేసినట్లు తెలిసింది.

రౌడీషీటర్లు సత్ప్రవర్తన అలవర్చుకోవాలి

హనుమకొండ టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : నేరాల నియంత్రణ కోసం రౌడీషీటర్లు సత్ప్రవర్తన అలవర్చుకోవాలని సుబేదారి సీఐ పి.సత్య నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండ సుబేదారి పోలీసు స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భం గా సీఐ మాట్లాడుతూ.. శాంతి భద్రతలకు ఎలాంటి భంగం కలిగించినా చర్యలు కఠినంగా తీసుకుంటామని హెచ్చరించారు. ఎలాంటి అల్లర్లకు పాల్పడవద్దని సూచించారు. నగరంలో శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టినట్లు సీఐ పేర్కొన్నారు.


రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న సీఐ

రూ.కోట్ల భూములు స్వాహా

- బాలసముద్రంలో తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్లు
- అక్రమార్కులకు అండగా నిలుస్తున్న అధికారులు
- పట్టించుకోని కలెక్టర్, మునిసిపల్ కమిషనర్

హనుమకొండ టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని ప్రభుత్వ భూములను కబ్జారాయుళ్లు యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారు. అడిగే వారు లేకపోవడంతో రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములను తప్పుడు పత్రాలు సృష్టించి ఆక్రమిస్తున్నారు. పేదవాడు 60 గజాల స్థలంలో గుడిసెలు వేసుకుంటే కూల్చివేస్తున్న పోలీసులు, రెవెన్యూ, గ్రేటర్ మునిసిపల్ అధికారులు.. రూ.కోట్ల విలువ చేసే భూములు కబ్జాకు గురవుతున్నా పట్టించుకోకపోవడంపై ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. భూముల అన్యాక్రాంతంపై పలుమార్లు కాలనీ ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కబ్జాదారులకు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల అండదండలు ఉండడంతో కబ్జాల పర్వాన్ని అడ్డుకోవడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

రికార్డులు మాయం

బాలసముద్రంలోని ఎల్ఐసీ కార్యాలయం సమీపంలో, బీఆర్ఎస్ భవన్ ఏరియాలో, కోదండ రామాలయం సమీపాన, కూరగాయల మార్కెట్ పక్కన పలు కాలనీలలో ప్లాట్లు కబ్జాలకు గురయ్యాయి. బాలసముద్రం లేఅవుట్ ప్లాట్ల రికార్డులను ఓ ప్రజాప్రతినిధి మాయం చేసి విలువైన భూములను కబ్జాలకు పాల్పడినట్లు కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. మొదటి దశలో టెండరు సమయంలో ప్లాట్ల విక్రయాలపై అప్పటి కమిషనర్, మునిసిపల్ చైర్మన్ పట్టాల్లో అధికారుల సంతకాలు ఉన్నాయని, తదనంతరం అధికారుల సంతకాలులేకుండా కొందరు ఫోర్జరీ సంతకాలు, అండదండలతో తప్పుడు పత్రాలు సృష్టించి కొంతమంది తమపేర్ల మీద భూములను రిజిస్ట్రేషన్లు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ కబ్జాల పర్వం 30 ఏళ్లుగా జరుగుతున్నట్లు అధికారుల దృష్టికి తీసుకుపోయినా నామ మాత్రంగా భూములను పరిశీలించి నిర్లక్ష్యం చేయడంతో విలువైన భూములు కబ్జాదారుల చేతుల్లో ఉన్నాయని ఆరోపిస్తున్నారు. కొంతమంది ఇళ్లు నిర్మించుకొని క్రయవిక్రయాలు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై కాలనీవాసులు విమర్శలు గుప్పిస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో బాలసముద్రంలోని ప్రభుత్వ భూముల్లో ఇండ్లు నిర్మించక పోయినా ఇల్లు ఉన్నట్లు అధికారులు 59 జీవో ద్వారా కొంత మంది సంపన్నులకు కోట్ల విలువ చేసే భూములను కట్టబెట్టినట్లు తెలుస్తోంది.


బాలసముద్రంలో తప్పుడు పత్రాలతో ప్లాటును కబ్జా చేస్తే అధికారులు ఏర్పాటు చేసిన నర్సరీ బోర్డు

మరికొందరు అక్రమంగా క్రమబద్ధీకరణలో భాగంగా కబ్జాలకు పాల్పడిన ప్లాట్లకు అధికారుల

1975లో లేఅవుట్

హనుమకొండలోని బాలసముద్రం డివిజన్‌లో చెరువు స్థలాన్ని ప్రభుత్వ ఆదాయం కోసం అప్పటి ప్రభుత్వం మునిసిపల్ అధికారులు లేఅవుట్ ద్వారా ఏ, బీ, సీ ద్వారా ప్లాట్లను ఏర్పాటు చేశారు. 1200 గజాలుగా, 600 గజాలు, 300 గజాలు, 250 గజాలు, 200 గజాల వరకు ప్లాట్లను ఏర్పాటు చేసి అప్పటి ప్రభుత్వం నిబంధనల ప్రకారం స్థలాలను విక్రయించారు. 1975లో టెండర్ ద్వారా నిలిచిపోయిన ప్లాట్లను 1988లో రీటెండర్ వేసి విక్రయాలు చేశారు. అప్పుడు కొన్ని వేలంలో మిగిలిపోయిన ప్లాట్లను ఎవరూ కొనకపోవడంతో కొన్ని ప్లాట్లను పార్కు స్థలాలుగా, ఇతర అవసరాలకు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో పార్కు స్థలాలు, కొన్ని లేఅవుట్ ప్లాట్లపై కబ్జాదారులు కన్నుపడి అక్రమంగా ప్లాట్లను కైవసం చేసుకున్నారు.

పట్టించుకోని మునిసిపల్ కమిషనర్, కలెక్టర్

నగరం నడిబొడ్డున కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములను కబ్జాలు చేసి నిర్మాణాలు చేస్తున్నా గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కమిషనర్, జిల్లా కలెక్టర్ దృష్టి సారించకపోవడంతో భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని కాలనీ ప్రజలు వాపోతున్నారు. అధికారుల మధ్య సయోధ్య లేక టెండర్లకు సంబంధించి రికార్డులలో టెండర్లలో ఎన్ని ప్లాట్లు మిగిలిపోయాయి?. ప్రభుత్వ స్థలం ఎంత ఉంది? లెక్కలు అధికారులకు తెలువకపోవడంపై కబ్జారాయుళ్లకు కలిసొచ్చినట్లైందని చెబుతున్నారు. బాలసముద్రంలోని ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అధికారులు మామూళ్లు తీసుకొని కబ్జాలను ప్రోత్సహించినట్లుగా స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా బాలసముద్రంలోని పలు కాలనీలలో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి తప్పుడు పత్రాలతో కబ్జాలు చేస్తున్న వారి రిజిస్ట్రేషన్లను రద్దు చేసి, పేద ప్రజల కోసం, ప్రభుత్వ పాఠశాలలకు, ఇతర ప్రభుత్వ అవసరాలకు భూములను కేటాయించాలని స్థానిక ప్రజలు అధికారులను కోరుతున్నారు.

యువతకు ఉపాధి కల్పించడమే ధ్యేయం

ఎం.మల్లయ్య
జిల్లా ఉపాధి కల్పన, శిక్షణ శాఖాధికారి



ప్రశ్నోత్తరాలు

ఆంధ్రజ్యోతి: జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన శిక్షణ శాఖ ద్వారా ఎలాంటి ఉపాధి కల్పిస్తున్నారు?

మల్లయ్య: జిల్లాలో నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాం.

ఆంధ్రజ్యోతి: ఉపాధి కల్పనకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

మల్లయ్య: నెలకు రెండుసార్లు జాబ్ మేళాను నిర్వహిస్తున్నాం. ప్రచార సాధనాలు, సామాజిక మాధ్యమాల ద్వారా జాబ్ మేళాల వివరాలను విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ఇప్పటి వరకు జిల్లాలో ఎంత మందికి ఉద్యోగాలు కల్పించారు?

మల్లయ్య: హనుమకొండ జిల్లాలో ఇప్పటి వరకు సుమారుగా 1,050 మందికి జాబ్ మేళాల ద్వారా వివిధ ప్రాంతాల్లోని ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలు కల్పించాం.

ఆంధ్రజ్యోతి: టామ్‌కామ్ ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారా?

మల్లయ్య: విదేశాల్లో ఉద్యోగాలు చేసేందుకు ఆసక్తి, అర్హత కలిగిన యువతీ యువకులు టామ్‌కామ్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే వారికి అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ప్రైవేటు కంపెనీలతో ఎలాంటి సంబంధాలు కొనసాగిస్తున్నారు?

మల్లయ్య: జిల్లా ఉపాధి కల్పన, శిక్షణ సంస్థ ఎప్పటికప్పుడు హైదరాబాద్, వరంగల్, ఇతరత్రా ప్రాంతాల్లోని వివిధ ప్రైవేటు సంస్థలను ఎప్పటికప్పుడు సంప్రదిస్తూ వారికి కావాల్సిన మానవ వనరులను అందిస్తామని వారికి వివరిస్తున్నాం. అందుకు అనుగుణంగా వారి అవసరాల మేరకు మమ్మల్ని సంప్రదిస్తున్నారు. దీంతో యువతీ యువకులకు ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలు కల్పించేందుకు కృషి చేస్తున్నాం.

- వరంగల్ ఎడ్యుకేషన్ (ఆంధ్రజ్యోతి)

చైతన్య యూనివర్సిటీలో ఫ్లాష్‌మాబ్


ఫ్లాష్‌మాబ్‌లో పాల్గొన్న విద్యార్థులు

రాంనగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : చైతన్య డీమ్డ్‌టుబీ విశ్వవిద్యాలయం 13వ స్నాతకోత్సవం పురస్కరించుకొని శుక్రవారం సాయంత్రం కళాశాల ఆవరణంలో విద్యార్థులు ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ జానపద, సినిమా పాటలకు నృత్యాలు వేసి అందరినీ అలరించారు. ఈ కార్యక్రమంలో చాన్స్‌లర్ డాక్టర్ పురుషోత్తంరెడ్డి, రిజిస్ట్రార్ రవీందర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ గాదె రాంబాబు, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు బీసీల సామాజిక హక్కు

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా నేత తమ్మల శోభారాణి


బీసీల పోరుగర్జన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తమ్మల శోభారాణి

వడ్డెపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): బీసీల రిజర్వేషన్లు ఎవరో ఇచ్చే భిక్ష కాదని, ఇది తమ సామాజిక హక్కు అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు తమ్మల శోభారాణి అన్నారు. శుక్రవారం గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లోని జవహర్‌కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతూ అసెంబ్లీలో చేసిన చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టి రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి సాధించేందు కోసం ఏప్రిల్ 2న న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించే బీసీల పోరుగర్జన సభకు మహిళలు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. సభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం జిల్లా ప్రతినిధులు బూరుగుల ప్రమీదాదేవి, చెరుకు సరిత, నరెడ్ల విజయ, కొడిపాక అన్నపూర్ణ, పిట్టల వసంత, ఇంజ మారమ్మ, మంతుర్తి సరోజన, చందన, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

వడ్డెపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసంతోపాటు మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ వడ్డెపల్లి రోడ్డులోని కనకదుర్గా కాలనీలో గల జుబేదాస్ హోంకేర్ హెల్త్ సర్వీసెస్, మెడిహీల్ ఆస్పత్రి సౌజన్యంతో ముస్లిం మహిళలతోపాటు మహిళా పారిశుధ్య కార్మికులకు శుక్రవారం చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మెడిహీల్ ఆస్పత్రి డాక్టర్ ఎమ్డీ.హనీఫ్ హుస్సేన్, జుబేదా, ఎమ్డీ.హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.


చీరలు పంపిణీ చేస్తున్న హుస్సేన్, జుబేదా

వరంగల్‌కు ప్రత్యేక ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు కృషి

వడ్డెపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌కు ప్రత్యేక ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు కృషి చేస్తానని గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు అన్నారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన వరంగల్ తూర్పు జర్నలిస్టుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరంగల్ ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు కొంత ఆర్థిక సహాయంతోపాటు ఫర్నిచర్‌ను అందించాలని వారు కోరినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బొల్ల అమర్, వరంగల్ తూర్పు జర్నలిస్టు నేతలు బుదారపు శ్రీనివాస్, సంగోజు రవి, కోరుకొప్పుల నరేందర్, దుర్గాప్రసాద్, తౌటి కామేశ్వర్, విజయ్‌కుమార్, విజయ్‌రాజ్, శ్రీధర్ పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

కాజీపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసంలో ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మతసామరస్యానికి ప్రతీక అని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. కాజీపేట జూబ్లీ మార్కెట్ మజీద్, ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఇఫ్తార్ విందు జరిగింది. సామూహిక నమాజ్ అనంతరం ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లింలు ఫలహారాలు, పండ్లు తినిపించారు. అంతకుముందు ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడారు. పవిత్ర రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందులతో ఆత్మీయత, సోదరభావం పెరుగుతోందన్నారు. ముస్లింల అభివృద్ధితో వారి సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర హజ్‌కమిటీ చైర్మన్ ఖుస్రుపాష, స్థానిక కార్పొరేటర్లు విజయశ్రీ రజాలీ, జక్కుల రవీందర్ యాదవ్, స్థానిక కాంగ్రెస్ నాయకులు, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

మైత్రినగర్‌లో సమస్యల మకాం

- రోడ్లు, డ్రెయినేజీలు మృగ్యం
- పత్తాలేని పక్కారోడ్లు.. పడకేసిన పారిశుధ్యం



మైత్రినగర్‌లో పక్కారోడ్లు, డ్రెయినేజీలు లేని దృశ్యం

వడ్డెపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 58వ డివిజన్ వడ్డెపల్లి ప్రాంతంలోని మైత్రినగర్‌లో సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు. రోడ్లు, డ్రెయినేజీలు మృగ్యమయ్యాయి. పక్కారోడ్లు లేక ప్రజలు పడుతున్న బాధలు వర్ణనాతీతం. కాలనీలో పారిశుధ్యం పడకేసింది.

రోడ్లు, డ్రెయినేజీలు మృగ్యం

మైత్రినగర్ ఆవిర్భవించి సుమారు రెండు దశాబ్దాలు కావస్తున్నా మౌలిక వసతులు రోడ్లు, డ్రెయినేజీలు మృగ్యమయ్యాయి. కాలనీలో ఎటు చూసినా మట్టిరోడ్లే తప్ప పక్కారోడ్లు పత్తాకైనా కనిపించని వైనం నెలకొంది. వర్షాకాలంలో చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ చిత్తడిగా మారుతాయి. డ్రెయినేజీలు, పక్కా రోడ్లు లేక నివాస గృహాల నుంచి వెలువడే మురుగు నీరు రోడ్లపైనే పారుతోంది. మురుగునీటి గుంతలతో దోమలు వృద్ధి చెందుతున్నాయని, రాత్రివేళల్లో కంటిమీద కునుకే కరువవుతోందని ప్రజలు వాపోతున్నారు. దోమల నివారణ మందును పిచికారీ చేసిన దాఖలాలే లేవని స్థానికులు అంటున్నారు.

పడకేసిన పారిశుధ్యం

కాలనీలోని ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు, నిరుపయోగమైన చెట్లు ఏపుగా పెరిగాయి. ఖాళీ స్థలాల్లోని చెట్ల పొదలు పాములు, తేళ్లు, క్రిమికీటకాలకు విడిదిగా మారాయి. రాత్రి వేళల్లో పాములు, తేళ్లు సంచరించడం వలన బయటకు రావడానికే ప్రజలు జంకుతున్నారు. వీధిలైట్లు సైతం లేక అంధకారంలో తాము జీవన మనుగడను కొనసాగిస్తున్నామని స్థానికులు వాపోతున్నారు. ఖాళీస్థలాల్లో పశువుల పాకలు ఉండడం వల్ల దుర్వాసన భరించలేకపోతున్నామని వాపోతున్నారు. అధికారులు స్పందించి కాలనీలో కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.


ఖాళీ స్థలాల్లో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

కనీస సౌకర్యాలు కల్పించాలి

గద్దల లక్ష్మి, మైత్రినగర్ (గృహిణి)



మైత్రి నగర్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలి. రోడ్లు, డ్రెయినేజీలతోపాటు పక్కా రోడ్లను వెంటనే ఏర్పాటు చేయాలి. ఖాళీ స్థలాల్లో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలి. పశువుల పాకను తొలగించడంతో పాటు దోమల నివారణకు వారానికోసారి ఫాగింగ్ చేపట్టాలి. మంచినీటి పైప్ లైన్‌ను విస్తరించాలి. వీధి దీపాలను ఏర్పాటు చేయాలి.

పశువైద్యాధికారికి స్థానచలనం

హసన్‌పర్తి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రైతులను ఇబ్బంది పెట్టినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మండల పశువైద్యాధికారి క్రాంతికుమార్‌ని బదిలీ చేస్తూ కలెక్టర్ ప్రావీణ్య ఉత్తర్వులు జారీ చేశారు. భీమదేవరపల్లి మండలం మాణిక్యాపూర్ పశువైద్యాధికారిగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అక్కడ పనిచేస్తున్న డాక్టర్ మాలవికను హసన్‌పర్తి మండల పశువైద్యాధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ మాలవిక శుక్రవారం రిపోర్టు చేయాల్సి ఉండగా, డాక్టర్ క్రాంతికుమార్ రిలీవ్ కాకపోవడంతో కొంతఇబ్బందికరమైన సమస్య తలెత్తుతున్నట్లు తెలిసింది.

డంప్ యార్డు పోరాటానికి సహకరించండి



ఇన్‌స్పెక్టర్ కిషన్‌కు వినతిపత్రం అందజేస్తున్న అడ్‌హాక్ కమిటీ

మడికొండ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మడికొండ, పరిసర గ్రామాల పాలిట శాపంగా మారిన డంపింగ్ యార్డు సమస్య పరిష్కారం కోసం బాధితులు చేస్తున్న పోరాటానికి సహకరించాలని శుక్రవారం డంపింగ్ యార్డు నిర్మూలన అడ్‌హక్ కమిటీ సభ్యులు స్థానిక ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పోరులో భాగంగా చేపట్టనున్న రిలే నిరాహార దీక్షలకు అనుమతి ఇవ్వాలని ఈ మేరకు ఆ వినతిలో ఇన్‌స్పెక్టర్‌ను కోరినట్లు అడ్‌హక్ కమిటీ సభ్యులు తెలిపారు.

ఇన్‌చార్జ్ బయాలజిస్ట్‌ను కలిసిన మలేరియా సిబ్బంది


రాజారెడ్డికి పుష్పగుచ్ఛాలు అందిస్తున్న సిబ్బంది

వరంగల్ కార్పొరేషన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ వరంగల్ అర్బన్ మలేరియా విభాగం ఇన్‌చార్జ్‌గా డాక్టర్ బొమ్మన రాజారెడ్డికి బాధ్యతలు అప్పగిస్తూ శుక్రవారం కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రాజిరెడ్డిని మలేరియా విభాగం సిబ్బంది శుక్రవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. రాజారెడ్డిని కలిసిన వారిలో హెల్త్ ఇన్‌స్పెక్టర్ మధూకర్, హెల్త్ అసిస్టెంట్లు పాశం రవి, ఫీల్డ్ అసిస్టెంట్లు రమేష్, ఆరోగ్యం, సమ్మయ్య, మార్త సమ్మారావు, నరేష్, రాజులు ఉన్నారు.

హనుమాన్ శోభాయాత్రను
జయప్రదం చేయాలి


ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న జైపాల్‌రెడ్డి, వెలగందుల రాజు

వడ్డెపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఏప్రిల్ 12న నిర్వహించే హనుమాన్ శోభాయాత్రను జయప్రదం చేయాలని విశ్వహిందూ పరిషత్ వరంగల్ మహా నగర అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, కార్యదర్శి వెలగందుల రాజు పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హనుమాన్ శోభాయాత్రకు సంబంధించిన కరపత్రాలు, ఆటోస్టిక్కర్లను ఆవిష్కరించారు. హనుమాన్ జయంతి సందర్భంగా ఏప్రిల్ 12న సాయంత్రం 3.30 గంటలకు వరంగల్ రంగశాయిపేట మహంకాళి దేవాలయం వద్ద వీర హనుమాన్ విజయ యాత్ర బైక్ ర్యాలీ ప్రారంభమై హనుమకొండ పద్మాక్షి దేవాలయం ప్రాంతంలోని హన్మద్గిరి వద్ద ముగింపు సభ జరుగుతుందని తెలిపారు. హిందూ సమాజం అధిక సంఖ్యలో పాల్గొని ఈ బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని వారు కోరారు. సమావేశంలో బజరంగ్ దళ్ సంయోజక్ కొల్లూరు ఆదిత్యసాయి, వరంగల్ విభాగ్ సహ కార్యదర్శి శ్రీరాం ఉదయ్‌కుమార్, ప్రతినిధులు పెల్లి సునంద్, గన్ను రామానుజన్, శ్రీకాంత్, సుతారి సాయి, నంగునూరు నాగరాజు, అరవింద్, వెంకటేశ్వర్లు, సుకృత్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

నవ్య
కుటుంబ కదంబం



వంటిల్లు

ఉగాదినాడు ఆరు రుచులు కలగలసిన 'ఉగాది పచ్చడి'తోపాటు బొబ్బట్లు, మామిడికాయ పులిహోర, పాయసం... ఇలా రకరకాల వంటలు చేసుకుంటూ ఉంటాం. వీటితో పాటు పండుగనాడు మరికొన్ని విభిన్నమైన రుచులు కూడా ప్రయత్నించాలనుకొంటే... ఈ వంటలు మీ కోసమే...

ఉగాదికి విభిన్న రుచులు

శ్రీఖండ్

కావాల్సిన పదార్థాలు
పెరుగు- అర లీటరు, పంచదార- ఒక కప్పు, బాదం- పది, పిస్తా- పది, జీడిపప్పు- పది, టూటీ ఫ్రూటీ- నాలుగు చెంచాలు, యాలకుల పొడి- చిటికెడు, కుంకుమ పువ్వు- అయిదు రేకులు

తయారీ విధానం
- జీడిపప్పు, బాదం, పిస్తా పప్పులను చిన్న పలుకుల్లా కోసి పెట్టుకోవాలి. నాలుగు చెంచాల పాలలో కుంకుమపువ్వు రేకులు వేసి నానబెట్టాలి. పంచదారను పొడి చేసుకోవాలి.
- ఒక గిన్నె మీద పలుచని వస్త్రాన్ని వేసి అందులో కమ్మని గడ్డ పెరుగు వేసి మూటలా కట్టాలి. ఈ మూటను రంధ్రాలు ఉన్న గిన్నెలో ఉంచి గిన్నె ను ఒక పళ్లెంలో పెట్టి ఫ్రిజ్‌లో ఉంచాలి. ఆరు గంటల తరవాత గుడ్డలో మిగిలిన గట్టి పెరుగును ఒక గిన్నెలోకి తీసుకోవాలి. దీన్ని చెంచాతో బాగా కలుపుతూ చిక్కని క్రీమ్‌లా చేయాలి. ఇందులో పంచదార పొడి వేసి బాగా కలపాలి. చిటికెడు యాలకుల పొడి, కుంకుమ పువ్వు నానబెట్టిన పాలు పోసి కలపాలి. జీడిపప్పు, బాదం, పిస్తా పలుకులు వేసి మరోసారి కలపాలి. ఈ మిశ్రమాన్ని ఒక బౌల్‌లోకి తీసుకుని పైన టూటీ ఫ్రూటీ చల్లి సర్వ్ చేయాలి.

జాగ్రత్తలు
- పెరుగు పుల్లగా కాకుండా తియ్యగా కమ్మగా ఉండాలి.
- వస్త్రంలో వడకట్టిన గట్టి పెరుగును బాగా బీట్ చేస్తే శ్రీఖండ్ రుచి బాగుంటుంది.

కొత్తిమీర వడలు

కావాల్సిన పదార్థాలు
శనగపిండి- ఒకటిన్నర కప్పులు, పసుపు- పావు చెంచా, జీలకర్ర- ఒక చెంచా, వాము- అర చెంచా, పచ్చి మిర్చి- అయిదు, ధనియాల పొడి- ఒక చెంచా, కారం- ఒక చెంచా, తెల్ల నువ్వులు- మూడు చెంచాలు, ఉప్పు- ఒక చెంచా, నూనె- వడలు వేయించడానికి కావాల్సినంత, కొత్తిమీర తరుగు- మూడు కప్పులు

తయారీ విధానం
- మిక్సీ గిన్నెలో జీలకర్ర, పచ్చి మిర్చి ముక్కలు వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి.
- వెడల్పాటి గిన్నెలో శనగపిండి, వాము, ఉప్పు, పసుపు వేసి బాగా కలపాలి. తరవాత కొద్ది కొద్దిగా నీళ్లు చిలకరిస్తూ పిండిని గంటె జారుగా కలపాలి.
- స్టవ్ మీద గిన్నె పెట్టి మూడు చెంచాల నూనె వేసి వేడి చేయాలి. ఇందులో పచ్చి మిర్చి-జీలకర్ర పేస్టు, నువ్వులు, కారం, ధనియాల పొడి వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని రెండు నిమిషాలు వేగనివ్వాలి. వెంటనే కొత్తిమీర తరుగు వేసి కలిపి అయిదు నిమిషాలు వేగనివ్వాలి. తరవాత ఇందులో శనగపిండి మిశ్రమం పోసి గరిటెతో కలుపుతూ ఉండాలి. పిండి దగ్గరకు వచ్చి గట్టి ముద్దలా అయిన తరవాత స్టవ్ మీద నుంచి దించాలి. ఒక పళ్లేనికి నూనె రాసి అందులో ఈ పిండి ముద్దను సమంగా పరచాలి. పిండి చల్లారిన తరవాత చాకుతో చతురస్రాకారపు ముక్కలుగా కోయాలి.
- స్టవ్ మీద మూకుడు పెట్టి సగానికి పైగా నూనె పోసి బాగా వేడి చేయాలి. తరవాత ఇందులో పిండి ముక్కలు వేసి దోరగా వేపాలి. ముక్కలు రెండు వైపులా బంగారు రంగులో వేగాక పళ్లెంలోకి తీయాలి. ఈ కొత్తిమీర వడలు వేడిగా ఉన్నప్పుడు తింటే కరకరలాడుతూ రుచిగా ఉంటాయి.

జాగ్రత్తలు
- శనగపిండి పరిమాణాన్ని తగ్గించి దానికి బదులు బియ్యప్పిండి లేదా మొక్కజొన్న పిండి వాడుకోవచ్చు
- మంట పెద్దగా లేదా మధ్యస్థాయిలో ఉండేలా చూసుకోవాలి. నూనె బాగా వేడెక్కినాకే పిండి ముక్కలు వేసి వేయించాలి. లేదంటే వడలు బాగా నూనె పీల్చుకుంటాయి.
- పిండి ముక్కలను నిండు నూనెలో వేయించడం ఇష్టం లేనివారు షాలో ఫ్రై చేసుకోవచ్చు. ఆవిరి మీద ఉడికించి తిన్నా బాగుంటాయి.



మావా బాటీ



కావాల్సిన పదార్థాలు
పంచదార- రెండు కప్పులు, నీళ్లు- రెండు కప్పులు, యాలకుల పొడి- ఒక చెంచా, కుంకుమ పువ్వు రేకులు- పదిహేను, కోవా- పావు కేజీ, మైదా- నాలుగు చెంచాలు, బేకింగ్ సోడా- పావు చెంచా, జీడిపప్పు- పది, బాదం- పది, పిస్తా- పది, పసుపు రంగు- చిటికెడు, నూనె- వేయించడానికి తగినంత

తయారీ విధానం
- ముందుగా కాజు, బాదం, పిస్తా పప్పులను చిన్న ముక్కలుగా కోసి పెట్టుకోవాలి. వీటన్నింటినీ ఒక గిన్నెలో వేసి అందులో అర చెంచా యాలకుల పొడి, కుంకుమ పువ్వు- తొమ్మిది రేకులు, పసుపు రంగు కూడా వేసి బాగా కలపాలి.
- స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో పంచదార, నీళ్లు, అర చెంచా యాలకుల పొడి, కుంకుమపువ్వు రేకులు ఆరింటిని వేసి బాగా కలపాలి. పది నిమిషాల తరవాత పంచదార మొత్తం కరిగి పాకం జిగురుగా మారుతుంది. ఇలా తేనె పాకం తయారయ్యాక స్టవ్ మీద నుంచి దించాలి.
- కోవాను ఒక పళ్లెంలోకి సన్నగా తురమాలి. ఇందులో మైదా పిండి, బేకింగ్ సోడా వేసి బాగా కలపాలి. ఎక్కడా పగుళ్లు లేకుండా మెత్తని ముద్దలా చేయాలి. ఈ ముద్దని చాకుతో ఎనిమిది భాగాలు చేయాలి. ఒక భాగాన్ని గిన్నెలోకి తీసుకుని అందులో కాజు-బాదం మిశ్రమం వేసి బాగా కలపాలి. దీన్ని ఏడు భాగాలు చేసి ఒక్కోదాన్ని చిన్న ముద్దలా చేయాలి.
- కోవా-మైదా భాగాలను చిన్న బిళ్లలుగా చేసి ఒక్కోదాని మధ్యలో కాజు-బాదం ముద్ద పెట్టి అంచులు మూసి మరోసారి బిళ్లలా చేయాలి.
- స్టవ్ మీద మూకుడు పెట్టి బిళ్లలు మునిగేంత నూనె పోసి చిన్న మంట మీద వేడి చేయాలి. నూనె కొద్దిగా వేడెక్కాక ఇందులో పైన తయారు చేసి పెట్టుకున్న బిళ్లలు వేసి రెండు వైపులా ముదురు గోధుమ రంగు వచ్చేవరకూ వేయించాలి. తరవాత వీటిని తీసి పంచదార పాకంలో వేయాలి. వీటిని పాకంలో నాలుగు గంటలు నాననివ్వాలి. తరవాత సర్వ్ చేసుకోవచ్చు. ఇవి గులాబ్ జామూన్‌లాగే కనిపిస్తాయి కానీ వీటి రుచి అమోఘంగా ఉంటుంది.

జాగ్రత్తలు
- కోవా-మైదాల మిశ్రమాన్ని మృదువుగా ఒత్తుతూ కలపాలి.
- బిళ్లలు వేయించడానికి నూనెను ఎక్కువగా వేడి చేయకూడదు. చిన్న మంట మీద నూనెలో బిళ్లలను మెల్లగా కదుపుతూ వేపాలి. బిళ్లలు ముదురు రంగులో వేగితేనే మావా బాటీ రుచిగా ఉంటుంది.

బుట్టే కా కీస్

కావాల్సిన పదార్థాలు
బేబీకార్న్- 8, శనగపిండి- రెండు చెంచాలు, నెయ్యి- మూడు చెంచాలు, ఆవాలు- పావు చెంచా, జీలకర్ర- పావు చెంచా, పచ్చిమిర్చి- రెండు, అల్లం తరుగు- ఒక చెంచా, ఇంగువ- చిటికెడు, పసుపు- పావు చెంచా, ధనియాల పొడి- పావు చెంచా, చిక్కని పాలు- ఒక కప్పు, కారం- అర చెంచా, పంచదార- ఒక చెంచా, ఉప్పు- ముప్పావు చెంచా, నిమ్మరసం- ఒక చెంచా, కొత్తిమీర తరుగు- రెండు చెంచాలు, చాట్ మసాలా- అర చెంచా, కొబ్బరి తురుం- రెండు చెంచాలు

తయారీ విధానం
- బేబీకార్న్‌ను మిక్సీలో వేసి కచాపచాగా గ్రైండింగ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని గిన్నెలోకి తీసుకోవాలి. స్టవ్ మీద పాన్ పెట్టి శనగపిండి వేసి దోరగా వేయించి పళ్లెంలోకి తీయాలి. పాన్‌లో రెండు చెంచాల నెయ్యి వేసి కరిగించాలి. ఇందులో ఆవాలు, జీలకర్ర, పచ్చిమిర్చి ముక్కలు, అల్లం తరుగు, ఇంగువ, పసుపు, ధనియాల పొడి వేసి బాగా కలపాలి. ఇవన్నీ వేగాక, మిక్సీ పట్టిన బేబీకార్న్ వేసి బాగా కలుపుతూ ఉండాలి. ఈ మిశ్రమం పొడి పొడిగా మారిన తరవాత వేయించిన శనగపిండి వేసి కలపాలి. తరవాత పాలు పోసి కలపాలి. ఈ మిశ్రమం దగ్గరకు వచ్చిన తరవాత కారం, పంచదార, ఉప్పు, ఒక చెంచా నెయ్యి వేసి కలిపి మూత పెట్టి అయిదు నిమిషాలు ఉంచాలి. తరవాత నిమ్మకాయ రసం, కొత్తిమీర వేసి కలిపి స్టవ్ మీద నుంచి దించాలి. దీని మీద చాట్ మసాలా, కొబ్బరి తురుం, కొత్తిమీర తరుగు చల్లి సర్వ్ చేయాలి.



జాగ్రత్తలు
- వంటకం పూర్తయ్యే వరకూ స్టవ్‌ను చిన్న మంట మీదనే ఉంచాలి.
- శనగపిండికి బదులు గోధుమ పిండిని వాడుకోవచ్చు. పాలకు బదులు నీళ్లు పోసుకోవచ్చు.

అమృతాహారం
చుక్కకూర

భోజనకుతూహలం
ఆహారంతో ఆరోగ్యం

మనకు అందుబాటులో ఉన్న అన్ని రకాల ఆకుకూరల్లో- చుక్కకూరకు ఒక ప్రత్యేకత ఉంది. ఇప్పుడైతే పులుపు కావాలనుకుంటే చింతపండును ఉపయోగిస్తాం. కానీ ఒకప్పుడు మన పూర్వీకులు పులుపు కోసం చుక్కకూరనే ఉపయోగించేవారు. మన ఆయుర్వేద గ్రంథాల్లో చుక్కకూరకు ఉన్న గుణగణాలను.. దాని వల్ల కలిగే లాభాలను వివరించారు. ఆ లాభాలేమిటో చూద్దాం..

- చుక్కకూరలో అనేక విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా లభిస్తాయి. దీనిని ప్రతి రోజు తీసుకుంటే రోగనిరోధక శక్తి బాగా పెరుగుతుంది. దీనిలో కొన్ని రకాలైన రసాయనాలు ఉంటాయి. ఇవి విష దోషాల నివారణకు ఉపకరిస్తాయి.
- చుక్క కూరను ఆయుర్వేద ఔషధాల తయారీకి కూడా వినియోగిస్తారు.
- చుక్క కూర పేగులను శుభ్రపరుస్తుంది. జీర్ణక్రియను ఉత్తేజపరుస్తుంది. పచ్చకామెర్లు లాంటి వ్యాధులు వచ్చినప్పుడు కూడా చుక్కకూరను తినవచ్చు. దీనిలో క్షార గుణాలున్న ఫ్లవనాయిడ్స్, పాలీఫినాల్స్ ఉండటం వల్ల కడుపులో మంట కలిగించదు.
- ఇది రక్తాన్ని శుద్ధి చేస్తుంది. రక్త సమృద్ధికి ఉపకరిస్తుంది.
- కూరల్లోను, పప్పుల్లోను చింతపండుకు బదులుగా చుక్కకూరను వాడుకోవచ్చు.

> చుక్కకూరలో కాల్షియం ఆక్సిలైట్స్ ఎక్కువగా ఉంటాయి. అందువల్ల మూత్ర నాళాల్లో రాళ్లు ఉన్నవారు దీనిని ఎక్కువగా తినకూడదు. పరిమితంగానే వాడాలి.

చుక్కకూరతో చారు...
చుక్కకూరతో తయారుచేసే చారు వల్ల అనేక రకాల ప్రయోజనాలు



ఉన్నాయి. దీనిని క్రమం తప్పకుండా ప్రతి రోజూ తింటే జీర్ణశక్తి పెరుగుతుంది. ఏవైనా విషదోషాలు ఉంటే వాటి ప్రభావం తగ్గుతుంది. దీనిని ఎలా తయారుచేయాలో చూద్దాం..
- చుక్కకూరను బాగా కడగాలి. దానిని మిక్సీలోకి వేసి బాగా తిప్పాలి. ఈ మిశ్రమాన్ని ఒక గుడ్డలో వేసి ఒడగట్టాలి. అప్పుడు వచ్చే రసాన్ని తీసి ఒక గిన్నెలో వేయాలి.
- ఈ రసాన్ని కొద్దిగా వేడి చేసి చారుపొడి వేయాలి. ఆ తర్వాత తాళింపు పెట్టాలి.
- కొందరు దీనిలో అల్లం, మిరియాల పొడి కూడా వేస్తారు. దీని వల్ల చుక్కకూర చారు మరింత రుచికరంగా ఉంటుంది.

• గంగరాజు అరుణాదేవి

మేకప్

వేసవిలో చెమటకు చెదరకుండా...

వేడి, ఉక్కపోతలకు మేకప్ చెదిరిపోవడం సహజం. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా, ఎన్నిసార్లు టిష్యూతో అద్దుకున్నా ఎంతో కొంత మేకప్ అటూ ఇటూ చెదిరిపోతూనే ఉంటుంది. ఇలా జరగకుండా ఉండాలంటే...

ముఖం శుభ్రంగా ఉంచుకోవాలి
ముఖాన్ని సబ్బుతో శుభ్రపరుచుకున్న తర్వాత టవల్‌తో రుద్దకుండా, సున్నితంగా అద్దుకోవాలి. తర్వాత తేలికపాటి మాయిశ్చరైజింగ్ జెల్ లేదా లోషన్‌ను పూసుకోవాలి. ఆ తర్వాత అదనపు చర్మ నూనెలు, మాయిశ్చరైజర్‌ను బ్లాటింగ్ పేపర్ అద్దుకుని తొలగించాలి.



ప్రైమర్ వాడుకోవాలి


మేకప్‌కు ముఖాన్ని సిద్ధం చేసుకునేటప్పుడు మొదట ప్రైమర్ అప్లై చేయాలి. ఫేస్, ఐ ప్రైమర్‌లను వాడుకోవడం వల్ల చర్మం నునుపుగా మారి, ఫౌండేషన్ పూతకు తగ్గట్టు తయారవుతుంది.

ఫౌండేషన్ పలుచగా
వేసవి వేడి వాతావరణంలో ఫౌండేషన్ భారీగా వేసుకుంటే అది ముద్దలుగా మారే ప్రమాదం ఉంటుంది. కాబట్టి మాయిశ్చరైజర్, ప్రైమర్ పలుచగా పూసుకున్న తర్వాత ఫౌండేషన్ కూడా వీలైనంత పలుచగా అప్లై చేసుకోవాలి.



సెట్టింగ్ స్ప్రే


సెట్టింగ్ స్ప్రేతో వేసుకున్న మేకప్ ముఖం మీద నిలిచి ఉంటుంది. మేకప్ పూర్తయిన తర్వాత సెట్టింగ్ స్ప్రే వాడుకుని, అది ముఖం మీదే ఆరిపోయేలా చూసుకోవాలి.

ఫిక్సింగ్ పౌడర్
ఈ కాలంలో కాంపాక్ట్ పౌడర్ నుంచి ట్రాన్స్‌ల్యూసెంట్ పౌడర్‌కు మారాలి. చెమట పట్టినప్పుడు కాంపాక్ట్ పౌడర్ చెక్కిళ్ల పైనుంచి కారిపోయి చారికలు ఏర్పడతాయి కాబట్టి వేసవిలో ఈ పౌడర్ వాడకం మానేయాలి.



వాటర్‌ప్రూఫ్


వాటర్‌ప్రూఫ్ మస్కారా, కాజల్, ఐలైనర్‌లను ఎంచుకోవాలి. సాధారణ ఉత్పత్తులతో పోల్చుకున్నప్పుడు వీటిని తొలగించడం కాస్త ఇబ్బందికరమే అయినప్పటికీ మేకప్ అందవిహీనంగా మారిపోకుండా ఉండడం కోసం వేసవిలో వాటర్‌ప్రూఫ్ సౌందర్య సాధనాలనే వాడుకోవాలి.

ట్రెండింగ్

విడిపోయిన బంధం... బరువైన పాటయింది

ధనశ్రీ మొదటి నుంచీ స్వతంత్ర భావాలున్న అమ్మాయి. నలుగురిలో ఒకరిలా కాకుండా... తనకంటూ ఒక ప్రత్యేకత కావాలని కోరుకుంది. క్రికెటర్ చాహల్‌తో పరిచయానికి ముందే ఆమెకంటూ ఒక గుర్తింపు ఉంది. అద్భుతమైన డ్యాన్సర్‌గా ఇన్‌స్టాగ్రామ్‌లో నిత్యం లక్షలమంది అభినందనలు అందుకొంటోంది. క్రికెటర్ చాహల్‌తో పెళ్లి తరువాత, అతడితో కలిసి ఆమె చేసిన డ్యాన్స్ వీడియోలతో ప్రపంచ వ్యాప్తంగా అభిమానులను సంపాదించుకుంది. ఆమెది సంపన్న కుటుంబం. ధనశ్రీ తండ్రి కపిల్‌వర్మ పారిశ్రామికవేత్త. తల్లి వర్ష గృహిణి. దుబాయ్‌లో పుట్టిన ధనశ్రీ ముంబయిలో పెరిగింది. ఆమె... చిన్న నాటి నుంచి డాక్టర్ కావాలనుకుంది.



ధనశ్రీ వర్మ... యజ్వేంద్ర చాహల్... ఒకర్ని ఒకరు ఇష్టపడి పెళ్లి చేసుకున్నారు. ఇద్దరూ కలిసి డ్యాన్స్ వీడియోలు చేసి... ఒకటి తరువాత ఒకటి వదిలారు. కోట్ల మంది అభిమానులను సంపాదించుకున్నారు. అంతా బానేవుందనుకొంటే... ఇంతలోనే విడాకులతో వేరు పడ్డారు. అందుకు ఎవరి కారణాలు వాళ్లకున్నా... ఇటీవల ధనశ్రీ వీడియో సాంగ్ ఒకటి విడుదల చేసింది. అది కూడా గృహ హింసకు సంబంధించింది కావడంతో సామాజిక మాధ్యమాల్లో దీనిపై చర్చ తారస్థాయికి చేరింది.

అనుకోని మలుపు...
తను కోరుకున్నట్టే ధనశ్రీ మెడిసిన్‌లో సీటు సాధించింది. బీడీఎల్ పూర్తి చేసింది. అయితే మొదటి నుంచి డ్యాన్స్‌తో పాటు నటనపైన ఉన్న మక్కువ ఆమె కెరీర్‌ను మలుపు తిప్పింది. చదువుకొనే రోజుల్లోనే ధనశ్రీ డ్యాన్స్ లిప్ సింకింగ్ వీడియోలు చేసి యూట్యూబ్‌లో పోస్ట్ చేసేది. ప్రముఖ డ్యాన్సర్లతో కలిసి చేసిన వీడియోలకు లక్షల్లో వ్యూస్ వచ్చాయి. తన పేరుతో పెట్టుకున్న 'ధనశ్రీవర్మ' చానల్‌ను తక్కువ సమయంలోనే లక్షలమంది సబ్‌స్క్రైబ్ చేశారు. 2020లో క్రికెటర్ చాహల్‌తో పెళ్లి తరువాత ఆమె జీవితం ఊహించని మలుపు తిరిగింది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది క్రికెట్ అభిమానులకు దగ్గరైంది.

హిట్ జంట...
పెళ్లి తరువాత చాహల్‌తో కలిసి అడుగులు కదిపింది ధనశ్రీ. ఇరువురూ కలిసి సూపర్ హిట్ పాటలకు డ్యాన్సులు చేసి, వాటిని సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. ఈ జంట నాట్యానికి కోట్ల మంది ఫిదా అయ్యారు. ఇంటర్‌నెట్‌లో చాహల్, ధనశ్రీలది హిట్ పెయిర్. దేశం దాటి విదేశాల్లో కూడా అభిమానులను సంపాదించుకున్నారు. కొరియోగ్రఫీలో కూడా మంచి పట్టున్న ధనశ్రీ... తనలా మరింతమంది డ్యాన్సర్లను తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో ఒక నాట్యాలయాన్ని ప్రారంభించింది. 'ఝలక్ దిక్ లాజా' తదితర డ్యాన్స్ రియాలిటీ షోస్‌లో పాల్గొని మురిపించింది. ఇప్పుడామె వార్షిక ఆదాయం 25 కోట్ల రూపాయల పైనే.

మూన్నాళ్ల ముచ్చట...
ధనశ్రీ, చాహల్... ఇద్దరి వృత్తిగత, వ్యక్తిగత జీవితాలు అద్భుతంగా సాగుతున్నాయని అనుకొంటున్న తరుణంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఎప్పటి నుంచో వస్తున్న ఊహాగానాలకు బలం చేకూరుస్తూ... విడిపోతున్నట్టు ఇద్దరూ ప్రకటించారు. సామాజిక మాధ్యమాల్లో, క్రికెట్ మైదానంలో ఎంతో అన్యోన్యంగా కనిపించిన ఈ జంట... మూడు ముళ్ల బంధం మూన్నాళ్ల ముచ్చట అయింది. పెళ్లయిన రెండేళ్లకే ఇద్దరి మధ్య అభిప్రాయ భేదాలు వచ్చాయని, అవి తారస్థాయికి వెళ్లడంతో... ఇక కలిసి ఉండలేమనే నిర్ణయానికి వచ్చారనేది సన్నిహితుల మాట. 2022 జూన్ నుంచి ఇద్దరూ వేరు కాపురాలు పెట్టారు. పరస్పర అంగీకారంతో ఈ నెల 20న ముంబయి ఫ్యామిలీ కోర్టు ఈ జంటకు విడాకులు మంజూరు చేసింది. భరణం కింద ధనశ్రీకి రూ.4.75 కోట్లు చెల్లించేందుకు చాహల్ అంగీకరించినట్టు సమాచారం.



ఆమెను అగౌరవపరిచేలా...
విడాకులన్నది చాహల్, ధనశ్రీల వ్యక్తిగత నిర్ణయం. కానీ కోర్టు నుంచి విడాకులు పొందాక సామాజిక మాధ్యమాల్లో ధనశ్రీ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేశారు. కొందరైతే... 'మీ అకౌంట్‌లో ఎంత క్రెడిట్ అయింది' అంటూ ప్రశ్నించారు. 'అతడి డబ్బుతో మీరు ఎలా జీవిస్తారు? మీకు ఆత్మాభిమానం లేదా' అని మరొకరు... ఇలా లెక్కకు మించి ఆమె వ్యక్తిత్వంపై దాడి చేశారు. కానీ ధనశ్రీ వేటికీ స్పందించలేదు. ఎప్పటిలా కెరీర్‌పై దృష్టి పెట్టి, తన పని తాను చేసుకుపోతోంది.

'గృహహింస' పాట...
ఇదిలావుంటే... విడాకులు తీసుకున్న రోజే ధనశ్రీ ప్రత్యేక పాటను విడుదల చేశారు. 'దేఖా జీ దేఖా మైనే' అంటూ సాగే ఈ వీడియో సాంగ్‌లో ఆమె గృహహింస బాధితురాలిగా, భర్త చేతిలో మోసపోయిన భార్యగా నటించారు. 'టీ సిరీస్' దీన్ని విడుదల చేసింది. జ్యోతి నూరన్ ఈ గీతాన్ని ఆలపించారు. ఈ వీడియోలో బాలీవుడ్ నటుడు ఇష్వాక్ సింగ్, ధనశ్రీ భార్యాభర్తలుగా కనిపించారు. తనను ఎంతో ఇష్టపడే భార్యను భర్త మోసం చేస్తాడు. వేరే అమ్మాయితో కలిసి తిరుగుతుంటాడు. ప్రశ్నించిన భార్యను అతడు శారీరకంగా హింసిస్తాడు. చివరకు ఆమె వైవాహిక జీవితానికి స్వస్తి చెప్పడంతో పాట ముగుస్తుంది. బంధాలు, భావోద్వేగాలు, మనస్పర్థలు, ప్రేమలోని సంక్లిష్టతల మధ్య నలిగిపోతున్న ఓ మహిళగా ధనశ్రీ నటించింది. కోర్టు విడాకులు మంజూరు చేసిన రోజే ఈ పాట విడుదల కావడంతో దీనిపై విపరీతంగా చర్చ నడుస్తోంది. యూట్యూబ్‌లో ఇప్పటికి దాదాపు అరవై లక్షల మంది ఈ పాటను వీక్షించారు. విడాకులకు కారణాలు అటు చాహల్ కానీ, ఇటు ధనశ్రీ కానీ బహిరంగంగా చెప్పలేదు. ఇదే విషయాన్ని వీడియో సాంగ్ విడుదల సందర్భంగా ధనశ్రీని అడిగితే... 'ముందు మీరు పాట వినండి' అంటూ బదులిచ్చారు. కానీ విడాకులపై నోరు విప్పలేదు.

కార్మిక రాజ్య బీమా సంస్థ

(కార్మిక మరియు ఉపాధి మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం)
ప్రాంతీయ కార్యాలయం, 5-9-23, హిల్‌ఫోర్ట్ రోడ్, ఆదర్శనగర్, హైదరాబాద్, తెలంగాణ - 500063
ఫోన్: 040-23232357/58/59, ఇ-మెయిల్ ఐడి: ins4.ts@esic.nic.in

క.రా.బీ.సం.
ESIC

ప్రకటన

జారీచేయబడిన C-18 అడ్‌హక్ నోటీసులపై వ్యక్తిగత విచారణ కోసం సంబంధిత అధికారి సమక్షంలో దిగువ తెలిపిన విధంగా అన్ని సంబంధిత డాక్యుమెంట్లు/ రికార్డులతో వ్యక్తిగత విచారణకు హాజరు కావాలని దిగువ పేర్కొన్న యజమానులకు ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది.

క్ర. సం.	కోడ్	ఫ్యాక్టరీ/Estt. పేరు & చిరునామా	యజమాని పేరు & చిరునామా	ప్రకటన తేది	ఎగవేత వ్యవధి నుండి	ఎగవేత వ్యవధి వరకు	కాంట్రిబ్యూషన్ క్లెయిమ్ మొత్తం
1.	52000582380000999	మెస్సర్స్ రోహిణి పర్సనల్ మేనేజ్‌మెంట్ & ఔట్ సోర్సింగ్ ఏజన్సీ 9-21/3/7/12, రోడ్ నం. 6, అశోక్‌నగర్ కాలనీ, బోడుప్పల్, మేడ్చల్, హైదరాబాద్ - 500039	శ్రీ/శ్రీమతి ఫాతిమా 3-11-284/4, ఎల్.బి.నగర్ మాంటిస్సోరి స్కూల్ దగ్గర, భువనగిరి, భువనగిరి, నల్గొండ-508116	సి-18 అడ్‌హక్ తేది: 07-12-2021	జనవరి-17	మార్చి-21	రూ.644490
2.	52000620230000912	మెస్సర్స్ జాగృతి ఫిల్లింగ్ స్టేషన్ కుల్చారం, సర్వే నం. 720/ఎ/ఎ, 721/ఎఎ/1, 721/ఎఎ/3, కుల్చారం(గ్రా&మం) మెదక్-502381	శ్రీ/శ్రీమతి కె.సాయిరెడ్డి, సర్వే నం. 720/ఎ/ఎ, 721/ఎఎ/1, 721/ఎఎ/3, కుల్చారం(గ్రా&మం.) మెదక్-502381	సి-18 అడ్‌హక్ తేది: 18-08-2022	జూన్-17	మార్చి-22	రూ.340148
3.	52000622360001301	మెస్సర్స్ గుడ్‌న్యూస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, 4-52/2-42/బి, కె.కె.బస్తీ, కల్వకోల్-509325	శ్రీ/శ్రీమతి బయ్యారపు జీవరత్నం 4-52/2-42/బి, కె.కె.బస్తీ, కల్వకోల్-509325	సి-18 అడ్‌హక్ తేది: 02-02-2022	జూన్-20	మార్చి-21	రూ.60060
4	52000654590000911	మెస్సర్స్ బ్రైటివే స్కిల్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ 5-9-58/1-15, ఫ్లాట్ నం. 702, 7వ అంతస్తు, బాబుఖాన్ ఎస్టేట్, బషీర్‌బాగ్, హైదరాబాద్ - 500029	శ్రీ/శ్రీమతి చిటి పవన్ కుమార్ 5-9-58/1-15 ఫ్లాట్ నం. 702, 7వ అంతస్తు, బాబుఖాన్ ఎస్టేట్, బషీర్‌బాగ్, హైదరాబాద్ - 500029	సి-18 అడ్‌హక్ తేది:28-02-2023	డిసెంబర్-17	మార్చి-22	రూ.295103
5	52000656250000999	మెస్సర్స్ మదర్ థెరీసా ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ, 28-207/2, సబ్ జైలు దగ్గర, మిర్యాలగూడ, నల్గొండ-508207	శ్రీ/శ్రీమతి విజయ్ వల్లపుదాసు 28-207/2, సబ్ జైలు దగ్గర, మిర్యాలగూడ, నల్గొండ-508207	(ఎ) సి-18 అడ్‌హక్ తేది:28-02-2023 (బి) సి-18 అడ్‌హక్ తేది:28-02-2023 (బి) సి-18 అడ్‌హక్ తేది:28-02-2023	డిసెంబర్-17 సెప్టెంబర్-21 మార్చి-22	సెప్టెంబర్-20 సెప్టెంబర్-21 మార్చి-22	రూ.211943 రూ.6006 రూ.8778
8	52000670230001001	మెస్సర్స్ తాజ్ ఎలక్ట్రికల్ & సివిల్ ఇంజనీరింగ్ వర్క్స్ ఇ.నం. 82/2, శాంతినగర్, జహీరాబాద్, సంగారెడ్డి-50220	శ్రీ/శ్రీమతి ఎం.డి. తాజుద్దీన్ ఇ.నం.82/2, శాంతినగర్, జహీరాబాద్, సంగారెడ్డి-50220	సి-18 అడ్‌హక్ తేది: 19-04-2023	ఏప్రిల్-18	సెప్టెంబర్-22	రూ.292793
9	52000670510001018	మెస్సర్స్ ఒరుసు మల్లేష్ సివిల్ కాంట్రాక్టర్, ఇ.నం. 5-105/2, కంతిపాలెం, తొర్రూరు, మహబూబాబాద్, తెలంగాణ-506163	శ్రీ/శ్రీమతి ఒరుసు మల్లేష్ ఇ.నం.5-105/2, కంతిపాలెం, తొర్రూరు, మహబూబాబాద్, తెలంగాణ-506163	సి-18 అడ్‌హక్ తేది: 30-05-2022	ఏప్రిల్-18	సెప్టెంబర్-21	రూ.474705
10	52000671290001019	మెస్సర్స్ కె. రామకృష్ణ, లేబర్ కాంట్రాక్టర్, ఇ.నం. 2-52, పూల్ల గ్రామం, జిన్నారం మండలం, మెదక్-502319	శ్రీ కర్రె రామకృష్ణ ఇ.నం.2-52, పూల్ల గ్రామం, జిన్నారం, మండలం, మెదక్-502319	సి-18 అడ్‌హక్ తేది: 22-02-2023	ఏప్రిల్-18	మార్చి-22	రూ.517633
11	52000671790001001	మెస్సర్స్ శ్రీరామ అంజనేయ ఎంటర్‌ప్రైజెస్, ఇ.నం. ఎల్‌ఐజి 241, టిఐజిసి కాలనీ, సబ్‌స్టేషన్, ఐడిఎ జీడిమెట్ల, కుత్బుల్లాపూర్, మేడ్చల్-మల్కాజిగిరి-500055	శ్రీ/శ్రీమతి తోపాల వరలక్ష్మి ఇ.నం. ఎల్‌ఐజి 241 టిఐజిసి కాలనీ, సబ్‌స్టేషన్, ఐడిఎ జీడిమెట్ల, కుత్బుల్లాపూర్, మేడ్చల్-మల్కాజిగిరి-500055	సి-18 అడ్‌హక్ తేది: 18-08-2022	ఏప్రిల్-20	ఆగస్టు-20	రూ.53592
12	52000672140001001	మెస్సర్స్ జెబెస్ గిరి కాంట్రాక్టర్ ఇ.నం. 2-24-105/13/3, లక్ష్మీనారాయణ కాలనీ, ఐడిఎ ఉప్పల్, మేడ్చల్-మల్కాజిగిరి-500039	శ్రీ/శ్రీమతి జెబెస్ గిరి ఇ.నం. 2-24-105/13/3, లక్ష్మీనారాయణ కాలనీ, ఐడిఎ ఉప్పల్ మేడ్చల్-మల్కాజిగిరి-500039	(ఎ) సి-18 అడ్‌హక్ తేది: 19-04-2023 (బి) సి-18 అడ్‌హక్ తేది: 25-05-2023 (సి) సి-18 అడ్‌హక్ తేది: 25-05-2023	అక్టోబర్-18 నవంబర్-20 ఏప్రిల్-21	సెప్టెంబర్-20 డిసెంబర్-20 మార్చి-21	రూ.171922 రూ.19404 రూ.21252
13	52000673150001018	మెస్సర్స్ ఏజిస్ సెక్యూరిటీ ఫోర్స్ ప్లాట్ నం. 15, రోడ్ నం. 4, మారుతీనగర్, లోతుకుంట, అల్వాల్, హైదరాబాద్-500015	శ్రీ/శ్రీమతి అబ్దుల్ నబీ ప్లాట్ నం. 15, రోడ్ నం. 4, మారుతీనగర్, లోతుకుంట, అల్వాల్, హైదరాబాద్-500015	సి-18 అడ్‌హక్	ఏప్రిల్-21 తేది: 26-08-2022	మార్చి-22	రూ.94248
14	52000673940001019	మెస్సర్స్ బాలు ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ 1-27, శ్రీకాంత్ కాలనీ, ఆమన్‌గల్, రంగారెడ్డి, తెలంగాణ-509321	శ్రీ/శ్రీమతి కమ్మరి బాలు 1-27, శ్రీకాంత్ కాలనీ, ఆమన్‌గల్, రంగారెడ్డి, తెలంగాణ-509321	సి-18 అడ్‌హక్ తేది: 26-08-2022	మే-18	మార్చి-22	రూ.257565
15	52000675480001019	మెస్సర్స్ కారిబౌ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, ప్లాట్ నం. 1-95/5/125& 126, పత్రికా నగర్, ఎంఎస్‌ఆర్ ఆర్కేడ్, 3వ అంతస్తు, మాదాపూర్ హైదరాబాద్-500081 మెస్సర్స్ కారిబౌ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, ప్లాట్ నం. 9/11, సెక్టార్3, గోల్డెన్ హైట్స్, హుడా టెక్నో ఎన్‌క్లేవ్, మాదాపూర్, హైదరాబాద్-500081 మెస్సర్స్ కారిబౌ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, 1-9-383/2/9, ఇ.సి కాంప్లెక్స్, కుషాయిగూడ, హైదరాబాద్-500062	శ్రీ/శ్రీమతి వెంకట శ్రీకాంత్ బోలేపల్లి ప్లాట్ నం. 102. శ్రీ రెసిడెన్సీ, తిరుమల హిల్స్, పుప్పాలగూడ, హైదరాబాద్-500089	సి-18 అడ్‌హక్ తేది:03-01-2023	ఏప్రిల్-18	మార్చి-22	రూ.530145
16	52000676110001099	మెస్సర్స్ సిటి బిజినెస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, ఫ్లాట్ నం. 501, ప్లాట్ నం. 986 & 987, సాయి కిరణ్ రెసిడెన్సీ, అయ్యప్ప సొసైటీ, కానంపేట, మాదాపూర్, హైదరాబాద్-500081 మెస్సర్స్ సిటి బిజినెస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, ప్లాట్ నం. 12 ఎ&బి, ఐ.ఇ కూకట్‌పల్లి, ఐడిపిఎల్, కూకట్‌పల్లి, హైదరాబాద్-500037	శ్రీ/శ్రీమతి కిశోర్ కర్నాటి ఫ్లాట్ నం. 501, ప్లాట్ నం. 986 & 987, సాయి కిరణ్ రెసిడెన్సీ, అయ్యప్ప సొసైటీ, కానంపేట, మాదాపూర్, హైదరాబాద్-500081	సి-18 అడ్‌హక్ తేది:18-08-2022	ఫిబ్రవరి-20	ఫిబ్రవరి-21	రూ.288006
17	52000677410000699	మెస్సర్స్ రాజరాజేశ్వరి ఎలక్ట్రికల్ & సివిల్ వర్క్స్, ప్లాట్ నం. 48, నిర్మల నగర్, సరూర్‌నగర్, కర్మన్‌ఘాట్, హైదరాబాద్-500079	శ్రీ/శ్రీమతి వెంకటేశ్వర్లు నారగోని 8-1-59/30, నిర్మల నగర్, హనుమాన్ దేవాలయం ఎదురుగా కర్మన్‌ఘాట్, హైదరాబాద్-500079	(ఎ) సి-18 అడ్‌హక్ తేది:28-04-2023 (బి) సి-18 అడ్‌హక్ తేది:28-04-2023	మే-18 ఏప్రిల్-22	డిసెంబర్-21 సెప్టెంబర్-22	రూ.71659 రూ.5544
18	52000678880001019	మెస్సర్స్ నాగభూషణం మ్యాన్‌పవర్ సర్వీసెస్ గోకుల్ నగర్, బీబీనగర్, నాచారం, ఉప్పల్, హైదరాబాద్-500076 మెస్సర్స్ నాగభూషణం మ్యాన్‌పవర్ సర్వీసెస్, 4-10-ఎ, యాచారం, రంగారెడ్డి, తెలంగాణ-501509	శ్రీ/శ్రీమతి నాగభూషణం గోకుల్ నగర్, బీబీనగర్, నాచారం, ఉప్పల్, హైదరాబాద్-500076	సి-18 అడ్‌హక్ తేది:23-05-2023	మార్చి-22	మార్చి-22	రూ.36960
19	52000680220001099	మెస్సర్స్ రైట్‌ఫిక్స్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ 13/5, లక్ష్మీనగర్, రాక్‌టౌన్,నాగోల్, మన్సూరాబాద్, హైదరాబాద్-500068	శ్రీ/శ్రీమతి కవిత జ్వాల తడికమళ్ల 11-13-1194, ఫ్లాట్ నం. 241, రోడ్ నం. 10, వాసవి కాలనీ, కొత్తపేట, సరూర్‌నగర్, హైదరాబాద్-500035	సి-18 అడ్‌హక్ తేది:15-02-2023	మార్చి-22	సెప్టెంబర్-22	రూ.21252
20	52000685010001019	మెస్సర్స్ ఎస్. సాయి శ్రావణ్ కాంట్రాక్టర్ 6-73, కానుకుర్తి, దామరగిద్ద మం., మహబూబ్‌నగర్, తెలంగాణ-509407	శ్రీ/శ్రీమతి ఎస్. సాయి శ్రావణ్ 6-73, కానుకుర్తి, దామరగిద్ద మం., మహబూబ్‌నగర్, తెలంగాణ-509407	సి-18 అడ్‌హక్ తేది:13-06-2023	ఆగస్టు-18	జూన్-22	రూ.248903
21	52000685120001019	మెస్సర్స్ రాజారం గార్మెంట్స్ ప్లాట్ నం. 67, బహదూర్‌పల్లి క్రాస్‌రోడ్, సాయినాథ్ సొసైటీ, కుత్బుల్లాపూర్, హైదరాబాద్-500043	శ్రీ/శ్రీమతి శ్రీధర్ గాదిపల్లి ప్లాట్ నం. 67, బహదూర్‌పల్లి క్రాస్‌రోడ్, సాయినాథ్ సొసైటీ, కుత్బుల్లాపూర్, హైదరాబాద్-500043	సి-18 అడ్‌హక్ తేది:02-05-2023	మార్చి-20	మార్చి-22	రూ.34650
22	52000685490000911	మెస్సర్స్ టెక్నో టూర్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఇ.నం.6-7-217, 38/బి, బన్సీలాల్ పేట, బైబిల్ హౌస్ దగ్గర, సికింద్రాబాద్, హైదరాబాద్, తెలంగాణ-500003	శ్రీ/శ్రీమతి పాలకోటి క్లారా ప్రియదర్శిని 1-11-126, జయా ఎన్‌క్లేవ్, 102, శ్యాములాల్ బిల్డింగ్, బేగంపేట్, హైదరాబాద్ - 500016	సి-18 అడ్‌హక్ తేది:24-11-2023	అక్టోబర్-18	జూన్-23	రూ.173597
23	52000685620000905	మెస్సర్స్ కెజిఎన్ ఎలక్ట్రికల్ వర్క్స్ 12-2-790, మెహిదీపట్నం, హైదరాబాద్-500028	శ్రీ/శ్రీమతి సయ్యద్ సలామత్ రజా 12-2-496, సాయిగ్రాండ్ కాలనీ, గుడిమల్కాపూర్, మెహిదీపట్నం-500028	సి-18 అడ్‌హక్ తేది:23-01-2024	నవంబర్-18	మార్చి-22	రూ.42504
24	52000685860000999	మెస్సర్స్ జై మా దుర్గ ఎంటర్‌ప్రైజెస్ ఇస్నాపూర్ క్రాస్‌రోడ్, పటాన్‌చెరు సంగారెడ్డి జిల్లా, తెలంగాణ-500017	శ్రీ/శ్రీమతి సంయుక్త బెహెరా ఇస్నాపూర్ క్రాస్‌రోడ్, పటాన్‌చెరు సంగారెడ్డి జిల్లా, తెలంగాణ-500017	సి-18 అడ్‌హక్ తేది:01-02-2024	డిసెంబర్-22	మార్చి-23	రూ.266677
25	52000686290001099	మెస్సర్స్ పి.బి.ఆర్ మ్యాన్ పవర్ ఇ.నం.3-16-98/5, వెంకటరెడ్డినగర్, రామంతాపూర్ భగాయత్, హైదరాబాద్-500013	శ్రీ/శ్రీమతి రాజశేఖర్ యాదవ్, పందనబోయిన 8-56, ద్వారకా చర్ల, రాజుపాలెం-523326	సి-18 అడ్‌హక్ తేది:22-09-2023	డిసెంబర్-19	సెప్టెంబర్-20	రూ.22176
26	52000686360000999	పర్‌ఫెక్ట్ ఎర్త్ మూవింగ్ & ఇంజనీరింగ్ వర్క్స్ పి.నం. 35, బాచుపల్లి, కుత్బుల్లాపూర్-500090	శ్రీ/శ్రీమతి హాషం అలీ సయ్యద్, ప్లాట్ నం. 45, బాచుపల్లి, కుత్బుల్లాపూర్, కుత్బుల్లాపూర్	సి-18 అడ్‌హక్ తేది:12-09-2023	జనవరి-21	మార్చి-21	రూ.20790
27	52000681550000911	మెస్సర్స్ విదేరే సాఫ్ట్ కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఇ.నం. 5-180, మైత్రి నగర్, మదీనాగూడ ఫేజ్-2, మియాపూర్, హైదరాబాద్ - 500049	శ్రీ/శ్రీమతి శ్రీనివాస్ కూనపులి ఇ.నం. 5-180, మైత్రి నగర్, మదీనాగూడ ఫేజ్-2, మియాపూర్, హైదరాబాద్ - 500049	సి-18 అడ్‌హక్ తేది:04-01-2023	జులై-18	డిసెంబర్-21	రూ.159914
28	52000687300001302	మెస్సర్స్ మైత్రి ఎడ్యుకేషనల్ సొసైటీ, 3-11-246/1, రోడ్‌నం.2, శ్రీ శంకర్ కాలనీ, ఎల్‌బి నగర్, సరూర్ నగర్, రంగారెడ్డి-500035	శ్రీ/శ్రీమతి సీమర్ల రాజ్‌కుమార్ రెడ్డి 3-11-246/1, రోడ్‌నం.2 శ్రీ శంకర్ కాలనీ, ఎల్‌బి నగర్, సరూర్ నగర్, రంగారెడ్డి-500035	సి-18 అడ్‌హక్ తేది:23-01-2024	మార్చి-20	సెప్టెంబర్-21	రూ.70224
29	52000687350000999	డి. శ్రీనివాసులు ఎలివేటర్స్ కాంట్రాక్టింగ్ కంపెనీ, ప్లాట్ నం. 36, పద్మశాలి కాలనీ, ఓల్డ్ బోయిన్‌పల్లి, హైదరాబాద్-500003	శ్రీ/శ్రీమతి శ్రీనివాసులు దొడ్డికాడ, ప్లాట్ నం. 36, పద్మశాలి కాలనీ ఓల్డ్ బోయిన్‌పల్లి, హైదరాబాద్-500003	సి-18 అడ్‌హక్ తేది:03-10-2023	ఆగస్టు-18	జులై-21	రూ.99042
30	52000687990001018	మెస్సర్స్ మెట్రో హాక్ సెక్యూరిటీ & ఫెసిలిటీ సర్వీసెస్ ఇ.నం. 12-50/1, రాజ్‌సుఖ్ నగర్, పుడమి స్కూల్ దగ్గర, నాగారం, కీసర-500083	శ్రీ/శ్రీమతి జె. వెంకట్ రమణ ఇ.నం. 12-50/1, రాజ్‌సుఖ్ నగర్, పుడమి స్కూల్ దగ్గర, నాగారం, కీసర, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ-500083	సి-18 అడ్‌హక్ తేది:01-11-2023	ఆగస్టు-18	జూన్-20	రూ.138023
31	52000688170001009	మెస్సర్స్ సనా పెయింటింగ్ కాంట్రాక్ట్ వర్క్స్ 35-74, ప్రకాష్ నగర్, మిర్యాలగూడ-508207	శ్రీ/శ్రీమతి షేక్ జానీపాషా, 14-64, సీతారామపురం, మిర్యాలగూడ - 508207 శ్రీ/శ్రీమతి షేక్ అఫ్జల్ పాషా, 7-998, బంగారుగడ్డ, మిర్యాలగూడ-508207	సి-18 అడ్‌హక్ తేది:31-10-2023	అక్టోబర్-18	మార్చి-23	రూ.275468
32	52000688190000999	మెస్సర్స్ మెర్సీ సర్వీసెస్ 10-5-779/38/2/1, వెంకట్ నగర్, తుకారాం గేట్, హైదరాబాద్-500017	శ్రీ/శ్రీమతి సురేష్, 10-5-779/38/2/1, వెంకట్ నగర్, తుకారాం గేట్, హైదరాబాద్-500017	సి-18 అడ్‌హక్ తేది:20-11-2023	జూన్-19	జూన్-23	రూ.68781
33	52000688580000999	మెస్సర్స్ బాల త్రిపుర సుందరి ఎంటర్ ప్రైజెస్, ఇ.నం. 9-28, డి.నగర్, ఇస్నాపూర్, పటాన్‌చెరు, హైదరాబాద్-502319	శ్రీ/శ్రీమతి సాన సింహాచలం ఇ.నం. 9-28, డి.నగర్, ఇస్నాపూర్, పటాన్‌చెరు, హైదరాబాద్-502319	సి-18 అడ్‌హక్ తేది:28-05-2022	ఏప్రిల్-20	ఏప్రిల్-20	రూ.28644
34	52000689030000902	మెస్సర్స్ అభిమన్య ఎంటీరియో ప్రైవేట్ లిమిటెడ్, ఫ్లాట్ నం. 104, లాన్సమ్ మాధవ్ టవర్స్, గఫూర్ నగర్, మాదాపూర్, హైదరాబాద్-500081	శ్రీ/శ్రీమతి సాగిరాజు దిలీప్ వర్మ ఫ్లాట్ నం. 104, లాన్సమ్ మాధవ్ టవర్స్, గఫూర్ నగర్, మాదాపూర్, హైదరాబాద్-500081	(ఎ) సి-18 అడ్‌హక్ తేది:10-11-2022 (బి) సి-18 అడ్‌హక్ తేది:10-11-2022	ఏప్రిల్-20 జనవరి-21	సెప్టెంబర్-20 మార్చి-21	రూ.68900 రూ.34470
35	52000689280001099	మెస్సర్స్ ఆర్.ఎస్.క్లోతింగ్, ఫ్లాట్ నం. 9, సర్వే నం. 105, శక్తి కాంప్లెక్స్, సూరారం, జీడిమెట్ల, హైదరాబాద్-500015 మెస్సర్స్ ఆర్.ఎస్.క్లోతింగ్, ఇ.నం. 2-150/10/ఎస్ఆర్, నారాయణ మల్లారెడ్డి హాస్పిటల్ ఎదురుగా, సూరారం, కుత్బుల్లాపూర్, మేడ్చల్ - 500015	శ్రీ/శ్రీమతి లోలం శ్రీనివాస్ 2-13, జీడిమెట్ల, హైదరాబాద్-500015	సి-18 అడ్‌హక్ తేది:30-05-2022	ఏప్రిల్-20	మార్చి-21	రూ.26334
36	52000691130000999	మెస్సర్స్ రోజ ప్రకాష్ ఫ్యాబ్రికేషన్ వర్క్స్ ఇ.నం. 2-86, పాటి విలేజ్ పాటిఘన్‌పూర్ పటాన్‌చెరు, 502300	శ్రీ/శ్రీమతి ప్రకాష్ బడే ఇ.నం.2-86, పాటి గ్రామం, పాటిఘన్‌పూర్ పటాన్‌చెరు,502300	సి-18 అడ్‌హక్ తేది: 12.02.2024	డిసెంబర్ 18	సెప్టెంబర్ 23	రూ. 288173
37	52000692320000699	ఆర్‌జె ఫ్యాబ్రికేషన్ ప్లాట్ నం. 104,105,106,107,117 వర్షశ్రీ అపార్ట్‌మెంట్, అత్వెల్లి-501401	శ్రీ/శ్రీమతి రాజేష్‌కుమార్ తరుమెళ్ళ ప్లాట్ నం.104,105, 106,107,117, వర్షశ్రీ అపార్ట్ మెంట్స్, అత్వెల్లి-501401	సి-18 అడ్‌హక్ తేది: 12.02.2024	డిసెంబర్ 18	సెప్టెంబర్ 23	రూ. 432259
38	52000692360000999	విఎస్ఆర్ ఎలక్ట్రికల్ ఎంటర్‌ప్రైజెస్ 14-1-62/1,అల్లాపూర్ బోరబండ -500018	శ్రీ/శ్రీమతి గాంధీ వాంకుడోత్ సీతారామపురం,కోరుకొండ ఖమ్మం-507003	సి-18 అడ్‌హక్ తేది:12.02.2024	డిసెంబర్ 18	సెప్టెంబర్ 23	రూ.288173
39	52000693340000999	ఎంఎ ఎలక్ట్రికల్ వర్క్స్ ఇ.నం.9-4-29/87/3ఎ హకీంపేట్,టోలిచౌకి-500008	శ్రీ/శ్రీమతి మీర్ వాజీద్ అలీ ఇ.నం.9-4-29/87/3ఎ టోలిచౌకి,హకీంపేట-500008	సి-18 అడ్‌హక్ తేది:20.05.2024	జనవరి 19	అక్టోబర్ 21	రూ.174405
40	52000693570001099	మెస్సర్ ఆర్ఎస్ గ్రూప్స్ ప్లాట్ నం.219, బిఎన్‌రెడ్డినగర్ చర్లపల్లి, ఘట్కేసర్-500063	శ్రీ/శ్రీమతి రాహుల్ హజారిక ప్లాట్‌నం.219, బిఎన్‌రెడ్డినగర్ చర్లపల్లి, ఘట్కేసర్-500063	సి-18 అడ్‌హక్ తేది:08.02.2024	డిసెంబర్ 18	ఆగస్టు 23	రూ.283553
41	52000697040001099	మెస్సర్ బీరెన్‌దాస్ సోనా సెక్యూరిటీ సర్వీస్ ఇ.నం.14-59, శ్రీరాంనగర్ కాలనీ, పటాన్‌చెరు-502319	శ్రీ/శ్రీమతి బీరెన్‌దాస్ ఇ.నం.14-59, శ్రీరాంనగర్ కాలనీ, పటాన్‌చెరు-502319	సి-18 అడ్‌హక్ తేది:20.02.2024	నవంబర్ 18	మే 20	రూ. 221760
42	52000697200000999	మెస్సర్ జైవీ ఫార్మాస్యూటికల్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఇ.నం 6-206, జీహెచ్ఎంసి ఆఫీస్ సమీపాన పటాన్‌చెరు, మెదక్ -502319 మెస్సర్ జైవీ ఫార్మాస్యూటికల్స్ ప్రైవేట్ లిమిటెడ్, 6-3-885/7సి /2ఎస్/1, 2వ అంతస్తు,అమిత్ ప్లాజా, సోమాజీగూడ సర్కిల్, హైదరాబాద్-500082	శ్రీ/శ్రీమతి మోహిత్ గుప్తా ఇ.నం.4-72,లింగంపల్లి తుల్జాభవానీ ఆలయం సమీపాన తారానగర్, శేరిలింగంపల్లి -500019	సి-18 అడ్‌హక్ తేది:08.09.2022	సెప్టెంబర్ 20	మార్చి 22	రూ. 18620
43	52000697370001001	మెస్సర్స్ పూజిత ఎలక్ట్రికల్ అండ్ ఇంజనీరింగ్ వర్క్స్ 3-8-14/1, పెద్దబండ గొల్లగూడెం,నల్గొండ-508001	శ్రీ/శ్రీమతి అమంచి శ్రీనివాస్ 3-8-14/1, పెద్దబండ గొల్లగూడెం,నల్గొండ-508001	సి-18 అడ్‌హక్ తేది:09.02.2024	నవంబర్ 18	డిసెంబర్ 21	రూ.198660
44	52000697970001099	మెస్సర్ నిస్సి గ్రూప్స్ మ్యాన్‌పవర్ సర్వీసెస్, హెచ్.నెం 5-1-11/3/4/ఎ1, ఓల్డ్ మీర్‌పేట్, మల్లాపూర్,ఉప్పల్,హైదరాబాద్ 500076 మెస్సర్ నిస్సి గ్రూప్ మెట్రో రైల్వేస్టేషన్ మ్యాన్‌పవర్ సర్వీసెస్, 3-9 సికింద్రాబాద్-500003	శ్రీ/శ్రీమతి మారపల్లి సంజయ్, ఇ.నం.5-1-11/3/4/ఎ1, ఓల్డ్ మీర్‌పేట,మల్లాపూర్ ఉప్పల్, హైదరాబాద్-500076	సి-18 అడ్‌హక్ తేది:01.02.2024	నవంబర్ 18	డిసెంబర్ 21	రూ.41786
45	52000698000001099	హైటెక్ ఫ్యాబ్రికేటర్స్ ఇ.నం.24-741, పంచశీల కాలనీ,ప్రగతి స్కూల్ దగ్గర రంగారెడ్డినగర్,ఐడిపిఎల్ కుత్బుల్లాపూర్-500037	శ్రీ/శ్రీమతి మజారుద్దీన్ మహ్మద్ 24-741, పంచశీల కాలనీ, ప్రగతి హైస్కూల్ సమీపంలో రంగారెడ్డినగర్,కుత్బుల్లాపూర్-500037	సి-18 అడ్‌హక్ తేది:08.02.2024	డిసెంబర్ 18	సెప్టెంబర్ 23	రూ.288173
46	52000698360000999	మెస్సర్ జి.సుధీర్ రెడ్డి ఎలక్ట్రికల్ & సివిల్ కాంట్రాక్టర్ 8-9-7/ఇ, రోడ్ నం.6, హేమానగర్,బోడుప్పల్-500039	శ్రీ/శ్రీమతి సుధీర్‌రెడ్డి గడుసు 3-101/1,కట్టంగూర్, మునుగుంట్ల-508205	సి-18 అడ్‌హక్ తేది:02.02.2024	డిసెంబర్ 18	సెప్టెంబర్ 23	రూ. 288173
47	52000698990000999	మెస్సర్ సాయికృష్ణ ఎంటర్‌ప్రైజెస్,2-62,బుర్దిపాడ్ జహీరాబాద్-502228	శ్రీ/శ్రీమతి గిరిజమ్మ కృష్ణారెడ్డి 2-62,బుర్దిపాడ్ జహీరాబాద్-502228	సి-18 అడ్‌హక్ తేది:12.02.2024	డిసెంబర్ 18	సెప్టెంబర్ 23	రూ. 576345
48	52000699050000599	ఎస్ఆర్‌బి కన్సల్టెంట్స్ నం.46-52/2, భగత్‌సింగ్ నగర్ జగద్గిరిగుట్ట,హైదరాబాద్ -500037	శ్రీ సుజాతా నాగిరెడ్డి నం.48 451 5, గణేష్‌నగర్ చింతల్,హైదరాబాద్ 500054	సి-18 అడ్‌హక్ తేది:01.02.2024	జూన్ 20	సెప్టెంబర్ 23	రూ.129360
49	52000699950001099	మెస్సర్స్ తహారా ఎలక్ట్రికల్ మరియు సివిల్ కాంట్రాక్టర్స్ ఇ.నం.3-16-105/1,2వ అంతస్తు, వెంకట్ రెడ్డినగర్, రామంతాపూర్,మల్కాజిగిరి, హైదరాబాద్-500047	శ్రీ /శ్రీమతి ఎంఎ రహీమ్ ఇ.నం.3-16-105/1,2వ అంతస్తు, వెంకట్ రెడ్డినగర్, రామంతాపూర్,మల్కాజిగిరి, హైదరాబాద్-500047	సి-18 అడ్‌హక్ తేది:13.03.2023	జూన్ 18	ఫిబ్రవరి 22	రూ.244687
50	52000700100000699	మెస్సర్స్ టెక్నో వి ఇంజనీరింగ్ 1-72/4బి/3బి, సైబర్‌హిల్స్ కాలనీ,గచ్చిబౌలి, శేరిలింగంపల్లి రంగారెడ్డి జిల్లా -500032	శ్రీ /శ్రీమతి దామోదర మహేష్ కొమ్ముల,1-72/4బి/3బి, సైబర్‌హిల్స్,కాలనీ,గచ్చిబౌలి, శేరిలింగంపల్లి,రంగారెడ్డి జిల్లా -500032	సి-18 అడ్‌హక్ తేది:28.04.2023	ఫిబ్రవరి 19	సెప్టెంబర్ 22	రూ.71553
51	52000701010001102	మెస్సర్స్ వెస్టిన్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్. ఇ.నం1-4/సిపి/218/4/70&71, సెంట్రల్ పార్క్ ఫేజ్-2, కొండాపూర్, హైదరాబాద్-500084	శ్రీ /శ్రీమతి వీరమనేని జితేందర్, హెచ్‌ఐజి 151 ఫేజ్ 1 2 రోడ్ నెం.5, మహారాష్ట్ర బ్యాంక్ సమీపాన,కెపిహెచ్‌బి కాలనీ,కూకట్‌పల్లి-500072	సి-18 అడ్‌హక్ తేది:27.06.2024	మే 19	మార్చి 24	రూ.278355
52	52000701090000606	మెస్సర్స్ ఎస్ఎస్ఎస్ఎస్ శ్రీనివాస దేవసాని క్రియేటివ్ స్మైల్, ప్లాట్ నం.4-9-774/34 దుబ్బాపి, రాజరాజేశ్వరినగర్ కాలనీ, హయత్‌నగర్, హైదరాబాద్, తెలంగాణ, 501505	శ్రీ /శ్రీమతి దేవసాని శ్రీనివాస్ ప్లాట్ నం.4-9-774/34 దుబ్బాపి, రాజరాజేశ్వరినగర్ కాలనీ, హయత్‌నగర్, హైదరాబాద్, తెలంగాణ, 501505	సి-18 అడ్‌హక్ తేది:01.02.2024	నవంబర్ 18	ఏప్రిల్ 22	రూ.211135
53	52000701290000999	మెస్సర్స్ వెంకటేశ్వర ఎంటర్ ప్రైజెస్ ఇ.నం.3-5-140/11 హైదర్‌గూడ, రాజేంద్రనగర్ శివాలయం టెంపుల్ ఎదురుగా,అత్తాపూర్ హైదరాబాద్, రంగారెడ్డి, తెలంగాణ-500048 మెస్సర్స్ వెంకటేశ్వర ఎంటర్ ప్రైజెస్, ఇ.నం.18-8-302/4 తానాజీనగర్, ఉప్పుగూడ-500053	శ్రీ /శ్రీమతి పైడి కళాదేవేందర్ ఇ.నం.18-8-302/4 తానాజీనగర్, ఉప్పుగూడ-500053	సి-18 అడ్‌హక్ తేది:09.2.2024	డిసెంబర్ 18	సెప్టెంబర్ 23	రూ.568111
54	52000701870000999	మెస్సర్స్ శ్రీ రేణుకా ఎల్లమ్మ ఎంటర్ ప్రైజెస్2-2,కోడైర్ నర్సాయిపల్లి-509102	శ్రీ /శ్రీమతి బి రమేష్ కుమార్ 2-2,కోడైర్, నర్సాయిపల్లి-509102	సి-18 అడ్‌హక్ తేది:09.07.2024	జనవరి 19	జూలై 22	రూ.215985
55	52000702130001399	మెస్సర్స్ ఎన్‌ఫోర్స్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ 3వ అంతస్తు,6-1-85/8/బి, సత్యసదన్,సైఫాబాద్,లక్డికాపూల్, హైదరాబాద్,తెలంగాణ-500004	శ్రీ /శ్రీమతి సిహెచ్ శ్రీధర్ రెడ్డి ఇ.నం.6-6-310/4,వివేకానంద నగర్,వివేకానందనగర్,గౌతమి కాలేజ్ సమీపాన -508001	సి-18 అడ్‌హక్ తేది:01.02.2024	నవంబర్ 18	మే 23	రూ. 277200
56	5200070215000999	మెస్సర్స్ శ్రీ బాలగిరీష్ క్యాటరర్స్ 2-114, పెద్దకందుకూరు,యాదగిరిగుట్ట, యాదాద్రి, భువనగిరి, తెలంగాణ-508286	శ్రీ /శ్రీమతి శ్రీనివాసులు బందుగుల బోడసిద్దాయపల్లె, చింతోటు నెల్లూరు-524002	సి-18 అడ్‌హక్ తేది:09.02.2024	డిసెంబర్ 18	మార్చి 23	రూ. 255609
57	52000702710000999	మెస్సర్స్ సిరి ఎంటర్‌ప్రైజెస్ ఇ.నం.6-67, సాయిప్రియా కాలనీ, ముత్తంగి, పటాన్‌చెరు, సంగారెడ్డి, తెలంగాణ- 502300	శ్రీ /శ్రీమతి విజయ పెద్దిరెడ్డి ఇ.నం.4-69, బొల్లారం, జిన్నారం-502325	సి-18 అడ్‌హక్ తేది:12.02.2024	డిసెంబర్ 18	జూన్ 20	రూ.107993
58	52000702890001001	మెస్సర్స్ మా బ్రదర్ స్టీల్ ఇండస్ట్రీస్ 1-6-261, జిఎన్ గార్డెన్ దగ్గర, జమిస్తాన్‌పూర్ ముషీరాబాద్,హైదరాబాద్-500020, మొబైల్ నం. 9701041028	శ్రీ /శ్రీమతి అక్బర్ పాషా మహ్మద్, 1-6-770, జమిస్తాన్‌పూర్,ముషీరాబాద్, హైదరాబాద్,తెలంగాణ 500020,	సి-18 అడ్‌హక్ తేది:08.02.2024	డిసెంబర్ 18	సెప్టెంబర్ 23	రూ.288173
59.	52000703400000999	మెస్సర్స్ శ్రీ రాఘవేంద్ర ట్రాన్స్‌ఫార్మర్స్ రిపైరింగ్ సెంటర్, 39-121, భండర్ నగర్ వనపర్తి, తెలంగాణ-509103	శ్రీ/శ్రీమతి తోట ప్రతాప్ రెడ్డి 39-121, భండర్ నగర్, వనపర్తి, తెలంగాణ -509103	సి-18 అడ్‌హక్ తేది.09-02-2024	డిసెంబర్-18	డిసెంబర్-21	రూ.210268
60.	52000703880000999	మెస్సర్స్ పివిఆర్ కార్పొరేట్ సొల్యూషన్స్, ప్లాట్ నం.225, గ్రౌండ్ ఫ్లోర్, రోడ్ నం.1 చక్రీపురంక్రాస్‌రోడ్స్,ఇసిఐఎల్, హైదరాబాద్-500 062.	శ్రీ/శ్రీమతి పసునూరి వేణు గోపాల్ రెడ్డి, ఫ్లాట్ నం.225, గ్రౌండ్‌ఫ్లోర్, రోడ్‌నం.1, చక్రీపురంక్రాస్‌రోడ్స్, , ఇసిఐఎల్, హైదరాబాద్-500062	సి-18 అడ్‌హక్ తేది.27-11-2023	మార్చి-20	మే-20	రూ.86311


(మిగతా 11వ పేజీలో)

బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన భద్రాద్రి

- రేపు అంకురార్పణ
- ఏప్రిల్ 6న శ్రీరామనవమి, 7న మహా పట్టాభిషేకం
- రేపటి నుంచి ఏప్రిల్ 12 వరకు నిత్య కల్యాణాల నిలిపివేత


మిథిలా స్టేడియంలో ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

భద్రాచలం, మార్చి28 (ఆంధ్రజ్యోతి):దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాద్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. రామక్షేత్రంలో ఆదివారం నుంచి వసంతపక్ష ప్రయుక్త నవాహ్నిక శ్రీరామ నవమి తిరు కల్యాణ బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. దీంతో పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. రామాలయం, కల్యాణమండపం పరిసర ప్రాంతాలు చలువ పందిళ్లు, చాందినీ వస్త్రాలతో అలంకరిస్తున్నారు. ఆలయానికి విద్యుద్దీపాలంకరణ చేపట్టడంతో దేదీప్యమానంగా ప్రకాశిస్తోంది. ప్రధాన కూడళ్లలో స్వాగత ద్వారాలు ఏర్పాటు చేయడంతో పట్టణం సరికొత్త శోభ సంతరించుకొంది. బ్రహ్మోత్సవాల తొలిరోజు శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకొని ఉదయం వేపపూత ప్రసాద వినియోగం, శ్రీసీతారామచంద్రస్వామి మూల వరులకు పంచామృతాభిషేకం నిర్వహించనున్నారు. సాయంత్రం నూతన పంచాంగ శ్రవణం చేయనున్నారు. ఏప్రిల్ 2న ధ్వజపట లేఖనం, 3న గరుడాదివాసం, 4న అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం, 5న ఎదుర్కోలు, 6న శ్రీరామనవమిని పురస్కరించుకొని శ్రీ సీతారాముల తిరు కల్యాణం, శ్రీరామ పునర్వసు దీక్ష ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 7న మహా పట్టాభిషేకం, 8న సదస్యం నిర్వహించనుండగా 12న చక్రతీర్థం, ద్వాదశ ప్రదక్షిణాలు, ద్వాదశ ఆరాధనలు, శ్రీపుష్ప యాగంతో ఉత్సవం సమాప్తి కానుంది. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం నుంచి ఏప్రిల్ 12 వరకు ఆలయంలో నిత్య కల్యాణాలను నిలిపివేయనున్నారు. శనివారం నుంచి ఏప్రిల్ 21వరకు ప్రభుత్వోత్సవం(దర్బారు సేవ), పవళింపు సేవలు సైతం నిలిపివేస్తారు. ఇందుకు ప్రత్యామ్నాయంగా ప్రతి రోజు తిరువీధి సేవ నిర్వహించనున్నారు.


కైలాస వాహనంపై విహరిస్తున్న స్వామిఅమ్మవార్లు

కైలాస వాహనంపై శ్రీశైలేశుడు

మహాదుర్గగా భ్రమరాంబ అమ్మవారి దర్శనం

శ్రీశైలం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో ఉగాది మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు శుక్రవారం భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు కైలాస వాహనంపై విహరించారు. మహాదుర్గ అలంకారంలో భ్రమరాంబికాదేవి అమ్మవారు దర్శనమిచ్చారు. మంగళవాయిద్యాలు, కళాకారుల సంగీత, జానపద నృత్యాల నడుమ స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆలయ రాజగోపురం నుంచి వెలుపలకి తొడ్కొని వచ్చి గ్రామోత్సవం జరిపారు. గ్రామోత్సవంలో విశేషంగా భక్తులు పాల్గొన్నారు. ఉగాది మహోత్సవాల్లో భాగంగా మూడోరోజు శనివారం సాయంత్రం ప్రభోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. రాత్రి స్వామి, అమ్మవార్లకు నంది వాహన సేవ, మహా సరస్వతి అలంకరణలో అమ్మవారు దర్శనం ఇవ్వనున్నారు.

నిమ్స్‌లో చిన్నపిల్లలకు ఉచిత గుండె చికిత్సలు

- ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ ఉంటే ఉచితంగా సర్జరీలు
- తెలంగాణతోపాటు ఏపీ వారికీ అవకాశం: వైద్యులు

హైదరాబాద్ సిటీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నిమ్స్‌లో చిన్నపిల్లలకు గుండె చికిత్సలు ఉచితంగా అందిస్తున్నట్లు ఆ ఆసుపత్రి కార్డియోథెరాసిక్ విభాగం వైద్యులు తెలిపారు. ఆరోగ్యశ్రీ, సీఎం సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి అనుమతి పత్రాలు ఉంటే అన్ని వర్గాల పిల్లలకు ఉచితంగా శస్త్రచికిత్సలు చేయనున్నట్లు ప్రకటించారు. నిమ్స్‌లో పిల్లలకు గుండె పరీక్షలు, శస్త్రచికిత్సలు చేయరని చాలా మందికి అనుమానాలు ఉన్నాయని, వారి సందేహాలను నివృత్తి చేయడానికి ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమం చేపట్టినట్లు డాక్టర్ ప్రవీణ్ వివరించారు. నిమ్స్‌లో అన్ని వర్గాల వారికి గుండె సంబంధిత సమస్యలకు వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణలోని రోగులకు తల్లిదండ్రుల ఆధార్ కార్డు, రోగి జనన ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు ఉంటే సరిపోతుందని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారు అక్కడి ఆధార్ కార్డు, సీఎంఆర్ఎఫ్ లేఖ తెచ్చినా చికిత్స అందిస్తామని చెప్పారు. నిమ్స్ పాత భవనంలోని మొదటి అంతస్తు ఆరో నెంబరు వార్డు వద్ద పీడియాట్రిక్ కార్డియాక్ ఐసీయూ కింద ఉచితంగా పీడియాట్రిక్ కార్డియాక్ శస్త్రచికిత్స సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సెలవు రోజుల్లో మినహా ప్రతి రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు డాక్టర్ అమరేష్ రావు మార్గదర్శకంలో డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ గోపాల్ అందుబాటులో ఉంటారని వివరించారు. అవసరమైన రోగులు, వారి కుటుంబసభ్యులు వచ్చి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చని సూచించారు. ఇతర వివరాలకు 7893337836 నంబర్‌కు ఫోన్ చేయాలని డాక్టర్ ప్రవీణ్ తెలియజేశారు.

పాస్టర్ ప్రవీణ్ మృతి కేసులో 'సిట్' దూకుడు

రాజమహేంద్రవరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తీవ్ర సంచలనం సృష్టించిన పాస్టర్ పగడాల ప్రవీణ్ కుమార్ అనుమానాస్పద మృతిపై సిట్ దర్యాప్తు వేగవంతమైంది. ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ ఇన్‌చార్జిగా సిట్ దర్యాప్తు జరుగుతోంది. ఏపీ సీఎం చంద్రబాబు, పోలీసు ఉన్నతాధికారులు కేసు పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. అయితే, అంతపెద్ద వ్యక్తి బుల్లెట్‌పై రావడం ఏంటనే ప్రశ్నలు వచ్చాయి. సంఘటన జరిగిన తీరునుబట్టి ఇది ముమ్మాటికీ హత్యేనని క్రైస్తవ సంఘాలు ఆరోపించడంతో రాష్ట్ర ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. కాగా, పాస్టర్ మరణానికి దారి తీసిన కారణాలను వెలికితీసే పనిలో సిట్ నిమగ్నమైంది. ప్రత్యేక పోలీసులు అన్ని కోణాల్లో విచారణ ముమ్మరం చేశారు. ఒకటి రెండు రోజుల్లో కేసు కొలిక్కి రానున్నట్టు సమాచారం.

హైకోర్టు అడ్వొకేట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జగన్

హైదరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు అడ్వొకేట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా న్యాయవాది ఎ.జగన్ విజయం సాధించారు. సమీప ప్రత్యర్థి ఎస్. సురేందర్‌రెడ్డిపై 990 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. జగన్‌కు 1,724 ఓట్లు రాగా, సురేందర్‌రెడ్డికి 734 ఓట్లు వచ్చాయి. అధ్యక్ష పదవికి జగన్ పోటీ చేయడం ఇది నాలుగోసారి. గత ఎన్నికల్లో స్వల్ప మెజారిటీతో ఓడిపోయిన ఆయనకు న్యాయవాదులు ఈ సారి భారీ విజయం అందించారు. ఉపాధ్యక్షుడిగా జి.రాజేశ్వర్‌రెడ్డి, కార్యదర్శులుగా ఖాజా విజారత్ అలీ, ఇంద్రసేనారెడ్డి నూకపల్లి, సంయుక్త కార్యదర్శిగా అనిరుధ్ నెల్లికొండ, కోశాధికారిగా పెద్దాకుల పాపయ్య, క్రీడలు- సాంస్కృతిక కార్యదర్శిగా పి. రాములు విజయం సాధించారు. సీనియర్ కార్యవర్గ సభ్యునిగా గుడిపాటి హనుమంతరావు, మహిళా కార్యవర్గ సభ్యురాలిగా ఎన్.టి. లావణ్య, జనరల్ కార్యవర్గ సభ్యులుగా ఎం. అంజలీ దేవి, బి. శిరీష, వై. ప్రకాశ్, కె.నరేశ్ గెలుపొందారు. కాగా, ఎన్‌సీఎల్‌టీ హైదరాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎల్.వెంకటేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడిగా టి.విజయ్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శిగా ఎస్.రాజశేఖర్‌రావు, ట్రెజరర్‌గా సి.తులసీకృష్ణ ఎన్నికయ్యారు.

(10వ పేజీ తరువాయి)

61.	52000638160001001	మెస్సర్స్ మహేందర్ ఎలక్ట్రికల్ & సివిల్ కన్‌స్ట్రక్షన్స్ అపరేషన్ సర్వీసెస్. 1-460/5, ప్రగతి కాలనీ, ములుగు గ్రామం ములుగు-506343	శ్రీ/శ్రీమతి జంబుల మహేందర్, 1-460/5, ప్రగతి కాలనీ, ములుగు గ్రామం, ములుగు-506343	సి-18 అడ్‌హక్ తేది.05-12-2022	ఆగస్టు-17	మార్చి-22	రూ.2048335
62.	52000577900000999	మెస్సర్స్ శ్రీ ఇండస్ట్రియల్ సర్వీసెస్ ఇ.నం.1-20, కాసాల, హత్నూర, మెదక్-502296	శ్రీ/శ్రీమతి ఎ. విష్ణవ్ కృష్ణ, ఇ.నం.1-20, కాసాల, హత్నూర, మెదక్-502296	సి-18 అడ్‌హక్ తేది.29-03-2022	ఫిబ్రవరి-17	సెప్టెంబర్-21	రూ.342458
63.	52000577620001401	మెస్సర్స్ తిరుమల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్, 7-10-58, గోడౌన్ రోడ్ నిజామాబాద్-503001.	శ్రీ/శ్రీమతి డా. పరేశ్వర్‌రెడ్డి 7-10-58, గోడౌన్ రోడ్, నిజామాబాద్-503001	సి-18 అడ్‌హక్ తేది.14-10-2021	సెప్టెంబర్-16	మార్చి-21	రూ.1718475
64.	52000550790001099	మెస్సర్స్ జి ఎమ్ ఎంటర్‌ప్రైజెస్ 13-107/2, నెహ్రూనగర్, ఉర్దూ స్కూల్ సమీపమున, శేరిలింగంపల్లి, హైదరాబాద్, తెలంగాణ-500019	శ్రీ/శ్రీమతి షేక్ గఫ్ఫార్, మెస్సర్స్ జిఎమ్ ఎంటర్‌ప్రైజెస్, 13-107/2, నెహ్రూనగర్, ఉర్దూస్కూల్‌సమీపమున, శేరిలింగంపల్లి, హైదరాబాద్ తెలంగాణ-500019	సి-18 అడ్‌హక్ తేది.28-03-2022	జనవరి-17	సెప్టెంబర్-21	రూ.349965
65.	52000551140000999	మెస్సర్స్ Xceltop ఐటి సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఇ.నం.1-112/25/409, ఫ్లాట్ నం.409, శ్రీ సాయి కేశవ టవర్స్, కొండాపూర్, హైదరాబాద్, తెలంగాణ -500084	శ్రీ/శ్రీమతి శ్రీధర్ శీల, మెస్సర్స్ Xceltop ఐటి సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఇ.నం.1-112/25/409, ఫ్లాట్ నం.409, శ్రీ సాయి కేశవ టవర్స్, కొండాపూర్, హైదరాబాద్, తెలంగాణ-500084	సి-18 అడ్‌హక్ తేది.29-10-2021	జూలై-16	మార్చి-21	రూ.354420
66.	52000548980000999	మెస్సర్స్ శ్రీ సాయి కోట్స్ ఇ.నం.4-5-113, వాసుదేవ రెడ్డి నగర్ కాలనీ, అత్తాపూర్, రాజేంద్రనగర్, హైదరాబాద్, తెలంగాణ -500030	శ్రీ/శ్రీమతి నాంపల్లి శ్రీకాంత్ మెస్సర్స్ శ్రీసాయి కోట్స్, ఇ.నం.4-5-113, వాసుదేవ రెడ్డి నగర్ కాలనీ, అత్తాపూర్, రాజేంద్రనగర్ హైదరాబాద్, తెలంగాణ-500 030	సి-18 అడ్‌హక్ తేది.29-10-2021	ఆగస్టు-16	మార్చి-21	రూ.349058
67.	52000552070000905	మెస్సర్స్ మారుతి ఎలక్ట్రికల్స్, ఇ.నం.3429, ఫేజ్-2, బిహెచ్ఇఎల్, రామచంద్రాపురం, మెదక్, తెలంగాణ-502032	శ్రీ/శ్రీమతి కె ప్రసన్న కుమార్ ఇ.నం.3429, ఫేజ్-2, బిహెచ్ఇఎల్, రామచంద్రాపురం, మెదక్, తెలంగాణ-502032	సి-18 అడ్‌హక్ తేది.04-03-2022	జనవరి-17	సెప్టెంబర్-21	రూ.349965
68.	52000557330000999	మెస్సర్స్ సెరియమ్ విజువల్ ఎఫెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఫ్లాట్ నం.ఎల్‌హెచ్-3, 1501-1, ల్యాంకోహిల్స్, మణికొండ, రాజేంద్రనగర్, రంగారెడ్డి, తెలంగాణ-500089	శ్రీ/శ్రీమతి వి ఎస్ తేజ నిమ్మగడ్డ, ఇ.నం.12-464/7/1, ఆశ్రమ్ రోడ్, ఓల్డ్ టోల్‌గేట్ సమీపమున, తాడేపల్లి మండలం, తాడేపల్లి, గుంటూరు 522501	సి-18 అడ్‌హక్ తేది.02-02-2022	నవంబర్-16	సెప్టెంబర్-21	రూ.360690
69.	52000699500000999	మెస్సర్స్ లవసా ఫుడ్స్ & ఫ్రీజ్ ఇ.నెం.5 3 319 ఫ్లాట్ నెం. 166, రోడ్ నెం.9, వెంకటరావ్ నగర్ కాలనీ, కూకట్‌పల్లి హైదరాబాద్ - 500072	శ్రీమతి బిక్కిన సతీష్ పృథ్వీ 2-46-26/1, కాకతీయ నగర్, శ్రీదేవి కాలనీ కాకినాడ-533004	సి-18 అడ్‌హక్ తేది: 01-02-2024	డిసెంబర్-18	సెప్టెంబర్-23	రూ.576345
70	52000549100001001	మెస్సర్స్ సిగ్మా సర్వీసెస్, ఫ్లాట్ నెం.21, ఇ.నెం.5-5-184/26/11, ఇందిరానగర్ కాలనీ, వనస్థలిపురం, హైదరాబాద్-500074	శ్రీ/శ్రీమతి. పదూరి సుమంత్‌రెడ్డి ఫ్లాట్ నెం.201, విజమ్ సాయి అపార్ట్‌మెంట్స్, చింతలకుంట, హైదరాబాద్-500070	సి-18 అడ్‌హక్ తేది: 17.11.2020	ఏప్రిల్-16	సెప్టెంబర్-20	రూ.672942
71	52000553280001099	మెస్సర్స్ గౌరి శంకర్ కాంట్రాక్టర్ శ్రీ లక్ష్మీ నగర్ కాలనీ, ఫ్లాట్.నెం. 62, సర్వే.నెం.697/ఎ 697/బి సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సమీపాన అలియాబాద్ (గ్రా), షామీర్‌పేట్ (మం.) హైదరాబాద్, తెలంగాణ-500 078	శ్రీ/శ్రీమతి మచ్చా ప్రవీణ్ కుమార్ గౌడ్, 6-42, అలియాబాద్, షామీర్‌పేట్, రంగారెడ్డి, హైదరాబాద్, తెలంగాణ-500 078	సి-18 అడ్‌హక్ తేది: 01.11.2021	ఆగస్ట్-16	మార్చి-21	రూ.698115
72	52000554420001099	మెస్సర్స్ శ్రీ రామకృష్ణ ఎంటర్‌ప్రైజెస్, ఇ.నెం.12-1-331/44ఎ, దత్తాత్రేయ కాలనీ, ఆసిఫ్ నగర్, హైదరాబాద్, తెలంగాణ - 500028 (ఫోన్ నెం: 9440010007)	శ్రీ/శ్రీమతి కె.వి.జె.ఆర్ కోటేశ్వర రావ్, ఇ.నెం.12-1-331/44ఎ దత్తాత్రేయ కాలనీ, ఆసిఫ్ నగర్, హైదరాబాద్, తెలంగాణ-500028	సి-18 అడ్‌హక్ తేది: 04.03.2022	జనవరి-17	సెప్టెంబర్-21	రూ.349965
73	52000553680001001	మెస్సర్స్ ఎమ్.చంద్రశేఖర్ రెడ్డి ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్, డోర్.నెం. డోర్.నెం.1-80, కొండేడ్ (గ్రా) జడ్చర్ల (మం.) మహబూబ్‌నగర్ జిల్లా, తెలంగాణ-509 408	శ్రీ/శ్రీమతి ఎమ్.చంద్రశేఖర్ రెడ్డి మెస్సర్స్ ఎమ్.చంద్రశేఖర్ రెడ్డి ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్, డోర్.నెం. 1-80, కొండేడ్ (గ్రా), జడ్చర్ల (మం), మహబూబ్‌నగర్ జిల్లా తెలంగాణ-509 408	సి-18 అడ్‌హక్ తేది: 02.02.2022	అక్టోబర్-16	మార్చి-21	రూ.3180326
74	52000554710000099	మెస్సర్స్ శ్రీసాయి క్యాటరర్స్/శ్రీ సాయిరాం క్యాటరర్స్, ఇ.నెం. 1-1-306/37ఎ, శ్రీరామ్ నగర్ కాలనీ, కాప్రా, సికింద్రాబాద్-500062	శ్రీ/శ్రీమతి యెకా నాగేందర్‌కుమార్ మెస్సర్స్ శ్రీసాయి క్యాటరర్స్/శ్రీ సాయిరాం క్యాటరర్స్, ఇ.నెం. 1-1-306/37ఎ, శ్రీరామ్‌నగర్ కాలనీ కాప్రా సికింద్రాబాద్, తెలంగాణ-500062	సి-18 అడ్‌హక్ తేది: 03.08.2022	సెప్టెంబర్-16	మార్చి-21	రూ.343695
75	52000549290000606	మెస్సర్స్ శ్రీశివసాయి ఫ్యాబ్రికేషన్ వర్క్స్, ఇ.నెం.9-91/9/15/10, అశోక్ నగర్, బోడుప్పల్, ఉప్పల్ మేడ్చల్-మల్కాజిగిరి, హైదరాబాద్ తెలంగాణ-500 039	శ్రీ/శ్రీమతి డి.బ్రహ్మానంద రెడ్డి మెస్సర్స్ శ్రీశివసాయి ఫ్యాబ్రికేషన్ ఇ.నెం.9-91/9/15/10, అశోక్ నగర్, బోడుప్పల్, ఉప్పల్, మేడ్చల్-మల్కాజిగిరి, హైదరాబాద్ తెలంగాణ-500 039	సి-18 అడ్‌హక్ తేది: 26.08.2022	ఆగస్ట్-17	మార్చి-22	రూ.325133
76	52000554160000606	మెస్సర్స్ వైశాలి ప్రాజెక్ట్స్ ఎలక్ట్రికల్ మెకానికల్ సివిల్ వర్క్స్ డోర్.నెం.3-14-16/6, శ్రీనివాసపురం, రామంతపురం హైదరాబాద్-500013	శ్రీ/శ్రీమతి ఎమ్.నరేష్ రెడ్డి ఇ.నెం. 6-47/1, సుభాష్ నగర్ అమరచింత, మహబూబ్‌నగర్ తెలంగాణ	సి-18 అడ్‌హక్ తేది: 02.02.2022	సెప్టెంబర్-16	సెప్టెంబర్-21	రూ.371415
77	52000555220001303	మెస్సర్స్ మ్యా సెయింట్ మారియా హై స్కూల్, 18-3-463/1/106 శివాజీ నగర్, రాజన్నబావి, హైదరాబాద్-500053	శ్రీ/శ్రీమతి డి.జాన్సీ రాణి 18-3-463/1/106, శివాజీ నగర్, రాజన్నబావి, హైదరాబాద్-500053	సి-18 అడ్‌హక్ తేది: 03.02.2022	సెప్టెంబర్-16	మార్చి-21	రూ.343695
78	52000555770000602	మెస్సర్స్ కిరణ్ పవర్ సిస్టమ్స్ 7-8-227/2, గౌతమ్ నగర్, ఫిరోజ్‌గూడ, బాలానగర్, సికింద్రాబాద్, హైదరాబాద్-500011	శ్రీ/శ్రీమతి ముదియాల చెన్నా రెడ్డి, గౌతమ్ నగర్, బోయిన్‌పల్లి, సికింద్రాబాద్-500003	సి-18 అడ్‌హక్ తేది: 27.01.2022	నవంబర్-16	ఆగస్ట్-21	రూ.712140
79	52000586940000999	మెస్సర్స్ డాక్సా ఇంజనీరింగ్ వర్క్స్, ప్లాట్.నెం. 25-22/బి/6 రోడ్.నెం.4, కాకతీయనగర్ ఆర్.సి.పురం, మెదక్-502001 ఫోన్: 8885553030	శ్రీ/శ్రీమతి ఎటిపివి కుమార్ ప్లాట్ నెం.25-22/బి/6, రోడ్ నెం.4, కాకతీయ నగర్, ఆర్.సి. పురం, మెదక్-502001 ఫోన్: 8885553030	సి-18 అడ్‌హక్ తేది:12.05.2022	మార్చి-17	సెప్టెంబర్-21	రూ.334950
80	52000587420001099	మెస్సర్స్ జి.వి.రావ్ ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్, 3-106/ఎ, హనుమాన్ నగర్, లక్ష్మీ చిల్డ్రన్ హాస్పిటల్, చైతన్యపురి, దిల్‌సుఖ్ నగర్, హైదరాబాద్-500060	శ్రీ/శ్రీమతి హాకోరేణి దత్తసాగర్ 3-106/ఎ, హనుమాన్ నగర్, లక్ష్మీ చిల్డ్రన్ హాస్పిటల్, చైతన్యపురి, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్-500060	సి-18 అడ్‌హక్ తేది: 12.05.2022	మార్చి-17	సెప్టెంబర్-21	రూ.334950
81	52000545570001009	మెస్సర్స్ వల్లిశెట్టి లక్ష్మణరావ్ నం. 1-10-28-230/22, నాగార్జున కాలనీ, కుషాయిగూడ, హైదరాబాద్, తెలంగాణ-500 062	శ్రీ/శ్రీమతి వల్లిశెట్టి లక్ష్మణరావ్ మెస్సర్స్ వల్లిశెట్టి లక్ష్మణరావ్ నం. 1-10-28-230/22, నాగార్జున కాలనీ, కుషాయిగూడ హైదరాబాద్, తెలంగాణ-500062	సి-18 అడ్‌హక్ తేది: 12.10.2021	సెప్టెంబర్-16	మార్చి-21	రూ.343695
82	52000544940001099	మెస్సర్స్ శ్రీమణికంఠ ఎలక్ట్రికల్స్ ఇ.నెం.1-55, ఓల్డ్ హఫీజ్‌పేట, శేరిలింగంపల్లి, హైదరాబాద్, తెలంగాణ- 500 049	శ్రీ/శ్రీమతి కె.మాణిక్యం మెస్సర్స్ శ్రీ మణికంఠ ఎలక్ట్రికల్స్, ఇ.నెం. 1-55, ఓల్డ్ హఫీజ్‌పేట, శేరిలింగంపల్లి, హైదరాబాద్, తెలంగాణ- 500 049	సి-18 అడ్‌హక్ తేది: 22.12.2021	జూలై-16	మార్చి-21	రూ.354420
83	52000543480000999	మెస్సర్స్ మ్యాక్స్‌వ్యూ ఎలక్ట్రానిక్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, 1-76 శ్రీనివాస నగర్, బోడుప్పల్, హైదరాబాద్, తెలంగాణ-500092	శ్రీ/శ్రీమతి వై.నవీన్ కుమార్ యాదవ్, మెస్సర్స్ మ్యాక్స్‌వ్యూ ఎలక్ట్రానిక్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ 1-76, శ్రీనివాస్ నగర్, బోడుప్పల్ హైదరాబాద్, తెలంగాణ-500092	సి-18 అడ్‌హక్ తేది: 10.05.2022	ఫిబ్రవరి-17	సెప్టెంబర్-21	రూ.342458
84	52000542920001099	మెస్సర్స్ ప్రొగ్రెసివ్ ఇన్‌ఫ్రాటెక్ ఫ్లాట్.నెం.103, సాయి విశాల్ రెసిడెన్సీ, కొలన్ నారాయణ రెడ్డి కాలనీ, నిజాంపేట్, హైదరాబాద్ తెలంగాణ-500072	శ్రీ/శ్రీమతి ఆర్.నాగ మోహన్ రెడ్డి, మెస్సర్స్ ప్రొగ్రెసివ్ ఇన్‌ఫ్రా టెక్, ఫ్లాట్.నెం.103, సాయి విశాల్ రెసిడెన్సీ, కొలన్ నారాయణ రెడ్డి కాలనీ, నిజాంపేట, హైదరాబాద్, తెలంగాణ-500072	సి-18 అడ్‌హక్ తేది: 18.08.2022	జూన్-17	మార్చి-21	రూ.578251
85	52000542900000999	మెస్సర్స్ గోల్డెన్ సెక్యూరిటీ సొల్యూషన్, ఇ.నెం.8-3-228/12805/518, జవహర్ నగర్, యూసఫ్‌గూడ, హైదరాబాద్ తెలంగాణ-5000 045	శ్రీ/శ్రీమతి ఎమ్. శశి కుమార్ ఇ.నెం.8-3-228/12805/518, జవహర్ నగర్, యూసఫ్‌గూడ, హైదరాబాద్, తెలంగాణ-500045	సి-18 అడ్‌హక్ తేది: 12.10.2021	సెప్టెంబర్-16	జనవరి-21	రూ.334455
86	52000541580000999	మెస్సర్స్ శ్రీ వెంకటేశ్వర ఎంటర్‌ప్రైజెస్, 2-127/43, విజయపురి కాలనీ, ఉప్పల్, రాంగారెడ్డి జిల్లా తెలంగాణ-500039	శ్రీ/శ్రీమతి ఎటికల సుధాకర్ రెడ్డి మెస్సర్స్ శ్రీ వెంకటేశ్వర ఎంటర్‌ప్రైజెస్, 2-127/43, విజయపురి కాలనీ, ఉప్పల్, రాంగారెడ్డి జిల్లా తెలంగాణ-500039	సి-18 అడ్‌హక్ తేది: 11.05.2022	మార్చి-17	సెప్టెంబర్-21	రూ.334950
87	52000541230000999	మెస్సర్స్ వైప్‌బిట్ సొల్యూషన్స్, 3-4-784/12/ఎ, కింగ్ కోఠి, హైదరాబాద్, తెలంగాణ - 500029	శ్రీ/శ్రీమతి మొహమ్మద్‌అబ్దుల్ జలీల్ మెస్సర్స్ వైప్‌బిట్ సొల్యూషన్స్, 3-4-784/12/ఎ, కింగ్ కోఠి, హైదరాబాద్, తెలంగాణ-500029 శ్రీ/శ్రీమతి షాహీన్ జలీల్, కేరాఫ్ వైప్‌బిట్ సొల్యూషన్స్, 3-4-784/12/ఎ, కింగ్ కోఠి, హైదరాబాద్, తెలంగాణ-500029	సి-18 అడ్‌హక్ తేది: 11.11.2020	ఫిబ్రవరి-16	సెప్టెంబర్-21	రూ.350369
88	52000555870001101	మెస్సర్స్ రుచి క్యాటరర్స్, సర్వే 651, ఫ్లాట్.నెం.6,7, రుచి హోటల్, తురకపల్లి (గ్రా), షామీర్‌పేట్ (మం), తెలంగాణ-500078	శ్రీ/శ్రీమతి సత్యనారాయణ అనుమోలు, 4-79/10, తురకపల్లి, షామీర్‌పేట్, రంగారెడ్డి-500078	సి-18 అడ్‌హక్ తేది: 02.02.2022	నవంబర్-16	ఆగస్ట్-21	రూ.356070
89.	52000555630000009	మెస్సర్స్ ఉమాని ఫుడ్స్, 8-13-11, శాంతి నగర్, అయ్యప్ప టెంపుల్ దగ్గర, కాటేదాన్, రాజేంద్రనగర్, హైదరాబాద్-500077	శ్రీ/శ్రీమతి ఫిరోజలీ దీదర్ అలి ఉమాని 1-8-205, ఫస్ట్ ఫ్లోర్, వెంకటరావు నగర్ కాలనీ, పిజి రోడ్, హైదరాబాద్-500003	సి-18 అడ్‌హక్ తేది.21-03-2022	నవంబర్-16	సెప్టెంబర్-21	రూ.360690
90.	52000554850001001	మెస్సర్స్ స్ట్రైటెక్ సొల్యూషన్స్ 8-2-269/19/103/1, ఇందిరానగర్, బంజారాహిల్స్, రోడ్ నం. 2, హైదరాబాద్, తెలంగాణ-500036	శ్రీ/శ్రీమతి చిటుమూరి సునీత 8-2-269/19/103/1, ఇందిరానగర్, బంజారాహిల్స్ రోడ్ నం. 2, హైదరాబాద్, తెలంగాణ-500036 శ్రీ/శ్రీమతి చిటుమూరి విజయశేఖర్ 8-2-269/19/103/1, రోడ్ నం. 2, హైదరాబాద్, తెలంగాణ-500036	సి-18 అడ్‌హక్ తేది.28-05-2022	జులై-19	మార్చి-21	రూ.417186
91.	52000556540001008	మెస్సర్స్ హ్యాష్‌ట్యాగ్ సొల్యూషన్స్, ఇ.నం. 15-24-8/ఎ, రోడ్ నం.1, ఎమ్‌ఐజి, కెపిహెచ్‌బి కాలనీ, కూకట్‌పల్లి, రంగారెడ్డి, తెలంగాణ-500072 మొబైల్ నం. 9848532153	శ్రీ/శ్రీమతి ఉపేంద్ర బాబు మొగిలిచర్ల 106, విజ్ఞాన్ టవర్స్, ఎఎస్ రాజు నగర్, తిరుమలగిరి హైదరాబాద్-500072	సి-18 అడ్‌హక్ తేది:21-03-2022	నవంబర్-16	సెప్టెంబర్-21	రూ.360690
92.	52000552020000999	మెస్సర్స్ ఓంనమశ్శివాయ ఎన్‌సిఎల్‌సిసిఎస్ లిమిటెడ్, ఇ.నం.2-3-692/43, ఇందిరానగర్, అంబర్‌పేట్, హైదరాబాద్-500013	శ్రీ/శ్రీమతి గండికోట లక్ష్మీనారాయణ ఇ.నం.2-3-692/43, ఇందిరానగర్, అంబర్‌పేట్, హైదరాబాద్-500013	సి-18 అడ్‌హక్ తేది:25-01-2022	డిసెంబర్-16	సెప్టెంబర్-21	రూ.746189
93.	52000677850001304	మెస్సర్స్ అరోరా ఎడ్యుకేషనల్ సొసైటీ, అరోరాస్ పాలిటెక్నిక్ కాలేజ్, మదర్ డైరీ దగ్గర, స్టేషన్ రోడ్, భువనగిరి-508116	శ్రీ/శ్రీమతి నారాయణ రెడ్డి నమిరెడ్డి అరోరాస్ పాలిటెక్నిక్ కాలేజ్, మదర్ డైరీ దగ్గర, స్టేషన్ రోడ్, భువనగిరి-508116	సి-18 అడ్‌హక్ తేది.26-08-2022	మార్చి-18	సెప్టెంబర్-21	రూ.920229
94.	52000676710001019	మెస్సర్స్ ఎ.ఎస్. శానిటేషన్, ఫ్లాట్ నం. 501, చాయమిన ఎన్‌క్లేవ్, కెపిహెచ్‌బి మెయిన్ రోడ్, హైదరాబాద్-500072	శ్రీ/శ్రీమతి అమిత్ కుమార్ ఫ్లాట్ నం. 501, చాయమిన ఎన్‌క్లేవ్, కెపిహెచ్‌బి మెయిన్ రోడ్, హైదరాబాద్-500072	సి-18 అడ్‌హక్ తేది.07-01-2021	సెప్టెంబర్-18	ఆగస్టు-20	రూ.454264
95.	52000677700001009	మెస్సర్స్ మాంతాస్ ఇన్‌ఫ్రాటెక్, ఇ.నం. 12-2-828, ఫ్లాట్ నం.107, మార్వెల్ మ్యాన్షన్, మెహిదీపట్నం, హైదరాబాద్-500028	శ్రీ/శ్రీమతి వై.సత్యనారాయణ రెడ్డి 39-40/41, 403, భాస్కర మ్యాన్షన్, యూసుఫ్‌గూడ, ఖైరతాబాద్, హైదరాబాద్-500045	సి-18 అడ్‌హక్ తేది.15-02-2023	ఏప్రిల్-18	సెప్టెంబర్-22	రూ.320424
96.	52000680700001099	మెస్సర్స్ శ్రేయాస్ ఎంటర్‌ప్రైజెస్, ఇ.నం. 3-12-29/24, రోడ్ నం.1, శ్రీనివాస నగర్ (విశాలాంధ్ర కాలనీ), మన్సూరాబాద్, ఎల్.బి.నగర్, హైదరాబాద్-500068	శ్రీ/శ్రీమతి రామ్‌రెడ్డి గురజాల ఇ.నం. 3-12-29/24, రోడ్ నం.1, శ్రీనివాస నగర్ (విశాలాంధ్ర కాలనీ), మన్సూరాబాద్, ఎల్.బి.నగర్, హైదరాబాద్-500068	సి-18 అడ్‌హక్ తేది.28-09-2022	సెప్టెంబర్-18	జనవరి-22	రూ.231857
97.	52000672780001018	మెస్సర్స్ జెఎస్ఎస్ హెల్త్ సొల్యూషన్స్, ఇ.నం. 1-173/2, స్నేహపురి కాలనీ, ఎర్రగడ్డ, హైదరాబాద్-500076	శ్రీ/శ్రీమతి చిటికిబత్తుల పోసిరత్న శ్రీ, 4-132, లైబ్రరీ వద్ద, దేవరపల్లి, హైదరాబాద్-500038	సి-18 అడ్‌హక్ తేది.02-08-2022	మే-18	సెప్టెంబర్-21	రూ.227908
98.	52000642650001099	మెస్సర్స్ ర్యాపిడింక్ ప్రాజెక్ట్స్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్, ఫ్లాట్ నం. 624, ఫ్లాట్ నం. జి1, సైనిక్‌పురి, డిఫెన్స్ కాలనీ, సికింద్రాబాద్-500094	శ్రీ/శ్రీమతి మామిడెల రేణుకాదేవి, ఫ్లాట్ నం. 624, ఫ్లాట్ నం. జి1, సైనిక్‌పురి, డిఫెన్స్ కాలనీ, సికింద్రాబాద్-500094	సి-18 అడ్‌హక్ తేది.31-10-2023	జులై-18	మార్చి-23	రూ.93276
99.	52000642740000699	మెస్సర్స్ విహారి ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ &డెవలపర్స్ ఇండియా ప్రై.లిమిటెడ్ 8-3-219/1, 4వ ఫ్లోర్, బండి టవర్స్ శ్రీనివాస కాలనీ వెస్ట్, అమీర్‌పేట్, హైదరాబాద్-500016	శ్రీ/శ్రీమతి వినయ్ నాయుడు గాలి, హెచ్‌ఐజి 134, ఫేజ్-3, బిహెచ్ఇఎల్ టౌన్‌షిప్, ఆర్‌సి పురం, మెదక్-502032	సి-18 అడ్‌హక్ తేది.02-08-2022	జూన్-17	మార్చి-22	రూ.340148
100	52000603850001401	మెస్సర్స్ ఆదిత్య హాస్పిటల్ 1-24-146, ఇందిరానగర్ కాలనీ, వెంకటాపురం, అల్వాల్ సికింద్రాబాద్ - 500015	శ్రీ/శ్రీమతి డా. కిరణ్ అడబాల, 3-54-49, ఫ్లాట్ నం. 5/3, సరస్వతి నగర్ కాలనీ, నర్తకి థియేటర్ వెనుక, తిరుమలగిరి-500015	సి-18 అడ్‌హక్ తేది.18-08-2022	సెప్టెంబర్-17	మార్చి-22	రూ.476438
101	52000597050000999	మెస్సర్స్ పయనీర్ బిల్డింగ్ సర్వీసెస్, ఇ.నం. 7-1-64, 1& 2వ ఫ్లోర్, మరాఠీ వీధి, సికింద్రాబాద్-500003	శ్రీ/శ్రీమతి శ్రీనివాస్ తలారి ఇ.నం. 18-413/16/2, ఎం.కె నగర్, హైదరాబాద్-500007	సి-18 అడ్‌హక్ తేది.18-08-2022	ఆగస్టు-17	మార్చి-22	రూ.422673
102	52000605260001302	మెస్సర్స్ శ్రీ జాస్మిన్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఇ.నం. 6-4-29, పరిపల్లి సొసైటీ, సిద్దిపేట-502103	శ్రీ/శ్రీమతి బుస్సా సుదర్శన్ ఇ.నం. 12-2-117/1, గణేష్ నగర్, సిద్దిపేట-502103	సి-18 అడ్‌హక్ తేది.08-02-2023	ఏప్రిల్-18	మార్చి-22	రూ.152922

* వార్తాపత్రికలో ప్రచురణ తేదీ నుండి 30 రోజులకు లేదా అలోగా స్వయంగా విచారణకు చివరి తేది.


* సంబంధిత రికార్డులు/దాఖలుతో వ్యక్తిగత విచారణకు హాజరు కావాలని సదరు యజమానులకు సూచించడమైనది. లేనిచో సెక్షన్ 45-ఎ మరియు తదుపరి సి-19 క్రింద ఎక్స్-పార్టీ ఉత్తర్వు ఈ కార్యాలయంలో లభించే రికార్డుల ఆధారంగా జారీచేయబడును.

తేది: 25.03.2025
సమయం: 13:10:46

సం/- సంజయ్ జాదవ్
డిప్యూటీ డైరెక్టర్, అధికృత అధికారి









ఆటుపోట్లతో రాటుదేలి!

- నేడు టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవం
- సంక్షోభాలను అవకాశాలుగా మలచుకుని శక్తిమంతంగా మారిన ప్రాంతీయ పార్టీ
- కేంద్ర కార్యాలయంలో జెండా ఆవిష్కరించనున్న చంద్రబాబు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

తెలుగు జాతి సంక్షోభంలో ఉన్న ప్రతిసారీ వారికి వెలుగుబాటై నిలిచింది తెలుగుదేశం పార్టీ. అన్న నందమూరి తారక రామారావు 1982 మార్చి 29న ఈ పార్టీకి ఊపిరిపోశారు. 43 ఏళ్ల ప్రస్థానంలో ఎన్నెన్నో ఆటుపోట్లు.. అయినా రాటుదేలి జాతీయ రాజకీయాల్లో కీలక శక్తిగా మారింది. 43వ ఆవిర్భావ దినోత్సవం జరుపుకొంటున్న పార్టీ పుట్టుకే సంచలనం. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి 1983 వరకు మూడున్నర దశాబ్దాలపాటు కాంగ్రెస్ పాలనతో విసిగివేసారిన తెలుగు ప్రజలకు.. ఎన్టీఆర్ ఏర్పాటుచేసిన టీడీపీ.. రాజకీయ ప్రత్యామ్నాయంగా నిలిచింది. జాతీయ రాజకీయాలను సైతం చేయిపట్టి నడిపే శక్తిగా ఆవిర్భవించింది.

సంక్షోభాలను అవకాశాలుగా మలుచుకుని.. పరాజయాలు ఎదురైనా అనతికాలంలోనే పుంజుకోవడం తెలుగుదేశం పార్టీ సహజ లక్షణమైంది. దాని ఆవిర్భావమే దేశంలో ప్రాంతీయ పార్టీల ఏర్పాటుకు ఒక నమూనా. ఇతర రాష్ట్రాల్లోని ప్రాంతీయ నాయకులకు స్ఫూర్తిగా నిలిచింది. కేంద్రీకృత రాజకీయ వ్యవస్థకు సవాల్ విసిరింది. 1982లో ఆవిర్భావం తర్వాత 10 సార్లు శాసనసభ ఎన్నికలు జరుగగా.. ఆరు సార్లు టీడీపీ విజయం సాధించింది. 1989, 2004, 09, 19ల్లో.. నాలుగు ఎన్నికల్లో మాత్రమే ఓడిపోయి ప్రతిపక్షంలో కూర్చుంది. ఈ గణాంకాలే రాష్ట్ర ప్రజలకు టీడీపీపై ఉన్న నమ్మకానికి నిదర్శనంగా చెప్పవచ్చు. ఎన్టీఆర్, చంద్రబాబుల సారథ్యంలో రాష్ట్ర స్థాయిలోనే కాదు జాతీయ స్థాయి రాజకీయాల్లో తీవ్ర అనిశ్చితి నెలకొన్న సమయంలోనూ.. ముందుండి ప్రతిపక్షాలను ఏకతాటిపైకి తెచ్చింది. 1989లో నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం, 1996-98 నడుమ యునైటెడ్ ఫ్రంట్ సర్కార్ల ఏర్పాటులో ప్రధాన పాత్ర పోషించింది. 1998, 99ల్లో వాజపేయి నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వాల ఏర్పాటులోనూ చంద్రబాబు చక్రం తిప్పారు. 2024లో మూడోసారి ప్రధానమంత్రి అయిన నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీయే సర్కారుకు టీడీపీయే ఆలంబనగా మారింది. చంద్రబాబు ప్రతిసారీ చెప్పే మాట.. ప్రతి సంక్షోభాన్ని అవకాశంగా మలచుకోవాలని! టీడీపీలో సంక్షోభం నెలకొన్న ప్రతిసారీ మరింత బలంగా లేచివచ్చింది. నాదెండ్ల భాస్కరరావు సృష్టించిన ఆగస్టు సంక్షోభం మొదలు.. లక్ష్మీపార్వతి నుంచి పార్టీని కాపాడుకుని నిలదొక్కుకునేలా చేయడంలో.. 2004, 09ల్లో వరుస పరాజయాల అనంతరం ఫీనిక్స్ పక్షిలా ఎగిరి 2014లో అధికారం చేజిక్కించుకోవడం.. 2019-24 నడుమ తీవ్ర నిర్బంధాలను అధిగమించి 2024 ఎన్నికల్లో రికార్డు విజయాన్ని నమోదు చేయడం వరకు ప్రతి సంక్షోభాన్నీ అవకాశంగా మలుచుకోవడం వల్లే సాధ్యపడింది.

కార్యకర్తలే బలం.. అభివృద్ధే పథం

టీడీపీకి మూలబలం కార్యకర్తలే. పార్టీ ఆశయాలకు కట్టుబడిన బలమైన కేడర్ దాని సొంతం. కోటిపైచిలుకు సభ్యత్వాల నమోదే దీనికి నిదర్శనం. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వ అరాచకాలను.. వేధింపులను తట్టుకుని పార్టీ నిలబడగలిగిందంటే ప్రధాన కారణం కార్యకర్తలే. మెడపై కత్తి పెట్టి.. పార్టీ మారితే తప్ప వదిలేది లేదని బెదిరించినా.. పార్టీ జెండా కప్పుకొనే చనిపోతానని చెప్పి మరీ ప్రాణాలు విడిచిన చంద్రయ్యలే టీడీపీ బలం. అయినా పార్టీ కేడరా.. రాష్ట్రాభివృద్ధా అంటే.. అభివృద్ధి వైపే మొగ్గు చూపే విధానం ఆ పార్టీది.. అధినేత చంద్రబాబుది. అందుకే ఆయన్ను వ్యతిరేకించేవారు కూడా.. అభివృద్ధి గురించి చెప్పాల్సి వస్తే తిరిగి ఆయన్నే ఉదాహరణగా చెబుతుంటారు. టీడీపీ హయాంలోనే అభివృద్ధి జరిగిందని అంగీకరిస్తారు. బీఆర్ఎస్ నేత కేటీఆర్ అయినా.. తెలంగాణకే చెందిన సీపీఐ నేత కూనంనేని సాంబశివరావు అయినా.. అభివృద్ధి గురించి చెప్పేటప్పుడు చంద్రబాబు పేరును ప్రస్తావించి తీరాల్సిందే.





ఆవిర్భవించిన 9 నెలల్లోనే అధికారం..

టీడీపీని స్థాపించిన కేవలం 9 నెలల్లోనే 1983 జనవరిలో జరిగిన ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో అద్భుతమైన విజయంతో ఎవరూ చెరపలేని రికార్డును సృష్టించింది. ఎన్టీఆర్ నాయకత్వంలో టీడీపీ 294 సీట్లలో 202 గెలుచుకుంది. ఈ విజయం భారత రాజకీయాల్లోనే పెను సంచలనం.

- స్వతంత్ర భారత చరిత్రలో తొలగించిన ముఖ్యమంత్రి తిరిగి సీఎం కావడం ఎన్టీఆర్ ఒక్కరికే సాధ్యమైంది. 1984 ఆగస్టు సంక్షోభంలో పదవిని కోల్పోయిన ఆయన.. తిరిగి నెల రోజులకే సీఎంగా ప్రమాణస్వీకారం చేశారు.
- ఎన్టీఆర్ పాలనలో రూ.2కే కిలో బియ్యం, జనతా వస్త్రాలు, పేదలకు పక్కా ఇళ్లు, మహిళలకు ఆస్తిహక్కు, కరణాలు, మునసబు, పటేల్, పట్వారీ వ్యవస్థను రద్దు చేయడం వంటి సంక్షేమ పథకాలు, విప్లవాత్మక సంస్కరణలు ప్రవేశపెట్టారు.
- వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పింఛన్లను తొలిగా ప్రారంభించింది టీడీపీయే. ఎన్టీఆర్ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 20 శాతం, మహిళలకు 9 శాతం రిజర్వేషన్లు, విద్య, ఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనతా టీడీపీ సొంతం.
- మైనారిటీల అభివృద్ధికి ప్రత్యేకంగా మైనారిటీ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్న ఆలోచనా ఈ పార్టీదే. 1985లో ఆ కార్పొరేషన్‌ను స్థాపించారు.
- తిరుపతిలో పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, విజయవాడలో ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం.. ఇవన్నీ టీడీపీ హయాంలో పురుడుపోసుకున్నవే. తిరుమల శ్రీవేంకటేశ్వరుడి ఆలయంలో భక్తులకు సరైన వసతుల కల్పన కూడా ఎన్టీఆర్ నుంచే ప్రారంభమైంది. 1985 ఏప్రిల్ 6న తిరుమలలో నిత్య అన్నదాన పథకం ప్రారంభించడం చరిత్ర సృష్టించింది. మరిన్ని మెరుగులతో నేటికీ అప్రతిహతంగా సాగుతోంది.

నేడు ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

- కేంద్ర కార్యాలయంలో జరిగే సభలో పాల్గొననున్న బాబు, లోకేశ్, పల్లా, సీనియర్లు

అమరావతి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం ఏపీ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు ఆ పార్టీ నాయకత్వం అన్ని ఏర్పాట్లూ చేసింది. ఉదయం 9 గంటలకు టీడీపీ కేంద్ర కార్యాలయంలో అట్టహాసంగా వేడుకలు నిర్వహించనున్నారు. జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పార్టీ జెండాను ఆవిష్కరించి, వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఆవిర్భావ సభను ప్రారంభిస్తారు. ఈ వేడుకల్లో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఏపీ మంత్రి లోకేశ్, పార్టీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస యాదవ్, పొలిట్‌బ్యూరో సభ్యులు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నేతలు పాల్గొంటారు. ఈ 43 ఏళ్లలో టీడీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం వంటి అంశాలను నాయకులు వివరిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఆవిర్భావ దినోత్సవాలను నిర్వహించాలని, ఎన్టీఆర్ విజయ ప్రస్థానం, సీఎంగా చంద్రబాబు సాధించిన విజయాలకు సంబంధించిన వీడియోలను జిల్లావ్యాప్తంగా ప్రదర్శించాలని ఆదేశించింది.

అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది



నితిన్, శ్రీలీల జంటగా వెంకీ కుడుముల దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'రాబిన్‌హుడ్' చిత్రం శుక్రవారం విడుదలైంది. అద్భుతమైన రెస్పాన్స్ వస్తోందనీ, ఆడియన్స్ బాగా ఎంజాయ్ చేస్తున్నారనీ దర్శకుడు వెంకీ చెప్పారు. శుక్రవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ 'మేం రెండు థియేటర్స్‌కి వెళ్లాం. నితిన్ పెర్ఫార్మెన్స్‌తో పాటు రాజేంద్రప్రసాద్, వెన్నెల కిశోర్ కామెడీ ట్రాక్‌ను చూసి ఎంజాయ్ చేస్తున్నారు. అలాగే క్లైమాక్స్‌లో వచ్చే ఎమోషన్, ట్విస్టుల గురించి గొప్పగా మాట్లాడుతున్నారు. డేవిడ్ వార్నర్ ఎంట్రీకి థియేటర్ అదిరిపోయింది. ఆడియన్స్ రియాక్షన్ చూశాక చాలా హ్యాపీగా అనిపించింది. ఈ ఉగాదికి మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. అందరూ థియేటర్‌కు వెళ్లి చూడండి' అని కోరారు. నిర్మాతల్లో ఒకరైన రవిశంకర్ మాట్లాడుతూ 'థియేటర్‌కి వెళ్లి ఫ్యామిలీ, యూత్ ఎంజాయ్ చేసే సినిమా ఇది. ఆడియన్స్ నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది. ప్రతి షో కీ కలెక్షన్లు పెరుగుతున్నాయి.. డిస్ట్రిబ్యూటర్స్ కూడా ఫోన్ చేసి బాగుందని చెబుతున్నారు. సినిమా కచ్చితంగా విన్నర్ అవుతుందని మా నమ్మకం' అన్నారు.

నవ్వించడంలో విజయం సాధించాం



నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ ప్రధాన పాత్రల్లో కల్యాణ్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మ్యాడ్ స్క్వేర్'. సూర్యదేవర నాగవంశీ సమర్పణలో హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మించారు. శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్ ప్రెస్ మీట్‌లో నాగవంశీ మాట్లాడుతూ 'మా చిత్రం సూపర్ హిట్ టాక్ సొంతం చేసుకుంది. భారీ ఓపెనింగ్స్ వస్తున్నాయి. ప్రేక్షకులను నవ్వించడంలో విజయం సాధించాం. మాపై ప్రేమను కురిపిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు. దర్శకుడు కల్యాణ్ శంకర్ మాట్లాడుతూ 'సినిమాలో సునీల్ పాత్రకు మంచి స్పందన రావడం ఆనందంగా ఉంది' అని అన్నారు. నిర్మాత హారిక సూర్యదేవర మాట్లాడుతూ 'మా కష్టానికి ఫలితం దక్కడం సంతోషంగా ఉంది' అని అన్నారు.

నాటక కళాకారులకు వెలుగునిస్తోంది



- తనికెళ్ల భరణి

ఎందరో మహానుభావులు నాటక రంగానికి సేవలందిస్తూ, కళాకారులను ప్రోత్సహిస్తున్నారని నటుడు, రచయిత తనికెళ్ల భరణి అన్నారు. ఆంధ్ర నాటకకళాపరిషత్ 96వ వార్షిక జాతీయ నాటకోత్సవాల్లో భాగంగా అమీర్‌పేటలోని కమ్మసంఘం హాల్‌లో కొనసాగుతున్న పద్మవిభూషణ్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి ఉత్సవాలకు శుక్రవారం తనికెళ్ల భరణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో మంచి నాటికలు, నాటకాలను ఇప్పటికీ ప్రజలు ఆదరిస్తుండడం వెనుక ఎంతో మంది. కృషి దాగుందన్నారు. నాటక కళాకారులకు వెలుగునిస్తున్న ఆంధ్రనాటక కళాపరిషత్ కృషిని కొనియాడారు. అంతకుముందు శార్వాణీ గ్రామీణ సాంస్కృతిక సేవా సంస్థ ప్రదర్శించిన 'కొత్త పరిమళం', మద్దుకూరి ఆర్ట్స్ క్రియేషన్స్ వారు ప్రదర్శించిన 'మా ఇంట్లో మహాభారతం' నాటికలు ఆకట్టుకున్నాయి. రావులపాలెంకు చెందిన సామాజిక సేవకుడు డాక్టర్ గొలుగూరి వెంకటరెడ్డికి ఆంధ్రనాటక కళాపరిషత్ జీవిత సాఫల్య సాధన పురస్కారం ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఒంగోలులోని ఎన్టీఆర్ కళా పరిషత్ అధ్యక్షులు ఈదర హరిబాబు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాటక అకాడమీ అధ్యక్షులు గుమ్మడి గోపాలకృష్ణ, కమ్మసంఘం ప్రధాన కార్యదర్శి మేకా రామకృష్ణ, హాస్యనటుడు గౌతంరాజు తదితరులు పాల్గొన్నారు.

అమీర్‌పేట, (ఆంధ్రజ్యోతి)

చిత్రజ్యోతి

SINCE 1965



ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఢిల్లీలో కలసిన విజయ్ దేవరకొండ, యామీ గౌతమ్, అమిత్ సాధ్ తదితరులు

నాకు నచ్చినట్టు జీవిస్తా

- సమంత



'నాకు నచ్చినట్టు జీవిస్తా.. రూల్స్ పెడితే అస్సలు నచ్చదు' అంటూ హాట్ కామెంట్స్ చేశారు సమంత. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశమవుతున్నాయి. ప్రస్తుతం సమంత సిడ్నీలో పర్యటిస్తున్నారు. అక్కడ నిర్వహించిన ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న సమంత మాట్లాడుతూ 'నాకు ఇష్టమైన రంగంలో రాణించాలన్నదే నా ఆశ. ఆడపిల్లనని ఇది చేయకూడదు, అది చేయకూడదు, ఇలా ఉండు, అలా ఉండు అంటూ రూల్స్ పెడితే నాకు నచ్చదు. అన్ని రకాల పాత్రలు పోషించి ప్రేక్షకులను మెప్పించాలి. అదే నా సక్సెస్‌గా భావిస్తా' అని అన్నారు.

హృతిక్ దర్శకత్వంలో 'క్రిష్-4'



బడ్జెట్ సమస్యల కారణంగా వాయిదా పడుతూ వస్తోన్న 'క్రిష్-4' చిత్రం ఎట్టకేలకు పట్టాలెక్కనుంది. హృతిక్ రోషన్ హీరోగా నటించనున్న ఈ మూవీకి ఆయనే దర్శకత్వం వహించనున్నారు. ఈ విషయాన్ని హృతిక్ తండ్రి రాకేశ్ రోషన్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ఆ మధ్య ఆదిత్య చోప్రా ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకొన్నారనే వార్తలు బీటౌన్‌లో చక్కర్లు కొట్టాయి. అలాంటిదేమీ లేదు ఆయన మాతోనే ఉన్నాడంటూ రాకేశ్ స్పష్టతనిచ్చారు. 'హృతిక్, ఆదిత్య ఇద్దరూ కలిసి వెండితెరపై ఇదివరకెవ్వరూ చేయలేని ఓ అద్భుతాన్ని 'క్రిష్-4' రూపంలో ఆవిష్కరించనున్నారు' అంటూ రాకేశ్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టారు. 'దుగ్గు (హృతిక్ రోషన్) పాతికేళ్ల క్రితం నిన్ను ఓ నటుడిగా ఈ ప్రపంచానికి పరిచయం చేశాను. ఇప్పుడు నేను, ఆదిత్య కలసి నిన్ను దర్శకుడిని చేయబోతున్నాం. ఈ కొత్త ప్రయాణంలో అన్నీ విజయాలే చేకూరాలని కోరుతున్నా' అని రాకేశ్ రోషన్ పేర్కొన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలి

» నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాలి: తుమ్మల



హైదరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం సీజన్‌కు అన్ని పంటల విత్తనాలను అందుబాటులో ఉంచాలని, నాణ్యమైన విత్తనాల ఎంపిక, కొనుగోళ్లలో రైతులకు అవగాహన కల్పించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. సచివాలయంలో శుక్రవారం విత్తనాల లభ్యత, సరఫరాపై వ్యవసాయాధికారులు, విత్తన కంపెనీ ప్రతినిధులతో ఆయన సమీక్ష నిర్వహించారు. వ్యవసాయాధికారులు వారి పరిధిలో ఉన్న విత్తన సంస్థలను తరుచూ పర్యవేక్షించి, రైతులకు నాణ్యమైన విత్తనం అందేలా చూడాలని, అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ మేరకు రైతు వేదికల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అలాగే సచివాలయంలో జాతీయ పసుపు బోర్డు కార్యదర్శి భవానిశ్రీ.. మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అంతర్జాతీయ ప్రమాణాలకు తగ్గట్టుగా సేంద్రియ పద్ధతిలో పసుపు పంట పండించేందుకు రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

దుబ్బాకలో స్కిల్ వర్సిటీ ఏర్పాటుకు స్థల పరిశీలన

» అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం

హైదరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): దుబ్బాకలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సీఎం రేవంత్‌ను దుబ్బాక బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. దుబ్బాకలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని.. హబ్సీపూర్-లచ్చపేట్ రోడ్డును రెండు వరుసలుగా అభివృద్ధి చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన సీఎం.. అక్కడ యూనివర్సిటీ ఏర్పాటుకు స్థల పరిశీలనకు వెళ్లాలని సీఎంవో అధికారులను ఆదేశించారు. అలాగే హబ్సీపూర్-లచ్చపేట రోడ్డును రెండు వరుసలుగా మార్చేందుకు రూ.35 కోట్లను మంజూరు చేశారు. అడిగిన వెంటనే స్పందించిన సీఎం రేవంత్‌కు దుబ్బాక నియోజకవర్గ ప్రజల తరఫున ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

నా వ్యాఖ్యలను చంద్రబాబు అనుకూలంగా మార్చుకున్నారు: కూనంనేని

హైదరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పర్యాటక రంగంపై తాను చేసిన వ్యాఖ్యలను ఏపీ సీఎం చంద్రబాబునాయుడు అనుకూలంగా మార్చుకున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఉమ్మడి ఏపీ సీఎంగా చంద్రబాబు ఉన్నప్పుడు ఏ ఇజం లేదు టూరిజం ఒకటే ఇజమని అనేవారని.. అందుకే తమకు కోపం వచ్చేదని చెప్పారు. పెట్టుబడి లేనిది టూరిజం అని, దీంతో ఆదాయం వస్తుందని, అలాగే ఉపాధి కల్పించే అవకాశం ఉన్నందున పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని తాను తెలంగాణ ప్రభుత్వానికి సూచిస్తే దీన్ని కొందరు దురుద్దేశంతో వక్రీకరించారన్నారు. శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పర్యాటక రంగంపై తాను చేసిన సూచనను ఏపీ సీఎం చంద్రబాబు తన మీడియా సమావేశంలో ఆయనకు అనుకూలంగా మార్చుకున్నారని ఆయన చెప్పారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ.. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయహోదా ఇవ్వడంలేదని కేంద్రం చెప్పడం రాష్ట్రానికి తీరని అన్యాయం చేయడమేనన్నారు.

లీజుల ఫైళ్లను నేరుగా నాకే పంపించండి

» ఉత్తర్వులు జారీ చేసిన దేవాదాయ శాఖ కమిషనర్

హైదరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ శాఖలో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. శాఖ పరిధిలో లీజులకు సంబంధించిన ఫైళ్లను నేరుగా తనకే పంపించాలని కమిషనర్ శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే, అడిషనల్ కమిషనర్(ఏడీసీ)-1 శ్రీనివాస్ రావుకు ఉండాల్సిన అధికారాల్లో కోత విధిస్తూ.. ఏడీసీ-2గా ఉన్న కృష్ణవేణికి అధికారాలు బదిలీ చేస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. 'ఉత్తమ పరిపాలన'లో భాగంగా అధికారాల్లో మార్పు చేసినట్లు కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పరిపాలనా సౌలభ్యంలో భాగంగా అధికారుల మధ్య విభాగాల మార్పు సర్వసాధారణమే అయినా.. దేవాదాయ శాఖలో ఇది తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

త్వరలో 28 మినీ ఖనిజ బ్లాకుల వేలం

హైదరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 28 మినీ ఖనిజ బ్లాకుల వేలానికి ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. ఈ బ్లాక్‌ల వేలం లావాదేవీల సలహాదారుగా ఎస్బీఐ క్యాపిటల్స్, వేలం పాట నిర్వహణదారుగా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ మెటల్ స్క్రాప్ ట్రేడ్ కార్పొరేషన్ (ఎంఎస్‌టీసీ) నియామకానికి అనుమతించినట్లు రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్ శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ భూముల్లోని లేటరైట్, బ్లాక్ గ్రానైట్, కలర్ గ్రానైట్, రఫ్ స్టోన్, రోడ్డు మెటల్‌కు సంబంధించిన 28 మినీ ఖనిజ బ్లాకుల వేలానికి మార్చి 10న రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. త్వరలో 28 మినీ గనుల వేలం పాటను నిర్వహించనుంది. కాగా, గ్రానైట్ కటింగ్, పాలిషింగ్ సీనరేజీ ఫీజు శ్లాబ్‌లను ప్రభుత్వం శుక్రవారం సవరించింది. గ్రానైట్ కటింగ్ కోసం 5, 10, 14, 27, 25 బ్లేడ్‌ల (మల్టిపుల్ బ్లాక్ కట్టర్) కట్టర్లకూ అనుమతి ఇచ్చింది. లైసెన్స్‌డ్ ఖనిజ డీలర్లు గ్రానైట్ కటింగ్, పాలిషింగ్ కోసం శ్లాబుల పద్ధతిలో నెలవారీగా సవరించిన సీనరేజీ ఫీజులను రాష్ట్ర గనుల శాఖకు చెల్లించాల్సి ఉంటుంది.

సులభతర వాణిజ్య విధానం భేష్: కేంద్ర బృందం

» అభివృద్ధికి ఆటంకంగా అటవీ చట్టాలు: సీఎస్

హైదరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సులభతర వాణిజ్య విధానాని(ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్)కి కేంద్ర బృందం కితాబిచ్చింది. కేంద్ర పారిశ్రామిక, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక శాఖ(డీపీఐఐటీ) ఉన్నతాధికారి సుకృతి లిఖి నేతృత్వంలో అధికారుల బృందం శుక్రవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో భేటీ అయింది. ఈ సందర్భంగా ఈవోడీబీపై చర్చించారు. సులభతర వాణిజ్య విధానాన్ని అమలు చేయడంలో తెలంగాణ రాష్ట్రం అగ్రగామిగా ఉందని సీఎస్ వారికి వివరించారు. రాబోయే రోజుల్లో వేగవంతమైన వాణిజ్య, వ్యాపార అభివృద్ధికి అనువైన వాతావరణాన్ని సృష్టిస్తున్నామన్నారు. ఇప్పటికే సంస్కరణలు చేపట్టామన్నారు. వాణిజ్య భవనాలకు త్వరితగతిన అనుమతులివ్వడానికి 'బిల్డ్ నౌ', ఆన్‌లైన్ విధానాన్ని ప్రారంభించామని, భూసమస్యల పరిష్కారానికి 'భూభారతి' వ్యవస్థను తీసుకొచ్చామని వివరించారు. కొన్ని అభివృద్ధి కార్యక్రమాలకు అటవీ, వన్యప్రాణుల చట్టాల అనుమతులు సకాలంలో లభించడం లేదని, దాంతో అభివృద్ధికి ఆటంకమేర్పడుతుందని సీఎస్ కేంద్ర బృందానికి వివరించారు. ఈవోడీబీలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని, రాష్ట్రప్రభుత్వం చేపట్టిన ప్రధాన సంస్కరణలు, కార్యక్రమాలు బాగున్నాయని సుకృతి లిఖి కితాబిచ్చారు.

బీసీ రిజర్వేషన్లపై బీజేపీ కుట్ర: వీహెచ్

న్యూఢిల్లీ/హైదరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ముస్లింల పేరుతో బీసీ రిజర్వేషన్లను అడ్డుకునేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంతరావు అన్నారు. ఏప్రిల్ 2న చలో ఢిల్లీకి బీసీలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. శుక్రవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. మత రాజకీయాలు చేసే బీజేపీ మాత్రం ముస్లింల పేరుతో బీసీ రిజర్వేషన్లు అడ్డుకోవాలని చూస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ అధిష్ఠానం తనకు ఏ బాధ్యత అప్పగించినా సమర్థంగా నిర్వర్తిస్తానని చెప్పారు. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో బీసీలకు అవకాశమిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రాభివృద్ధిని అడ్డుకుంటే ప్రజలు రాళ్లతో కొడతారంటూ కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన, పది నెలల కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధమా అంటూ ఆ పార్టీ నేతలకు సవాల్ విసిరారు. లిక్కర్ లెక్కలు, బడ్జెట్ లెక్కల మధ్య గందరగోళానికి గురైన ఎమ్మెల్సీ కవిత.. తడబడుతున్నారంటూ ఎద్దేవా చేశారు. మంత్రి వర్గ విస్తరణలో బంజారా వర్గానికి చెందిన ప్రజాప్రతినిధులకు స్థానం కల్పించాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌కు గిరిజన సంఘాలు విజ్ఞప్తి చేశాయి.

అత్యంత శక్తిమంతమైన భారతీయుల జాబితాలో

సీఎం రేవంత్ @ 28



» నిరుటితో పోలిస్తే 11 స్థానాలు పైకి..

» ఇండియన్ ఎక్స్‌ప్రెస్ జాబితా-2025లో అగ్రస్థానంలో ప్రధాని మోదీ

హైదరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దేశంలోని అత్యంత శక్తిమంతమైన వ్యక్తుల జాబితాలో తన స్థానాన్ని మెరుగుపర్చుకున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సారి ఏకంగా 11 స్థానాలు ఎగబాకారు. దేశంలోని వివిధ రంగాల్లో అత్యంత శక్తిమంతులైన 100 మంది ప్రముఖులతో 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్-2025' జాబితాను విడుదల చేసింది. ఇందులో సీఎం రేవంత్‌రెడ్డికి 28వ స్థానం దక్కింది. గత ఏడాది ఈ జాబితాలో ఆయన 39వ స్థానంలో నిలిచారు. జాబితాలో ప్రధాని నరేంద్ర మోదీ అగ్రస్థానంలో నిలిచారు. నిరుడూ ఆయన నంబర్ వన్‌గానే ఉన్నారు. రెండో స్థానంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, మూడో స్థానంలో కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ నిలిచారు. తర్వాత (పది స్థానాల్లో) వరసగా ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అశ్వినీ వైష్ణవ్, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రముఖ పారిశ్రామికవేత్త ముకేశ్ అంబానీ ఉన్నారు. 100 మంది జాబితాలో దేశంలోని రాజకీయ, వ్యాపార, క్రీడా, వినోద రంగాల్లో అత్యంత ప్రభావవంతమైన వ్యక్తులు ఉన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పాలనలో తీసుకొచ్చిన మార్పులు, వ్యూహాత్మక రాజకీయ కార్యకలాపాలతో సీఎం రేవంత్‌రెడ్డికి ఈ గుర్తింపు లభించింది. తనదైన దూకుడుతో దేశ రాజకీయాల్లో చూపుతున్న ప్రభావం, నాయకత్వ లక్షణాలతో ఆయన ర్యాంకు ఈ సారి బాగా మెరుగుపడింది. ప్రాంతీయ అవసరాలను జాతీయ ప్రాధాన్యాలతో సమన్వయం చేయగలిగిన మేధో సంపత్తి, వ్యూహాత్మక దృక్పథం రేవంత్‌ను కీలక నాయకునిగా నిలిపేలా చేశాయి. ఇక ఈ జాబితాలో ఏపీ సీఎం చంద్రబాబు 14 స్థానంలో నిలిచారు. ఆయనకు ఈ ఏడాది కొత్తగా జాబితాలో చోటు దక్కడం గమనార్హం. ఈ సారి సినీ నటుడు అల్లు అర్జున్‌కూ చోటు దక్కింది. ఆయన 92వ స్థానంలో నిలిచారు.

విధానపరమైన నిర్ణయాలతో..

రైతు కుటుంబాలకు రూ.21 వేల కోట్ల రుణ మాఫీ చేయడం, ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వడం, మహిళా సంఘాలకు సోలార్ పవర్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు, ప్రీమియం రిటైల్ స్టోర్ల వంటి వ్యాపార అవకాశాలను కల్పించడం, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు, ట్రాఫిక్ విభాగంలో ట్రాన్స్‌జెండర్ల నియామకం వంటి అనేక నిర్ణయాలు రేవంత్‌రెడ్డికి ఆదరణ పెరగడానికి కారణమయ్యాయి. కాగా, పారదర్శకమైన పాలన, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కట్టుబడినందునే అత్యంత శక్తిమంతుల జాబితా-2025లో సీఎం రేవంత్ 28వ స్థానంలో నిలిచారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ అన్నారు. ఈ గుర్తింపు తెలంగాణ ప్రజల పట్ల ముఖ్యమంత్రి బాధ్యతను మరింత పెంచినట్లయిందని పేర్కొన్నారు.

కీలక శాఖల్లో మార్పులు!

(మొదటిపేజీ తరువాయి)



ఇటీవల ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్‌తో పార్టీ అధిష్ఠానం చర్చలు జరిపిన విషయం తెలిసిందే. ఈ చర్చల్లో మంత్రివర్గ విస్తరణతోపాటు మంత్రిత్వ శాఖల మార్పులపైనా చర్చ జరిగినట్లు సమాచారం. ఆయా శాఖలకు సంబంధించి మంత్రుల పనితీరుపై వివిధ మార్గాల్లో అధిష్ఠానం ఇప్పటికే నివేదిక తెప్పించుకుంది. దీనికితోడు శాఖల నిర్వహణలో పార్టీ ఎమ్మెల్యేలు, నేతలతోపాటు వివిధ వర్గాల వారూ అధిష్ఠానానికి ఫిర్యాదులు ఇచ్చినట్లు సమాచారం. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న అధిష్ఠానం.. పలువురు మంత్రుల శాఖల మార్పులపైనా చర్చించినట్లు చెబుతున్నారు. కొత్తగా తీసుకునే మంత్రులకు ఏయే శాఖలు కేటాయించాలన్న చర్చలో భాగంగా ఈ అంశంపైనా చర్చించినట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా ప్రభుత్వంలో అత్యంత ప్రధాన శాఖలుగా పరిగణించే శాఖలను ఆయా మంత్రుల నుంచి ఇతరులకు బదిలీ చేసే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. అధిష్ఠానం పట్ల విశ్వాసం, శాఖల నిర్వహణలో అత్యంత జాగ్రత్త తీసుకునే వారికి ఆ శాఖలను కేటాయించే ఆలోచనలో అధిష్ఠానం ఉందని అంటున్నారు.

అధిష్ఠానం కోర్టులో నిర్ణయం!

విస్తరణలో భాగంగా ఎవరెవరికి మంత్రివర్గంలో చోటు కల్పించాలి, వారికి ఏయే శాఖలు కేటాయించాలన్నది ప్రస్తుతం కాంగ్రెస్ అధిష్ఠానం కోర్టులో ఉంది. ఇటీవల ఢిల్లీలో జరిగిన సమావేశంలో దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్‌ల అభిప్రాయాలను అధిష్ఠానం పెద్దలు తీసుకున్నారు. ఇక నిర్ణయం తీసుకోవడమే మిగిలి ఉంది. అయితే చర్చల్లో భాగంగా.. ఆయా ఎమ్మెల్యేలను మంత్రివర్గంలోకి తీసుకోవాల్సిన ఆవశ్యకత, తీసుకుంటే జరిగే పరిణామాలు, అసంతృప్తులకు ఇవ్వాల్సిన వాగ్దానాలు వంటి వాటిపైనా చర్చించారు. పార్టీలో అంతర్గతంగా ఆ కసరత్తు కూడా జరుగుతున్నట్లు తెలుస్తోంది. కాగా, కీలక శాఖలను మార్చే క్రమంలో.. వాటి స్థానే ఆయా మంత్రులకు కేటాయించాల్సిన శాఖలపై తర్జన భర్జన నడుస్తున్నట్లు చెబుతున్నారు. కొత్త మంత్రులకు సీఎం రేవంత్ వద్ద ఉన్న శాఖలతోపాటు ఇతర మంత్రుల వద్ద అదనంగా ఉన్న శాఖల్లో ఏయే శాఖలను కేటాయించాలన్న దానిపైనా కసరత్తు చేస్తున్నట్లు పేర్కొంటున్నారు. అయితే విద్యాశాఖ, హోంశాఖను మాత్రం సీఎం రేవంత్‌రెడ్డి తన వద్దనే ఉంచుకునే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. కొత్త మంత్రుల ప్రమాణ స్వీకారానికి ప్రభుత్వ పెద్దలు ముహూర్తాలు కూడా పరిశీలించారు. ఉగాది రోజు(మార్చి 30)తోపాటు ఏప్రిల్ 2సాయంత్రం, ఏప్రిల్ 3, 4వ తేదీల్లో ఉదయం బాగుందంటూ అధిష్ఠానానికి వారు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. మంత్రివర్గ విస్తరణ, శాఖల మార్పుపై అధిష్ఠానం తుది నిర్ణయాన్ని ప్రకటించగానే ప్రమాణ స్వీకారానికి ముహూర్తాన్ని ఖరారు చేయనున్నట్లు చెబుతున్నారు.

నేడు కొడంగల్‌కు సీఎం రేవంత్

కొడంగల్: పేదల తిరుపతిగా పేరొందిన వికారాబాద్ జిల్లా కొడంగల్ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరు కానున్నారు. సాయంత్రం 4 గంటలకు హెలికాప్టర్‌లో తాండూరు రోడ్డులోని హెలిప్యాడ్‌కు ఆయన చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా ఆలయానికి చేరుకొని బ్రహ్మోత్సవాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి పాల్గొంటారు. ఈ సందర్భంగా స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించి పూజలు నిర్వహిస్తారు. అనంతరం కొడంగల్‌లో నిర్వహించే ఇఫ్తార్ విందులో పాల్గొంటారు.

రేపు రవీంద్రభారతిలో ఉగాది వేడుకలు

ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి హాజరు

హైదరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): భాషా సాంస్కృతిక శాఖ, దేవాదాయ ధర్మాదాయ శాఖల ఆధ్వర్యంలో ఈ నెల 30 తేదీన ఉదయం 10గంటలకు రవీంద్రభారతిలో 'శ్రీ విశ్వావసు' నామ ఉగాది వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనుంది. ఈ వేడుకలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా వేడుకల ఏర్పాట్లపై శుక్రవారం రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో దేవాదాయ ధర్మాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్ సమావేశమై చర్చించారు. హైదరాబాద్ నగరంలో ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో ఈసీ జారీ చేసిన అనుమతి, నిబంధనలకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. వేడుకల్లో భాగంగా 'పంచాంగ శ్రవణం' ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

'ఎల్‌ఆర్ఎస్' రాయితీ

గడువు పెంపు!?

ఎల్లుండితో ముగియనున్న గడువు

» ఏప్రిల్ నెలాఖరు దాకా పెంచాలని సర్కారు యోచన!

» గత 15 రోజుల్లో రూ.950 కోట్ల ఆదాయం

హైదరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): లే అవుట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) రుసుములో ప్రభుత్వం ఇచ్చిన రాయితీ గడువు ఈ నెల 31తో ముగియనుంది. తొలుత నత్తనడకన సాగిన ఈ ప్రక్రియ.. రుసుములో 25% రాయితీ ఇవ్వడంతో ఊపందుకుంది. అయితే గడువు దగ్గరపడడంతో దరఖాస్తుదారులు క్యూ కడుతున్నారు. రాయితీ గడువును నెల రోజుల పాటు పొడిగించాలని కోరుతున్నారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల్లోనూ కొందరు ఎమ్మెల్యేలు ఎల్ఆర్ఎస్ గడువు పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల విషయంలో మహబూబ్‌నగర్ జిల్లా నుంచి మంచి స్పందన వచ్చింది. వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి ఏప్రిల్ నెలాఖరు వరకు రాయితీ గడువు పెంచాలని సభలో ప్రభుత్వాన్ని కోరారు. దరఖాస్తుదారులు, ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం గడువు పెంచే యోచనలో ఉన్నట్లు తెలిసింది. ఏప్రిల్ నెలాఖరు వరకు పెంచే అవకాశం ఉన్నట్లు సమాచారం. 2020లో ఎల్ఆర్ఎస్ కింద 25.68 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా 20 లక్షల మందికి రుసుము చెల్లించాలంటూ లేఖలు పంపారు. పెద్దగా స్పందన లేకపోవడంతో ప్రభుత్వం 25 శాతం రాయితీ పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ నెల 31 వరకు రాయితీ పథకం అమల్లో ఉందని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్ని జిల్లాల్లో దరఖాస్తుదారులకు సమాచారం పంపారు. తొలుత కొన్ని ఇబ్బందులు ఎదురైనా.. రెండు వారాల నుంచి ఫీజు చెల్లించడానికి వచ్చే దరఖాస్తుదారుల సంఖ్య గణనీయంగా పెరిగిందని డీటీసీపీ దేవేందర్‌రెడ్డి చెప్పారు. నాలుగేళ్లలో ఎల్ఆర్ఎస్ కింద రూ.112 కోట్లు చెల్లిస్తే.. గత 15 రోజుల్లో 2.80 లక్షల మంది రూ.950 కోట్ల రుసుము చెల్లించారు. 31 వరకు మరో రూ.500 కోట్లకు పైగా రావచ్చని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటి వరకు ఎదురైన సాంకేతిక సమస్యలను అధిగమించడంతో రానున్న రెండు రోజుల్లో ఈ ప్రక్రియ మరింత వేగిరమయ్యే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు. ఏప్రిల్ ఆఖరు వరకు రాయితీ పొడిగిస్తే మరింత మందికి లబ్ధి చేకూరే అవకాశం ఉన్నందున ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని భావిస్తున్నారు.

ఏఐసీసీ సమావేశాల ముసాయిదా కమిటీ భేటీకి హాజరైన భట్టి



న్యూఢిల్లీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఏప్రిల్ 8, 9 తేదీల్లో నిర్వహించబోయే ఏఐసీసీ సమావేశాలకు సంబంధించి కాంగ్రెస్ అధిష్ఠానం నియమించిన ముసాయిదా కమిటీ సమావేశమైంది. శుక్రవారం ఢిల్లీలోని కాంగ్రెస్ కార్యాలయంలో ముసాయిదా కమిటీ కన్వీనర్ రణదీప్ సింగ్ సూర్జేవాలా నేతృత్వంలో జరిగిన భేటీకి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మిగిలిన సభ్యులూ హాజరయ్యారు. రెండు రోజుల పాటు జరిగే సీడబ్ల్యూసీ, ఏఐసీసీ ప్రతినిధుల సమావేశాలకు సంబంధించి అజెండా, ఏర్పాట్లు తదితర అంశాలపై చర్చించారు. కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షతన జరిగే ఈ సమావేశాలకు అగ్ర నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు, ఏఐసీసీ ప్రతినిధులు, పార్టీ సీనియర్ నేతలు హాజరుకానున్నారు.

బేస్‌మెంట్ పూర్తయిన ఇండ్లకు

తక్షణమే చెల్లింపులు

» స్థలం లేని అర్హులకు 'డబుల్ ఇండ్లు'

» జూన్ చివరి నాటికి వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పూర్తవ్వాలి: పొంగులేటి



హైదరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాల్లో ఇండ్ల గ్రౌండింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. బేస్‌మెంట్ పూర్తయిన ఇండ్లకు తక్షణమే చెల్లింపులు జరపాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అభివృద్ధి కార్యక్రమాలు, పలు అంశాలపై జిల్లా మంత్రులు సీతక్క, కొండా సురేఖతో పాటు సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యతా అంశమని, కలెక్టర్లందరూ ఆ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని పనిచేయాలని సూచించారు. బేస్‌మెంట్ పూర్తయిన ఇండ్ల వివరాలను సంబంధిత అధికారులకు పంపితే తక్షణమే చెల్లింపులు చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో ఇండ్ల స్థలాలు లేని అర్హత కలిగిన లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కేటాయించాలన్నారు. నిర్మాణం పూర్తికాని ఇళ్లను పూర్తిచేయడానికి కాంట్రాక్టర్ ముందుకురాకపోతే లబ్ధిదారులకే అవసరమైన ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పారు. వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

3.15 కోట్ల మందికి సన్నబియ్యం!

(మొదటిపేజీ తరువాయి)

మందికి ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. దేశంలో ఇదో విప్లవాత్మక సంక్షేమ పథకమని, ఇంతకంటే అద్భుతమైన పథకం ఏదీ లేదని చెప్పారు. శుక్రవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉత్తమ్ మాట్లాడారు. ఆదివారం హుజూర్‌నగర్‌లో ఈ పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 90 లక్షల రేషన్ కార్డులున్నాయని.. కొత్త మరో 10 లక్షలు కార్డులు పెరుగుతాయని, మొత్తం కోటి కార్డులు అవుతాయని చెప్పారు. లబ్ధిదారుల సంఖ్య ప్రస్తుతం 2.85 కోట్లు ఉండగా.. మరో 30 లక్షల మంది పెరుగుతారని, మొత్తం లబ్ధిదారుల సంఖ్య 3.15 కోట్లకు చేరుతుందని వెల్లడించారు. ప్రతి ఒక్కరికి 6 కిలోల చొప్పున నెలవారీ కోటా పంపిణీ చేస్తామన్నారు. భవిష్యత్తులో ఇతర నిత్యావసర వస్తువులు కూడా పంపిణీ చేయాలనే ఆలోచనతో ఉన్నామని, ఏయే వస్తువులు ఇవ్వాలి? ఎంత పరిమాణంలో ఇవ్వాలనే దానిపై ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఆహార భద్రత చట్టం కింద బియ్యం పంపిణీ పథకానికి కేంద్ర ప్రభుత్వం రూ.5,489 కోట్లు వెచ్చిస్తోందని, రాష్ట్రం రూ.8,033 కోట్లు కలిపి ఏడాదికి రూ.13,522 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు ఉత్తమ్ వివరించారు.

ఇష్టం వచ్చిన చోట బియ్యం తీసుకోవచ్చు

రాష్ట్రంలో రేషన్‌కార్డులు ఎక్కడ ఉన్నా.. లబ్ధిదారులు తమకు ఇష్టం వచ్చిన చోట బియ్యం తీసుకోవచ్చన్నారు. సన్నధాన్యం సాగును ప్రోత్సహించామని, రూ.2,300 ఎమ్మెస్పీ ఉంటే.. క్వింటాకు రూ.500 బోనస్ ఇచ్చి.. రూ.2,800 చొప్పున సన్నాలు కొనుగోలు చేసినట్లు తెలిపారు. 4.41 లక్షల మంది రైతులకు రూ.1,200 కోట్ల బోనస్ చెల్లించామన్నారు. రాష్ట్రంలో వానాకాలం, యాసంగిలో కలిపి సన్న ధాన్యం సమృద్ధిగా ఉత్పత్తి అవుతుందని చెప్పారు. సన్నబియ్యంతోపాటు కొత్త రేషన్ కార్డులు కూడా పంపిణీ చేస్తామన్నారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు మూడు రంగులతో ఉన్న కార్డులు, దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్న కుటుంబాలకు (ఏపీఎల్) ఆకుపచ్చ రంగు కార్డులు పంపిణీ చేస్తామని తెలిపారు. రేషన్ కార్డులు స్మార్ట్ కార్డుల రూపంలో ఉంటాయన్నారు. కార్డుల ముద్రణ ప్రారంభం అవుతోందని, ఏప్రిల్‌లో లబ్ధిదారులకు అందజేస్తామని చెప్పారు. ఏప్రిల్ కోటా బియ్యం పంపిణీ చేసేనాటికి కొత్త కార్డులు చేతికి అందకపోయినా.. లబ్ధిదారుల జాబితాలో ఉన్న పేర్ల ఆధారంగా బియ్యం పంపిణీ చేస్తామని ఉత్తమ్ వెల్లడించారు. గరీబ్ కల్యాణ్ యోజన కింద కేటాయిస్తున్న బడ్జెట్‌లో సన్నబియ్యం పథకానికిగాను అదనపు నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని సీఎం రేవంత్, తాను కలిసి విజ్ఞప్తి చేయగా.. సానుకూలత వ్యక్తంచేసినట్లు తెలిపారు. రేషన్ కార్డులపై ప్రధానమంత్రి బొమ్మ వేయాలనే ప్రతిపాదన రాలేదని, వస్తే పరిశీలిస్తామని చెప్పారు. కాగా, శుక్రవారం ఆయన హుజూర్‌నగర్‌లో సీఎం రేవంత్ బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సభ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. సుమారు 50వేల మందితో బహిరంగ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఉగాది తర్వాత 'ఏఐ సిటీ'కి భూమి పూజ

» మహేశ్వరంలో 200 ఎకరాల్లో నిర్మాణం: శ్రీధర్ బాబు

» 'క్లియర్ టెల్లిజెన్స్' ఆపరేషన్స్ సెంటర్ ప్రారంభం

హైదరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఉగాది తర్వాత రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో 'ఏఐ సిటీ' నిర్మాణానికి భూమి పూజ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. హైటెక్ సిటీలోని ఐటీసీ కోహినూర్‌లో శుక్రవారం 'క్లియర్ టెల్లిజెన్స్' ఇండియా డెలివరీ అండ్ ఆపరేషన్స్ సెంటర్‌ను మంత్రి శ్రీధర్ బాబు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భావితరాల అవసరాలకు అనుగుణంగా సుస్థిరాభివృద్ధే లక్ష్యంగా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఫ్యూచర్ సిటీని నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. ఇక్కడే 200 ఎకరాల్లో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఏఐ సిటీని నిర్మిస్తామని చెప్పారు. ఈ సిటీలో పెట్టుబడులు పెట్టేందుకు ఇప్పటికే అనేక టెక్ దిగ్గజ సంస్థలు ఆసక్తి చూపాయన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాలకు ధీటుగా ఎమర్జింగ్ టెక్నాలజీస్‌లో తెలంగాణ హబ్‌గా మారుతుందని పేర్కొన్నారు. డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ లాంటి ఎమర్జింగ్ టెక్నాలజీస్‌లో ఇప్పటికే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాలను ప్రారంభించామని, త్వరలోనే 'క్వాంటం కంప్యూటింగ్'నూ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. టెక్నాలజీ అంటేనే ప్రపంచం హైదరాబాద్ వైపు చూసేలా చేయడమే తమ లక్ష్యమన్నారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు అనేక మంది పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారని, వారికి ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని చెప్పారు. పారిశ్రామికవేత్తలు ఎదిగితే.. రాష్ట్రం కూడా వృద్ధి చెందుతుందన్నారు. ప్రతిభ గల యువతే తెలంగాణకున్న అతి పెద్ద ఆస్తి అని పేర్కొన్నారు. రోజురోజుకీ మారుతున్న టెక్నాలజీ కారణంగా అనేక సవాళ్లు తలెత్తుతున్నాయని, వాటికి పరిష్కారాలను కనుక్కునేందుకు కొత్తగా ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు.

పీఆర్‌లో 45 మంది రిటైర్డ్ అధికారులు ఔట్..!

హైదరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని వివిధ విభాగాల్లో సేవలందిస్తున్న 45మంది రిటైర్డ్ అధికారులను విధుల నుంచి తొలగిస్తున్నట్లు ఆశాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్ శుక్రవారం మెమో జారీచేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికనుగుణంగా వారిని తొలగిస్తున్నట్లు తెలిపారు.



సరదాగా కరాటే పోటీలో తలపడుతున్న మంత్రి పొన్నం, స్పీకర్ గడ్డం ప్రసాద్.. చిత్రంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్

నువ్వా నేనా సై..!

సరదాగా కరాటే ఆడిన మంత్రి పొన్నం, స్పీకర్ ప్రసాద్

» గచ్చిబౌలిలో 4 కియో కరాటే చాంపియన్‌షిప్-25 ప్రారంభం

గచ్చిబౌలి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి పొన్నం ప్రభాకర్ సరదాగా కరాటే పోటీలో తలపడ్డారు. ఇరువురు కరాటే దుస్తులు ధరించి కాసేపు ప్రేక్షకులను అలరించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి బాలయోగి స్టేడియంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో 4 కియో కరాటే చాంపియన్‌షిప్- 2025 పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి స్పీకర్ ప్రసాద్‌తోపాటు మంత్రి పొన్నం, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్, పొన్నం కాసేపు కరాటే ఆడి ప్రేక్షకులను అలరించారు. అనంతరం స్పీకర్, మంత్రి పొన్నం మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా క్రీడలన్నింటికీ తెలంగాణ కేంద్రబిందువుగా ఉండాలనే లక్ష్యంతో రాష్ట్రంలో జాతీయ, అంతర్జాతీయ క్రీడలు నిర్వహించడం గొప్ప విషయమని అన్నారు. తెలంగాణలో క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు.

నిర్మల్ డీఎస్‌వోపై సస్పెన్షన్ వేటు

- డీఎస్‌వో అవినీతిని తేల్చిన విచారణాధికారులు
- పౌరసరఫరాల సంస్థ డీఎం, డీటీపైనా సస్పెన్షన్

హైదరాబాద్/నిర్మల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రైస్‌మిల్లర్లకు ధాన్యం కేటాయింపులు, కస్టమ్ మిల్లింగ్ రైస్‌లో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో నిర్మల్ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి (డీఎస్‌వో) కిరణ్‌కుమార్‌పై రాష్ట్ర ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. డీఎస్‌వో అక్రమాలకు సహరించినందుకు పౌరసరఫరాల సంస్థ డీఎం గోపాల్, నర్సాపూర్(జి) మండలం ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దారు రమాదేవిపై కూడా సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల రైస్ మిల్లర్లకు పౌరసరఫరాల కోటా ధాన్యం కేటాయింపులో పెద్దఎత్తున డబ్బు వసూలు చేసినట్లు డీఎస్‌వో కిరణ్‌కుమార్‌పై ఆరోపణలు వచ్చాయి. దీనిపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించగా.. కిరణ్‌కుమార్ మిల్లర్లతో కుమ్మక్కయి అవినీతికి పాల్పడినట్లు విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తేల్చారు. నిర్మల్ జిల్లాకు చెందిన కిరణ్‌కుమార్‌పై గతంలోనూ అవినీతి ఆరోపణలు వచ్చాయి. దీంతో మూడేళ్ల క్రితం ఆయనను అప్పటి కలెక్టర్ ప్రభుత్వానికి సరెండర్ చేశారు. ఆ తర్వాత కొంతకాలానికే తిరిగి ఆదిలాబాద్ జిల్లాలో కిరణ్‌కుమార్ పోస్టింగ్ తెచ్చుకున్నారు. అయితే ఆదిలాబాద్‌లో వరిసాగు చేయకపోయినా, తొమ్మిది రైస్‌మిల్లులు వెలిశాయి. ఎటువంటి యంత్రాలు లేకుండా.. గోదాముల్లా ఉన్న వాటిని రైస్‌మిల్లుల జాబితాలో చూపించి సీఎంఆర్ ధాన్యం కేటాయింపులు చేశారు. దీంతో నిజామాబాద్ జిల్లా బోధన్‌కు చెందిన ప్రభాకర్‌రెడ్డి అనే రైస్‌మిల్లర్‌పై గతంలో కేసు కూడా నమోదైంది.మరోవైపు ఆదిలాబాద్‌లో రైస్‌మిల్లర్లు వేల టన్నుల బియ్యం బకాయిలు పెట్టారు. కమిషనరేట్‌లో ఉన్న పలుకుబడితో మళ్లీ నిర్మల్ జిల్లా డీఎస్‌వోగా పోస్టింగ్ తెచ్చుకోగా.. మళ్లీ అవినీతి ఆరోపణలు వచ్చాయి. దీంతో శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ సమగ్ర విచారణకు ఆదేశించారు. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఇచ్చిన నివేదిక ఆధారంగా... డీఎస్‌వో కిరణ్‌కుమార్‌ను ఆయనతోపాటు డీఎం గోపాల్, డీటీ రమాదేవిపై చర్యలు తీసుకున్నారు.

ఏసీబీ వలలో ఆదిలాబాద్ డీఈఎంవో

- రూ.30 వేల లంచం తీసుకుంటుండగా పట్టివేత

ఆదిలాబాద్ రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఓ కేసు విషయంలో మెడికల్ షాపు యాజమాని నుంచి లంచం తీసుకుంటూ ఆదిలాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఎక్స్‌టెన్షన్ మెడికల్ ఆఫీసర్ (డీఈఎంవో) రవిశంకర్ శుక్రవారం ఏసీబీకి పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని గుడిహత్నూర్ మండలం మన్నూర్‌లో ఓ యువతికి అబార్షన్ చేసి ఆమె మృతికి కారణమైన కేసులో మందులు ఇచ్చిన మెడికల్ షాపు యాజమానిపై చర్యలు తీసుకునేందుకు వైద్యాధికారులు సిద్ధమయ్యారు. అయితే ఈ వ్యవహారంలో తన తప్పేంలేదని, తనపై ఏ చర్యలు తీసుకోవద్దంటూ మెడికల్ షాప్ యజమాని.. డీఈఎంవో రవిశంకర్‌ను కలిసి వేడుకున్నాడు. అయితే ఇందుకు రూ.లక్ష ఇవ్వాలని రవిశంకర్ డిమాండ్ చేశాడు. తర్వాత బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. పథకం ప్రకారం శుక్రవారం తన కార్యాలయంలో మెడికల్ షాప్ యజమాని నుంచి రవిశంకర్ రూ.30 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆయనను కరీంనగర్ ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు.

నాగర్ కర్నూల్ మెడికల్ కళాశాలలో ర్యాగింగ్

నాగర్‌కర్నూల్ క్రైం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ మెడికల్ కళాశాలలో ర్యాగింగ్ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ముగ్గురు విద్యార్థులపై కేసు నమోదైనట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని సీనియర్ విద్యార్థులు బుధవారం అర్ధరాత్రి హాస్టల్ గది నుంచి బయటకు పిలిచారు. ర్యాగింగ్‌కు పాల్పడ్డారు. హాస్టల్ రూమ్‌లో గోడకుర్చీ వేయమని, సిలిండర్ మోయమని నానా రకాలుగా ఇబ్బందులకు గురిచేసినట్లు బాధిత విద్యార్థి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోలీసు విచారణకు మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

- భూవివాదంపై ఆరా తీసిన మోకిల పోలీసులు

శంకర్‌పల్లి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): భూ వివాదంలో నమోదైన కేసులో ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు జీవన్‌రెడ్డి పోలీసుల విచారణకు హాజరయ్యారు. నార్సింగి ఏసీపీ రమణగౌడ్ ఆధ్వర్యంలో మోకిల సీఐ వీరబాబు శుక్రవారం జీవన్‌రెడ్డిని విచారించారు. టంగటూరులోని తన భూమి సుమారు 56 ఎకరాలను జీవన్‌రెడ్డితోపాటు ఆయన కుటుంబీకులు కబ్జా చేశారని సామ దామోదర్‌రెడ్డి గత ఏడాది మే నెలలో ఫిర్యాదు చేశారు. దీంతో జీవన్‌రెడ్డితోపాటు ఆయన భార్య రజిత, తల్లి రాజుబాయిపై కేసు నమోదైంది. ఇటీవల జీవన్‌రెడ్డి భార్య రజిత, తల్లి రాజుబాయిలకు హైకోర్టు ముందస్తు బెయిల్ ఇచ్చింది. జీవన్‌రెడ్డికి బెయిల్ రాకపోవడంలో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కోర్టు అరెస్టు నుంచి మినహాయింపునిస్తూ కేసు విషయంలో పోలీసులకు సహకరించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో జీవన్‌రెడ్డి సుప్రీంకోర్టు ఆర్డర్ కాపీతో మోకిల పోలీస్ స్టేషన్‌కు విచారణ నిమిత్తం వచ్చారు. పోలీసులు ఆయనను సుమారు 3 గంటలు విచారించారు.

యాంకర్ విష్ణుప్రియపై కఠిన చర్యలు వద్దు

- ముందుగా నోటీసులు ఇవ్వండి: హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం చేశారంటూ దాఖలైన కేసుల్లో యాంకర్ విష్ణుప్రియకు శుక్రవారం హైకోర్టులో ఊరట లభించింది. ఆమెపై కఠిన చర్యలు తీసుకోకూడదని పోలీసులను ఆదేశించింది. ముందుగా బీఎన్ఎస్ఎస్ 35 (సీఆర్‌పీసీ 41ఏ) కింద నోటీసులు జారీ చేసి చట్టప్రకారం విచారణ చేపట్టాలని సూచించింది. ఆమెపై వినయ్ అనే వ్యక్తి చేసిన ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు ఒక కేసు, ఫణీంద్రశర్మ చేసిన ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు మరో కేసు నమోదు చేశారు. ఈ రెండు కేసులను కొట్టివేయాలని కోరుతూ ఆమె హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వాదనలు విన్న జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం నోటీసులు ఇవ్వకుండా ఎలాంటి కఠిన చర్యలు చేపట్టవద్దని పోలీసులను ఆదేశించింది.

ఎల్పీజీ నిరంతర సరఫరాకు చర్యలు

- ఆందోళన చెందవద్దు: ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు

హైదరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సదరన్ రీజియన్ బల్క్ ఎల్పీజీ ట్రాన్స్‌పోర్ట్ ఓనర్స్ అసోసియేషన్‌కు చెందిన బల్క్ ఎల్పీజీ రవాణాదారుల సమ్మె నేపథ్యంలో తమ ఎల్పీజీ వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తగినంతగా సిలిండర్ల సరఫరా అందుబాటులో ఉంటుందని ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలైన ఐవోసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌లు హామీ ఇచ్చాయి. ఇటీవల జరిగిన రవాణా టెండర్‌ను అన్ని ప్రాంతాల ట్రాన్స్‌పోర్టర్లతో విస్తృత చర్చల తర్వాత తుది రూపమిచ్చినట్లు పేర్కొన్నాయి. భద్రతా ఉల్లంఘనలకు సంబంధించిన శిక్షా నిబంధనలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కొందరు సమ్మెకు పిలుపునిచ్చినట్లు తెలిపాయి.

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై అట్రాసిటీ కేసు కొట్టివేతకు నో

- అరెస్టు చేయకుండా ఆదేశాలు ఇవ్వలేమన్న హైకోర్టు

హైదరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కార్పొరేటర్ బానోత్ సుజాతను కులం పేరుతో దూషించారంటూ ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిపై దాఖలైన కేసును కొట్టివేసేందుకు శుక్రవారం హైకోర్టు నిరాకరించింది. అరెస్టు చేయకుండా ఆదేశాలు కూడా ఇవ్వలేమని విచారణ జరిపిన జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం తెలిపింది. తదుపరి విచారణను ఏప్రిల్ 10కి వాయిదా వేసింది. ఆలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఫిర్యాదుదారు సుజాతకు నోటీసులు జారీ చేసింది. అభివృద్ధి పనుల శంకుస్థాపనపై సుధీర్‌రెడ్డి, సుజాత మధ్య వివాదం నెలకొంది. ఈ క్రమంలోనే సుధీర్‌రెడ్డి తనను దూషించారని ఎల్బీనగర్ పీఎస్‌లో సుజాత ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యేపై ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం కింద కేసు నమోదైంది.

9885 మంది 'యాంటీ డ్రగ్ సోల్జర్'లు!

- డ్రగ్స్ కట్టడికి పోలీసుల సరికొత్త వ్యూహం
- మత్తుమందులపై పోరులో విద్యార్థులు
- సమాచారం ఇవ్వాలంటూ అవగాహన

హైదరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలను అరికట్టడానికి పోలీసులు సరికొత్త వ్యూహాన్ని అనుసరిస్తున్నారు. డ్రగ్స్ ముఠాలు లక్ష్యంగా చేసుకున్న ప్రాంతాల్లోనే వారిని కట్టడి చేయడానికి ప్రణాళికలు రూపొందించారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులను టార్గెట్ చేసుకొని మత్తుమందులు విక్రయించే ముఠాల ఆట కట్టించేందుకు విద్యార్థులనే సైన్యంగా వాడుకోవాలని నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అధికారులు నిర్ణయించారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ముప్పును వివరిస్తున్నారు. అలాగే డ్రగ్స్‌కు అలవాటు పడిన వారిని ఎలా గుర్తించాలనే అంశంపై అవగాహన కల్పిస్తున్నారు. తర్వాత 'యాంటీ డ్రగ్ సోల్జర్ల'గా నమోదు చేసుకోవడానికి విద్యార్థులకు అవకాశం ఇస్తున్నారు. డ్రగ్స్ వాడే వారిని గుర్తించినా, మత్తు మందుల సరఫరాదారుల గురించి సమాచారం తెలిసినా నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరోకు ఈ మెయిల్ లేదా 8712671111 ఫోన్ నంబర్‌కు, టోల్ ఫ్రీ నంబరు 1908కి సమాచారం ఇవ్వాలని యాంటీ డ్రగ్ సోల్జర్లకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఇలాంటి సమాచారం అందించిన సోల్జర్ వివరాలను రహస్యంగా ఉంచడంతో పాటు వారిచ్చిన సమాచారంతో డ్రగ్స్ ముఠాలు పట్టుబడితే ఆయా సోల్జర్లకు పారితోషికాలు కూడా అందిస్తామని అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు తెలంగాణలో 9,885 మంది విద్యార్థులు యాంటీ డ్రగ్ సోల్జర్లుగా పేర్లు నమోదు చేసుకున్నారని చెప్పారు.



8,662 మంది అరెస్టు

నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరోను 2023లో ప్రారంభించారు. నాటి నుంచి గత నెలాఖరు వరకు రాష్ట్రవ్యాప్తంగా మత్తుమందుల అమ్మకాలకు సంబంధించి 3,838 కేసులు నమోదు చేశారు. 8,662 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.244 కోట్ల విలువైన మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటి వరకు 13 కేసుల్లో నిందితులు మత్తు మందుల అమ్మకాల ద్వారా కూడబెట్టిన రూ.66 కోట్ల ఆస్తులను సీజ్ చేశారు.

ద్రవరూప గంజాయి సరఫరా కేసులో ఇద్దరికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష

మహబూబ్‌నగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ద్రవ రూప గంజాయి (హాశీష్ ఆయిల్) సరఫరా చేసిన ఇద్దరు వ్యక్తులకు పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ శుక్రవారం మహబూబ్‌నగర్ మొదటి అదనపు జిల్లా కోర్టు తీర్పు ఇచ్చింది. రూ.లక్ష జరిమానా కూడా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరునెలల కఠిన కారాగార శిక్ష పడనుంది. గత సంవత్సరం అక్టోబరు మూడో తేదీన ఎక్సైజ్ శాఖ నిర్వహించిన తనిఖీల్లో ఒడిశాకు చెందిన ఇద్దరు వ్యక్తులు... నరోత్తమ్ రే, ధర్మేంద్రకుమార్ రేలు అయిదు కేజీల హాశీష్ ఆయిల్ సరఫరా చేస్తూ పట్టుబడ్డారు. వారిపై సీఐ వీరారెడ్డి, ఎస్సై సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నేరం రుజువు కావడంతో కోర్టు శిక్ష విధించింది.

బీవైడీకి ఓకే..!



(మొదటిపేజీ తరువాయి)

ఆరు లక్షల ఈవీలు, 20గిగావాట్ల బ్యాటరీల ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటు చేసే ఈ ప్రాజెక్టు కోసం రెండు కంపెనీలూ సుమారు రూ.85,490 కోట్ల మేర పెట్టుబడులు పెడతాయని అంచనా.

షాబాద్ వద్దే ప్రాజెక్ట్?

బీవైడీ ఇప్పటికే ఎంఈఐఎల్ గ్రూప్ కంపెనీ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్‌తో కలిసి రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలోని సీతారాంపూర్ వద్ద 150 ఎకరాల్లో.. విద్యుత్ బ్యాటరీలతో నడిచే బస్సులు తయారు చేస్తోంది. తెలంగాణ ఆర్టీసీతో పాటు అనేక రాష్ట్రాల రోడ్డు రవాణా సంస్థలు ఈ బస్సులను పెద్దఎత్తున కొనుగోలు చేస్తున్నాయి. ఇప్పుడు ఎంఈఐఎల్‌తో కలిసి సంయుక్తంగా ఏర్పాటు చేసే ఈవీ కార్ల ప్రాజెక్టును కూడా షాబాద్ మండలంలోనే 500 ఎకరాల్లో ఏర్పాటు చేసే అవకాశం ఉందని సమాచారం. అయితే ప్రాజెక్టు ఎక్కడ అనే దానిపై ఇంకా తుది నిర్ణయానికి రాలేదని, షాబాద్‌తో పాటు హైదరాబాద్ సమీపంలోని మరో మూడు ప్రాంతాలనూ పరిశీలిస్తున్నారని తెలుస్తోంది. నిజానికి భారత్‌లో తయారీ యూనిట్ ఏర్పాటుకు బీవైడీ ఎప్పటి నుంచో ప్రయత్నిస్తోంది. 100 కోట్ల డాలర్లతో ప్లాంటు ఏర్పాటు చేస్తామని 2023లో ఎంఈఐఎల్‌తో కలిసి దరఖాస్తు కూడా చేసింది. అయితే భారత-చైనా సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఆ ప్రతిపాదనను తిరస్కరించింది. అయినా పట్టువదలకుండా బీవైడీ-ఎంఈఐఎల్ తమ ప్రయత్నాలను కొనసాగించాయి. ఇటీవల చైనాతో సరిహద్దు ఉద్రిక్తతలు కొంత తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో.. బీవైడీ జేవీకి కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం. అయితే ఈ ప్రాజెక్టుపై పూర్తి స్పష్టత వచ్చేందుకు మరికొద్ది రోజుల సమయం పడుతుందని అధికార వర్గాలు చెప్పాయి.

తెలంగాణలోనే ఎందుకు?

బీవైడీ ఉత్పత్తి యూనిట్ కోసం అనేక రాష్ట్రాలు పోటీపడ్డాయి. అయితే ఇప్పటికే ఎంఈఐఎల్ గ్రూప్ సంస్థ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్‌తో ఉన్న అనుబంధంతోపాటు.. ఆ ప్రాజెక్టుకు సమీపంలోనే 500 ఎకరాల భూమి కేటాయించేందుకు, ఈవీలపై రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజుల మినహాయింపు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించినందునే తెలంగాణను ఎంచుకున్నట్టు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టు అమలుకు నోచుకుంటే, ప్రాజెక్టు సమీపంలో ఈవీల తయారీకి అవసరమైన అనుబంధ సంస్థల క్లస్టర్ కూడా ఏర్పడి పెద్దఎత్తున ఉద్యోగావకాశాలు లభిస్తాయని రాష్ట్రసర్కారు భావిస్తోంది. ఇప్పటికే ఐటీ, ఫార్మా, ఏరోస్పేస్, జీసీసీలతో దూసుకుపోతున్న హైదరాబాద్.. ఈ ప్రాజెక్టుతో ఆటోమొబైల్ కేంద్రంగానూ ఎదిగే అవకాశం ఉంటుందని ఆశిస్తోంది.



టెస్లాకు పోటీ

బీవైడీ ఇప్పటికే చైనా, యూరప్ మార్కెట్లలో మస్క్‌కు చెఉందిన టెస్లాకు గట్టి పోటీ ఇస్తోంది. గత ఏడాది బీవైడీ అమ్మకాలు టెస్లాను మించిపోయాయి. అదే టెస్లా కంపెనీ ఇప్పుడు భారత్‌లోనూ కాలుమోపేందుకు సిద్ధమవుతోంది. టాటా మోటార్స్‌తో పాటు కొన్ని జపాన్, దక్షిణ కొరియా కంపెనీలూ మన దేశంలో తమ ఈవీ యూనిట్లు ఏర్పాటు చేశాయి. మరికొన్ని కంపెనీలూ ఆసక్తి చూపిస్తున్నాయి. కాగా.. బీవైడీ ప్రవేశంతో భారత ఈవీల మార్కెట్లో పోటీ మరింత పెరుగుతుందని భావిస్తున్నారు. ఆ సంస్థ ఇటీవల మార్కెట్లో విడుదల చేసిన రూ.22 లక్షల విలువైన డాల్ఫిన్ మోడల్ ఈవీ ఇప్పటికే టాటా మోటార్స్, ఎంజీ మోటార్ ఈవీలకు గట్టి పోటీ ఇస్తోంది.

రాష్ట్రంలో హెన్‌కిన్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్

- రూ.2,500 కోట్ల పెట్టుబడులు.. తక్షణం 1000 ఉద్యోగాలు
- సీఎం రేవంత్‌తో సంస్థ ప్రతినిధుల భేటీ

హైదరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అమెరికాకు చెందిన బీర్ల తయారీ సంస్థ హెన్‌కిన్ ఎన్‌వి.. రూ.2 వేల కోట్ల నుంచి రూ.2,500 కోట్ల పెట్టుబడితో హైదరాబాద్‌లో గ్లోబల్ కేపబిలిటీ కేంద్రాన్ని (జీసీసీ) నెలకొల్పేందుకు సిద్ధమైంది. ఈమేరకు.. సంస్థ ముఖ్య ప్రతినిధులు జాకోవానడర్ లిన్‌డెన్, వివేక్ గుప్తా, గరిమా సింగ్ తదితరులు సీఎంరేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. జీసీసీ ఏర్పాటుతో తక్షణం 1000 మందికి.. వచ్చే మూడేళ్లలో 3000 మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పించవచ్చని వెల్లడించారు. వారి ప్రతిపాదనపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్టు సమాచారం. అమెరికాలో హెన్‌కిన్ పేరుతో వ్యాపారం చేస్తున్న ఈ సంస్థ.. భారతదేశంలో యునైటెడ్ బ్రూవరీస్ లిమిటెడ్ (యూబీఎల్) పేరిట తన కార్యకలాపాలను నిర్వహిస్తోంది. యునైటెడ్ బ్రూవరీస్ లిమిటెడ్ సంస్థ ఆర్థిక ఇబ్బందులు సహా పలు సమస్యలను ఎదుర్కొంటున్న నేపథ్యంలో.. హెన్‌కిన్ సంస్థ 2021లో డెట్ రికవరీ ట్రైబ్యునల్ నుంచి ఆ కంపెనీలో మాల్యాకు చెందిన 15 శాతం వాటాలను కొనుగోలు చేసి, మొత్తం 61.5 శాతం వాటాతో దాన్ని తన నియంత్రణలోకి తీసుకుంది. నాటి నుంచి యూబీఎల్ పేరుతోనే భారత్‌లో తన వ్యాపారాలను సాగిస్తోంది. తెలంగాణలో ఈ సంస్థ ఇప్పటికే రూ.650 కోట్ల పెట్టుబడులు పెట్టి.. బీర్లను ఉత్పత్తి చేస్తోంది. ఈ సంస్థకు దేశవ్యాప్తంగా ఉన్న 32కుపైగా ఉత్పత్తి కేంద్రాల్లో రెండు పెద్ద కేంద్రాలు మన రాష్ట్రంలోనే ఉన్నాయి. వాటి ద్వారా 900 మందికిపైగా ప్రత్యక్షంగా, 5000 మందికిపైగా పరోక్షంగా ఉపాధి లభిస్తోంది. రాష్ట్రంలో ఏడాదికి రూ.5 వేల కోట్లకు పైగా ఎక్సైజ్ డ్యూటీ చెల్లిస్తోంది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్)లో భాగంగా గడిచిన 5-6ఏళ్లలో రూ.5.5 కోట్లను ఖర్చు చేసింది. ఈ నేపథ్యంలోనే.. ఇటీవల నిర్వహించిన హెన్‌కిన్ బోర్డు సమావేశంలో జీసీసీని తెలంగాణలో స్థాపించాలనే నిర్ణయం తీసుకున్నారు. చక్కటి మౌలిక వసతులు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు ఉండడంతో.. గోల్డ్‌మెన్ శాష్, ఫెడెక్స్, లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సహా పలు సంస్థలు హైదరాబాద్‌లో జీసీసీలను స్థాపించాయి. మెక్‌డోనాల్డ్స్, మారియట్ కూడా ఇక్కడ జీసీసీల ఏర్పాటుకు సిద్ధమవుతున్నాయి. ఆ కోవలోనే హెన్‌కిన్ కూడా ఇక్కడ జీసీసీ ఏర్పాటుకు ఆసక్తి చూపుతోంది.

ఏప్రిల్‌లోగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి నియామకం: లక్ష్మణ్

న్యూఢిల్లీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్‌లోగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ప్రకటన ఉంటుందని ఆ పార్టీ ఎంపీ కె.లక్ష్మణ్ తెలిపారు. అనుభవం సహా అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకునే నియామకం జరుగుతుందని స్పష్టం చేశారు. శుక్రవారం ఢిల్లీలోలక్ష్మణ్ మాట్లాడారు. ఇప్పటివరకు 13 రాష్ట్రాల్లో మాత్రమే పార్టీ అధ్యక్షులను నియమించినట్లు చెప్పారు. రాష్ట్రప్రభుత్వం ఆమోదించిన బీసీ బిల్లులో తప్పులున్నాయని, వాటిని సవరించాలని కోరుతున్నామని వెల్లడించారు.



సీఎం సతీమణి గీతారెడ్డి, మనవడు రుద్రతో మంత్రి సీతక్క

ఘనంగా సీఎం మనవడి బర్త్‌డే

- వేడుకల్లో పాల్గొన్న మంత్రి సీతక్క

హైదరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మనవడు రుద్ర పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం, ఆయన సతీమణి గీతారెడ్డి, ఇతర కుటుంబసభ్యులతోపాటు సన్నిహితులు, పలువురు మంత్రులు మాత్రమే పాల్గొన్నారు. మంత్రి సీతక్క వేడుకలో పాల్గొని రుద్రకు శుభాకాంక్షలు తెలిపారు. కాగా, సీఎం సతీమణి గీతారెడ్డి, మనవడు రుద్రతో మంత్రి సీతక్క కలిసి ఉన్న ఫొటో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది.

హైడ్రా, మూసీ పేరుతో మూటలు కడుతున్న కాంగ్రెస్ గద్దలు

- బీఆర్ఎస్ కృషితోనే తెలంగాణకు బీవైడీ: కేటీఆర్

హైదరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి):అసమర్థ పాలనలో సౌభాగ్యనగరం.. అభాగ్యనగరంగా మారిందని, మూసీ, హైడ్రా పేరుతో కాంగ్రెస్ గద్దలు మూటలు కడుతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. పేదల ఇళ్లపైకి బుల్డోజర్లు, పెద్దల ఆస్తులతో సెటిల్మెంట్లు చేసుకుంటున్న కారణంగా రియల్ ఎస్టేట్ ఢమాల్ అయిందని శుక్రవారం ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు. ఇళ్ల కొనుగోళ్లు జరగక రియల్టర్లు ఆందోళనలో పడ్డారని, అన్నదాతలే కాదు రియల్ వ్యాపారులు కూడా ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. హైదరాబాద్‌లో గత త్రైమాసికంలో 49% ఇళ్ల విక్రయాలు తగ్గాయని, ఆఫీస్ లీజింగ్ కూడా 2025 జనవరి-మార్చి మధ్య 41% తగ్గిందన్నారు. కాంగ్రెస్ సర్కార్ దూరదృష్టిలేని, అసమర్థ విధానాలే ఈ పతనానికి కారణమన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన కృషి కారణంగానే.. ఎలక్ట్రిక్ వాహన దిగ్గజం బీవైడీ సంస్థ.. ఇప్పుడు తెలంగాణకు వచ్చిందని పేర్కొన్నారు. కాగా, నిష్కల్మషమైన హృదయం కలిగిన పాస్టర్ పగడాల ప్రవీణ్ అకాల మరణంపై క్రైస్తవ సోదరులు అనుమానాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో.. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని ఏపీ ప్రభుత్వానికి కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. ఎక్స్ వేదికగా ప్రవీణ్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాగా, ఈఏడాది మే 30న లండన్‌లో జరిగే ఐడియాస్ ఫర్ ఇండియా సదస్సుకు రావాలని బ్రిడ్జ్ ఇండియా సంస్థ వ్యవస్థాపకుడు ప్రతీక్‌దత్తానీ.. కేటీఆర్‌కు ఆహ్వాన లేఖ పంపారు.

అప్పులపై కాంగ్రెస్‌ది తప్పుడు ప్రచారం: కవిత

అప్పులపై కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రచారానికి తిప్పలు పడుతున్నా అవి పటాపంచలయ్యాయని, పార్లమెంటు సాక్షిగా వాస్తవం బయటపడిందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. శాసనమండలి మీడియా పాయింట్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర అప్పులు మొత్తం రూ.4.42లక్షల కోట్లని పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. అయితే తాము రూ.8లక్షల కోట్లు అప్పులు చేశామని సీఎం రేవంత్ దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.